భారతి

సాహిత్య మాసపత్రిక

మే 1983

ఈ లోకంలో యిలాగే

వెంకట సీతారామమూర్తి

కృషిశ్చ మే వృష్టిశ్చ మే

వేంకటేశ్వర్లు

నేను సూర్యుడైన వేళ!

లింగన్న

సమాజ పరిణామం : సాహిత్య ప్రభావం

సోమసుందర్

కన్యకాపురాణం : వైశ్యుల సాంఘిక చరిత్ర

సూర్యనారాయణ

బ్రౌణ్యం : వ్యవహారం

లక్ష్మణరావు

ఇంకా జోశ్యభట్ల, కామేశ్వరరావు, రమేష్‌బాబు, గోదావరిశర్మ, లింగమూర్తి, శశికాంత్ శాతకర్ణి, మునిసుందరం, కిశోరుబాబు – అశోకుబాబు, నరసింహారావు, విజయ దత్తాత్రేయశర్మ, సత్యరామప్రసాద్, సుబ్రహ్మణ్యము ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

మే 1983

సంపుటము : 60 సంచిక : 5

విడిప్రతికి వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

మే 1983



9-5-'83 చైత్ర బహుళ ద్వాదశీ సోమవారము

కళాప్రపూర్ణ, దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

115వ జయంతి

నేను సూర్యుడైన వేళ...!

శ్రీ కాణిపాకం లింగన్న

సంధ్యను నెట్టిన సమయం
మెల్ల మెల్లగా చీకట్లు అలుముకుంటున్నాయి
నన్నుచుట్టిన అంధకారం భూమి నేలుతోంది
మిన్నువైపు కన్నెత్తి చూశాను
చంద్రుని వెన్నెల వెల్లువ గగనాన్ని కడుగుతోంది

నేను చంద్రుడైనవేళ —
అంబరాన చుక్కలు సంబరపడుతూ
నిక్కినిక్కి వెక్కిరిస్తున్నాయి
పోటీపడుతున్నాయి శత్రువులై
మచ్చలెన్నో ఎత్తిచూపి - అమాయకుడన్నారు
చల్లనితనం చూచి - చేతగానివాడన్నారు
మంచితనం చూచి - పిరికివాడన్నారు.

రెక్కలు విరిగిన పక్షిలానేను —
దిక్కులేని వాడిలా దినదినమ్ము —
తగ్గి తగ్గిపోయి నిర్జీవి నయ్యానాను
లేడిలా జడుసుకుని తరిగి, కరిగిపోయాను

ఆయువులో పూర్వభాగంలా, రాత్రి గడచింది
కోడి కూసింది—పిడికిలి బిగించాను
వేగుచుక్క పొడిచింది—వెన్నుతట్టి లేచాను
సూర్యోదయం వేళకు—కనువిప్పు కల్గింది

నేను సూర్యుడైనవేళ —
కణకణలాడాయి నాలో భావ పరంపరలు,
శర పరంపరలై తీక్షణంగా విచ్చుకున్నాయి
మధ్యాహ్న మార్తాండుడనై—వెలిగిపోయాను
భగ్గు భగ్గున మండే మంటలా, మండిపడ్డాను
క్రూర సమాజంపై అక్కను కక్కేను
ఎర్రబడ్డాయి కనులు—ఉరిమురిమి చూశాను
సింహంలా తిరగడం నేర్చాను
విజయుడనై సంచరించాను
అంతే —
అంబరాన సంబరపడిన చుక్కలు
మటుమాయమై ఎక్కడ కనులు మూశాయో ?
తీక్షణ భావుకుడంటే ఎవడికైనా భయమే.
అపహాస్యం చేసినవారు, అంతరించిపోయారు.
ప్రచండ ప్రతాపం ఎదుట —
నిలదొక్కుకు నిలబడలేదెవ్వడూ !
నేను సూర్యుడైనపుడు—
నా జీవన రథం నిరాటంకంగా,
అనుకున్న మార్గాన్ని బట్టి,
సూర్యతేజో విరాజితమై
ముందు ముందుకే సాగిపోయింది.



త్రైలోక్యమ్ మంగళమ్ కురు

శ్రీ ఎస్. మునిసుందరం

పిడికెడు మెతుకులు

కాళ్లూ చేతులు
చిన్నవి పెద్దవి
ఆడవి మగవి
లేతవి ముదురువి
తోసుకుంటూ తొక్కుకుంటూ
నాకా నీకా నీకా నాకా
కావ్ కావ్ కావ్
గోల గోల కాకి గోల
భౌ భౌ భౌ ఆకలి కుక్కలు
కాట్లాట పోట్లాట పీకులాట కీచులాట
గలగలల గోదారి
బిరబిరా క్రిష్ణమ్మ
గంగా కావేరీ
జలం జలం జలం
సుజలాం సుఫలాం
సస్యశ్యామలాం
మాదాకవళం తల్లీ!

రెండు గుడ్డపీలికలు

తైతక తైతక తకతై
తక తక తక తక
చక చక చక చక
ఝుక్ ఝుక్ ఝుక్
లబ్ డిబ్ లబ్ డిబ్
లబో దిబో లబో దిబో
బీ. పి. హై హై హై
టింగ్.... టింగ్.... టింగ్
టింగ్ టింగ్ టింగ్
హమ్ దివానే
మిస్టర్ నాయుడూ
అరె జాజా, ఝూగా కహీఁకా
ఛట్.... చీకటి
కంకాళాలు ఢీకొంటున్న
నవ్వడులు, నిట్టూర్పులు, నిశ్వాసాలు
నరమాంసం కాలిపోతున్న వాసనలు
ఎవరు ఎవర్ని తింటున్నారో తెలియని నాగరికత
అలలు అలలుగా అసంతృప్తి గాలులు
ఢమ ఢమ ఢమ ఢాం
జిగేల్ జిగేల్ జిగేల్
కళ్ళు చెవులు చిటిపోయి
కాంతి, ఎర్రని నల్లని నీలం కలిసిపోయి
లో.... లో.... బీ. పి. లో.... లో....
శాడిజం, నూడిజం, సూయిసైడిలిజం
చెప్ప లేదంటనక పొయ్యేరు
తప్పదిదిగో గురుని వాక్యం
ఠప్.... బెలూన్స్ ఠపాఠప్.

ఒక్క కుర్చీ

ఎత్తులు జిత్తులు పైపై ఎత్తులు
రోజూ పెరిగే వ్యాపారులు
ఆశలు దురాశలు పేరాశలు
బట్ట తలలు బుట్ట తలలు చిట్టి తలలు
బురకాలు గిరికీలు, జంతర్ మంతర్
కాశీపట్నం చూడర బాబూ
అరచేతిలో వైకుంఠం
అల్లదే; ప్రభుత్వ సారాయి బుంబుం
చాలదా?
పైసల్ పైసల్ లచ్చల్ లచ్చల్
భయమేల విప్పు మూటల్
గొర్రెలు జనం మేకలు జనం
పైసకు బలి పశువులు జనం
నువ్వా నేనా? నేనా నువ్వా?
ముఠాలు, మతాలు, కులాలు
ఖూనీలు, మెహర్బానీలు, మహమ్మద్ గోరీలు
గుడు గుడు గుంచం గుండే రాగం
ఎన్నికలొచ్చే ఎక్కడి దొంగలు
పరుగులు పరుగులు

ఊరూ వాడా పల్లె గిల్లె
పురకలు పురకలు
కల్లు తాగిన కోతులు
మ్యూజికల్ చేర్స్
నో స్పోర్టివ్ స్పిరిట్
త్రీ ఛీర్స్ టు మై కంట్రీ లీడర్స్
ఎలుకలు కలుగులు
చీమలు పెట్టిన పుట్టలు
నీ ఉపమానం సిల్లీ
కనకపు సింహాసనం
నీ క్షేమం తెలియదు ఫో
తాత ఫస్టే

ఫటాఫట్ పందికొక్కులు
ఎక్కడ కుర్చీ ఏదీ కుర్చీ
నాదీ కుర్చీ నాదీ నాదీ
బతకలేను అది లేకుంటే
బ్రేవ్.... అజీర్ణమా?
బోల్తాకొట్టిందిలే బుల్ బుల్ కుర్చీ
జగమే మాయా! పదవే మాయా!
ఓ నా జనులారా!
అసతోమా సద్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
తమసోమా జ్యోతిర్గమయ
ఓం శాంతిః శాంతిః

~~~~~

సంభవామి యుగే యుగే!

శ్రీ సి. కామేశ్వరరావు

వేద యుగంలో
వేద రుచిరార్థ సూక్తినిధినై
వేదాధ్యయనుల గుండెల్లో
మోదాన్ని కుమ్మరించాను!
పురాణేతిహాస యుగంలో
పురుషోత్తముని గాథనై
నీతిధర్మ విస్ఫురితకు
నికేతనమై నిలిచాను!
ప్రబంధ యుగంలో

ప్రబంధాల సుగంధాలు
రాజ సౌధాలలోను
రసిక హృదయాలలోను
గుభాళించాను!
ఆధునిక యుగంలో
వచన కవితనై
అన్నార్తుల కేకనై
చైతన్య స్రవంతినై
దిగంతాలకు విస్తరిస్తున్నాను!!

—✱—
~~~~~

శ్రీ ఎ. విజయదత్తాత్రేయ శర్మ

శ్రీకాకుళం జిల్లా గ్రామనామములు ఒక పరిశీలన

ఆంధ్రప్రదేశ్ ఉత్తర సరిహద్దు చివర నున్న శ్రీకాకుళం జిల్లా 1950 సం॥లో నాటి అవిభక్త విశాఖపట్నం జిల్లా ఉత్తర భాగాన్ని పుణికి పుచ్చుకుని ఏర్పడినది. 11 తాలూకాలతో, 9,743 చ॥కి॥మీ॥ విస్తీర్ణంతో, ఉత్తర అక్షాంశం 18°–20' నుండి 19°–10' వరకును, తూర్పు రేఖాంశం 83°–51' నుండి 84°–50' వరకు వ్యాపించి ఉండిన ఈ జిల్లాకు ఉత్తర పడమరలలో ఒరిస్సారాష్ట్రం తూర్పున బంగాళాఖాతం, దక్షిణమున విశాఖపట్నం (ప్రస్తుతం విజయనగరం) జిల్లాలు ఎల్లలుగా నున్నవి.[1] 1975 సం॥ ఆం॥ ప్రదేశ్ స్టాటిస్టికల్ ఎబ్‌స్ట్రాక్ట్ ననుసరించి ఈ జిల్లాలోని వివిధ తాలూకాలలోని గ్రామముల / పట్టణముల సంఖ్యావివరములు ఈ క్రింది విధముగా నున్నవి.[2]

క్రమ సంఖ్య	తాలూకా పేరు	గ్రామముల సంఖ్య జనావాసము గలవి	గ్రామముల సంఖ్య జనావాసము లేనివి	పట్టణముల సంఖ్య	మొత్తము
1.	పాతపట్నం	443	48	—	491
2.	పాలకొండ	423	15	2	440
3.	టెక్కలి	284	23	3	310
4.	శ్రీకాకుళం	187	23	2	212
5.	సోంపేట	166	2	1	169
6.	నరసన్నపేట	166	2	1	169
7.	ఇచ్ఛాపురం	49	—	1	50
8.	చీపురుపల్లి	300	19	2	321
9.	బొబ్బిలి	197	14	1	312
10.	పార్వతీపురం	440	40	1	481
11.	సాలూరు	210	15	1	226
	జిల్లా మొత్తం	2,865	215	16	3,181

1979 సం॥ జూన్ నెల 1వ తేదీన క్రొత్తగా ఏర్పరచబడిన విజయనగరం జిల్లాలో శ్రీకాకుళం జిల్లాలోనివైన బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, చీపురుపల్లి (లావేరు, రణస్థలం ఫిర్కాలు మినహా) తాలూకాలు విలీనమైనవి. ఇంతకు పూర్వం విజయనగరం జిల్లా గ్రామనామములను గూర్చి జరుపబడిన పరిశీలనలో పైన చెప్పబడిన తాలూకాలు పరామర్శించబడినవి[3] గనుక ప్రస్తుతపరిశీలనలో విడువబడినవి. కాని, చీపురుపల్లి తాలూకాలో నుంచి ఈ జిల్లాలోకి శేషించబడిన గ్రామములు పరిగణనలోనికి వచ్చినవి. ఇటీవల తాలూకాలు పునర్వ్యవస్థీకరించబడి వాటిసంఖ్య పెరిగినది గాని ప్రస్తుత పరిశీలనలో 1971 సం॥ గణాంక జాబితాలోని లెక్కయే ప్రమాణముగా స్వీకరించబడినది. మొత్తంమీద ప్రస్తుత పరిశీలన పరిధిలోనికి వచ్చిన ఈ జిల్లాలోని గ్రామముల/పట్టణముల సంఖ్య 2048.

చారిత్రక నేపథ్యము

ఈ జిల్లా ప్రాంతంలో నేటివరకు ఉత్ఖాతన పరిశోధనలు క్రీస్తు పూర్వకాలపు నాటి మానవ నివేశనా విశేషణాలను వెలుగులోనికి తీసుకురాకపోయినప్పటికీ, చరిత్రగతిలో మాత్రం ఈ ప్రాంతం వెనుకబడలేదు[4].

నంద, మౌర్య, చేది, శాతవాహన, మాఠర, వాశిష్ఠ, విష్ణుకుండిన, తూర్పుగాంగ, తూర్పు చాళుక్య, చోళ, వెలనాటిచోళ, కాకతీయ, రెడ్డి, రేచెర్ల, సూర్యవంశగజపతి, కుతుబ్‌షాహి, మొఘల్, అసఫ్ జాహి మున్నగు రాజవంశములనేకములు ఈ ప్రాంతమును ప్రత్యక్షముగా బహుకాలము ఏలుటయో, దండయాత్రలు జరిపి, కొంతకాలము కొంతప్రాంతమును ఆక్రమించుకొని ఏలుటయో జరిగినది. నందాపుర/జయపుర, విజయనగరం, బొబ్బిలి, పాలకొండ, టెక్కలి, మందసా, ఉర్లాము ఇత్యాది సంస్థానములు/జమిందారీలు ఏలుబడి సాగించినవి. క్రమ ప్రకారము ఆయా రాజవంశముల, పాలకుల ప్రభావము ఈ ప్రాంత గ్రామ నామములపై ఎంతవరకు ప్రతిఫలించినదో గమనించుటకు

ముందుగా ప్రాచీన, మధ్యయుగములందు ఈ ప్రాంతమున ప్రవర్తిల్లిన పాలనా విభాగములు సూచింపబడుతున్నవి.

ప్రాచీన, మధ్యయుగములలో పాలనా విభాగములు

క్రీ॥శ॥ 5వ శతాబ్ది నుండి 15 శ॥ వరకు ఈ ప్రాంతమును బహుకాలము ఏలినవారు తూర్పుగాంగులు. కావున వారి కాలమందు స్పష్టమైన పరిపాలనా విభాగములు రూపెత్తుటకు ఎక్కువ అస్కారము గలదు. ప్రాచీన, మధ్య యుగములలో ఈ ప్రాంతము విషయము, రాష్ట్రము, రాజ్యము, భోగము, సీమ, పాంచాలివంపు మొ॥ పాలనా విభాగములు కలిగి యుండెడిది.

వి ష య ము లు

విషయము "సంస్కృతాంధ్ర సారస్వతములందును, శాసనము లందును వివిధ కాలములందు దేశ విభాగమును సూచించు సర్వజన విదితమైన పదము.... విస్తీర్ణమున పెద్దది, చిన్నది యను భేద మింతుకయు లేక వివిధ ప్రాంతములకీ నామముపయోగించబడినది."5

(అ) కళింగ విషయము : మాఠర వంశీయుడైన శక్తివర్మ (C 350 – 365) చే దానమీయ బడిన కళింగ విషయములోని 'రాకలువ' గ్రామం నేడు శ్రీకాకుళం తాలూకాలోని 'రాగోలు' గ్రామంగా గుర్తించ బడినది.6 కావున, క్రీ॥శ॥ 4వ శతాబ్దపు నాటికి శ్రీకాకుళ ప్రాంతం కళింగ విషయముగా నుండెడిదని నిశ్చయించుటకు వీలగుచున్నది.

(ఆ) కోలువర్తని / వరాహవర్తని : ఉ॥ దా॥ మూడవ అనంతవర్మ వజ్రహస్త (క్రీ॥ శ॥ 1037–1070) ని దంత తామ్ర శాసనములో7 పేర్కొనబడిన కోలువర్తని, అనంతవర్మ చోడ గాంగదేవు (క్రీ॥ శ॥ 1076 – 1150) ని కొర్ని శాసనములో8 పేర్కొనబడిన వరాహవర్తని నొకే విషయమును సూచించు పర్యాయపదములని, నీ విషయ(ము)ల ప్రాంతము నేటి శ్రీకాకుళం, టెక్కలి ప్రాంతములకు సరిపోవునని గుర్తించుటైనది.9

(ఇ) క్రోష్టుకవర్తని : ఉ॥దా॥ హస్తివర్మ ఉర్లాం తామ్ర శాసనమునందు పేర్కొన బడిన నీవిషయములో నేటి శ్రీకాకుళం తాలూకా ప్రాంతము కొంత చేరియుండెనని పరిశోధకుల తలంపు.10

(ఈ) జలమ్బూర : ఉ॥దా॥ :ఇంద్రవర్మ దేవుని తామ్ర శాసనము11 (12శ॥) జలమ్బూర విషయములోని అమేరసింగ గ్రామ దానమును పేర్కొనినది. జలమూరు నరసన్నపేట తాలూకాలోను, దానమీయ బడిన గ్రామము 'అంగారసింగి' అనుపేర పాతపట్నం తాలూకాలోను ఉన్నవి. కనుక ఈ విషయము ఆ తాలూకాల ప్రాంతమునకు సరిపోవునదిగా ఎంచవచ్చును.

(ఉ) ఎర(అ)ద / వేల్పూర : ఎరద విషయమును పేర్కొనిన 12, 13 శ॥ నాటి శాసనములలో నొకదానియందు ఉటంకించ బడిన 'వెలంగాఠ' (వెలగాడ), శ॥సం॥ 979 (క్రీ॥ శ॥ 1057) నాటిదగు మూడవ అనంతవర్మ వజ్రహస్తుని నడగాం శాసనములో పేర్కొన బడిన 'పోదూరు' (పొందూరు) గ్రామములు నేడు శ్రీకాకుళం జిల్లాలో శేషించిన చీపురుపల్లి తాలూకాలో నుండుటను బట్టి నీవిషయములను తాలూకా ప్రాంతమునవని భావించ వచ్చును.12

(ఊ) సమ్మగ : ఉ॥ దా॥ శ॥ 982 నాటిదగు మూడవ అనంతవర్మ వజ్రహస్తుని దంత తామ్ర శాసనములో13 పేర్కొన బడిన నీవిషయము పరిశోధకులచే బొబ్బిలి – చీపురుపల్లి తాలూకా ప్రాంతముగా గుర్తించబడినది. శాసనములలో నిది సమ్వా లేక సంబ విషయమని కూడా పేర్కొనబడినది.14

(ఋ) రూపవర్తిని : ఉ॥దా॥ 'రూప్యవతి' యని నామాంతరము గల ఈ విషయము ఇంద్రవర్మ టెక్కలి శాసనమందు పేర్కొనబడినది. ఈ విషయము టెక్కలి తాలూకా ప్రాంతమునకు సరిపోవునదిగా పరిశీలకులు గుర్తించారు.15

(ౠ) పాఱతలగాము : ఉ॥దా॥ శ॥1203 నాటిదగు నొక సింహాచల శాసనము16లో పేర్కొనబడిన ఈ విషయములోని కోడూరు,జమ్ము అను గ్రామములు నేటికీ అవే పేర్లతో నరసన్నపేట తాలూకాలోనున్నవి. పాఱతలగాము నేడు 'పారతలగాం' పేరుతో నదే తాలూకాలో నుండుటనుబట్టి ఆ పేరుగల విషయమునకు ఆ కాలములో నాగ్రామము కేంద్రముగా నుండి యుండవచ్చును.

2. భో గ ము లు

"భోగమనగా నొక మండలములోని యంతర్భాగము.17

(అ) ఓంకార భోగము: మహారాజ ఇంద్రవర్మ జిర్జింగి తామ్ర శాసనములో ఓంకార భోగ సంబంధముగా పేర్కొనబడిన 'జిజ్జిక' గ్రామము నేడు 'జిర్లింగి' పేరుతో టెక్కలి తాలూకాలో నుండుటను బట్టి ఆ భోగము నేటి టెక్కలి తాలూకా ప్రాంతముగా తలంప వచ్చును.

(ఆ) మహేంద్ర భోగము: మాఠరవంశీయుడైన ఉమావర్మ (400-430) మహేంద్రభోగములోని 'కొత్తూరు' గ్రామమును దాన మిచ్చినట్లు ఆతని ధవళపేట శాసనము[19] తెలుపుచున్నది. 'కొత్తూరు' శ్రీకాకుళం తాలూకాలోనుండుటను బట్టి మహేంద్ర భోగము ఆ ప్రాంతమునకు వర్తించునని భావింపవచ్చును.

3. రాజ్యము

ఉ॥ దా॥ శ॥ సం॥ 1392, 1393 నాటివగు శ్రీకూర్మ శాసనములలో[20] పాలకొండ రాజ్యము పేర్కొనబడినది. పాలకొండ నేటికిని శ్రీకాకుళం జిల్లాలో నొక తాలూకా కేంద్రమైయున్నది.

4. రాష్ట్రములు

(అ) కురక రాష్ట్రము: దానార్ణవుని కుమారుడైన ఇంద్రవర్మ పుర్లి శాసనమందు కురకరాష్ట్రములోని భకుక్కురు గ్రామ ప్రశంస గలదు. 'భుకూక్కురు' గ్రామముగల నేటి పాలకొండ తాలూకాయే పూర్వపు కురక రాష్ట్ర ప్రదేశమై యుండునని పరిశోధకుల గుర్తింపు.[21]

(ఆ) ప్లకి: శాసనములలోనిది ప్రకిర్నాడు, ప్లకి విషయమని గూడా పేర్కొనబడినది. విష్ణుకుండిన ఇంద్రభట్టారక వర్మ (క్రీ. శ. 529-555) రామతీర్థ తామ్రశాసనము[22]లో పేర్కొనబడిన ప్లకి రాష్ట్రము, బొబ్బిలి, చీపురుపల్లి తాలూకా ప్రాంతములకు సరిపోవునదిగా భావించబడినది.[23]

5. పాంచాలి

దానార్ణవుని కుమారుడు ఇంద్రవర్మ శ్రీకాకుళం శాసనమందు[24] పేర్కొనబడిన 'క్రోష్టుక పాంచాలి' క్రోష్టుకవర్తనీ విషయాంతర్భాగమై యుండును. పాంచాలి యనగా అయిదు గ్రామముల సముదాయమై యుండును. క్రోష్టుకవర్తనీ విషయము నేటి శ్రీకాకుళం జిల్లా మిడి తాలూకాల ప్రాంతముగా నుండే వివరించుట జరిగినది.

6. దండపాట

ఈ పేరుగల పాలనా విభాగము అర్వాచీన గాంగుల, సూర్య వంశ గజపతుల కాలమందు ప్రాచుర్యములోనికి వచ్చినది.[25] నేటి శ్రీకాకుళంజిల్లా ప్రాంతం నాడు కళింగ దండపాటలో నుండెడిది. శ॥ సం॥ 1441 నాటిదగు శ్రీకృష్ణదేవరాయల సింహాచలం శాసనము[26] మున్నగునవి 'కళింగదండ పాట' ను పేర్కొనినవి.

పై వివరణవలన ప్రస్తుత శ్రీకాకుళం జిల్లాలోని వివిధ తాలూకాలలో ప్రాచీన, మధ్యయుగములందుండిన పాలనా విభాగము లీ క్రింది విధముగా కానవచ్చుచున్నవి.[27]

1) చీపురు పల్లి : ఏరద/ వేల్వార, సమ్మగ విషయములు, ప్లకి రాష్ట్రము

2) టెక్కలి : రూప వర్తిని విషయము; ఓంకార భోగము

3) నరసన్నపేట : పారతలగాం విషయము; జలమ్వోర విషయము

4) పాలకొండ : పాలకొండ రాజ్యము; కురక రాష్ట్రము

5) శ్రీకాకుళం : కళింగ, కోలువర్తని/ వరాహవర్తని, క్రోష్టుకవర్తని, విషయములు; మహేంద్ర భోగము; కళింగదండ పాట; క్రోష్టుక పాంచాలి.

నిజమునకు పై విధమైన నిరూపణ ఖచితమైనది కానేరదు. నేడీ విధముగా జిల్లాలనుంచి జిల్లాలు (ఉ॥దా॥ విశాఖపట్నం జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా ఏర్పడగా, తిరిగి ఆరెండు జిల్లాలనుంచి విజయనగరం జిల్లా ఏర్పడినది) ఏర్పడుట, తాలూకాలు పునర్వర్గీకరింప బడుట జరుగుచున్నదో ఆ విధముగనే ప్రాచీన, మధ్య యుగములందుకూడా జరిగెడిది. ఉ॥దా॥ "ఏరద విషయమే వేల్వార గ్రామమ్ తుమ్మకావప్పడాం వల్లూరమ కోనూరన పోడూరు వాడం మూరిగాం తననురంప దేవరమ చికిడమ గుద్రపీ ఏతన్ ద్వాదశ గ్రామాన్ వేల్వార విషయేతితి నామమే కీకృత్య"- అని ఏరద విషయములోని పండ్రెండు గ్రామములను ఏకముగాజేసి, వేల్వార విషయమని నామకరణము చేయబడినట్లు మూడవ వజ్రహస్తుని నదగాం శాసనము (క్రీ॥శ॥ 1057) వలన తెలియవస్తోంది.[28] పైన చెప్పబడిన గ్రామములలో వల్లూరమ (వల్లూరు), వప్పడాం (బొప్పడాం), కోనూరన (కోనూరు) గ్రామములు నేడు విజయనగర జిల్లాలోనుండగా, పోడూరు (పొందూరు) శ్రీకాకుళం జిల్లాలో శేషించిన చీపురుపల్లి తాలూకాలోనున్నది

శాసనములు - గ్రామ నామములు

క్రమ సంఖ్య	శాసనములోని గ్రామ నామము	ప్రస్తుత గ్రామ నామము	తాలూకా	శాసనము - కాలము - ఆధారము
1	ఖొన్న	కొర్ని	శ్రీకాకుళం	అనంతవర్మ చోడగాంగదేవుని కొర్ని తామ్ర శాసనము శ॥ సం॥ 1003
2	గార	గార	,,	JAHRS (జర్నల్ అఫ్ ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చి సొసైటి), రాజమండ్రి. వాల్యూం 1, పార్ట్ 1. జూలై, 1926, పే. 43.
3	హోంబరవల్లి	హొమ్మరావెల్లి	,,	,,
4	తూలువు	తూలుగు	,,	,,
5	ఖొల్లేర	కొర్లాం	,,	,,
6	తొనెంగి	తోనంగి	,,	,,
7	సిద్ధార్థక	సిద్ధాంతం	,,	ఇంద్రవర్మ అచ్యుతాపుర తామ్రశాసనం. గాంగ శ॥87. (584 క్రీ.శ.) ఇండియన్ ఏంటిక్వెరి, వాల్యూం 8, పే. 120 & కళింగదేశ చరిత్రానుబంధము, పే. 35
8	రాకలువ	రాగోలు	,,	మాఠరశక్తివర్మ (350-365) రాగోలు తామ్రశాసనం ఎపిగ్రాఫికా ఇండికా, XII, పే. 1-3 & భావరాజు వెంకట కృష్ణారావు, ఎర్లీ డైనాస్టీస్ అఫ్ ఆంధ్రదేశ, పే. 385-386.
9	కోకుద్ద	కుద్దాము	,,	మూడవ వజ్రహస్తుని చిక్కాలవలస తామ్రశాసనము శ॥సం॥982 కళింగదేశ చరిత్రానుబంధము, పు. 50.
10	కొత్తూరు	కొత్తూరు	,,	ఉమావర్మ (400-430) ధవళపేట శాసనము. JAHRS. X పే.143.
11	జిజ్జిక	జిర్లింగి	నరసన్నపేట	ఇంద్రవర్మ జిజ్జింగి తామ్రశాసనము. 6 శతాబ్దం ప్రథమార్ధము. కళింగదేశ చరిత్రానుబంధము, పు. 37.
12	ఉరామల్ల	ఉర్లాం	,,	హస్తివర్మ ఉర్లాం శాసనము గాం॥శ॥80. ఎపిగ్రాఫికా ఇండికా, XVII, నెం. 19.
13	దీగ్గాన్సి	దీర్ఘాసి	,,	ముఖలింగ శాసనము, క్రీ. శ. 1085. S. I. I. V, నెం. 1146.
14	రోనెంకి	రోణంకి	,,	రోణంకి శాసనము. S. I. I. V, నెం. 1348, క్రీ. శ. 1093 డా॥ బూదరాజు రాధాకృష్ణ, 'ఎర్లీ తెలుగు ఇన్‌స్క్రిప్షన్స్' ప్రాచీనాంధ్ర శాసనాలు, పే. 468.
15	కోడూరు జమ్ము	కోడూరు జమ్ము	,,	సింహాచలం శాసనము. శ. 1203. S. I. I. VI, నెం. 1118.
16	తులగ్రామ	తులగాం	టెక్కలి	ముఖలింగశాసనము. శ. 1059. S. I. I. V, నెం. 1081.
17	తిరిలింగ	తిర్లింగి	,,	ఇంద్రవర్మ పుర్లి శాసనము. గాంగ విజయరాజ్య సంవత్సరములు 149 E.I. XIV, నెం. 362. కళింగదేశ చరిత్రానుబంధము. పు. 40.
18	దిమిలిఘెడ	దిమిలాడ	,,	చంపకేశ్వర దేవాలయ శాసనము శ॥ సం॥ 1063.. JAHRS, Vol. IV, పే. 163.

క్రమ సంఖ్య	శాసనములోని గ్రామ నామము	ప్రస్తుత గ్రామ నామము	తాలూకా	శాసనము - కాలము - ఆధారము
19	నవగ్రామ	నౌగాం	నరసన్నపేట	ముఖలింగ శాసనము S. I. I. V, నెం. 1110.
20	తుంగన	చినతుంగాం	,,	ఇంద్రవర్మ టెక్కలిశాసనము E. I. XVIII, నెం. 31.
21	వర్ధమానపురము	వడమ	పాలకొండ	ఉమావర్మ (400-430) టెక్కలి తామ్రశాసనము E. I. XXVIII, నెం. 47
22	భక్కుకుర	భకూరు	,,	ఇంద్రవర్మ పుర్లి శాసనము. E. I. XIV, పే. 362
23	పాలకొండ	పాలకొండ	,,	శ్రీకూర్మ శాసనము శ॥1392, S. I. I. V, నెం. 1247
24	పీరకూట	పీరఘట్టం	,,	సింహాచల శాసనము శ॥1270, S. I. I. VI, నెం. 988
25	అవరెంగ	అవలింగి	,,	మూడవ వజ్రహస్తుని బొడ్డపాడు తామ్ర శాసనము, శ॥ 982 కళింగదేశ చరిత్రానుబంధము, పు. 55.
26	ఝూడె	ఝాడుపూడి	సోంపేట	సింహాచల శాసనము శ॥ 1294 S. I. I. VI, నెం. 1110.
27	చీకటి	చీకటి	,,	సింహాచల శాసనము శ॥ 1203 S. I. I. VI, నెం. 1118.
28	ఆమేరసింగ	అంగారసింగి	పాతపట్నం	ఇంద్రవర్మ దేవుని తామ్రశాసనము. 12 వ శతాబ్దము కళింగదేశ చరిత్రానుబంధము పు. 85
29	పోడూరు	పొందూరు	చీపురుపల్లి	మూడవ వజ్రహస్తుని నడగాంశాసనము శ॥979 E.I. VI, నెం.24
30	తులసిగ్రామ	తులసిగాం	ఇచ్ఛాపురం	శ్రీకూర్మ శాసనము శ॥ 1281. S. I. I V, నెం. 1157.

పై పట్టిక ఉదాహరణ ప్రాయముగా కొన్ని గ్రామనామములు కాలగతిని జన వ్యవహారములో మార్పు నొందుటయు, మరికొన్ని, వందల సంవత్సరములు గడచినప్పటికీ ఏవిధమైన మార్పులకు లోనుగాకుండుటయును విశదపరుస్తుంది. అంతేకాక ఆయా గ్రామముల ప్రాచీనతను కూడ తెలియజేస్తుంది.

మతములు - గ్రామనామములు

మానవుని వ్యక్తి, సంఘజీవితాలలో మతంయొక్క ప్రభావం ఉంటూవస్తోంది. ఈ సంగతి గ్రామనామముల విషయంలో కూడ ద్యోతక మవుతున్నది. ఈ జిల్లాలో పౌరాణిక, చారిత్రిక ప్రసిద్ధి నొందిన దేవస్థానము లుండిన గ్రామముల పేళ్ళ వెనుక చరిత్ర ఆసక్తిదాయకమూ, పరిశీలనార్హమూ అయినదిగా ఉన్నది.

నాగావళిని రచించిన వాడని భావింపబడే బలరాముడే ఆ నదీతీరమున పాటలేశ్వర (ఒరిస్సా), సోమేశ్వర (గుంప), సంగమేశ్వర (సంగాం-పా॥తా॥) కోటీశ్వర (శ్రీకాకుళం), మణినాగేశ్వరు (కళ్ళేపల్లి-శ్రీ॥తా॥) లను పంచలింగములను ప్రతిష్ఠించెనను విశ్వాసంచేత, "బలరామ క్షేత్రం అన్నా, పంచలింగ క్షేత్రం అన్నా, ఈ శ్రీకాకుళం మండలంగానే పరిగణించాలి"29 అనే అభిప్రాయం యేర్పడినది.

<u>అరసవిల్లి (శ్రీ)</u> : దక్షిణ భారతదేశంలో అరుదైన సూర్యాలయ మున్న ఈ గ్రామనామం శిలాశాసనములలో 30, తామ్రశాసనములో31, జనవ్యవహారములో 'అర్షవెల్లి, యరసవెల్లి, అరిసివల్లి, అరసివిల్లి, అరిసిల్లి మొ॥పలువిధముల ఉచ్చరింపబడుచున్నది. అరసవెల్లిని 'హర్షవల్లి' అని సంస్కృతీకరించే ప్రయత్నం జరిగినదని గుర్తించబడి నప్పటికీ, జనసామాన్యం ఆ పేరు వెనుక కూడా చరిత్రను ఊహించటానికి ఉద్యుక్తులైనట్లు తోస్తూంది. "సూర్యుని ఆదేశానుసారం హర్షుడు హర్షవల్లి అనే గ్రామాన్ని నిర్మించి అందులో సూర్యాలయాన్ని నిర్మించాడు. హర్షవిల్లి క్రమంగా అరసవల్లి అయినది."32 ఇక్కడ హర్షు అంటే సకలోత్తర పథాదినాథుడు హర్షుడనే గ్రహించాలి. ఈ జిల్లాలో హర్ష

బాడ (పె) అనే గ్రామమూ ఉన్నదిగాని అ హర్షుడు ఈ ప్రాంతాల వరకూ వచ్చినట్లు ఇంకే ఇతర చరిత్రకాధారాలు తెలియజేయటం లేదు కనుక ఈ ఉత్పత్తి అంగీకారయోగ్యంగా కన్పట్టదు. ఇక పోతే, 'ఆరోగ్యం భాస్కరాధీనం' అను నమ్మకను బట్టి సూర్య నారాయణను ఆలయమున్న గ్రామం కావున నది హర్షదాయకమై నామసార్థక్యమును కలిగినదనే సమర్థనలేకపోలేదు. దీనిని "అర్శోహర క్షేత్రం" అని కూడా పెద్దలు అంటారు. అర్శస్సు అనగా మూల వ్యాధి. ఇదొక మొండి తెగులు. అట్టి జబ్బులను కూడా తొలగించు దివ్యక్షేత్రం అగుటచే "అర్శవల్లి" అని కూడా అయిందంటారు. అను. అభిప్రాయం కొంత యుక్తి యుక్తంగానే అన్నది. వ్యాసప్రోక్తమని చెప్పబడే స్కాందపురాణం ప్రకారం ఇక్కడ సూర్యదేవుని దేవేంద్రుడే ప్రతిష్ఠించాడు. చరిత్ర ప్రకారం తూర్పుగాంగ మొదటి దేవేంద్రవర్మ (క్రీ॥శ॥670-702) ఈ ఆలయ నిర్మాత.33 ఇది ఇలా ఉండగా, "తమిళమున కలింగ అంటే నాజూకు నేతబట్టట. శ్రీకాకుళం శబరులలో చేనేతవారు అర్సి సవరణలు. అర్సి, అరసవెల్లి సంబంధం తెలియాలి. అర్సు, అరసు కన్నడంలో హోదాను సూచిస్తుంది.... అరసవెల్లి సవరపల్లి యేమో" అని వేరొక అభిప్రాయం.34

ఇచ్ఛాపురం (ఇ): శ్వేచ్ఛావతిదేవి ఆలయమున్న ఈ ఊరికి ఆ పేరు ఆ శ్వేచ్ఛ(ఇచ్ఛా)వతీదేవి పరంగా వచ్చి ఉండవచ్చును.

ఇప్పిలి (శ్రీ) : ఈ గ్రామములోగల సుందరేశ్వరుడు పిప్పిలేశ్వరుడుగాను, పురాణాలలో ఈ గ్రామం ఆ దేవిని పరంగా 'పిప్పల' గ్రామంగా నుండేదని 'పిప్పిలి' క్రమంగా 'ఇప్పిలి' గా మారినదని భావించబడుచున్నది.35 ముఖలింగ, శ్రీ కూర్మశాసనాలలో36 'ఇప్పిలి' గ్రామనామం కానవస్తోంది. ముఖలింగం విషయంలో వలెనే ఈ గ్రామనామము కూడా వృక్ష సంబంధమైనదిగా తోస్తుంది.

గోకర్ణపురం (సోం & పా): "పూర్వగాంగుల ఇష్టదైవము గోకర్ణేశ్వరస్వామి. గోకర్ణేశ్వరాలయము గజాం జిల్లాలోని మహేంద్రగిరిపై వున్నది. గాంగవంశ భూజానులు మొదట మైసూరునుండి వలసవచ్చి గోకర్ణేశ్వరుని పూజించి, అయన అనుగ్రహముచే కళింగదేశమున గాంగరాజ్యమును స్థాపించిరి."37 మరి, ఆ దేవుని పేర గ్రామములేర్పడుట సహజమే. గోకన్నపల్లి (పాల) అగర్ల గోకర్లపల్లి, చిన్నారి గోకర్లపల్లి (పె) వంటి గ్రామ నామములు కూడ 'గోకర్ణ' స్వామి పరముగనే ఏర్పడినవి.

దీపావళి (శ్రీ) : టెక్కలి తాలూకాలోని దిమిలాడ అనే ఊరు దగ్గరలో దీపావళి అనే పేరు గల గ్రామం గలదని, దానికి ఆ పేరు - దిమిలాడలోగల చంపకేశ్వరుని దేవాలయములో దీపారాధనకు అనంతవర్మ చోడగాంగ దేవుడు సమర్పించిన గ్రామమగుటచే వచ్చినదని వివరణ గలదు.38 అయితే, టెక్కలి తాలూకాలో ఆ పేరు గల గ్రామం కానరాదు. శ్రీకాకుళం తాలూకాలో నొక 'దీపావళి' గ్రామం ఉన్నది. ఈ గ్రామమునకు కూడా ఆ పేరు పై విధముగా వచ్చినదేమో !?

ముఖలింగం (పా) : "ఈ ముఖలింగేశ్వర క్షేత్ర మహాత్మ్యమును బట్టి దీని పూర్వనామము గోవిందకానన మనబడినది. దీని అపభ్రంశ రూపములే 'గోండ్వాణము' 'గోండు వనము' అను పదములు. జయంతి, గోకర్ణము, ముఖలింగము అనునవి కూడ దీని పూర్వ నామములు."39 కాగా, "దేవుని పేరిట (రామేశ్వరము వలె) ముఖలింగం గ్రామనామం అయిన కాలం ఆధునికమే"40 అని వేరొక అభిప్రాయం. శాసనములలో ఈ గ్రామం సప్తగ్రామ, నవగ్రామమని కూడ చెప్పబడినది. తూర్పు గాంగుల రాజధానియైన కళింగ నగర మిదియేనని చరిత్రకారులు గుర్తించిరి 41 కాగా, మధుకేశ్వరలింగమునకు ముఖముండుటచే ఆయన ముఖలింగేశ్వరుడై, ఆ గ్రామము ముఖలింగమైనదని జన విశ్వాసం. "గ్రామస్థులు ముఖం అనేది బెరడులేని చోటు కాబట్టి ఈ అర్చామూర్తి శిలా కాఠిన్యమొందిన తరు కాండ మనక తప్పదు."42 ఏది ఏమైనా, "ఈ లింగమునకు 'ముఖలింగమ'ని పేరున్నను ముఖము మాత్రము లేదు. కనుక ఈ ముఖలింగము నకు పూర్వ రూపము 'మధూక లింగము'.యే యున్నట్లు తోచుచున్నది. ఇప్ప చెట్టును సంస్కృత భాషలో మధుక వృక్షమని వ్యవహరింతురు. ఇది ఒరియా భాషలో 'మెహువా'గా మారినది. ఆ పిమ్మట ఇది మోహలింగముగా మారినది. చివరకు ముఖలింగమని సంస్కృతీకరింపబడి యుండును. లేదా కళింగ దేశము మూడు ప్రాంతములుగా విభజింపబడుటచే, ఈ ప్రాంతమును పాలించిన రాజులందరును త్రికలింగేశ్వరులని పిలువబడిరి. కావున మూడు కళింగములు కలిసిముక్కలింగమై అదియే ముఖలింగముగా మారియుండును."43 ఈ విధముగా దేవుని పేరు వెనుకగల చరిత్రయే గ్రామనామము చరిత్రగాకూడ యున్నది. ప్రఖ్యాతమైన ఈ ముఖలింగ గ్రామనామ స్ఫూర్తితో నేర్పడిన మరియొక గ్రామనామము 'ముఖలింగపురం' (పె).

శ్రీ కూర్మం (శ్రీ) . శ్రీ మహావిష్ణువు దశావతారములలో రెండవదియైన కూర్మావతారమునకు అరుదుగానుండిన ఆలయములలో నొకటి ఇచ్చోట నున్నది. శ్రీ కూర్మనాథస్వామి పేరే ఈ గ్రామ నామముగా నేర్పడినది. ఆ దేవుని పేర ఇంకొన్ని గ్రామములుకూడా గలవు. కూర్మనాథపురం (పా & న)

సంగాం (పాల) : "యిక్కడ గోస్తని, వేగవతి అనెడు రెండు చిన్న ప్రవాహములు కలిసి శ్రీకాకుళమువద్ద నున్న మొపజు బందరు దగ్గర సముద్రగామి యగుచున్న లాంగలనది లోనికి ప్రవహించుచున్నవి. యీ జలసంధి మధ్యప్రదేశమునందు సంగమేశ్వరుడనే శివునియొక్క ఆలయమున్నది. ఆ ప్రవాహములు సంగమమైన స్థలమగుటచేత సంగమేశ్వరుడనే పేరు వచ్చినది."44 సంగమేశ్వరుని విషయములోవలెనే అక్కడి గ్రామమునకు 'సంగాం' అను నామమేర్పడినది.

సైలాడ (శ్రీ) : పురాణ ప్రసిద్ధుడైన నందికేశ్వరుని తండ్రీ మహాభక్తుడూ అయిన శిలాదుని పేర నేర్పడిన సైలాడ (శిలాడ) కొండ ప్రాంతపు గ్రామంగా నిది 'సైలాడ'యను పేరు తెచ్చుకున్నది.

వైష్ణవము

ఈ ప్రాంతమున చాల ప్రాచుర్యముగల సింహాద్రి వరాహ నరసింహుని నామ ప్రభావమున నేర్పడినవి : వరాహ నరసింహపురం (న); సింహాద్రిపురం (న). తాయిమాంబాపురం, వైకుంఠపురం (శ్రీ); వనవిష్ణుపురం (సో). హరిదాసపురం (టె); గోవర్ధనపురం, రాధావల్లభపురం (పా ; దేవకివాడ (పాల) ఇత్యాదులు ఈ జిల్లాలో వైష్ణవమతము నొందిన ప్రాముఖ్యమును తెలియజేయు గ్రామనామములుగ నున్నవి.

శైవము

అమృతలింగపురం, కాత్యామాయిపేట, మల్లికార్జునపురం (శ్రీ): ఈశ్వరరాయి (పా); భవానీపురం (పాల) మొ॥ గ్రామనామములు శైవమత ప్రభావ సూచకములుగ గ్రహించ వచ్చును.

ఇతర దైవతములు : ఉ॥దా॥ పర్వతేశ్వరునిపేట (శ్రీ); అమ్మవారి పుట్టుగ (సోం)

దైవనామాంకితములైన గ్రామములున్నట్లే ఈ జిల్లాలో భేతాళపురం (సోం): భూతాలగుడ (పా) వంటి గ్రామములు కూడా నున్నవి.

బౌద్ధమత సంబంధములు

దంతపురము: ఇంద్రవర్మ జిర్జింగి తామ్రశాసనము మొ॥ వాటిలో అమరపుర ప్రతిస్పర్థిగా ఎంచబడిన తూర్పుగాంగుల తొలి రాజధాని. జాతక కథల ప్రకారం ప్రాచీన కళింగ రాజధాని. "బుద్ధుని నిర్యాణానంతరము ఆయన దంతమును తెచ్చి ఒక స్థూపమున దానినుంచి ఆ పురమున భద్రపరచుటచే ఆ పురమునకు దంతపురమని నామము ఏర్పడినట్లు ముఖలింగశాసనమున గలదు. శ్రీకాకుళము జిల్లాలోని, శ్రీకాకుళము వద్ద నున్న దంతవక్త్రుని కోటయే పూర్వపు దంతపురమని కొందరి అభిప్రాయము."45

మందసా (సోం): "వేంటి మందసా పట్టణము నాంటి బుద్ధదంతము గల మంజూష యొకటి స్థాపితమైన పట్టణము కానోపుననియు 'మంజూషా' శబ్దమేవికృతిని బొంది 'మందసా'గా జనుల నాలుకలో నిలిచి యున్నదనియు కొందరభిప్రాయము."46

శాలి హుండాం (శ్రీ): "లభ్యమైన శాసనములను బట్టి శాలిహుండా మునకు పూర్వము 'శాలిపేటిక' అను నామమున్నట్లు తెలియుచున్నది."47 శల్యపేటిక అనునది శాలిపాటక మయినదనియు, బహుశా బుద్ధుని శల్యమొకటి భద్రపరచబడిన పేటికపై నిర్మింపబడిన స్థూపము కలిగినది కాబట్టి ఆ పేరు వచ్చియుండుననియు ఒక అభిప్రాయం.48 ఒరియా భాషలో హుండ అనగా కొండ. సంస్కృత భాషలో శాలి అనగా ధాన్యము. కనుక నీప్రదేశము ఒకప్పుడు ధాన్యాగారము వంటిదై యుండెడిదని వేరొక నిరూపణము.49 "విద్వజ్జన వేదాధ్యయన శ్రోత్రియ బ్రాహ్మణుల గ్రామాల, అగ్రహారాల పేరు చివర పట్టు వుండుట సాధారణము. కళింగ అనంతవర్మ చోడ గంగరాజు కొన్ని శాసనంలో నార (గ్రామం) వద్దనున్న సాలిహుండామునే ముణ్ణపట్టు అన్నాడు. అంటే బౌద్ధసన్యాసుల తావు. బోడిగుండు సందర్భం. గీర్వాణంలో ముణ్డ, ముణ్డి, ముణ్డిత శబ్దాలకు వచ్చిన తిప్పలు. ముణ్డ శబ్దం తల అర్థంతోనూ వాడేరు"50 అని శాలిహుండా మనకు పూర్వముండిన వేరొక నామమునకు వివరణ.

సిద్ధాంతం (శ్రీ): ఇంద్రవర్మ అచ్యుతాపుర శాసనంలో పేర్కొనబడిన సిద్ధార్థక గ్రామమే నేడు 'సిద్ధాంతం' గా మారినదని గుర్తింపబడినది.51 బుద్ధుడు తొలుత సిద్ధార్థుడు గదా!

కొన్ని చారిత్రక గ్రామములు

సముద్రగుప్తుని (క్రీ॥శ॥ 335-380) దక్షిణ దిగ్విజయ యాత్రా కాలము నాటికి దమనుని పాలనలో నుండిన హేరండపల్లి

ఆముదాలవలస (శ్రీ)గా గుర్తింపబడినది. ఆముదాలవలసకు హే (ఏ) రంథపల్లి సంస్కృత మాతృక.52

మాఠర పితృభక్త (350 - 437), వంశీయులకు కొంతకాలము రాజధానిగా నుండిన సింహపురమే నేటి సింగుపురము (శ్రీ). మాఠరుల రాజకీయవారసులైన వాసిష్ఠవంశరాజుల (5 శ॥) రాజధాని సిరిపురము. సింగుపురములు (శ్రీ & సొం & టె & పా & పాల), సిరిపురములు (పాల & సొం & చీ) గ్రామనామాలై ఈ జిల్లాలో బహుళముగా నుండుటకు నొకప్పుడు ఆ పేరుగల గ్రామములు ప్రముఖములైనవి యగుటే యనిపించును. "కళింగాంధ్ర దేశము వివిధ ప్రాంతముల నేలిన రాజన్యుల కొకప్పుడు వర్ధమాన పురపు ప్రధాన నగరముగ నుండెను.... ఈ వర్ధమాన పురము.... పాలకొండ తాలూకాకు చెందిన వడమ గ్రామము."53

కళింగపట్నం (శ్రీ) ఒకప్పుడు కళింగాంధ్రమున ప్రముఖ రేవు పట్టణము 'పట్నం' నామాంత్యముగల గ్రామమునది-సముద్ర తీరస్థ గ్రామముగా గుర్తింపవచ్చును.54 "కళింగపట్నం పూర్వనామము కన్నగర, కాటకర్దన - కార్తికేయధామయట. కర, కల - సుంకము. కర, కూల తీరప్రాంతము."55 విశాఖ పట్నమునకు వలెనే కళింగపట్నమునకు కూడ స్కంద సంబంధము ఊహింపబడుట గమనింపదగినది.

రాజ వంశముల, పాలకుల నామ ప్రభావము

ఆంధ్ర రాజులు కళింగమందు చేసిన రాజ్యస్థాపనా సూచకముగా భావింపబడిన గ్రామనామములలో నొకటైన అంధ్రవరం56 నరసన్నపేట తాలూకాలో నున్నది.

"కళింగం ఒకప్పుడు నందరాజుల రాజ్యం, కళింగలో నంద శబ్దమున్న ఊర్లు లేకపోలేదు."57 అట్టివి: నందికొండ (శ్రీ): నందిగామం (న), నందిగాం (టె), నందబలగ (పాల), నందలపాడు, నందవ (పా), నందిగాం, నందివాడ (చీ).

తూర్పుగాంగ

"పూర్వ గాంగులలో ప్రధానులైనవారు కొందరు కళింగ నగరమును దంతపురమును రాజధానులుగా చేసుకుని పాలించిరి. కొందరు శ్వేతకాధిష్టానము నుండి పరిపాలించిరి. శ్వేతకను 'శ్వేత - శ్వేతక' యని కూడ వ్యవహరించిరి.58 ఈ 'శ్వేతక' నేటి సోంపేట తాలూకాలోని 'చీకటి'గా గుర్తించబడినది.59 తూర్పుగాంగ భూజానులకు తమ రాజధానిని 'తిరస్కృత త్రివిష్టప' (స్వర్గ రాజధానిని మించునదిగా) మని వర్ణించుకొనుట గలదు. అమరావతి (సొం), సురవరం (శ్రీ), సురపురం (చీ) వంటి గ్రామ నామములు ఆ విషయమును జ్ఞప్తికి తెచ్చేవిగా ఉన్నవి. గాంగ వంశనామ ప్రభావముగ గంగవరం (న), గంగువాడ (పా & టె), వంటి గ్రామనామము లున్నవి. ఈ వంశీయులలో ముప్వురు భీములు, అర్గురు అనంతవర్మలు, ముప్వురు రాజరాజులు, నల్గురు నరసింహులు ఉన్నారు.60 వారి నామ ప్రభావముగ ఈ గ్రామ నామము లేర్పడినట్లు తోచును. భీమవరం (పా), భీమపురం (టె), అనంతపురం (సొం & టె), అనంతగిరి (పా), రాజపురం (పా & పాల & న & టె & ఇ), నరసింహపురం (చీ), నరసింగపురం(సొం), నరసింగపల్లి (శ్రీ & న), నరసీపురం, నరసాపురం, నరసింగపల్లి [టె], సత్యవర్మ [క్రీ॥శ॥ 545]పేర సత్యవరం [న], అనంతవర్మ చోడ గాంగదేవు [1076 - 1150]ని భార్య కస్తూరి కామోదిని పేర కస్తూరిపాడు [న], కుమారుడు రాఘవు [1156 - 1170]ని పేర రాఘవపురం [శ్రీ] ఏర్పడినట్లు తోచును. మహాదేవి పురములు [టె & పా] అనంతవర్మ చోడగాంగ దేవుని అగ్రమహిషి పృథ్వీ మహాదేవి పేర నేర్పడిఉండెనా అనిపించునుగాని ఆ గ్రామనామములు వేరెవరి దేవేపేరనైన నేర్పడిఉండవచ్చు. నాల్గవ నరసింహదేవు [1377-1424]ని భార్య నీలాదేవి. నీలావతి [సొం], నీలాదేవి పురం [పాల & పా], నీలానగరం (పా), నీలాపురం [చీ] గ్రామ నామములలో నేదైన పేరున ఏర్పడినుండ నోపును.

చోళ: తూర్పు గాంగులకు దాక్షిణాత్యులైన చోళులకు రాజకీయ, వైవాహిక సంబంధములుండినవి. తత్సూచిక గ్రామ నామములు చోడవరం (న); చోడసముద్రం (పా).

కదంబ: "గాంగులకును, కదంబులకును సంబంధము గలదు.....తూర్పు గాంగుల వలెనే, తూర్పు కదంబులు పశ్చిమోత్తర ప్రాంతమునుండి వచ్చి గజాం జిల్లాయందు స్థిరనివాస మేర్పరచుకొని, గాంగులచే నోడింపబడి వారి క్రింద సామంతులుగ నుండి యుందురు. దక్షిణమునందు వలెనే, కళింగమునందు పర్లాపురం, టెక్కలి, పలాస, జయంతిపురం, వనవాసి మొదలుగా గల కదంబ గ్రామములున్నట్లు తెలియుచున్నది."61 కుంతల దేశంలోని తమ నగరములకు గల పేర్ల చొప్పున పలాసిక, వైజంతి పురముల పేర్లను తాము వలస వచ్చిన ప్రాంతములలో నెలకొల్పు కొనిన గ్రామములకిచ్చారు. 62 పలాసిక నేడు పలాసా (సొం) అయినది. అసలు, 'పలాశ' అనునది వృక్షసంబంధి. "పలాశ (కింశుక, మోదుగ) బ్రాహ్మణ్యంలో పవిత్రం.... బ్రహ్మపలాశ అన్నారు."63

తూర్పుచాళుక్య మొ॥ : గుణగ విజయాదిత్యుని కళింగ విజయ యాత్రా సూచికముగా బెజ్జి పుట్టగ (ఇ); బెజ్జి (పా&పాల) గ్రామ నామములు కన్పట్టును. అతని సేనాని పండరంగని నామ సూచికముగా పాండ్ర (పా) కావచ్చును. రాష్ట్రకూట రెండవ కృష్ణుని బావమరది, కిరణపురాధి నాదుడు సంకిల పండరంగనిచే విజితుడు.64 సంకిలి (పాల), పెదసంకిలి (పా) గ్రామనామములు ఈ సంకిలి పరముగా వచ్చియుండవచ్చును. సంకిలి రాజ్యమైన దాహాలము కళింగమునకు పొరుగుదేశము. దక్షిణకోశలమునకు 5, 6 శ॥ లలో రాజధాని యైన శరభపుర నామము కళింగము లోనూ గలదు. శరభపురం (శ్రీ).

రెడ్డి :

"రూడె జంతుర్నాటి జననాథ శుద్ధాంత
కుచ కుంభముల మీఁది కుంకుమంబు
....
బలవ ద్బారహ దొంతి మన్నె ధరణీపాలవరో ధాంగనా
విలసన్మంగళ సూత్రరక్షణ కళావిఖ్యాత కారుణ్య"

మొదలుగా శ్రీనాథుని కాశీఖండములో వీరభద్ర, వేమారెడ్డి పరాక్రమము కీర్తింపబడినది. పై వర్ణనలోని రూడె లేక రూడు అను గ్రామము సోంపేట తాలూకాలోని రూడు లేక రూడు పూడి యను స్థలము"65 శ॥ సం॥ 1294 నాటిదగు ఒక సింహాచల శాసనము ఒక రూపుపాల పడిరాయని పేర్కొనినది.66 ఇదిట్లుండగా బారహ (బారహ అనగా పన్నెండు67 పన్నెండు గ్రామములకు కేంధ్రస్థాన మా గ్రామము కావలయును). మధ్యప్రదేశ్‌లోనిదే గాని శ్రీకాకుళమండలములోది కాదను అభిప్రాయము 68 సరికాక పోవచ్చును. పూసపాటి రాజుల పూర్వ బిరుదావళిలో "బారహ పన్నె గండ పెండేర విరాజితుడు," "బారహ మన్యరాజన్య కోటీర కోటి హీరచారు శుష్యమాణ సమాశ్రిత పాదపంకజుడు" ననునవి గలవు. పూసపాటివారి రాజ్యము మధ్యప్రదేశ్ వరకు విస్తరించి నట్లు తోచదు. వారి సీమలలోనిదిగా చెప్పబడిన ఈ బారహ 'బారువా' (సొం) యే అయి ఉండును. అల్లాడరెడ్డి పేర అల్లాడ పేట(న), వీరభద్రారెడ్డిపేర వీరభద్ర [సొం], పెదకోమటి వేముని బిరుద పరంగా వీరనారాయణ పుర [సొం&పా] గ్రామనామము లేర్పడియుండునా అనిపించును.

సూర్యవంశగజపతి :

ఈ జిల్లాలో విరివిగానున్న పురుషోత్త [మ] పురములు [శ్రీ & ఇ & సొం & టె & పా] పురుషోత్తమ గజపతి [1468-1497] ప్రముఖుడు.69 'బుర్హాన్-ఇ-మాసిర్' అను చారిత్రక గ్రంథము ననుసరించి కపిలేశ్వరుని [1435-1469] మరణానంతరం అతని కుమారులు అంబరరాయలు, మంగళరాయలు రాజ్యాధికారము కొరకు కలహించుకున్నారు. హంవీరుడు అంబర రాయలుగను, పురుషోత్తముడు మంగళరాయలుగను గుర్తింపబడి నారు.70 అంబేరుపేట (న), చినమంగళాపురం, గొట్టిమంగళా పురం [పాల] గ్రామములున్నవి. హంవీరుని మరియొక నామ ధేయం అంపరాయలై యున్నది."71 అంపోలు [శ్రీ], అంపా లెం [న], అంపురం [సొం & పా], అంపిలి [పాల] గ్రామనామ ములో నేదైన అంపరాయల పరంగా నేర్పడియుండవచ్చును. హరిశ్చంద్రపురము [న] ప్రతాపరుద్ర గజపతి [1497-1538] ముఖ్యసేనాని హరిశ్చంద్ర (గజపతి) పేరున వెలసినదై యుండును.

బాహుబలేంద్ర :

ముకుంద బాహుబలేంద్రుడు [క్రీ. శ. 1558] కొంతకాలం కళింగాన్నిహస్తగతం చేసుకున్నాడు. సింహాద్రి నాదుని నిత్యకైంకర్యములకు దోహదం చేసాడు కూడా.72 ఈ జిల్లాలోగల ముకుందపురము [సొం&టె&పాల&పా&చీ] లలో నేదైన నాతని పేరు దాల్చి యుండవచ్చును.

[సశేషం]

ఈలోకంలో యిలాగే-

నేనైతే జాతివిచక్షణలేని ఒక ప్రాణిగానే వుంటాను.
కానీ
నువ్వెవ్వరని ప్రశ్నిస్తుందీ ప్రపంచం.
నేనైతే మతాల కతీతంగానే వుంటాను.
కానీ
నీదే మతం అని అడుగుతుంది నాకు విద్యనేర్పే విద్యాపీఠం
నేనైతే కులరహితంగానే వుంటాను.
కానీ
కుల్గం రాయనిదే వృత్తి రాదంటాయి ఉపాధిచూపే సంస్థలు
అందుకే
జాతి మత కుల నామాలను వల్లెవేస్తూ
అడ్డుగోడలకు పునాదులు కట్టుకుంటూ
ఇంకా యిలాగే
మసక వెల్తుర్లోంచి చీకట్లోకి....!

అగ్ని ఆరితే చీకటే!

ఈ చీకటి
వెలుతుర్ని ఎవరో
అడ్డేయగా ఏర్పడిందే-

ఈ ఆకలి
సంపదనంతా ఎవరో
దోచేయగా మిగిలిందే-

ఈ అగ్నికూడ
ఎందరో అమాయకుల
చల్లారాక రగిలిందే!

శ్రీ ఆదూరి వెంకట సీతారామమూర్తి

కవిత

భావుకుని
హృదయ
ఆకాశంలో

ఊహల
మేఘాలు
విహరిస్తే

భావం
మెరుపై
మెరుస్తుంది

భాష
వానై
కురుస్తుంది

కవిత
హరివిల్లై
విరుస్తుంది.

కారణాలు

కాంతల
కష్టాలకు
కారణాలు
రెండు.

కళ్యాణం
కాకుండుట
ఒండు

కళ్యాణం
కావడమే
రెండు.

"జోశ్యభట్ల"

డాక్టర్ వి. వి. యల్. నరసింహారావు

విజ్ఞాన వికాసానికి వ్రాత ప్రతుల సేకరణ, సంరక్షణ

"భగ్న పృష్ఠ కటి గ్రీవః స్తబ్ధ దృష్టి రధోముఖః
కష్టేన లిఖితం గ్రంథం యత్నేన పరిపాలయేత్"

"వెన్ను వంచి, నడుం వంచి, మెడ వంచి, చెదరకుండా చూపు నిలిపి, అదేపనిగా క్రిందికి చూస్తూ, కష్టపడి యెత్తి వ్రాసిన గ్రంథమయ్యా ఇది; దీన్ని ఎట్లాగైనా పరిరక్షించండి బాబూ!" అని వేడుకుంటున్నాడు వ్రాయసకాడు లోకాన్ని.

"అతని కష్టం గుర్తుంచుకొని మనం గ్రంథాన్ని కాపాడాలా ఏమిటి?" అనే లోకం ఇది. "గ్రంథం గొప్పతనాన్నిబట్టి కాపాడతాం కాని, వ్రాయసకాని కష్టాన్నిబట్టి కాపాడతామా యేమిటి?" అనే వారూ వుండవచ్చు.

అసలు గ్రంథంలో ఏముందో ఒకసారి మనం చదివి చూస్తేగా దాని గొప్పతనమేమిటో తెలియటానికి? అందుకోసమైనా గ్రంథం చదవక తప్పదు.

విజ్ఞాన వికాసానికి పుస్తకం వ్రాయట మెంత అవసరమో, పుస్తకం చదవటం అంతకు వెయ్యి రెట్లు అవసరం. గ్రంథ రచన, గ్రంథ పఠనం నిరంతరంగా సాగినప్పుడే సంస్కృతి వికాసం. రచనకూ పఠనానికీ అనుబంధం కూర్చేది లేఖనం.

ఈనాడు ముద్రణ యంత్రాలు ఆధునిక పద్ధతుల్లో కూడా అసంఖ్యాకంగా వెలశాయి కనుక లక్షల ప్రతులు తెల్లవారేసరికి తయారౌతున్నాయి. ఈ సాధనాలేవీ లేనిరోజుల్లో గ్రంథపఠనానికి వ్రాతప్రతులే శరణ్యం కదా! వ్రాయసకాండ్రే ఆప్తబంధువులు కదా!

రాళ్ళమీద రాసిన రోజులున్నై, జంతువుల చర్మంమీద రాసిన రోజులున్నై, చెట్టు బెరళ్ళమీద రాసిన రోజులున్నై, తాటాకుల మీద రాసిన రోజులున్నై, రాగి రేకులమీద రాసిన రోజులున్నై, కాగితాలమీద రాసినరోజులున్నై, ఉలులు, పోగల్లు, గంటాలు, కలాలు సాధనాలుగా సాగింది వ్రాత.

వ్రాత ప్రతుల తయారీ అనేది క్రీ. పూ. నాలుగైదు శతాబ్దుల నాటికే ఏర్పడివుంది. మనిషికి లేఖన కళతో పరిచయం అంత కంటే ఎంతో ముందే ఏర్పడివుంది.

మనకు తెలిసినంతలో అతిప్రాచీనమైన సంస్కృత రచన-కొండరావి వంటి చెట్టు బెరడుమీద వ్రాసింది; క్రీ. శ. అయిదో శతాబ్దికి చెందింది. తాళపత్రలిఖితమై, మనకు లభించిన సంస్కృత రచన క్రీ. శ. ఆరో శతాబ్దికి చెందింది. అట్లాగే మనకు దక్కిన ప్రాచీనమైన కాగితపు వ్రాతప్రతి - మనదేశంలోనే వ్రాయబడింది-క్రీ. శ. పదమూడో శతాబ్దికి చెందింది. పద్నాలుగో శతాబ్దికి పూర్వం వ్రాయబడిన వ్రాతప్రతులు లభ్యంకావటం అరుదు. జైన సన్యాసుల సంఘం పవిత్రమైన తమ మత గ్రంథాలను ఎత్తి వ్రాయించే కార్యక్రమం క్రీ. శ. 453 నాటికే చేపట్టినట్లు చారిత్రికాధారాలున్నాయి. కాని ఆ వ్రాత ప్రతులు అలభ్యం.

వ్రాత ప్రతుల చరిత్రలో శిలా శాసనాలకంటే, తామ్రపత్ర రచనల కంటే తాటాకుపుస్తకాలూ, కాగితం పుస్తకాలూ ప్రాముఖ్యం వహిస్తాయి. అసంఖ్యాకంగా లభించినవీ, అసంఖ్యాకంగా నష్టమైనవీ కూడా తాటాకుపుస్తకాలూ, కాగితం పుస్తకాలే.

వ్రాత ప్రతుల సేకరణ ఆవశ్యకత

వ్రాతప్రతుల సేకరణ ఆవశ్యకతను గూర్చి అట్టే చెప్ప వలసిన పనిలేదు. బ్రతికివున్న ఏజాతి చరిత్రను గూర్చి తెలుసుకోవాలన్నా, ఏ జాతి సంస్కృతిని గూర్చి తెలుసుకోవాలన్నా ప్రామాణికమైన ఆధారాలను పట్టి యిచ్చేవి ప్రాచీనమైన వ్రాత ప్రతులే. మూడువేల సంవత్సరాలకు పరివ్యాప్తమై వున్న సాహిత్య చరిత్రగల జాతికి, రెండువేల సంవత్సరాలకు పైబడిన వ్రాత ప్రతుల చరిత్రగల జాతికి నేడు దక్కి వున్న వ్రాత ప్రతులు కొన్ని లక్షలు మాత్రమే◆ అంటే భయోత్పాతం కలుగక మానదు.

◆ అనుబంధం I చూడవలసింది.

మహోన్నతమైన మనజాతి మేధాసంపత్తికీ, విజ్ఞాన వికాసానికీ తరుగని నిక్షేపమనదగ్గ వ్రాత ప్రతులను సేకరించడం, సేకరించిన వాటిని శ్రద్ధగా పరిరక్షించుకోవటం మన ప్రాథమిక బాధ్యతల్లో ప్రథమ గణ్యాలు. జాతి సాంస్కృతిక చరిత్రపై ఏఏ క్రొత్త వెలుగులు ప్రసరిస్తాయో పరిశోధించేందుకైనా వ్రాత ప్రతుల సేకరణ అత్యంతావశ్యకం.

శీతోష్ణపరిస్థితులవల్లా, చెదపురుగులవంటి కీటకాలవల్లా కంటే మనుషుల అశ్రద్ధవల్లా, మతకలహాలవల్లా, పరదేశీయుల దండయాత్రలవల్లా, దేశీయుల అశక్తతవల్లా ధ్వంసమైపోయిన వ్రాత ప్రతులు అసంఖ్యాకం. సాహిత్య జిజ్ఞాస, విజ్ఞాన తృష్ణ గలిగిన సామంత ప్రభువులు, జమిందారులు మొదలైన వారి వల్ల కొంతకు కొంత వ్రాత ప్రతులకు రక్షణ కలిగినా కాలగర్భంలో కలిసిపోయిన వ్రాత ప్రతుల విజ్ఞాన నిక్షేపం అంచనాకు అందదు.

వ్రాత ప్రతుల సేకరణ చరిత్ర

పరాయి పాలనవల్ల కలిగిన నష్టాలతో పాటు లాభాలను కూడా బేరీజు వేసుకునే మంచితనం మనకుంది. వ్రాత ప్రతుల సేకరణ అనేది సక్రమమైన కార్యక్రమంగా రూపొందింది పరాయి పాలన లోనే. ఈ సేకరణ చరిత్ర క్రీ. శ. 1774 తో ప్రారంభమైందని చెప్పవచ్చు. వ్రాత ప్రతుల సేకరణను దీక్ష దక్షతలతో మొదలు పెట్టిన మనీషి సర్ రాబర్ట్ చాంబర్స్. సంస్కృత గ్రంథాల వ్రాత ప్రతుల మహాగ్రంథాలయం నిర్మించాలన్న పట్టుదల చాంబర్స్ బుర్రలో పొడసూపింది.

సర్ రాబర్ట్ చాంబర్స్ స్వయంగా గొప్ప బుద్ధిశాలి. మంచి సంస్కారం ఉన్నవాడు. 1774–1779 మధ్యకాలంలో అవిరళమైన కృషిచేసి, అమూల్యమైన భారతీయ గ్రంథ భాండాగారం నెలకొల్పాడు. ప్రాచీన విజ్ఞానం ఆధునిక విజ్ఞానం రెండూ అతనిలో సమాన స్థాయిలో మేళవించి వున్నాయి. సర్ విలియం జోన్స్ తోనూ, బర్కు తోనూ అతనికిగల సన్నిహితత్వం అతని కృషికి మరింత దోహదం కలిగించాయి. ఈస్టిండియా కంపెనీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తుల్లో తానూ ఒకడు కావటం, వంగదేశపు ఆసియా సంఘం అధ్యక్షపదవి నలంకరించటం కూడా అతని గ్రంథ సేకరణ జిజ్ఞాసను మరింత పెంపొందించాయి. "బెర్లిన్ ఇంపీరియల్ లైబ్రరీ"లో నిక్షేపించబడిన భారతీయ మహాగ్రంథ భాండాగారం — వ్రాత ప్రతుల సేకరణలో చాంబర్స్ చూపిన దీక్ష దక్షతలకు నిదర్శన మనవచ్చు.

సర్ రాబర్ట్ చాంబర్స్ అడుగుజాడల్లో నడచిన పుణ్య పురుషుడే కల్నల్ మెకంజీ. 1782 లో భారతదేశంలో అడుగు పెట్టి 1821 దాకా ఇక్కడే ఉన్నాడు. సుమారు నాలుగు దశాబ్దుల కాలంలోని ఒక్క క్షణంకూడా వృథా కానీయకుండా వ్రాతప్రతుల తయారీకి అత్యధికకాలం వినియోగించటం ఉద్యోగరీత్యా అతనికి దక్షిణభారతదేశంతోనే సంబంధం వున్నా ఉత్తర భారతదేశంతో కూడా గ్రంథసేకరణ విషయంలో సంబంధం పెంచుకొన్నాడు. భారతీయ పండితులంటే అతనికి చెప్పలేనంత గౌరవం. అనేక విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన పండితుల సాయంతో అతడు అసంఖ్యాకంగా గ్రంథాల సేకరణ జరిపాడు. భారతీయ గణితశాస్త్ర పండితుల్లో "లాగరిదమ్స్" కు సంబంధించిన విజ్ఞానం అపారమని గుర్తించినవాడు మెకంజీ. దక్షిణ భారతంలోని అనేక మహా పండితుల సాయంతో భారతదేశ చరిత్రకు సంబంధించిన విషయ సేకరణ నిర్విరామంగా చేశాడు. సుప్రసిద్ధులైన కావలి సోదరులు – బొరయ్య, లక్ష్మయ్య, రామస్వామి – మెకంజీకి సహాయపడిన వారిలో ప్రముఖులు. మెకంజీ దగ్గర గుమాస్తాలుగా పనిచేసినవారు ఆనందరావు, నట్టల నారాయణ మొదలైనవారు. వీరంతా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనూ, నిజాం ప్రాంతంలోనూ కాలికి బలపం గట్టుకొని తిరిగి, బళ్లకొద్దీ వ్రాతప్రతులను సేకరించారు. 1828 లో హెచ్. హెచ్. విల్సన్ ఈ వ్రాత ప్రతులకు కేటలాగు తయారు చేశాడు దాని ప్రకారం మెకంజీ యాజమాన్యంలో సేకరించబడిన వ్రాతప్రతుల్లో 150 తాళపత్ర గ్రంథాలు, 255 స్థానిక చరిత్రలూ, 8000 శాసన ప్రతులు ఉన్నాయి. ఇవన్నీ వివిధ విజ్ఞానశాస్త్ర శాఖలకు సంబంధించినవి. మెకంజీ కైఫీయత్తుల సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వాటికి విలువకట్టటం కష్టం.

మెకంజీతో పాటు వ్రాత ప్రతుల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినవాడు డాక్టర్ లేడెన్. ఇతడు ముఖ్యంగా తెలుగు జిల్లాల నుండే వ్రాత ప్రతులు సేకరించాడు. ఈస్టిండియా కంపెనీ వారు ఇతని నిర్యాణ సమయంలో వ్రాత ప్రతుల సంపుటి నొకదాన్ని వెలువరించారు. అందులోని వ్రాతప్రతులన్నీ లేడెన్ సేకరించినవే. ఆ సంపుటిని 'ఇండియా ఆఫీసు లైబ్రరీ'లో భద్రపరచటం జరిగింది.

అటు తర్వాత రంగంలో అడుగు పెట్టిన వీరుడు సర్ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఈస్టిండియా ఉద్యోగులందరిలోనూ ఆంధ్రదేశాన్ని అత్యంత ప్రియమైన ఆవాసంగా భావించుకొని అవిరళమైన సాహిత్య కృషి సాగించిన ఉద్యోగి ఫిలిప్ బ్రౌన్. అతడు ఇక్కడ అడుగుమోపిన తొలినాళ్ళలో తెలుగు సాహిత్య దీపం కొడిగట్టి

మినుకు మినుకు మంటూవున్నదని ఆందోళన పడ్డాడు. అందుకే దేశీయులైన తెలుగు పండితులసాయం అర్థించి, గ్రంథ సేకరణకు ఉద్యమించాడు. ఆ పండితులు దేశమంతా గాలించి ఎన్నో వ్రాత ప్రతులు సంపాదించి ఆయన కప్పజెప్పారు.

అప్పటికి మెకంజీ సేకరించి వుంచిన వ్రాత ప్రతులూ, లేడెన్ సేకరించివుంచినవీ, బ్రౌన్ సేకరించినవీ - అన్నీ కలిపి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల సంస్కృతాచార్యుడుగా పనిచేస్తున్న 1869 లో ప్రొఫెసర్ పిక్‌ఫర్డ్ అజమాయిషీలో ఆ వ్రాత ప్రతులు భద్రపరచటం జరిగింది. తరువాత ప్రొ॥ పిక్‌ఫర్డ్ మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయానికి తొట్టతొలి 'క్యూరేటర్' పదవి నలంకరించటం కూడా జరిగింది.

ప్రభుత్వపు ఉత్తర్వులు

భారత దేశంలో వ్రాత ప్రతుల నన్వేషించి, సేకరించే ప్రయత్నం 1868 నుండి తీవ్రతరంగా జరిగింది. సైనికుల తిరుగుబాటు (మ్యూటినీ) వల్ల ఏర్పడ్డ అలజడి సద్దుమణిగిన తరువాత భారత ప్రభుత్వం ప్రాచీన భాషా సాహిత్యాలపట్ల ఉదారవైఖరి నవలంబించి వీటిని పునరుద్ధరించాలనే పట్టుదల వహించింది. అందుకు అనుగుణంగా ఉత్తర్వులు కూడా జారీ చెయ్యటం జరిగింది.◆ ఈ ఉత్తర్వుల ప్రకారం వ్రాత ప్రతుల సేకరణకోసం క్రమబద్ధమైన అన్వేషణ, దేశంలోని వివిధ ప్రాంతాలలో సేకరించబడిన వ్రాత ప్రతులకు కేటలాగులు తయారు చెయ్యటం మొదలైనాయి. సంస్కృత భాష, అరేబియాభాష, పారశీకం- ఈ మూడు భాషలలోని వ్రాత ప్రతుల సేకరణ కార్యక్రమం పిక్‌ఫర్డ్‌కే అప్పగించబడింది. 1868 నుండి రెండేళ్లు ఆయన పర్యవేక్షణలో ఈ కార్యక్రమం మద్రాసు ప్రభుత్వపు ఆదేశాన్ని అనుసరించి చురుకుగా సాగినప్పటికీ పిక్‌ఫర్డ్ అనారోగ్యంవల్ల 1870 లో ఆయన తిరిగి యూరపు వెళ్ళక తప్పలేదు. అటు తరువాత ప్రభుత్వపు ఉత్తర్వు ననుసరించి బర్నెల్, శేషగిరిశాస్త్రి గార్లు వ్రాత ప్రతుల సేకరణ, పట్టికలు తయారుచేసే కార్యక్రమం సాగించి, వాటి ఫలితాలను 'నివేదికలు' (రిపోర్ట్స్) అనే శీర్షిక క్రింద ప్రకటించటం కూడా జరిగింది. ఆ విధంగా సేకరించిన వ్రాత ప్రతులను గూర్చిన వివరాలు త్రైవార్షిక గ్రంథ పట్టికల ద్వారా ప్రకటించటం జరిగింది. వ్రాత ప్రతుల్ని కొనుగోలు చేయటం, కొనుగోలుతో పనిలేకుండా ఉచితంగా లభించిన వాటిని కృతజ్ఞతతో స్వీకరించటం కూడా జరిగింది. మొత్తంమీద ఈ కార్యక్రమం క్రమబద్ధమైన పద్ధతిలో జరగటం వల్ల ఎన్నో సత్ఫలితాలు కలిగాయి. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం పధ్నాలుగు పైచిలుకుగా వర్ణనాత్మక గ్రంథ పట్టికలూ (డిస్క్రిప్టివ్ కేటలాగ్స్), ఆరింటి వరకూ త్రైవార్షిక గ్రంథ పట్టికలూ (ట్రయెన్నియల్ కేటలాగ్స్) మాత్రమే కాక సంస్కృతం, కన్నడం, మరాఠీ, అరబిక్, ఉర్దు, పారశీక భాషలలోని వ్రాత ప్రతుల పట్టికలు కూడా ప్రకటించటం జరిగింది.

ప్రభుత్వ ప్రేరణతో ఇంత కృషి జరుగుతుండగా, ఇంతకు ముందుకూడా దేశంలో వ్రాత ప్రతుల సేకరణతోపాటు వ్రాత ప్రతుల గ్రంథాలయాల స్థాపన మొదలైన కృషికూడా విద్యావంతులైన మహావ్యక్తుల వల్ల దేశంలో పలు ప్రాంతాలలో జరిగింది ఈ సందర్భంలో తంజావూరి మహారాజా శెర్ఫోజి, పూనా భండార్కర్ వంటి పుణ్యపురుషుల కృషి గణనీయం.

తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయం, పూనా భండార్కర్ ప్రాచ్య పరిశోధన సంస్థల కృషి

తాళపత్ర గ్రంథాల ప్రసక్తి వస్తే ముందుగా జ్ఞప్తికి వచ్చేది తంజావూరి సరస్వతీ మహల్ గ్రంథాలయం. తమిళ చోళ ప్రభువులు, తెలుగు నాయకరాజులు, మహారాష్ట్ర నేతలు - ఈ ముగ్గురి సంస్కృతులూ చివరకు కొంత పాశ్చాత్య నాగరికతతో మేళవించి క్రొత్తరూపు సంతరించుకొన్న సారస్వతమూర్తి నేటి సరస్వతీ మహల్ గ్రంథాలయం. 1798 లో సింహాసనం అధిష్ఠించిన మహారాజా శెర్ఫోజి అటు తర్వాత రాజ్య పాలన కంపెనీ వారికి దఖలుపరిచి జీవితాన్ని విజ్ఞాన నిలయంగా మలుచుకున్న ప్రాజ్ఞుడు. నేటి సరస్వతీ మహల్ - నాటి శెర్ఫోజీ త్యాగమయమైన దూరదృష్టికి దివ్య చిహ్నమనవచ్చు. బహు భాషా పండితకవి అయిన శెర్ఫోజి సేకరించిన లిఖిత గ్రంథాలు ఆయన అభిరుచికి చెరగని గుర్తులు. లాటిన్, గ్రీక్, ఫ్రెంచి, ఇటలీ మొదలైన బహు భాషలు నేర్చుకుని, ఆ విజ్ఞుడు సేకరించిన పెక్కు భాషల్లోని వ్రాత ప్రతులు మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తాయి. లాక్షారస వర్ణ చిత్రితములై కరుప్పూరు వస్త్రాలలో చుట్టి వుంచబడిన అనేక మరాఠీ వ్రాతప్రతులు సంగీత సాహిత్య వేదాంత ఆయుర్వేదాది అనేక విజ్ఞానశాస్త్ర విషయాలకు సంబంధించినవి. శెర్ఫోజి స్వయంగా రచించిన 'దేవేంద్ర కొరవంజి' మొదలైన గ్రంథాలు భూగోళ శాస్త్రాది విషయాలను చిన్న పిల్లలక్కూడా తెలిసేటట్లు వివరిస్తాయి. భారత భాగవతాలు మరాఠీ భాషలో సచిత్రంగా లిఖించబడిన కాగితపు వ్రాత ప్రతు

◆ ప్రొసీడింగ్స్ ఆఫ్ ది హోమ్ డిపార్ట్‌మెంట్ (పబ్లిక్) నెం. 4338-48, సిమ్లా దేశెస్ నవంబర్ 3, 1868.

లుగా ఇక్కడ సాక్షాత్కరిస్తాయి. మొత్తంమీద వ్రాత ప్రతుల సేకరణలో భారతదేశం గర్వించదగిన గ్రంథాలయం సరస్వతీ మహల్ గ్రంథాలయం.

అట్లాగే 1917 జులై 6 వ తేదీన స్థాపించబడిన పూనా భండార్కర్ ప్రాచ్య పరిశోధన సంస్థ వ్రాత ప్రతుల సేకరణలో ప్రత్యేకంగా పేర్కొనదగింది. భారతీయ విజ్ఞానశాస్త్ర గ్రంథాల సేకరణలో పేరెన్నికగన్న రామకృష్ణ గోపాల భండార్కర్ తన గ్రంథాలయ సర్వస్వాన్ని - పరిశోధన పత్రికలతోసహా - పరిశోధన సంస్థకు బహూకరించారు. ఆ మరుసటి సంవత్సరమే అప్పటి బొంబాయి ప్రభుత్వం (ప్రస్తుత మహారాష్ట్ర ప్రభుత్వం) ఇరవై వేల సంస్కృత ప్రాకృత గ్రంథాలతోపాటు, 'బొంబాయి సంస్కృత ప్రాకృత సీరీస్' యాజమాన్యం కూడా భండార్కర్ పరిశోధన సంస్థకు అప్పగించటం జరిగింది. ఈ సంస్థలో 'వ్రాత ప్రతుల శాఖ' అనేది ప్రత్యేక శాఖగా రూపొంది, అవిరళమైన కృషి చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. 45 సంపుటాలుగా వర్ణనాత్మక గ్రంథ పట్టికలు ముద్రించాలని తలపెట్టి 1968 నాటికే 20 సంపుటాలు వెలువరించటం జరిగింది. వ్రాత ప్రతుల సేకరణ అవిచ్ఛిన్నంగా సాగుతూనే వుంది.

ఇవి కాకుండా మన దేశంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో వ్రాత ప్రతుల శాఖలు ప్రత్యేకంగా నెలకొల్పబడినాయి. వివిధ రాష్ట్రాల్లోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయాలు వ్రాత ప్రతుల సేకరణ జరుపుతూనే వున్నాయి. ఎంతగా సేకరించినా, ఉత్పన్నములై పోయిన వ్రాత ప్రతులలో కోట్యంశం కూడా మనకు దక్కలేదనే చెప్పాలి. మహాభారత తాత్పర్య నిర్ణయం వ్రాసిన ఆనంద తీర్థ మాధవాచార్యుడు ఆ మాటే అన్నాడు.

“ఉత్పన్నాః ప్రాయశః సర్వే కోట్యంశోఽపి న విద్యతే” ఆ మాట అక్షరాలా నిజం.

కాని, దక్కినంత మేరైనా మనం జాగ్రత్తపరుచుకోవాలి గదా!

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచ్య లిఖిత గ్రంథాలయ కృషి

ఉమ్మడి మద్రాసు రాష్ట్రం విభజించబడిన సందర్భంలో పెక్కు వ్రాత పుస్తకాలు, మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం నుండి తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి బదిలీ చేయటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధన సంస్థ 1975 లో ప్రత్యేకమైన డైరెక్టరేట్‌గా రూపొందింది.

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో వ్రాత ప్రతుల సేకరణ సందర్భంలోను, గ్రంథ పరిశోధన పరిష్కారముల విషయంలోను మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి మొదలైన మహామహుల కృషి మరువరానిది.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1939 లో శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య సంస్థ నెలకొల్పటం జరిగింది. సంస్కృతం, తెలుగు, తమిళం, మొదలైన భాషల్లో పరిశోధన కృషితో పాటు ఆగమశాస్త్రం, సంగీతశాస్త్రం మొదలైన శాస్త్రవిషయాల్లో కూడా కృషి చెయ్యటానికి అనువుగా గ్రంథసేకరణ జరిగింది. సర్వశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య, కె. సి. వరదాచారి, డి. టి. తాతాచార్య, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ మొదలైన పండిత పరిశోధకులు వ్రాత ప్రతులను పరిశీలించి, సంశోధన సాగించారు. పద్నాలుగు వేలకు పైచిలుకుగా వున్న వ్రాత ప్రతులలో ముద్రణ నపేక్షించే గ్రంథాలు ఇక్కడ ఎన్నో ఉన్నాయి.

కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తు, రాజమండ్రిలోని రాళ్ళబండి సుబ్బారావు 'ప్రభుత్వ మ్యూజియం' మొదలైన సంస్థల్లో కూడా అముద్రితమైన వ్రాత ప్రతులు అనేకం వున్నాయి.

1975 నుండీ 'ప్రత్యేక డైరెక్టరేట్' గా రూపొందిన ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం పరిశోధనాలయంలో 22 వేలకు పైచిలుకుగా 14 భాషల్లో రచించబడిన వ్రాతపుస్తకాలున్నాయి◆. ఏటేటా వ్రాత ప్రతులను ప్రత్యేకంగా కొనుగోలుచేసి, సేకరించీ, గ్రంథాలయాన్ని వృద్ధి చెయ్యటం జరుగుతున్నది.

ప్రభుత్వ కృషితోపాటు, 1979 ఫిబ్రవరి వరకూ ఈ శాఖకు డైరెక్టరుగా పనిచేసిన వాఙ్మయ మహాధ్యక్ష, కళాప్రపూర్ణ డా॥ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారు కూడా వ్రాత ప్రతుల సేకరణలో ఎంతో కృషి చేశారు.

ప్రాచీన గ్రంథాలను కూడా సేకరించటంతోపాటు ఆధునిక గ్రంథాలను కూడా సేకరించటం అవశ్యకం. ఆధునికులు సేకరించిన ప్రాచీన గ్రంథాల వ్రాత ప్రతులు కూడా ఈ కృషిలో అంతర్భాగం అవుతుంది. కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

◆ అనుబంధం - II చూడవలసింది.

గారి గ్రంథాలు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం ఇటీవల కొనుగోలు చేసి భద్రపరచటం జరిగింది. అదేవిధంగా మల్లంపల్లి సోమశేఖర శర్మగారి గ్రంథాలు, కావ్యకంఠ గణపతిమునిగారి పుస్తకాలు కొనుగోలు చెయ్యటం జరుగుతున్నది. వివిధ మత-శాస్త్ర-సాహిత్య గ్రంథాలు కూడా కొనబడినాయి.

పత్రికా ప్రపంచంలో 'భారతి' వంటి మాసపత్రికలు ప్రతి నెలా ఒక ప్రాచీన శాసనం వ్రాతప్రతిని ముద్రించటమో, వాటికి సంబంధించిన వ్యాసాలు ప్రచురించటమో వ్రతదీక్షగా చెయ్యటం వ్రాత ప్రతుల సేకరణోద్యమంలో అంతర్భాగమే అవుతుంది. ఈ మార్గంలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి వంటి మహాపురుషుల కృషి చిరస్మరణీయం.

వ్రాత ప్రతులను సేకరించటంతో పాటు, దేశంలోని వ్రాత ప్రతుల మైక్రోఫిల్మ్ ప్రతులను సంపాదించి వాటి నన్నింటినీ కేంద్ర స్థానంలో పరిశోధకులకు అందుబాటులో ఉంచటం అవశ్యకం. ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం తంజావూరు సరస్వతీ మహాలు గ్రంథాలయం లోని అనేక అమూల్య లిఖిత ప్రతుల మైక్రోఫిల్మ్‌లు తయారు చేయించి పరిశోధకులకు అందుబాటులో వుంచటం జరిగింది. అనేక అమూల్య గ్రంథాలను ప్రచురించటం కూడా జరిగింది. డెభ్భై ఏళ్ళుగా మరుగున పడివున్న ప్రౌఢ ప్రబంధం -నారన సూరన విరచితమైన "ఉదయనోదయం" ('వనమాలి విలాస' సంక్షిప్తప్రతితోసహా) ముద్రితమై విడుదలైంది. ఇటువంటి గ్రంథాలు అనేకం. విదేశీయులైన పరిశోధకులను కూడా అనుదినం ఆకర్షిస్తున్న అరేబిక్, ఉర్దు, పారశీకం, మొదలైన భాషల్లోని సుమారు 17 వేల వ్రాత పుస్తకాలలో-కొన్నింటినైనా ముద్రించాలనే కృషి జరుగుతున్నది.

వ్రాత ప్రతుల సేకరణ- అమూల్య గ్రంథాల ముద్రణ-అనేవి ప్రపంచమంతటా నిరంతరంగా జరుగుతున్న కృషి. ప్రపంచంలోని ఈ సంస్థ లన్నింటికీ పరస్పర సంబంధం ఏర్పడి మైక్రోఫిల్మ్‌ల రూపంలో-ఇచ్చి పుచ్చుకోవటాలు జరుగవలసిన అవశ్యకత కూడా లేకపోలేదు. కనీసం మన దేశంలోని ప్రాచ్య పరిశోధన సంస్థలకైనా వ్రాత ప్రతుల సేకరణలో పరస్పర సంబంధం ఉండటం అత్యంతావశ్యకం.

ఒకే గ్రంథానికి పెక్కు వ్రాత ప్రతులు పెక్కు సంస్థల్లో వుండే అవకాశం ఉన్నది. గ్రంథ పరిశోధన పరిష్కారాల్లో వివిధ లిఖిత ప్రతుల పరామర్శ ఎంత అవసరమో విజ్ఞులకు విదితమైన విషయమే. అందుకోసమైనా వివిధములైన వ్రాత ప్రతుల గ్రంథాలయాలకు పరస్పర సంబంధం అనివార్యం.

ప్రభుత్వ అభిలేఖాలయాల్లోను (అర్కైవ్స్) పురావస్తు శాఖల్లోను (ఆర్కియాలజీస్ & మ్యూజియమ్స్) ఉన్న అనుబంధ గ్రంథాలయాల్లోకూడా అనేకమైన వ్రాత ప్రతులున్నాయి. అభిలేఖాలయాల్లో ప్రభుత్వ పరిపాలనకు సంబంధించిన వివిధ శాఖల్లోని రికార్డులు , జీ. వో.లు మొదలైనవి క్రమంగా చేర్చటం జరుగుతున్నది. చారిత్రిక ప్రాధాన్యం గల వ్రాత ప్రతులు విధిగా ఇక్కడ సేకరించటం జరుగుతుంది. సాహిత్యానికీ, మతానికీ, వివిధ విజ్ఞాన శాస్త్రాలకూ సంబంధించిన వ్రాత ప్రతులను పురావస్తు శాఖనుండీ, అభిలేఖాలయాలనుండి వేరు పరిచి ప్రాచ్యలిఖిత గ్రంథాలయాల్లోకి బదిలీ చేయటం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. అరుదైన అమూల్య గ్రంథాలను పరిష్కరించి ప్రచురించటానికి కూడా ఎక్కువ సౌకర్యం కలగవచ్చు.

వ్రాత ప్రతుల పరిరక్షణ

వ్రాత ప్రతుల సేకరణంతా ఒక యెత్తు. వాటి పరిరక్షణంతా మరొక యెత్తు. సేకరణకంటే పరిరక్షణ కష్టతరమైన పని. ప్రాతలైన తాళ ప్రత గ్రంథాలూ, కాగితం పుస్తకాలూ పరిరక్షించటానికి ప్రత్యేకమైన పరి రక్షణ ప్రయోగశాలలు (కన్సర్వేషన్ లేబొరేటరీస్) ఆవశ్యకం.

ప్రయోగశాల లనేవి ఆధునిక సాధనా లనుకుందాం. గ్రంథాల్ని ఎట్లా సంరక్షించాలో చెప్పే సందర్భాల్లో ప్రాచీనాలూ, అర్వాచీనాలూ కంఠోక్తిగా చెప్పారు; అగ్నినుండీ. నీటినుండీ, నూనెనుండీ, ఎలుకలనుండీ, దొంగలనుండీ, యాచకులనుండీ వాటిని రక్షించటం అవసరమన్నారు. పత్రాలకు కట్టిన త్రాళ్ల తెగిపోవటం, కీటకాలు ధ్వంసం చెయ్యటం మొదలైనవి కూడా ఉపద్రవాలే.

పాండురంగ మహాత్మ్యంలో పుస్తక భాండాగారంబును అఖు శుక్షణి శిథిల బంధన యాచకముఖోపద్రవంబుల వలన ప్రోచుట (3-24) ముఖ్యమని హెచ్చరిక చేయబడింది.

"తైలాత్ రక్షేత్; జలాత్ రక్షేత్; రక్షేత్ శిథిల బంధనాత్;
మూర్ఖ హస్తే న దాతవ్యం ఏవం వదతి పుస్తకమ్"

అనేది అనుభవంమీద చెప్పిన అభిజ్ఞ వాక్యం.

నక్షత్రాలకూ గిట్టల క్షతాలకూ తేడా తెలియని మహానుభావులు ఏకాలంలోనూ ఉంటారు. మోటు దాని చేతిలో మొగలి పువ్వులా, బంగారంలాంటి పుస్తకాన్ని పిసికి పిండలిచేసే ప్రబుద్ధులూ వున్నారు. వీరి చేతిలో వయసుచెల్లిన తాటాకు పుస్తకమో, కాగితాల పుస్తకమో పడితే ఇక చెప్పేదేముంది ?

ఇటువంటి ప్రమాదాల నట్లావుంచి శీతోష్ణ పరిస్థితులవల్లా చెద పురుగులు మొదలైన వాటి దాడివల్లా వచ్చే ప్రమాదాలు ఎట్లా నివారించాలో గుర్తించేందుకు నిరంతరమైన పరిశోధనలు జరుగుతున్నై. తాళపత్రి గ్రంథాల పరిరక్షణ విషయమై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీలు పుచ్చుకున్నవారూ ఉన్నారు. పరిశోధన పత్రాలు సమర్పించినవారూ ఉన్నారు. ఆక్స్‌ఫర్డ్‌లోని బోడ్లియన్ లైబ్రరీలో పనిచేసే సీనియర్ కన్సర్వేటర్ జె. సెగల్ అనే ఆమె తాళపత్రాల పరిరక్షణ గూర్చి ప్రత్యేక పరిశోధన పత్రం ప్రచురించింది. 1958లో ఒ.కె. నార్డ్‌స్ట్రాండ్ "స్టడీస్ ఇన్ కన్సర్వేషన్"అనే గ్రంథంలోని మూడో సంపుటంలో – కోపెన్‌హగన్ రాయల్ లైబ్రరీలో తాళ పత్ర గ్రంథాల పరిరక్షణకు అవలంబించే శాస్త్రీయ పద్ధతులను గురించి పరిశీలన చెయ్యటం జరిగింది. 1969లో ఎ. కౌలీ చేసిన పరిశోధనలుకూడా తాళపత్రాల పరిరక్షణకు సంబంధించినవే. మనదేశంలో ఒ. పి. అగర్వాల్ పురావస్తువులను ఎట్లా భద్రపరచాలో వివరిస్తూ వ్యాసాలు, గ్రంథాలు కూడా వ్రాయటం జరిగింది. ఈ విషయం ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే వ్రాత ప్రతులను సంరక్షించటానికి ఎంత జాగ్రత్త కావాలో సూచించటానికే.

తాళపత్ర ప్రతులు, కాగితం ప్రతుల పరిరక్షణకు శాస్త్రీయ పద్ధతులు

ఈ వ్రాత ప్రతుల పరిరక్షణ పద్ధతులు పేర్కొనే ముందు వీటికిసంబంధించిన శాస్త్రీయపరిభాషను పరిచయంచేసుకోవటంమేలు.

పరిరక్షణ అనే పదానికి 'కన్సర్వేషన్' 'ప్రిజర్వేషన్' అనే పదాలు రెండూ సమానార్థకంగా కనిపించవచ్చు. కాని ఈ రెంటికీ తేడా వుంది. 'కన్సర్వేషన్' అనేది విశాలమైన అర్థంగల పదం. ఇందులో 'ప్రిజర్వేషన్', 'రిస్టొరేషన్' అనే పదాల అర్థం కూడా ఇమిడివుంది.

పత్రాలు శిథిలం కాకుండా నివారించేందుకు తీసుకొనే చర్య 'ప్రిజర్వేషన్'.

పత్రాల్లో వచ్చే మార్పులను చక్కదిద్దటానికి చేసే చికిత్స 'రిస్టొరేషన్'. ఇది చెడిపోయే పత్రాలలో వచ్చే మార్పుల్ని సరిదిద్ది పునరుద్ధరించే ప్రయత్న మన్నమాట.

'ప్రిజర్వేషన్' రోగనివారణ చర్య అయితే 'రిస్టొరేషన్' రోగాన్ని నయం చేసే చర్య అన్న మాట. రోగాన్ని నయం చెయ్యటం కంటే నివారించటం అభిలషణీయం. 'ప్రివెన్షన్' కంటే 'క్యూర్' మంచిదికాదు కదా! కాని రోగాన్ని నివారించటం అసాధ్యమైనప్పుడు నయం చెయ్యటమే శరణ్యం.

పదార్థం (మేటర్) మీద శీతోష్ణప్రభావం తప్పక వుంటుంది. జీవంగల తాటిచెట్లనుండిలభించే తాటాకు జీవజన్యపదార్థం (ఆర్గానిక్ మేటర్); రాళ్ళు, లోహాలు వాటికి భిన్నం (ఇనార్గానిక్). ఈ రెండో తెగకు చెందిన వాటికంటే మొదటి తెగకు చెందినవి శీతోష్ణ ప్రభావానికి త్వరగా లోనౌతాయి. శీతోష్ణాలు వాతావరణంలోని చెమ్మ, వేడి వల్ల మారుతూ వుంటాయి. చెమ్మ, వేడి పరస్పర సంబంధం కలవి కావటం వల్ల వీటి ప్రభావం నుండి, పత్రాలను తప్పించటానికి సాధారణ వాతావరణం కంటె సూక్ష్మవాతావరణం (మైక్రోక్లైమేట్) కల్పించి క్రమంగా పత్రాలను పరిరక్షించవలసి వుంటుంది. హఠాత్తుగా వేడినుండి చలికీ, చలినుండి వేడికీ మార్పు చెందే వాతావరణం వల్ల కలిగే దుష్ఫలితాలు కల్పిత సూక్ష్మ వాతావరణం వల్ల నివారించవచ్చు.

వ్రాత ప్రతులు నిలువ చేసి వుంచిన గదులన్నిటినీ 'ఎయిర్ కండిషన్' చేయించటం కూడా మంచిదే కాని అది అధికవ్యయంతో కూడిన పని. అంతకంటే "ఫ్యూమిగేషన్ చాంబర్స్" తయారు చేయించి రసాయన పదార్థాలతో కూడిన ఆవిరులు వ్రాత ప్రతుల మీదికి వదలటం సులభమైన పద్ధతి. ఈ రసాయన పదార్థాల్లో 'థైమాల్' అనే పదార్థం ప్రస్తుతం ఎక్కువ వాడకంలో వున్నది. ఈ 'ఫ్యూమిగేషన్ చాంబర్స్' చిన్న బీరువాల ప్రమాణంలో అవసరమైనన్ని అరలతో నిర్మించుకోవచ్చు.◆ ముఖ్యంగా క్రిమికీటకాల నుండి పుస్తకాలను రక్షించటానికి ఇవి బాగా పనికి వస్తాయి. సాధారణమైన వేడితో పేరాడైక్లోరో బెంజీన్, కార్బన్‌డైసల్ఫైడ్, కార్బన్‌టెట్రాక్లోరైడ్, మెథిల్ బ్రోమైడ్ మొదలైన రసాయన పదార్థాల ఆవిరులు పురుగుల్ని తేలికగా ధ్వంసం చేస్తాయి. కొయ్య బీరువాలు ప్రత్యేక పద్ధతిలో నిర్మించి, గట్టిగా తలుపులు బిగించి ఈ ఆవిరులను లోపల విడుదల చెయ్యటమే ఇందులోని ప్రధానాంశం. కాగితం పుస్తకాల పరిరక్షణకు ఈ పద్ధతి బాగా ఉపయోగిస్తుంది.

పురుగులను ధ్వంసం చేసే పదార్థాల్లో డి. డి. టి , గెమాక్సిన్, మెర్క్యూరిక్ క్లోరైడ్, పెంటాక్లోరో ఫినాల్ మొదలైన వాటివల్ల ఎక్కువ కాలం పురుగు సోకకుండా వ్రాత ప్రతులను కాపాడవచ్చు. తగిన మోతాదులో రసాయన పదార్థాల ఆవిరులు విడుదల చెయ్యటం ముఖ్యం. ఎక్కువైతే తాళ పత్రాల మీద శాశ్వతంగా మచ్చలు పడే ప్రమాదం వుంది.

తాళ పత్రాలకు బూజు పట్టట మంటే సూక్ష్మక్రిములు చేరడమనే గ్రహించాలి. చెదపురుగులు, రకరకాల ఇతర క్రిములు

◆ అనుబంధం - III చూడవలసింది.

కీటకాలు చేరి పత్రాలను ధ్వంసం చేస్తాయి. పెద్ద గ్రంథాలయాలు కొన్నిటిలో క్రిమిసంహారకమైన పొళ్ళు తయారుచేసి పొట్లాలుగా అమర్చి గ్రంథాల నడుమ నిలువచెయ్యటం జరుగుతున్నది. కర్పూరం, మిరియాలు, లవంగాలు మొదలైన పదార్థాలు పెక్కింటిని ప్రత్యేకమైన పాళ్ళలో కలిపి ప్యాకెట్లుగా అమరుస్తారు.

కాగితం పుస్తకాలకు కూడా ఇటువంటివే అనేక సాధనాలున్నాయి.

తాళపత్రాలు వాతావరణంలో వేడివల్ల తేలికగా బిరుసెక్కిపోతాయి. చెట్టున వున్న తాటాకులాగా, పచ్చగా మెత్తగా వుండే అవకాశం గ్రంథరూపంలోకి వచ్చిన తాళపత్రానికి ఉండదు కదా! క్రమంగా బిరుసెక్కి, ఇవి తాకితే పెళుసుగా విరిగిపోయేట్లుంటాయి. అందులో గంటంతో అక్షరాలు తొలిచిన పత్రం మరీ సున్నితంగా వుంటుంది. పసిబిడ్డను సాకినట్టు పదిలంగా సాకితేనే వీటికి రక్షణ. తరుచూ ప్రత్యేకమైన నూనెలతో వీటికి మెత్తదనం సమకూర్చుతూ వుండాలి. నీలగిరులలో తయారైన సెట్రొనెల్లా నూనె, ఇంకా లెమన్ గ్రాస్ నూనె మొదలైన వాటిని తగిన మోతాదులో పత్రాలకు పట్టిస్తూ, వీటిని తాళపత్ర గ్రంథాలయాల్లో భద్రపరచటం జరుగుతున్నది. ఈ నూనెలు కమ్మని పరిమళంతో మనకు నాసాతర్పణంగా వున్న క్రిమికీటకాలకు భంజకంగానే వుండి ఆకుల మెత్తదనాన్ని కాపాడుతూ వుంటాయి.

ఈ పద్ధతులన్నీ సంస్థల్లో అమలు చెయ్యటం సులభం కావచ్చు కాని విడిగా వ్యక్తుల అధీనంలో వున్న వ్రాత ప్రతులను వారు భద్రపచుకోవటం కష్టం. పుస్తకాలమీద ఎంతో ప్రేమాదరాలూ, శ్రద్ధా వున్నవారికి కూడా కష్టమే. అందుకే అటువంటి పుస్తకాలను సంస్థలకు దానం చెయ్యటమో, అమ్మకం చెయ్యటమో మంచిది.

పరిరక్షణ లేకుండా వందలయేండ్లు నిలువవుంచిన వ్రాత ప్రతులు కొత్తగా సేకరించినప్పుడు వాటికి పట్టివున్న దుమ్మూ, ధూళి, బూజు, క్రిమికీటకాలు వీటన్నిటి వల్ల ఆ పుస్తకాల దగ్గరికి పోతేనే అంటు వ్యాధులు సోకే ప్రమాదం కూడా వుంటుంది. గ్రంథాలయానికి కొత్తగా సేకరించిన ఇటువంటి పుస్తకాలను దుమ్ము దులిపి శుభ్రంచేసే యంత్రాలు కూడా వున్నాయి. (డస్టింగ్ మెషీన్స్) ఈ యంత్రాల సహాయంతో గ్రంథాలు శుభ్రంచేస్తే తప్ప వాటిని తాకి, చదివి, విలువ కట్టటం కష్టమౌతుంది.

ఒ. కె. నార్డ్‌స్ట్రాండ్ (కోపెన్ హాగన్) విరిగిపోయిన తాళపత్రాలకు అతుకుపెట్టే ప్రయత్నం కూడా చేశాడు. సిల్క్‌గాజ్, పుస్తకాల బైండింగ్‌కు ఉపయోగించే జిగురు ఇందుకు ఉపయోగించి చూచాడు. ఈ జిగురులో వుండే పదార్థం వల్ల కూడా కొత్త క్రిములు ప్రవేశించే అవకాశం వున్నట్లు యస్. భౌమిక్ (బరోడా) పరిశోధనల వల్ల తేలింది. పుస్తకాల దుమ్ము దులిపి శుభ్రం చేసేందుకు ఈయన 'ఐసోప్రొపిల్ ఆల్కహాల్' మొదలైన పదార్థాలను వినియోగించాడు. కాలక్రమంగా ఈ పద్ధతి కూడా అంత ప్రయోజనకరంగా లేనట్లు తేలింది.

సాంస్కృతిక వస్తువుల పరిరక్షణ కోసం ఢిల్లీలో ఏర్పాటు చేసిన జాతీయ పరిశోధన ప్రయోగశాలవారు ప్రచురించిన గ్రంథంలో రచయిత ఒ. పి. అగర్వాల్ (లక్నో) తాళపత్రాలు శుభ్రంచేసే కొత్త పదార్థాలను పేర్కొన్నాడు. ముఖ్యంగా గ్లిజరిన్, శుభ్రమైన నీళ్ళు మొదలైన వాటితో పత్రాలను కడిగి కర్పూరం, సెట్రొనెల్లా నూనె, లేదా వాల్నట్ నూనె మొదలైన వాటితో బిరుసెక్కకుండా ఆకుల మెత్తదనం కాపాడవచ్చునని ప్రయోగపూర్వకంగా వివరించాడు. ప్రస్తుతం ఈ పద్ధతులే అమలు చేస్తూ మన వ్రాత ప్రతుల గ్రంథాలయాల్లోని పుస్తకాలు భద్రపరచటం జరుగుతున్నది.

ఏమైనా మనిషి ఆరోగ్యం లాగే వ్రాత ప్రతుల ఆరోగ్యం కూడా తరుచూ ఒడుదుడుకులకు లోనౌతూ వుంటుంది. ఎడతెగకుండా వైద్యం చేస్తూనే వుండాలి. అతిగా మందులు వాడి అసలు ఏ మందూ పనిచేయని అనారోగ్యవంతుల్లాగే వ్రాత ప్రతులు కూడా అతిగా మందులు వాడటం వల్ల అవి అనారోగ్యం పాలయ్యే ప్రమాదం కూడా వుంది.

సాధ్యమైనంతవరకు ప్రాత వ్రాత ప్రతులను తరుచూ చేతుల్తో తాకి, పత్రాలు విప్పిచూచే పనిలేకుండా మైక్రోఫిల్మ్ ప్రతుల్లో, జిరాక్స్ ప్రతులో తయారు చేసుకుని వాటిని వినియోగించుకోవటమే క్షేమం.

ఇదంతా - సేకరించిన వ్రాత ప్రతులను సంరక్షించే ప్రయత్నం. అసలు సేకరణకు గాని, సంరక్షణకు గాని ప్రధాన లక్ష్యం పఠితృలోకంలో విజ్ఞాన తృష్ణ పెంపొందించి, వారికి మేలు కలిగించటం.

విజ్ఞాన వికాసం

నేడు పుంఖాను పుంఖంగా వచ్చే ముద్రిత గ్రంథాల్ని చదివే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతున్న సూచనలు కనిపిస్తు

న్నాయి. ఈ దశలో వ్రాత ప్రతుల్ని చదివే ఆసక్తి ఎంతమంది కుంటుంది? కాని ఆసక్తి పెంపొందేట్లు చెయ్యవలసిన బాధ్యత కూడా వ్రాత ప్రతులు సేకరించే సంస్థలమీద వుంది. దీనికి వివిధ రంగాల్లో కృషి చేసి పేరెన్నిక గన్న ఆధునికుల రచనల వ్రాత ప్రతులు కూడా లభ్యమయ్యేట్లు చూడాలి. ముద్రిత గ్రంథాల వ్రాత ప్రతులు కూడా పరిశోధకులకు పాఠాంతరాలు అందిస్తూ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. పూర్వానుభవం పండిన వృద్ధ రచయితల అనుభవాలు వారి ముఖతః పలికించి, వాటిని రికార్డు చేసి, ప్రత్యేకమైన "టేప్ లైబ్రరీ" పెంపొందించవచ్చు. అటువంటి కృషి జరుగుతున్నది.

ఇటువంటి నూతన ప్రయత్నాల వల్ల ఆధునిక పఠితృ లోకాన్ని కూడా బాగా ఆకర్షించవచ్చు. ఇందుకు ప్రచార సాధనాలు కూడా అవసరం.

వ్రాత ప్రతుల ప్రయోజనం గూర్చి, వాటి సేకరణ మార్గాలను గూర్చి, వాటి పరిరక్షణ పద్ధతులను గూర్చి, పత్రికల ద్వారా, రేడియో ద్వారా, టి. వి. ద్వారా, డాక్యుమెంటరీ ఫిల్ముల ద్వారా విస్తృతమైన ప్రచారం అవసరం. ప్రాచీనమైన మహాభారతాది గ్రంథాల వ్రాతప్రతులతో పాటు ఆధునికమైన మహాప్రస్థానం మొదలైన గ్రంథాల వ్రాతప్రతులు కూడా ఎట్లా వుంటాయో జనులకు ప్రత్యక్షంగా చూపగలిగితే క్రమంగా జనుల దృష్టి వ్రాతప్రతులపట్ల ఆకర్షించబడి, వాటి ప్రయోజనం అవగతమౌతుంది. కష్టపడి వ్రాసిన తాళపత్ర గ్రంథాలు, కాగితం పుస్తకాలు ఎందుకు చదవాలో, ఎట్లా పరిరక్షించాలో జనులకు సువిదిత మౌతుంది. మనం చెప్పవలసిన పని లేకుండానే "కష్టేన లిఖితం గ్రంథం యత్నేన పరిపాలయేత్" అని వారే మనకు చెపుతారు.

అంతకంటే కావలసిందేముంది?

అనుబంధం - I

ప్రొఫెసర్ కె. టి. పాండురంగి సేకరించిన వివరాలను బట్టి 1978 నాటికి మనదేశంలో వున్న సంస్కృత - ప్రాకృత - పాళీ - వ్రాత ప్రతుల మొత్తం:

క్రమ సంఖ్య	రాష్ట్రం పేరు	వ్రాత ప్రతులు
1.	ఆంధ్రప్రదేశ్	20,149
2.	అస్సాం	443
3.	బీహారు	9,861
4.	ఢిల్లీ	4,436
5.	గుజరాతు	1,10,045
6.	గోవా	1,500
7.	హర్యాన	4,633
8.	జమ్ము, కాశ్మీరు	13,774
9.	కర్ణాటకం	60,105
10.	కేరళ	39,325
11.	మధ్యప్రదేశ్	5,963
12.	మహారాష్ట్ర	30,857
13.	పాండిచేరి	12,709
14.	పంజాబు	8,756
15.	రాజస్థాన్	98,716
16.	తమిళనాడు	85,159
17.	ఉత్తరప్రదేశ్	62,067
18.	పశ్చిమబెంగాల్	20,129
	మొత్తం	6,38,627

అనుబంధం - II

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం పరిశోధనాలయంలో భద్రపరచబడిన వ్రాత ప్రతులు, మైక్రో ఫిల్ములు.


క్రమ సంఖ్య	భాష	వ్రాత ప్రతుల సంఖ్య
1.	తెలుగు	1,490
2.	సంస్కృతం	4,009
3.	కన్నడం	58
4.	తమిళం	165
5.	హిందీ	80
6.	ఇంగ్లీషు	41
7.	మరాఠీ	84
8.	ఉర్దు	1,674

క్రమ సంఖ్య	భా ష	వ్రాత ప్రతుల సంఖ్య
9.	అరేబిక్	6,337
10.	పారశీకం	8,915
11.	పిస్తో	3
12.	టర్కిష్	14
13.	పంజాబి	4
14.	సింధి	3
	మొత్తం	22,877

మైక్రో ఫిల్ములు	ప్రతుల సంఖ్య
1. సామవేదం రాణాయనీయశాఖ (సంస్కృతం)	18
2. తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలోని వ్రాత ప్రతులనుండి తీయబడినవి (తెలుగు)	697
మొత్తం	715

1. వ్రాత ప్రతులు (తాళపత్ర ప్రతులు కాగితం ప్రతులు కలిసి)	22,877
2. మైక్రో ఫిల్ములు	715
మొత్తం	23,582

అ ను బం ధం - III



అ ను బం ధం - IV

ఉ ప యు క్త ర చ న లు

1. అగర్వాల్, ఒ. పి. : "కన్సర్వేషన్ ఆఫ్ ఏషియాన్ కల్చరల్ ఆబ్జెక్ట్స్ : ఏషియన్ మెటీరియల్స్ ఎండ్ టెక్నిక్స్" - మ్యూసియమ్ (యునెస్కో) వాల్యూం XXVII, నెం. 4 (1975)

2. అగర్వాల్, ఒ. పి. : "కేర్ ఎండ్ ప్రిజర్వేషన్ ఆఫ్ మ్యూసియమ్ ఆబ్జెక్ట్స్" - నేషనల్ రీసెర్చ్ లేబరేటరీ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ కల్చరల్ ప్రాపర్టీస్, న్యూఢిల్లీ (1977)

3. మిసెస్ సేగాల్, జె. : "ది కన్సర్వేషన్ ఆఫ్ పామ్ లీవ్స్ (1979) రచయిత్రి బోడ్లియన్ లైబ్రరీ, ఆక్స్‌ఫర్డ్ లో సీనియర్ కన్సర్వేటరుగా ఉంటూవుండినవారు.

4. నార్డ్‌స్ట్రాండ్, ఒ. కె. : స్టడీస్ ఇన్ కన్సర్వేషన్, వాల్యూం I, నెం. 2 (1969)

5. భౌమిక్, ఎస్. : "కన్సర్వేషన్ ఆఫ్ పామ్ లీఫ్ మాన్యుస్క్రిప్ట్స్" - బరోడా మ్యూసియమ్ ఎండ్ పిక్చర్ గాలరీ బులిటెన్ (1966)

6. గోపాలన్, ఎస్. : "పీప్స్ ఇంటూ సరస్వతీ మహల్" (1973)

7. గోల్డెన్ జూబిలీ సావెనీర్ : భండార్కర్ ఓరియంటల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, పూనా, మే 17, 1968

8. ఎ బ్రీఫ్ హిస్టరీ : శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ ఓరియంటల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్,

9. ప్రొసీడింగ్స్ ఆఫ్ హోమ్ డిపార్ట్‌మెంట్ (పబ్లిక్) నెం. 4338-48, సిమ్లా, డేటెడ్ నవంబర్ 3, 1868.

10. ప్రొఫెసర్ పాండురంగి, కె. టి. : "ది వెల్త్ ఆఫ్ సాంస్క్రిట్ మాన్యుస్క్రిప్ట్స్ ఇన్ ఇండియా ఎండ్ ఎబ్రాడ్" (మే 1978)

"కృషిశ్చ మే వృష్టిశ్చ మే..."

["వానల్లు కురవాలి !! పంటల్లు పండాలి !!" వేద ఋక్కు మొదలుకొని చిన్నపిల్లలదాకా సర్వులూ కోరుకునే ఆపాత మధుర మైన భావం ఇది!

అనావృష్టితో మాడిపోతున్న పంట చేలకీ, సర్వ ప్రాణిలోకానికీ అమృతవర్షోపమానమై విశాఖ జిల్లాలో 16-10-82 వ తేదీన బ్రహ్మాండమైన వాన కురిసింది! అయితే దీన్ని అతివృష్టి అంటారేమో కొందరు! ఏమైనా కవిగా ఆ వర్ష సౌందర్యాన్ని నా శక్తి మేరకు ఊహించాను! క్రింది పద్యాలికి ఆ వర్షమే ఉద్బోధకమని వేఱుగా చెప్పనక్కఱలేదుకదా! ఇక చదవండి !!" —రచయిత.]

తన కపకారముం దలచి తాలిమిఁ గోల్పడి వేటగానిపై
కనులటు లెఱ్ఱజేసి ఘుర ఘుర్ఘురితాత్మ గళప్రదేశమౌ
గొణిగెడు భల్లుకంబుగతి ఘూంకృతగర్జలఁ
గార్మొయిళ్లు మిం
టను కనుపింప వాకిళుల నాట్యము సేసిరి బాల
బాలికల్ !!

ఇంతయు నింతయై మరియు నింతయి అంతయి
నాకసమ్ముఁదా
నంతయుఁ గ్రమ్మ కాల తమ సాంధపయోధరరాశి
సుంతలో
వింతలు వింతలై మెఱుపు విచ్చల కుచ్చలుతోచు
తోడ దు
ర్దాంత కఠోర భీషణ విరావము విన్బడు మేఘ
గర్జగాన్ !!

చెప్పగ చిత్రమౌను నిరుచేతులు జాచుచు వాన వాన వ
ల్లప్పను మంత్రముం బలుకు నర్భక మౌనుల
కోర్కెఁ దీర్పగా
తప్పదటంచు వచ్చితివొ! తాదృశ సత్కరుణారస ప్రభన్
ఒప్పులకుప్ప వైతి వదిగో నదె! దైవగుణంబు
చూడగన్ !!

కూలిల తాటియాకు గొడుగుల్ పయి తక్క తథింగిణోం
ధ్వనిన్
హేలగ నాట్యమాడి కనుపించని యే గగనాంతరంపు మా
ర్మ్యలనో పుట్టుచుం భువనమోహనమౌనటు భూమి
జారి మా
చేలకు ప్రాణశక్తి వికసింపగ జేసెడు వర్షమా!
నతుల్ !!!

చూరుల జారెడున్ జలము చుక్కలు చుక్కలు
సూది సూదులై
సారెకు సారెకున్ బలిసి స్వచ్ఛత పట్టుపురుంగు తెల్లనౌ
దారపుత్రాళ్లుగా మెఱసి తక్షణ మావులతోక పాటిదై
సారత దేవదంతి కర సన్నిభ ధారలు తోచు
వ్రేల్మిడిన్ !!

వాకిళులందు నిండ్లపయి పళ్ళెములందున
బిందెలందు, తా
రేకులపైన చూఱులకు క్రిందున, నెద్దులబండి గూడుపై
తాకిన జల్లు మద్దెలల తాళములన్, చిఱుగజ్జెలన్ మహా
భీకృత ఢక్కలన్ మరియు పేరి నగారల మ్రోతఁ
జేసెడిన్ !!

ఒక పది యూళ్ళనుం దడిపి యూరక పర్విడి
పోవు వేగి, యొం
డొకటి నిమేషమాగి మఱి హోరున నెమ్మది నేగు
వెన్క, నిం
కొకటియు భూనభోంతరము నొక్కటిఁజేయును
విల్చి, మానవ
ప్రకృతుల భేదముల్ తెలియపల్కెడు చందము
వానజల్లులున్ !!

సకల కళాప్రపూర్ణతయు సర్వమనోజ్ఞము
నాట్యశాస్త్ర రూ
పకము రసజ్ఞబృంద పరిభావుకమున్ మరి నేత్రతర్పణ
ప్రకటన శీలముం బొరయు పావన నాట్యవిలాస
సంపదన్
అకలుష వర్షధారలు వియత్తల రంగమునందుఁ
జూపెడిన్ !

"కృషిశ్చ మే వృష్టిశ్చ మే"

పరశివదేవు మౌళి పయి పాదము మోపిన గంగ- కిల్బిషో
త్కర ప్రవినాశి గంగ, భవతాపములన్మడియించు
గంగ, ని
ర్జరులకె పావనత్వ వర సంపదలం బొదలించు గంగ, స
త్కరుణ రసాంతరంగ, పలుదారులఁజేలకు పర్వు
లెత్తెడిన్!

అమృతములై, మహా మహిమ నందిన మంత్రి
జలమ్ములై, తపో
విమల కవీశ రమ్య మృదు పేశల భావములై, జగద్ధిత
ప్రముదిత యోగభావనలఁబండిన నిష్కలుషత్వ ఛాయలున్
తెమలి జయించుతన్ తెలుగు నేలలపై నెల మూడు
వానలున్ !!

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

రామాయణము

శ్రీ కపిలవాయి లింగమూర్తి

పొసగ వల్మీకమందుండి పుట్టినట్లు
మఘవ చాపంబు వాల్మీకి మౌని నుండి
పుట్టె రామాయణము దాని పోలుపు జూచి
ముగ్ధుడుం గాడెవండు నీ భూతలమున.

వేల రామాయణంబులు వెలయ నేమి
రామ బ్రికృతియు పురుషుడు రాము డగుట
నిత్యనూతన మా కథ నిజము పలుక
లేదు పునరుక్తి దోషమా కృతికి నెపుడు.

అవని నెందరు శంకాలియాలు రాని
ఎన్ని విషవృక్షములు బుట్టి యెసగెనేని
దాని ప్రాచీనతా మహత్వంబు దలప
దానిదే సుమి రామాయణం బనంగ.

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

కన్యకా పురాణమున వర్ణితమైన వైశ్యుల సాంఘిక చరిత్ర

తెలుగు సాహిత్యంలో ప్రత్యేకంగా సాంఘిక జీవనాన్ని, అందునా ఒక తెగ లేక ఒక వర్గపు జీవన స్థితి గతుల్ని పేర్కొనే గ్రంథాలు బహు స్వల్పం అని చెప్పటం అసమంజస మేమీకాదు. సాహిత్యం నిస్సందేహంగా ఏకాలంలోనైనా, ఏదేశంలోనైనా సమకాలీన ప్రజా జీవితాన్ని ప్రతిబింబించి తీరుతుంది. కాని ప్రత్యేకంగా ఒక వర్గపు, లేదా ఒక వర్ణపుజీవన సరళిని వర్ణించటానికి, వీలైతే మరింత క్రమబద్ధం చేయటానికి సాహిత్యంలో, ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో జరిగిన కృషి అంతంత మాత్రమే. వైశ్య కులానికి సంబంధించినంత వరకు అలాంటి సాంఘిక చరిత్రను చిత్రించిన గ్రంథం, శ్రీ వాసవ కన్యకా పురాణము.1 ఇది పెనుగొండ వైశ్యయువకుల కంకితముగా వ్రాయబడిన గ్రంథం. దీనికర్త పదిహేనవ శతాబ్ది చివరి ప్రాంతాల వాడైన గురు భాస్కరా చార్యుడు. కనుక యిందు పేర్కొనబడిన వైశ్యుల జీవన సరళి సమకాలీన స్థితి గతుల్ని సహజంగానే రూపు కడుతుంది. కాని ఒక్క విషయం గమనించాలి. ఇది వైశ్యుల కులప్రశస్తిని, వర్ణ గౌరవాన్ని యినుమడింప జెయ్యటానికి వ్రాయబడిన గ్రంథం. అందువలన యిందలి విషయాలను సాంఘిక చరిత్రకు అన్వయించుకొనే ప్రక్రియలో కాస్త జాగరూకతతో కూడిన పరిశీలన చాల అవసరం. వైశ్యుల సాంఘిక చరిత్రకు సంబంధించినంతవరకు తెలుగులో దీనినిమించి మరియొక ఆధారమేదీ లేదు. 'వైశ్య వంశ సుధాకరం' లాంటివి రమారమి యిదే కాలంలో వెలసినా అవి సంస్కృత గ్రంథాలు.2 పైగా అందున్న విషయాలు తెలుగునాటికి మాత్రమే పరిమితములు కావు. ఇక యితర చారిత్రకాధారాలైన శాసనాల్ని పరిశీలిస్తే బలంజ,3 విశ్వకర్మ,4 తెలికి5 మున్నగు శూద్ర జాతుల ప్రశస్తుల వలన తెలియవచ్చే అంశాలకన్నా, వైశ్యుల ప్రశస్తుల వలన తెలిసే విషయాలు తక్కువ. కనుక తెలుగునాట, ముఖ్యంగా తీరాంధ్రంలోని వైశ్యుల సాంఘిక చరిత్ర తెలుసుకుందికి ప్రముఖాధారం 'కన్యకా పురాణము' మాత్రమే!

వేర్వేరు శాసనాల్లో పలు చోట్ల యీ వైశ్యులు శ్రేష్ఠి,6 శెట్టి,7 కోమటి,8 మున్నగు విధాలుగా పేర్కొనబడ్డారు. 'కోమటి' అనే పదం ఆవిర్భవించటాన్ని గూర్చి సరైన వివరం తెలియదు. శ్రీమతి అల్లాడి వైదేహిగారు, యీ 'కోమటి' అనే పదం పదమూడవ శతాబ్ది వాడైన భద్ర భూపాలుని 'నీతిసార ముక్తావళి' లో ప్రథమంగా ఉపయోగింప బడినట్లు పేర్కొనిరి.9 కాని అది వాస్తవము కాదు. శాసనాల్లో ఆ పదం పదకొండవ శతాబ్దినుండి వాడుకలోవుంది.10 ఆ పదాన్ని గురించి 'కన్యకా పురాణం' లో ఓ చిన్న వివరణ యిలా వుంది. పరమేష్ఠి ఆదేశము మేరకు గోవు గర్భమునుండి భువికి చనుదెంచిన కులమగుటచే వీరు 'గోమతు' లట!11 కాలక్రమేణ కోమట్లు కావచ్చును. కాని శాసనాది యితరాధారాల్లో ఎక్కడా 'కోమటి' పదావిర్భావానికి ముందు గోమతి, గోమఠ రూపాలలో వీరి కులనామం కానరానందున పై వివరణ పదిహేనవ శతాబ్ద్యంతాన కల్పింపబడినది కావచ్చును.

వర్తక వ్యాపారములు వైశ్యుల ముఖ్య వృత్తులు. దేశ బాహ్యాంతరములలో 'శ్రేణులు' గా నేర్పడి వీరు సాగించెడి వ్యాపారము వీరు ధనవంతులగుటకే కాక, దేశపు నాలుగు చెరగుల వీరు విస్తరించుటకు, రాజుమొదలు సమాజములోని అట్టడుగు వ్యక్తి వరకు వీరితో సంబంధమేర్పరుచు కొనుటకు ఉపయోగపడినది. కాలక్రమేణ పరిపాలనా వ్యవస్థలో, ఆర్థిక సంబంధ వ్యవహారములలో వీరు తలదూర్చి సమర్థత చూపినట్లును, రాచ మర్యాదలు బడసినట్లును శాసనములు పేర్కొనుచున్నవి.12 తమ ఆస్తుల రక్షణకు, వ్యాపార ప్రయాణములందు రక్షణకు వీరు స్వంత సైన్యముల నేర్పరచుకొనుట, కొన్ని పరిస్థితులలో తమ పరిపాలకులకు సైతము ఋణములీయబూనుట, వీరి ఎదుగుచున్న ప్రాబల్యమును విశదపరచుచున్నవి.

ఈ కాలమున వైశ్యులు కూడా బ్రాహ్మణులవలెనే గోత్ర నామములు ధరించుట గమనింపదగిన యంశము. ఆర్థికముగా

మే

సుసంపన్నులగుట వలన ఖ్యాతి మరింత వృద్ధి నొందించుకొను ప్రయత్నమున కాబోలు లెక్కకు మిక్కుటమైన గోత్రములు వీరి కులమున జొప్పింప బడినవి. అవచి తిప్పయ్యశెట్టి కంకితమొసగ బడిన శ్రీనాధ కవి సార్వభౌముని 'హర విలాసము' న వైశ్యులు 'సహస్ర గోత్ర పవిత్రులు' గా అభివర్ణింప బడిరి.13 'కన్యకా పురాణము' మాత్రము వీరిగోత్రముల సంఖ్య 714 గా పేర్కొను చున్నది. వీనిలో భార్గవ ఋషిగణము - 200; శాండిల్య ఋషి గణము 252; ప్రభాత ఋషిగణము - 66; మిగిలిన 196 - కాశ్యప ఋషిగణము. మిగిలిన మూడు గణములు విపులముగా తెలియక పోయినను, కాశ్యప ఋషిగణము నందలి 196 గోత్రములు మాత్రము యివి :

1. ప్రభాత
2. రస్మివంత
3. మాండవ్య
4. మదన
5. ఆంగీరస
6. అఖండల
7. ఇడిమ్మీరల
8. ఘోటక
9. తుందిల
10. తుహినాహార
11. చరణ
12. వ్యూహ
13. వత్సక
14. గణేశ్వర
15. కణ్వ
16. కందర్ప
17. చరణాత్రయ
18. చండిక
19. పౌంగ్రిక
20. దేవల
21. ధార్మిక
22. మైత్రేయ
23. మంజుళ
24. సనక
25. సనందన
26. నారద
27. ఊర్మి
28. ఉదంక
29. మరు
30. సంజ్ఞిక
31. కాశ్యప
32. కల్మాషపాద
33. దత్త్రాత్రేయ
34. ధాతృక
35. చ్యవన
36. జహ్ను
37. ముక్తిప్రద
38. నిరతమ
39. మౌద్గల్య
40. పౌతిమాష్య
41. గౌపవన
42. కౌశికాయన
43. గౌతమాయన
44. సైతవ
45. గార్గ్యాయన
46. పారాశర్య
47. యాజ్ఞవల్క్య
48. యాజక
49. అఘుహారిప
50. పౌండ్రక
51. పురుకుత్స
52. పుష్పదంత
53. చిత్రక
54. చిత్ర
55. చిత్రగుప్త
56. వామన
57. వామదేవ
58. యాయుష్య
59. చతుష్కర్ణ
60. చరమతత్వ
61. చల్మిత్రపత
62. ఇంద్రద్యుమ్న
63. జాలాయన
64. ఉద్వారకాయన
65. మాధ్యందిన
66. సౌకరాయన
67. కాషాయన
68. బాష్కలాయన
69. సాయకాయన
70. కౌశికాయన
71. పారాశర్యస
72. పావనత్రియ
73. హరితోద్వహ
74. కంబుగ్రీవస
75. గీవస్థిత
76. ఉత్తమాఖ్య
77. పారద
78. పల్వల
79. సత్యప్రస్థ
80. భీషణాఖ్య
81. విజయవర్ణ
82. నాచికేత
83. పులస్త్య
84. సూనృత
85. గౌతమ
86. భార్గవ
87. జైమిని
88. మతంగక
89. ఘృతకౌశిక
90. ఆసురాయణ
91. అయాస్క
92. స్త్రైవణి
93. ప్రీతమానస
94. పరమత్వక
95. విశ్వామిత్ర
96. సుతీక్ష
97. కనకపాలక
98.* సనత్సుజాత
99. సంవర్తక
100. తుంబుర
101. పేశల
102. వరుణ
103. కృత్స్న
104. కపిల
105. సాందీపన
106. అపస్తంబ
107. మందపాల
108. భారద్వాజ
109. బృహదశ్వ
110. ఋశ్యశృంగ
111. వాలఖిల్య
112. కూర్మ
113. అజంధన
114. అపజంధని
115. అసురీ
116. మాందీస
117. కైశోర్య
118. లౌప్య
119. ముద్గల
120. మార్కండేయ
121. మంజువ్రిత
122. అప్నుత
123. శాండిల్య
124. శమీర
125. శ్రీధర
126. పవన
127. ప్రమద
128. అగస్త్య
129. రైభ్య
130. హరివక్త్ర
131. వేదనిధి
132. పవిత్రపాణి
133. కౌండిన్య
134. భృగు
135. అక్షయాక్షి
136. బోధాయన
137. పింగళ
138. సత్యవ్రిత
139. మహాసేన
140. కౌత్స
141. వాముకాయవ
142. స్థూలశీర్ష
143. కృష్ణద్వైపాయవ
144. కుమారిహారి
145. కుమార
146. విదర్భ కౌండిన్య
147. విదర్భ
148. వత్సపాల
149. బభ్రు
150. పథ
151. సోహార
152. మాధవ

153. ముచికుంద
154. శరభ
155. ధౌమ్య
156. తుర్యవ్రత
157. మౌసల
158. హయగ్రీవ
159. శక్తి
160. పావన
161. విష్ణు
162. వర్ధన
163. జాతవేదస
164. శుక
165. గార్గ్యస
166. కృష్ణ
167. ఆయాస్య
168. అభూత
169. అంగీరస
170. త్వష్ట
171. విశ్వరూప
172. ఆశ్వ
173. దధీచి
174. అథర్వణ
175. మృత్యు
176. ప్రద్వంసన
177. మరీచి
178. బృహస్పతి
179. వశిష్ఠ
180. పుండరీక
181. త్రిజట
182. కాంచన
183. శౌనక
184. ఏక ఋషి
185. విప్రచిత్త
186. వృష్ఠి
187. కల్మాష
188. స్వయంభూ
189. సనారు
190. పరమేష్ఠి
191. సనాతన
192. ఆశ్వలాయన
193. విష్వక్సేన
194. సుతీక్ష్ణ
195. జాబాలి
196. శార్ఙరవ

ఈ 196 ఏకార్షేయ గోత్రములు. ఇవికాక 'కన్యకా పురాణము' నందును, యితర శాసనములందును పేర్కొనబడిన గోత్ర నామములు కొన్ని దిగువ నిచ్చుచున్నాను. ఇవి భార్గవ, శాండిల్య, ప్రభాత ఋషిగణములలోనివై యుండును.

చరితవ్రత	ఇంచుకుల	మైత్రేయకుల
నాభీలము	తులశిష్ట	సెట్టిసెట్ల
మునికులము	వృకశిష్ట	బల్లి సెట్టి
మూలకులము	శ్రీరంగకుల	సంతాల
వక్రాలము	శ్రీకకుల	దెడ్డి
వక్రశిష్టము	ఘనముఖ	నాగుండయరి
వ్రంగమము	చేగోళ్ళ	పుచ్చకోల
బుద్ధికులము	చేరుకోళ్ళ	యజ్ఞసెట్టి
యలమంచి కులము	ఘనకకుల	బొడుకుల
మన్యుకుల	పట్టణకుల	వివిరిశిష్ట
పాల	దేశిష్ట	అప్పనాంగకుల
అనుపకుల	దైవిశిష్ట	వెంకుల
	మిధునకుల	

బ్రాహ్మణాది యితర కులములందువలెనే వైశ్యులతో కూడ పూర్వ స్థావరము లాధారముగా నేర్పడిన విభాగములుండెడివి. 12, 13 శతాబ్దులలోని శాసనములలో కొన్నిచోట్ల 'కమ్మనాటి' నుండి విస్తరించిన కమ్మకోమట్లు ప్రస్తావింప బడినారు.[14] శాసనము లందును, సాహిత్యము నందును ద్యోతకమగు వంశములను బట్టి యీ వైశ్య కుటుంబములు నగరములలో నొక ప్రత్యేక ప్రాంతమున నివసించుచుండెడివారని తెలియుచున్నది. 'కన్యకాపురాణము'న వీరు నివసించుచుండెడి 18 మహానగరములు పేర్కొనబడినవి. వైశ్యుల 714 గోత్రముల వారికిని యీ నగరములే స్వస్థానములు. ఆ నగరములు, అందు వసించెడి వైశ్యుల వివిధ వంశముల వివరము లివి :

పట్టణము	వంశములు
1. ఏలాపురము	మాన్యమానాభ వంశము
	అనుపాల వంశము
	అనుపకుల వంశము
	కంక వంశము
	కర్మి వంశము
2. వీరనారాయణ పట్టణము	ఘంటక వంశము
	గుంటుక వంశము
	కవట వంశము
	కాకేల వంశము
	గో వంశము
3. విశాల నగరము	గోశీల వంశము
	పున్నశీల వంశము
	వంక వంశము
4. శివ పురము	గోప వంశము
	పెద్దిశిష్ట వంశము
	పేరిశిష్ట వంశము
5. అచంట నగరము	చిని వంశము
	శిశి వంశము
	శిరీష వంశము
	నంది వంశము
	సునంది వంశము
	కాంపిల్య వంశము
6. ధనద పురము	యిక్ష్వాకు వంశము
	కురంటక వంశము

పట్టణము	వంశములు
7. ధర్మ పురము	గణపతి వంశము
	హరి వంశము
	చంద్ర వంశము
	అర్క వంశము
	కాల వంశము
	అగ్ని వంశము
	భద్రి వంశము
	మంద్ర వంశము
8. పాలకుండ పురము	సూసాళ్ళ వంశము
	కరాళస్మయ వంశము
	పారు వంశము
	దర్దు వంశము
	శాబర వంశము
	మణిగ్రీవ వంశము
9. జగన్నాధ పురము	బలిశిష్ఠ వంశము
	గయభీయ వంశము
10. కళింగ పట్టణము	గ్రంధిశీల వంశము
	తుంబ బంధుక వంశము
11. పాంచాల నగరము	మరు వంశము
	ప్రోవిశిష్ఠ వంశము
	చంద్ర వంశము
12. భీమ పట్టణము	పదగశీల వంశము
	మలయాల వంశము
13. త్రిగుణ పట్టణము	కఠోర వంశము
	కోవన వంశము
	శాంత వంశము
	దామవ వంశము
	దర్దుర వంశము
	పృధ్వీ వంశము
	పీస్తు వంశము
	కార్శ్రిను వంశము
14. ఘంటసాల పురము	వినికుల వంశము
	మాసంత కులము
	హయగ్రీవ వంశము
	మణిగ్రీవ వంశము
	శంఖగ్రీవ వంశము
15. కామ పురము	వేన్న కులము
	మణికుంట వంశము
16. పీఠికా పురము	సానక వంశము
	కేశ వంశము
	శుంగ వంశము
17. జనద పురము	చిరుబిళ్ళ వంశము
	బుదుర వంశము
	యనస వంశము
	ద్రోణ వంశము
	శూల వంశము
18. పెనుగొండ పట్టణము	ఉద్వాహ వంశము

పెనుగొండ, ఘంటసాల, విశాఖ పట్టణ, జననాధ పురము మున్నగుచోట్ల 11, 12 శతాబ్దులలో నీయబడిన శాసనములు పెక్కింట యుందు పేర్కొన బడిన గోత్రముల, వంశముల వైశ్యులే పేర్కొనబడుట చాల ఆసక్తికరమైన విషయము.15 పైన పేర్కొన బడిన 18 నగరములను వివరించు సందర్భమున గ్రంథమున వేర్వేరుచోట్ల వేర్వేరు విధములుగా నున్నది. కొన్ని సందర్భములలో యీ నగరముల సంఖ్య 20 వరకు పెరిగినది. ఆ హెచ్చుగా చేర్చబడిన రెండు నగరములు తరువాత కాలమున చొప్పింప బడినవి కావచ్చును. ఇదికాక గ్రంథమున పై నగరములలో కొన్నింటికి ఒక సందర్భమున నుపయోగింపబడిన నామము, మరియొక సందర్భమున మరియొక విధముగా చెప్పబడుటకూడ గమనింపదగినది. ఉ॥ దా॥ విశాఖ నగరము – విశాల నగరము; జనదపురము – ఘనసార పురము మున్నగునవి. పైన పేర్కొన బడిన నగరములన్నింటిలో ప్రస్తుతము విశాఖ, అచంట, ధనద, ఘంటశాల, పీఠికాపుర, పెనుగొండ పట్టణములు మాత్రమే గుర్తింపబడినవి. ఇవి ప్రస్తుత విశాఖపట్నం, అచంట, చందవోలు ఘంటశాల, పిఠాపురం, మరియు పెనుగొండలు. మిగిలిన ధర్మ,

పాంచాల, త్రిగుణ, వీరనారాయణాది నగరాల్ని గుర్తించటానికి ఆధారాలు లేవు.

కన్యకాపురమును బట్టి యీ వైశ్యులందరును పెనుగొండ వైశ్యుల నాయకత్వమున నొక 'శ్రేణి' గా నేర్పడిరని తెలియుచున్నది. పై ప్రాంతము లన్నింటను వారి కుల పరిషత్తులనదగు 'నకరము' లేక 'నగరము' లుండెడివి.[16] వాటి అధ్యక్షుడే 'నగర స్వామి' బహుశః మూలకేంద్రమైన పెనుగొండ 'నకరము' తమ కులమునకు సంబంధించిన సాధారణ వ్యవహారములను మొత్తము సమీక్షించును. క్లిష్ట సమస్యల పరిష్కారమునకు అన్ని 'నకరము' లకు సంబంధించిన ముఖ్యులతో సమావేశము పెనుగొండలోని నగరేశ్వరస్వామి ఆలయ ముఖ మండపమున నేర్పాటుచేయబడి చర్చింపబడుట సంప్రదాయము.[17]

వైశ్యులలో ప్రాంతీయ విభాగాలు ఆధారంగా ఏర్పడిన విభజన తప్ప మరొక విధమైన వేర్పాటు ఏదీలేదు. కాని పురాణమున పేర్కొనబడిన వాసవీకన్య – విష్ణువర్ధనుల ఉదంతకాలం నాటి నుండి అభిప్రాయాల్లో, నడవడిలో ఏర్పడిన వైరుధ్యం కారణంగా మొత్తం 714 గోత్రాల వైశ్యులలో 612 గోత్రాల వైశ్యకుటుంబాలు చీలిపోవటం సంభవించింది. మిగిలిన 102 గోత్రాల వైశ్యులు 'కుల ధర్మాన్ని' పరిరక్షించే పవిత్ర యజ్ఞంలో సమిధలై ఆత్మార్పణ చేసుకోవటంతో ఆ గోత్రీకుల సంతతి నాటికీ నేటికీ అత్యంత పవిత్రులుగా పరిగణింప బడుతోంది. పశ్చిమ గోదావరిజిల్లా పెనుగొండ లోని శ్రీ వాసవ కన్యకా పరమేశ్వరి వీరి కులదేవత.

కన్యకా పురాణమునందలి చారిత్రికాంశాలు ఎంతటి వివాద గ్రస్తాలైనా యిందు పేర్కొనబడిన సాంఘిక జీవన వివరాలు మాత్రము మరే యితరాధారమునందును లభింపనివి, మీదుమిక్కిలి ముఖ్యమైనవి. వైశ్యులు తొలినుండి నగరేశ్వరస్వామి భక్తులు. సాధారణముగా అన్ని వైశ్య నగరములందును నగరేశ్వరాలయ ముండును. పురాణమననుసరించి వైశ్యులను పరమశివుడు భూమిపై నవతరింప వలసినదిగా ఆజ్ఞాపింపగా, శివభక్తులైన వారందరు భగవానుని ఎడబాటుకు ఖిన్నతచెంది దుఃఖింపగా, శివుడనుగ్రహించి వారి కోర్కెమేరకు తానునూ 'నగరేశ్వరుడ' ను పేరిట భువికి దిగి వచ్చెనట! నగరేశ్వరుడవతరించుటను బట్టి యివి 'నగరము' లైన వనుట పురాణ కథ. నగరములవారు నిర్మించుకున్న దైవమగుటచే నగరేశ్వరు డయ్యెననుట యుక్తము. ఈ గ్రంథమున వైశ్యులు క్రయ విక్రయ పారీణులుగా వర్ణింపబడినారు. ధర్మ మార్గమున వాణిజ్యము నడుపుట, గోరక్షణ, రత్నాది సమస్త వస్తువులను పరీక్షించి నాణ్యము చేయుట, ఏనుగుల వ్యాపారము మున్నగునవి వీరి వృత్తులుగా చెప్పబడినవి. ఈ వృత్తులన్నింటిని వీరవలంబించి నడుపుచున్నట్లు తత్కాల శాసనాధారముకూడ కలదు.[18] ధనముతో తులతూగెడి వీరు ధనమును వడ్డీకిచ్చుచుండుట కూడ దీనియందు సూచింపబడినది. కొన్ని సందర్భములలో ధనముతో విర్రవీగెడి వీరిలోని కొందరు తమ పాలకులనుకూడ లక్ష్యము చేయకుండుట, వారికన్న తాము అధికులమని వాదింపబూనుట సాంఘిక చరిత్రలో గమనింపదగిన పరిణామము.[19] రాజాజ్ఞకన్న 'కులధర్మము' పాటించుటయే ముఖ్యమని భావింపబడెడిది. ఆ కులధర్మ రక్షణలో వారు ప్రాణ త్యాగమునకైన వెనుతీయలేదు. బ్రాహ్మణులను గౌరవించినను, భూరి దానములొసంగినను కొన్ని సందర్భములందు వీరు వేద విధిని నిరసించుటకు కారణము తెలియదు. వేద మంత్రములు పాటింపక, వైదిక క్రియాకలాపము సమస్తమును వర్జించి కేవలము పురాణోక్త విధిని మాత్రము పాటించుచుండిరి. అశ్వమేధ, గోమేధ, జ్యేష్ఠభాగ, పలల శ్రాద్ధములతోపాటు, సంఘ సంస్కరణ, క్రియలైన వితంతు వివాహము, జాత్యంతర వివాహము కూడా వీరి నిరాదరమునకు గురియైనవి.[20] వేద వాఙ్మయమున బ్రాహ్మ, క్షత్రియ జాతులతోపాటు వీరుకూడా ద్విజులుగా పరిగణింపబడి వైదిక క్రియా కలాపమున కధికార మొసంగబడినను వీరిట్లు ప్రవర్తించు విముఖతకు కారణము తెలియదు. కాని వైదిక క్రియా కలాపమును నిరసించిన వీరు బ్రాహ్మణుల యెడ భక్తి కల్గి యుండుట, దానము లొసగుట మాత్రము మానలేదు. కన్యకా పురాణమున వైశ్యులు బ్రాహ్మణులకు ఏ ఏ సందర్భములలో ఏ విధముగా దానములొసగి తృప్తులను చేయవలెనో పేర్కొనబడినది. ప్రతి సంవత్సరమునందును వారి గురువు వచ్చినపుడు ఘనముగా సత్కరించి ప్రతియొక్క వైశ్య గృహము 8 వరహాలు సమర్పింపవలెను. అట్లే వివాహ సమయములో 12 వరహాలు, సీమంతమున 6 వరహాలు, గర్భాదాన సందర్భమున 3 వరహాలు, పుంసవనమందు 6 వరహాలు, పుత్రుడు కల్గిన యెడల 3 మాడలు పుత్రిక కల్గిన యెడల 1½ మాడలు సమర్పింపవలెను. ఇవికాక అన్నదమ్ముల ఆస్తుల పంపకమునందును, క్రయ విక్రయ వ్యవహార లబ్ధియందును ధర్మాంశమీయబడును.[21]

వివాహపు నిశ్చయము విషయమున విధిగా 'మేనరికము' పాటించటం, ఆస్తిపాస్తుల పంపకంలో ఒకే పుత్రిక యున్న సందర్భమున ఆమెకు పుత్రులతోపాటు భాగమీయటం వీరి ఆచారాలు. ఇవికాక యీ పురాణమునందును, శాసనములందును[22] ద్యోతకమగు అంశమొకటి కలదు. ఏదైనా దాన మొసగునపుడు గాని, ఆలయ తటాకాదులు నిర్మించునపుడుగాని వారు ప్రథమమున తమ 'కులపెద్ద'ల యనుమతిగైకొని, తదుపరినే వాని నొనరింతురు

వీని యన్నింటికన్న ప్రముఖముగా పేర్కొనదగినది యీ పురాణమున పేర్కొనబడిన వైశ్యుల వివాహోత్సవపు పద్ధతి.23 ఇది ఏడు దినముల తంతు. వివాహముహూర్తపు ముందురోజు అగ్ని పూజింపబడుటతో నిది మొదలగును. వివాహవేదికకు చుట్టును 5 పోలిక స్తంభములను నిలిపి నలుపు, పసుపు, ఎరుపు, తెలుపు రంగులు కల అన్నము బలి యొసగబడును. తదుపరి ఇంద్ర, అగ్ని, యమ, వరుణ, చంద్రులు వరుసగా అర్చింప బడెదరు. రెండవ దినమున ముప్పది మూడుకోట్ల దేవతలపూజ. మూడవ దినమున గోత్రపూజ. నాలుగవ దినమున వైశ్యులకు నాక బలి. ఇందు సమస్త వైశ్యుల మాతృదేవతయైన కామధేనువుకు నివేదన యొనరించి చక్కెర కలిపిన వరిబియ్యపు పిండిని బంధువుల కందరకు పంచిపెట్టవలెను. ఐదు, ఆరు దినములందు నావికా పూజ. ఏడవదినమున కంకణ విసర్జన. ఏడవ దినపు మధ్యాహ్నము ఇంద్ర, అగ్ని, వరుణ, యమ, చంద్రులను పూజించి వేదిక చుట్టును నిల్పిన 5 ప్రోలి స్తంభములను కదిలించుటతో తంతు పరిసమాప్తి యగును.

వేశ్యల్ని నిరసించటం, స్త్రీ స్వేచ్ఛపై ఆంక్షలు, నగర రక్షణకి గస్తీలేర్పరచటం, ముఖ్యమైన విషయాన్ని చాటింపు వేయించటం, రహస్య సమావేశాలు జరపటం-యిలాంటివి యీ గ్రంథంలో కానవచ్చే యితర విషయాలు. సింహాచలం, శ్రీ కూర్మం, పాలకొల్లు, జగన్నాధం, దాక్షారామాలు యిందు కానవచ్చే ఇతర క్షేత్రాలు. ఈ విధంగా యీ గ్రంథం 15వ శతాబ్ది ప్రాంతంలో తెలుగునాట వైశ్యుల జీవనవిధానాన్ని వేర్వేరు కోణాల్లో తెలుసుకుందికి వీలుకలిగిస్తోంది.

శ్రీ కొత్త భావయ్య చౌదరిగారు రెండు వందలమంది కోమటి కుటుంబాల వారు కమ్మవారిలో కలిసిపోయినట్లు, అలా అని 'కన్యకాపురాణము'లో నున్నట్లు తమ 'కమ్మవారి చరిత్ర'లో వ్రాసారు.24 కాని 'కన్యకాపురాణము' న ఎక్కడా అలాంటి అంశమేదీ లేదు.

అధోసూచికలు

1. శ్రీ వాసవ కన్యకా పురాణము, ఆర్యవైశ్య యువజన సంఘము, పెనుగొండ, 1951.
2. హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్స్, ఎమ్. సోమశేఖరశర్మ, పు. 274
3. స్టడీస్ ఇన్ ఎకనామిక్ ఎండ్ సోషల్ కండిషన్స్ ఆఫ్ మెడివల్ ఆంధ్ర, కె. సుందరం, పు. 70
4. సౌ. ఇన్. సం.VI, నెం. 209
5. ఎ. ఇం. సం.VI, పు. 334
6. ఏ. రి. ఎ. నెం. 170 ఆఫ్ 1966
7. అదే.నెం. 455 ఆఫ్ 1899
8. సౌ. ఇం. ఇన్. సం. VI, నెం. 87
9. సోషల్ ఎండ్ ఎకనామిక్ కండిషన్స్ ఇన్ ఈస్టరన్ డెక్కన్, పు. 42
10. సౌ. ఇం. ఇన్. సం. IV, 1021, 1012 వ.
11. అధ్యాయం 54, శ్లో॥ 40–45
12. సౌ. ఇం. ఇన్. సం. IX, నెం. 41
13. హరవిలాసము, II, ప. 139
14. సౌ. ఇం. ఇన్. సం. V, నెం. 179; సౌ. ఇం. ఇన్. సం. VI, నెం. 136 వగైరా
15. సౌ. ఇం. ఇన్. సం. X, నెం. 114, 115, 264, 651 వగైరా
16. కార్పొరేట్ లయిఫ్ ఇన్ మెడివల్ ఆంధ్ర, ఆర్. నరసింహారావు, పు. 36
17. స్టడీస్ ఇన్ ఎకనామిక్ ఎండ్ సోషల్ కండిషన్స్ ఆఫ్ మెడివల్ ఆంధ్ర, పు. 59
18. ఏ. రి. ఎ. 1918, ii పేరా 85
19. అధ్యాయం 35, శ్లో॥ 47-48
20. అధ్యాయం 36, శ్లో॥ 29-30
21. అధ్యాయం 44, శ్లో॥ 25-30
22. కన్నడ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నెం. 22, 23 వగైరా
23. అధ్యాయం 44, శ్లో॥ 75 - 85
24. కమ్మవారి చరిత్ర, పే. 7.

—✱—

చెట్టు

గుట్టు దాచుకోకుండా
బట్ట బయలుగా నిలబడే
చెట్టు కవుల కాదర్శం.
అందమైన పూలూ
మందమైన గాలులూ
ఉట్టిపడే తీపీ
వట్టిపోని ఊపీ—
ఇవి మాత్రమే కారణాలు
కావు, చెట్టు పలుకుబడికి.
ఎండలోనిది సగమే,
అండర్ గ్రౌండ్ వర్క్ మరో సగం.
చెట్టు పూసే ప్రతి పువ్వూ
మట్టిలో పూసినదే.
చెట్టు చేసే ఛాయాదానం
మట్టిలో వేళ్ళ చలవ.

చెట్టు చూపే రాజసం
మట్టిలో వేళ్ళ శ్రమఫలం.
చవులూరించే డైనింగ్ టేబుల్‌ని
చెమటలుకార్చే వంటిల్లు సిద్ధపరుస్తుంది.
షోకేస్‌లో అందాలబొమ్మ చీరని
చిగురుల బనీనువాడు సింగారిస్తాడు.
వ్యవస్థవేసే విలువైన వేషాలన్నీ
తెరవెనక రంగులు వేసే
శ్రమజీవుల త్యాగఫలం.

అందంగా ప్రబంధాల్లోని
రొమాంటిక్ హీరోలా కనిపిస్తుంది, కాని,
ఈ చెట్టు
కష్టపడి పైకొచ్చిన వ్యాయామనిష్టు.

కొండలు

వెయ్యి మండే నాలుకలతో
ప్రాణాన్ని పీల్చేసి మోళ్లు మిగిల్చే సూర్యుడూ
కరకు కొరడా దెబ్బలతో
ప్రకృతిని పాలించే పహరా గాలీ
ఈ కొండల్ని ఏమీ చెయ్యలేకపోయాయి.
సగర్వంగా తల ఎత్తుకుని
ఓటమికి అతీతంగా హీరోదాత్తంగా
ధీరుల్లా నిలబడ్డాయి, ఎప్పటినుంచో.
కాని,
ఈ ధీర హీరోలు శుష్క బ్రహ్మచారులు.
కోకిల వధూ కలస్వనం గాని
పాపల్లా పారాడే సెలయేరుల గలగలలు గాని
ఎరగని మరుభూమికి మహారాజులు.
వ్యర్థులు.

శ్రీ కె. గోదావరి శర్మ

నీ వాకిట నిలబడిన ఈ క్షణాలు...

సుదూర నీలాకాశంలో
అప్పుడే పొడిచిన వేగుచుక్కలా
ఈ చీకటి హృదయంలో
తళుక్కుమనే మెరుపు
స్పష్టంగా దోబూచులాడింది.

ప్రభూ !
'మమత' అనేది నీవు నేర్పకుండా ఉన్నట్లైతే
'మానవత' అనేది నాకు చూపించకుండా ఉన్నట్లైతే
ఈ మనసొక అంధకార సాగరమై
ఈ మనిసొక అమవసల బడబానలమై
దగ్ధమై ఉండేవి !
సంధిగ్దంలో మునిగి ఉండేవి !

తండ్రీ !
నీ వాకిట నిలబడిన ఈ క్షణాలు....
నా నక్షత్ర నేత్రాలలో బంగారు భవిష్యత్తును
చూపెడుతున్నాయి !
నీ ముంగిట జోడించిన ఈ చేతులు....
విశ్వభాగ్యోదయాన్ని కాంక్షిస్తూ గీతోపదేశ
మిస్తున్నాయి !

శ్మశాన వాటికలో...

ఊదర గొడుతున్న
పిచ్చి ఈదురుగాలి
సేద దీరుస్తోందో
సెలవేస్తోందో
అర్థమయీ కానట్లు
అందీ అందనట్లు
ఈ గుండెల్లో ఏదో రొద !
ఈ లోతు లోయల్లో ఏదో సొద !

◆ ◆

తామర తంపరల్లా
పుట్టుకొచ్చిన
గువ్వ కుత్తుకల కీచురాళ్ళే ఐనా
ఏదో ఆనవాళ్ళు !
లీలగా
జాలిగా
గత స్మృతులను పేరబెడుతు !
వింత శృతులను దోసిళ్ళపడుతూ ! !

◆ ◆

సమాధి నిశ్శబ్దాలను
దీల్చుకొంటూ
కాటికాపరుల్లా అరిచే తీతువులే ఐనా
ఏవో మేలుకొలుపులు !
నిర్మమంగా
నిశ్చలంగా
ఎక్కడో నక్కల ఊలలలో శివతాండవంనాటి
సరిగమలు !
ఎక్కడో డేగల రెక్కలలో బృందావనంనాటి
మురళీరవాలు ! !

◆ ◆

అందుకే కాబోలు
ఈ శ్మశాన వైరాగ్యంలో సైతం
నాకో సందేశం వినవస్తోంది !
పార్థునికి మల్లే
ఒక గీతోపదేశం !

◆ ◆

అంతేకాదు
ఈ మరు భూమి విచారంలో సైతం
నాకో పవిత్ర నినాదం వినవస్తోంది !
నిత్యచైతన్యానికి మల్లే
ఒక ఓంకారం !

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

శ్రీ సోమసుందర్

సమాజ పరిణామంపై సాహిత్య ప్రభావం

చిత్తశుద్ధీ నిర్దిష్ట ధ్యేయమూ ఉన్న రచయిత దాదాపు ఒక సంస్థ వంటి వాడు. అతని ఆవేశం అందుకొనే వారూ, అతని ఆలోచనలను తమ మనసులపై ఒరపిడి పెట్టుకునేవారూ - పాఠకులలో అసంఖ్యాకంగా ఉంటారు. కొత్త తరానికి చెందిన యువ మేధావులు అతని ప్రభావ పరిధిలోనికి వస్తూ వుంటారు. ఈ సత్యాన్ని అనుసరించి పరిశీలిస్తే - అతనే ఒక అనభివ్యక్త విశ్వ విద్యాలయంగా మార్గనిర్దేశకుడవుతూ వుంటాడు.

గత తరానికి చెందిన యుగపురుషులు మహా కవులూ ఆనాటి యువకులపై ప్రసరించిన ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ఈ సత్యం బోధపడుతుంది.

ఏవం విధంగా తరంనుంచి తరానికి అనుభవాన్నీ ఉత్సేకాన్నీ అందిపుచ్చుకోవడంలోనే సృజనాత్మకశక్తి అనుస్యూతంగా పెంపొందుతుంది. జలపాతంలాగ ముందుకు దూసుకుతూంటుంది. నూతనక్షేత్రాలలో ప్రవేశిస్తుంది. ఇది ఒక నిరంతర జీవధార.

అజ్ఞాత హృదయ రంగప్రవేశం చేస్తూ సాగుతూన్నపుడు- బాల్య హృదయ నిర్మలత్వాల్నీ, యౌవన హృదయ జిజ్ఞాసల్నీ సాహితీ పిపాసువులుగా తీర్చుస్తూంటుంది. మేధా సంపదను ప్రబుద్ధం చేస్తుంది. రచనా నైపుణ్యాన్ని ప్రవృద్ధం చేస్తుంది. రసావేశాల నుద్రేకిస్తుంది. ఈ విధమైన క్రియాత్మక, ప్రతిక్రియాత్మక తేజశ్చక్రం, వ్యక్తులను సాహితీ సృజన శక్తులుగా రూపొందిస్తుంది. వ్యక్తుల సమూహమే సమాజంగా అవగతమవుతుంది.

సాహితీ పిపాసువుల బృహత్ స్వరూపమే సాహిత్య ప్రపంచం. ప్రతిభావంతుని ప్రభావరశ్మి వ్యక్తినుంచి ప్రారంభమై మానవజాతి పరంగా విస్తరిత మవుతుంది. సామాజిక ఆర్థిక సంస్కృతీరంగాలన్నింటా ఈప్రభావం ప్రసరిస్తుంది. సత్ఫలితాల నందిస్తుంది. ఆంతరంగిక పరిణామం ద్వారా వ్యవస్థాగతమైన పరిణామాన్ని సాధిస్తుంది. పరిణామం సర్వతోముఖంగా నిర్వహించబడినపుడే విప్లవాత్మక మైనమార్పులు సంభవిస్తాయి. పరస్పర విరుద్ధశక్తుల విభిన్న స్వభావాలు ఆటుపోట్లతో పరిణామం క్రమానుగత వికాసం పొందనినాడు ఉద్ధృత శక్తిగా విజృంభిస్తుంది. తక్షణ పరిణామాన్ని సాహసవంతం గానూ, హింసాయుతంగానూ ఆపాదిస్తుంది. భౌతిక స్వరూపంపై జరిగే విప్లవానికి పీడితుల నిర్మాణాత్మక చైతన్యం ప్రాతిపదికగా ఉండక తప్పదు. ఆ నిర్మాణచైతన్యానికి సాహిత్య ప్రభావం నేపథ్యంగా సంసిద్ధం కావడమూ తప్పదు.

వ్యక్తుల, సామాజిక వర్గాల భావ విప్లవాన్ని ఆయత్త పరిచే చైతన్యం - ఒంటరిగా సాహిత్య ప్రభావం వల్లనే కలుగుతుందనుకోవడం సంపూర్ణ సత్యం కానేరదు. సమాజంలోని రాజకీయార్థికాద్యనేక స్థితి గతుల పరిపక్వత ప్రధాన భాగస్వామికత్వం వహిస్తుందని మరువకూడదు. సమాజపరంగా ఒక విశాలప్రభావాన్ని నిర్వహించ గలిగిన శక్తులలో రచయితలు ప్రముఖ స్థానంలో ఉంటారు కనకనే - వారిని విశ్వ విద్యాలయంవంటి సంస్థలుగా పేర్కొనడం జరుగుతూంటుంది.

అజ్ఞాతం నుంచి జ్ఞాతానికి

సామాజిక పరిణామంలో సత్ఫలితాలను సత్వరంగా అందుకుందుకు సామాజికుల కర్మణత్వం అవసరం. వ్యక్తులు సామాజిక బాధ్యతలను నిర్వర్తించడమూ అవసరమే. ఈ అవసరాలను సంఘటింప చేయడానికి సముచిత చైతన్యం ప్రధానం. ఈ శక్తి యుక్తులను రచయిత తాను ముందుగా తన హృదయ క్షేత్రంలో సంసిద్ధం చేసుకోవాలి. అంటే తనకు తాను ముందుగా తన అజ్ఞాత

మానసిక లోకాలలో చిన్నదైనా జ్ఞాన జ్యోతి వెలిగించుకోవాలి. దాని కాంతులతో గవేషణ జరపాలి. ఆ అన్వేషణలోనే అతని ఆలోచనలు జ్ఞాత లోకాలకు ఆవిష్కృత మవుతాయి. వస్త్రక్షాళితమై సారభూతాంశాలు లభిస్తాయి.

అనిదం పూర్వమైన పారిశుద్ధ్యాన్ని అందుకుంటాయి. భావనలో అపూర్వ తేజస్సును, అభివ్యక్తిలో అనవద్యతనూ సాధించ గలుగుతాయి. తద్వారా జ్ఞాతలోకాలను స్పర్శించే అతని ప్రభావ రశ్మి విస్తృత పరిధుల నందుకుంటుంది. విస్మృత స్వప్నాలను జాగరిస్తుంది.

స మా జ ప్రే ర ణ

మానవ సమాజంపట్ల అభిమానమూ, మానవతా శక్తుల సమైక్యంపై అభినివేశమూ గలరచయిత తన మనోధర్మ ప్రేరణగా బాధ్యత వహించగలడు. తనంతట తానుగా సామాజిక పరివర్తనకు దోహదం కలిగిస్తాడు. తన సమాజంలో తానొక భాగస్వామి అయినా, ద్రష్టగా లోకవృత్తాన్ని దర్శిస్తున్నపుడు- క్లేశభరిత సమాజం తన కెదురు బదురుగా నిలచినట్లు అనుభవం పొందుతాడు. అట్టి సమాజాన్ని ప్రతిబింబ ప్రాయంగానైనా తన రచనలో చిత్రించక మానడు. ఉన్న స్థితిని చూపుతూనే పొందవలసిన గతినైతం ప్రేరేపిస్తాడు. ఉత్తమ దర్శనం లేని రచయితకు ఉత్తమగతి గమ్యమూ లభించవు.

రచయిత ద్రష్ట అయినపుడు సామాజికుల అజ్ఞానంపై అతని కాగ్రహమేర్పడదు. బిడ్డలపై తల్లికి ఉండే ప్రేమవంటిదే ఉంటితీరుతుంది. బాల్య మనస్థితిలో కొట్టుకుంటున్న సమాజాన్ని దరదీసి బోధించే మమకారం ఉంటుంది. అట్టి మమకారాది అనుభూతులనుంచే, ఉత్తమకళాస్పర్శగల సాహిత్యం ఉద్భూత మవుతుంది. అజ్ఞాన తిమిరంలో కొట్టు మిట్టాడుతున్న జాతికి వెలుగు బాట అందించాలన్న ధ్యేయం ఏర్పడుతుంది.

సరిగ్గా యిలాంటి అభిమానం పుష్కలంగా తమ హృదయాల నిండా ఉన్నందువల్లనే- లియో తాలస్తాయిగాని, రవీంద్రుడు గాని, గురజాడ గాని సామాజికులను ప్రేమతో ఆదరించి నరమాన్నాలను గోరు ముద్దలుగా తినిపించారు.

ముఖ్యంగా మన గురజాడ మహాకవి సమాజాన్ని బాల్య హృదయునిగా పోల్చుకున్నారు కనకనే అంత లాలిమితోనూ, తన సాహిత్యాన్ని రూపొందించాడు. ఎంతో మమకారంగల తండ్రి హృదయం ఉంటే తప్ప - పూర్ణమ్మ వంటి అద్భుత కావ్యం-వ్రాయగలడాయన! అందుకే గురజాడ మహాకవి ఆధునిక సాహిత్యానికి పితృపాదులుగా సముచిత స్థానం సంపాదించుకున్నారు.

గురజాడ దర్శించిన సమాజం 1910 వరకూ నిజానికి బాల్య దశలోనే వుంది. అందుకే ఆ దశలో ఆయన రచించిన కవితలన్నీ బాలహృదయాలకు ప్రభావం కలిగించే రీతిలోనే విరచింపబడ్డాయి. ఆయన స్వీకరించిన ముత్యాలసరం ఛంద స్వరూపం మొదలుకొని, అభివ్యక్తి కొరకెన్నిక చేసిన పదాల వరకూ సరళసుందర రీతికే దోహదం చేసాయి.

పరాకష్ఠ విషయం కూడా ఆయనకు స్పష్టంగా తెలుసు. తన బోధలను అందుకొని పెంపొందవలసినది - బాల్యం వీడని ప్రారంభ యౌవనుల తరమేనని ఆనాడాయన పోల్చుకున్నాడు. ఆ తరమే మరో పది, పదిహేను సంవత్సరాలలో సర్వాంగీణ ఆధునికత్వం అందుకోగలదని ఆకాంతదర్శి అంచనా వేసుకున్నాడు.

రచయిత - సృజనశక్తి

సామాజిక హృదయాన్ని ప్రేరేపించ కలిగేది మౌలికంగా రచయిత సృజనశక్తి. అదే అంతరంగాలను వివశీభూతం చేస్తుంది. వ్యక్తి హృదయ శక్తిగా రూపాంతరం చెందుతుంది. తిరోగమన వాదుల బారిపడి గుడిసుళ్ళు పొందే మంది మనస్తత్వంనుంచి కాపాడుతుంది. జాతిని కదిలించడమూ, నడిపించడమూ తన ప్రాథమిక అవసరంగా మౌలిక సృజన స్వీకరిస్తుంది. వినూత్న అక్షర లోకాలను ఆయత్తపరుస్తుంది. మనోలోకంలో ప్రదర్శిస్తుంది. సామాజిక ప్రబోధం ద్వారా జాతి చైతన్యాన్ని జాగృతం చేస్తుంది.

ఇలాంటి ఉత్తమాశయాలను సాధించాలంటే సృజనాత్మక రచన, కాంతా సమ్మితంగానో, సహృత్ సమ్మితంగానో తన హృదయాన్ని ఆవిష్కరించుకోవాలి. లేదూ కేవలబోధ - బోరుకు పర్యాయ పదమే! కర్మ వాదపు సుడిగుండంలో పడి కొట్టుకు పోకుండా, జాతిని నైరాశ్య తిమిరాలనుంచి కాపాడి, క్రియాశీలత పట్ల ఉత్తేజాన్ని కలిగించాలంటే- సృజనాత్మక రచన శ్రోత

హృదయంలో స్థిరనివాస మేర్పరచుకో గలగాలి. ఈ మన్నిక కళాత్మకత వల్లనే సిద్ధిస్తుంది. అప్పుడే సాహిత్యం సమాజ పరివర్తనానికి దోహదకారి కాగలుగుతుంది.

ఒక ప్రతిభావంతుడైన కవి భావనా స్వరూపంలో నిక్షేపించిన ఆదర్శలోకం - సమాజ బాహ్య వాస్తవికతకు ప్రేరణాత్మక మవుతుంది. సామాజిక పరివర్తనకు అవసరమైన ఆచరణను ప్రోది చేస్తుంది. సామాజికుల మానసిక స్థితితోపాటు అభిరుచి రూపమూ మార్పు పొందుతుంది. సామాజికుల అభిరుచితో పాటు అభివ్యక్తి రీతులూ మారుతాయి. సంవిధానంతోపాటు ప్రబోధాత్మక రీతీ మార్పు పొందుతుంది రీతి మారుతుందేతప్ప ప్రబోధంమాత్రం సార్వకాలిక సమాజ కృత్యంగా స్వీకృత్యంకాక తప్పదు.

సాహిత్యం ప్రధానంగా సృజనాత్మక కళా స్వరూపమే, కనక సాహిత్యం ద్వారా జరిగే ప్రబోధం ఉత్తమోపదేశంగానే వుంటుంది. తద్వారానే సమాజం నిరంతరం మానసికంగా తన్ను తాను పునర్నిర్మించుకుంటూంటుంది. చెడిపోయిన అంగాలను మరామ్మత్తు చేసుకుంటుంది. లేదా పూర్తిగా పైదొలగించుకుంటుంది. ఈ ప్రతిచర్య వల్లనే సమాజ జీవితం వినూత్న సాంస్కృతిక స్థాయిని అందుకుంటుంది. సాంఘిక వాతావరణ పరిసరాలలో పారిశుధ్యాన్ని ఆపాదించుకుంటూ ముందుకు సాగుతుంది.

ఇరవయ్యో శతాబ్దికి ఆయత్తమవుతున్న ఆరంభకాల సమాజాన్ని గురజాడ మహాకవి దర్శించారు. అదే సమాజం గడచిన తొంభయి సంవత్సరాలలో ఎన్నో పరిణామాలందుకుంది. చిర కాలంగా కొనసాగుతున్న ఫ్యూడల్ సామాజిక నీతినీ, దాని కుటిల వర్తనాన్నీ పరిమార్చుకో కలిగింది. ప్రస్తుత సమాజం అనేక సామాజికార్థిక రాజకీయాది భిన్న శక్తుల పెనగులాటతో కళవళ పడుతోంది. ఈ సంఘర్షణ గురజాడ కాలంలో ఇంత స్పష్ట రూపంలో దర్శనమిచ్చే అవకాశమే లేదు. ఆనాటికింకా చిన్న చిన్న జమీందారులు సైతం - మహా భూమండలేశ్వరులుగా తిరుగులేని ప్రశంస లందుకుంటున్నారు. మొత్తం సమాజంపై వారి ప్రభావం ప్రశ్నింపరానిదిగా కొనసాగుతోంది. కాని నేడో - జమీందారుల ప్రభావం అంతరించి, రాజకీయ పెత్తందారీ వర్గం సకల ప్రభావాలూ నెరపుతోంది. అదే పాలకవర్గమై, ఆ వర్గ భావాలే బహు జనుల భావాలుగా సాగిపోతున్నాయి. వేరొక దిశగా అనేక సిద్ధాంతాలు తర్జన భర్జన పొందుతున్నాయి. సంఘర్షణ స్థాయినీ, అందుకుంటున్నాయి. ఈ సంఘర్షణలో రాజకీయ సిద్ధాంతసంఘర్షణ సహజంగానే కీలక పాత్ర వహిస్తోంది. ఇలాంటి మార్పులెన్నో స్పష్టంగానే ద్యోతకమవుతున్నాయి.

ప్రస్తుత సమాజ వ్యవస్థలో - అస్తిత్వానికీ, రూపొంద వలసిన ఆదర్శ స్వరూపానికీ మధ్య సాగే ఘర్షణగా ఇది సహజమైనదే : అంటే స్థితికీ, గతికీమధ్యసాగే ఘర్షణ తప్ప అన్యం కాదిది. ఇది మన సమాజ గర్భంనుంచి ఉత్పన్నమవుతూన్నదే తప్ప-ఎక్కణ్ణించో వైదేశికంగా వస్తున్న గాలిదుమారంకాదు.

ఇట్టి అస్థిమిత పరిస్థితుల్లో రచయిత తనకుతానుగా విధించుకొనే ఆదర్శం ఏమిటి? దాని గతి ఎలా ఉండాలి? అనే ప్రశ్నలు దాదాపు అందరినీ కలవర పరుస్తున్నాయి.

సమాజ ప్రమేయం

రచయితకు గల ప్రమేయం విశాల సమాజం పట్లనే; ఐతే ఈ సమాజం అనేది నిర్దిష్టస్వరూప స్వభావాలులేని బ్రహ్మ పదార్థం వంటిది కాదు కదా : రచయిత సహజంగా మానవతా మూల్యాలనే తన ప్రధాన లక్ష్యంగా స్వీకరిస్తాడు కనుక, అత్యధిక సంఖ్యాకులైన నిర్ధన వర్గాలపై - అల్ప సంఖ్యాకులైన స్వలాభాపేక్ష పరులు జరిపే పీడనపట్ల ప్రధాన ప్రమేయం కలిగి వుంటాడు. తన సహానుభూతిని కేంద్రీకరించుకుంటాడు. అల్ప సంఖ్యాకులే రాజ్యాంగాన్నీ, రక్షకభట వర్గాన్నీ, ప్రచార సాధనాలనూ తమ హస్తగతం చేసుకుని వుంటారు - సాంకేతికంగా బలాఢ్య వర్గంగా రూపొంది వుంటారు. దరిద్ర శ్రేణులను బలహీనులుగా మార్చి తమ ఏలుబడినీ, పలుకుబడినీ కొనసాగిస్తారు. అలాంటి పరిస్థితులలో కవి, రచయితల సానుభూతి సహజంగా బలహీనుల పైనే ప్రసరించక తప్పదు. తమ స్వార్థ సంకుచిత వర్గ ప్రయోజనాలకోసం - విశాల లోకాన్ని పీడిస్తున్న ధనస్వామ్య వర్గాన్ని అభిశంసించకనూ తప్పదు.

ఈ అభిశంసన పరోక్షంగానో, నిర్లిప్తంగానో సాగేది కాదు. పీడిత వర్గంతో మమకారాన్ని భజించక తప్పదు. రచయిత తనకు తానుగా సర్వరంగాలలోనూ దోపిడీకి గురిచేయబడుతూన్న బడుగు వర్గాలకు ప్రతినిధిగా కంఠమెత్తి గర్జించక తప్పదు. ఇది సహజ పరిణామమే తప్ప తెచ్చికోలు వ్యవహారంకాదు. కీర్తి కండూతితో సాగించే లౌక్యమూ కాదు.

ఐతే యిలా రచయిత తాడితవర్గానికి ప్రాతినిధ్యం వహించి కంఠమెత్తితే-సాహిత్యమంతా రాజకీయ కలుషితమై పోతోందని సంప్రదాయ వాదులు గగ్గోలు ప్రారంభిస్తారు. సర్వసాహిత్యమూ వర్గాతీత రమణీయ పదార్థంగా భాసించాలని తిరస్కరిస్తారు. ఇంత విశాల వర్గ భూమికలో తన ఉనికిని నిర్ధరించు కొన్న రచయిత సృజనాత్మక కళాప్రక్రియల ద్వారా తన హృదయాన్ని ఆవిష్కరించుకోవలసినపుడు - సంకుచిత పాక్షిక ప్రయోజనాలకోసం పార్టీ జాన్‌గా గొంతెత్తవలసిన అవసరం వుందా?

నేడు మన దేశంలో పీడితవర్గ ప్రాతినిధ్యమున్నదను కుంటున్న రాజకీయ పక్షాలే భిన్న భిన్న శకలాలుగా విడిపడి వున్నాయి. ఇది ఒకటిన్నర దశాబ్దాలుగా పొడసూపుతూన్న దేశీయ స్థితి. ఇట్టి దశలో రచయితలు సంకుచితంగా ఏదో ఒక రాజకీయ పార్టీవిధానానికే కట్టుబడి, దాని విధానాలనే కీర్తించవలసిన స్థితిలో ఉండాలా? లేక మనిషిని మనిషి దోపిడీ చేసే వర్గరాజకీయాల విశాల ప్రాతిపదికపై తన సృజనశక్తిని కేంద్రీకరించాలా?-అనే ప్రశ్నలు సహజంగానే సాహిత్య రంగాన్ని కలవర పెట్టకతప్పదు.

చిత్తశుద్ధిగల రచయితకు నేడు ఎదురు బదురుగా నిలచిన సామాజికఅరిష్టాలు అసంఖ్యాకాలే. సామాజికులఅజ్ఞానమూ, బాబాలు పూజారులు పురోహిత వర్గమూ సమిష్టిగా కలిగిస్తున్న మూఢవిశ్వాస పరం పరలూ సామాన్యుల పురోగతిని అరికడుతున్నాయి. ప్రజానీకంలోగల నిరక్షరాస్యత సంప్రదాయిక కర్మసిద్ధాంతాన్ని బలపరుస్తోంది. కొత్తగా వెలసిన మానవ దేవతలు పాలకవర్గాన్ని సంరక్షిస్తున్నాయి. ఇలాంటి కీడులన్నీ వర్గదోపిడీని సుస్థిర మొనర్చ కృషి సల్పుతున్నాయి. వర్గాలుగా విడిపోయిన నేటి సమాజంలో, మానవ పీడన అంతరించడానికి సమష్టి క్రియాశీలత కాక వేరే విభూతి మార్గమేదో ఉందన్న భ్రమలు కలిగించబడుతున్నాయి. దీనికి పాలకవర్గం బుద్ధిపూర్వకంగా దోహదం చేస్తుంది. నిజాయితీ విశ్వాసమూ ఉండి కానేకాదు. పరధన, పరప్రాణ, పరదారా హరణోద్యోగులైన నేటి పాలకులకు దైవభక్తి విశ్వాసమూ ఉన్న వంటే అమాయకులు నిజమేననుకోవాలి. రాజకీయంగా చెలామణీ కావడానికే నటన అత్యవసరమని వారికి తెలుసు.

ప్రస్తుత సాంస్కృతిక రంగంలో స్థూలంగానూ, ప్రగతివాద సాహిత్యంలో సూక్ష్మంగానూ నేటి సమాజాన్ని పాలిస్తున్న సకల కశ్మలాలూ చిత్రించబడుతూనే ఉన్నాయి. వాటి ప్రవేశమూ స్పష్టంగా సాక్షాత్కరిస్తున్న దనడంలో సంశయం లేదు. విశాల పీడిత వర్గ సమైక్య సంఘటనకు ప్రాతి పదికలు సాహిత్యంద్వారా ఆవిష్కృతం కావడంలేదు. వ్యక్తిగత అనుచర వర్గాన్ని పెంపొందించుకోవాలన్న రాజరిక ధీరోదాత్త నాయక లక్షణాలు ప్రఖ్యాత రచయితలలో మితిమీరి పోతున్నాయి. అవినీతి, అబద్ధమూ, మోసమూ వంటివి పరాకాష్ఠకు చేరుకుంటున్నాయి.

పాలకవర్గ దుర్నీతులు

పాలకవర్గ దుర్నీతులు, వ్యక్తిగతమైన హుందాతనాలు, వక్రసిద్ధాంతాలు, దుర్లక్షణాలు వంటివన్నీ నేటి పాలిత వర్గ బాహుళ్యంలో పాతుకుపోయి బలపడుతున్నాయి. వక్రమార్గాలు ఆరాధ్యాలవుతున్నాయి. ఈ వైలక్షణ్యంతో వర్తమాన చరిత్ర ఒక కొత్త మలుపు తిరిగింది. సోమరితనమూ, ధనార్జనా సులభ మార్గాన్వేషణ, సార్వత్రిక లక్షణాలుగా ద్యోతకమవుతున్నాయి. ఒకడు పీడిత వర్గానికి వస్తుతః చెందినవాడైనా తానూ చేయగలిగినంత దోపిడీ చేయడానికి వెనుకాడ్డం లేదు. పైగా ప్రస్తుత నీతిగా పరిగణిస్తున్నాడు. సమాజంలో పేరుకుంటున్న ఈ అరిష్టాలు మేధా హృదయంపై తమ దుష్ప్రభావాన్ని ప్రసరించక విడువడంలేదు.

ఇట్టి సంధిగ్ధావస్థలో నిర్దిష్ట శాస్త్రీయసామ్యవాద ఆదర్శాలు గల రచయితల కర్తవ్య మేమిటి? అనైక్యం, అభిప్రాయ వైవిధ్యం రచయితలను శత్రుకూటాలుగా విడదీస్తుంటే చూస్తూ ఊరుకోవడమేనా కర్తవ్యం?

అందుకే ఆధునిక రచయితలంతా ఒక్కసారి ఆగి ఆలోచించాలి. చిత్తశుద్ధితోనూ, హృదయ పారిశుధ్యంతోనూ ఆత్మవిమర్శ చేసుకోవాలి. అలాంటి పరీక్షాసమయానికి మన ఆధునిక సాహిత్యం చేరుకున్నదని విశ్వసిస్తున్న ద్రష్టలలో ఈ వ్యాసకర్త ఒకడు.

మన వెలుగు జాడ

ఆధునిక సాహితీ జనకుడైన గురజాడ - నవమానవీయ మహోద్యమాన్ని ప్రారంభించాడు. దానికోసమై ఆయన ఆధునిక సాహితీ స్వరూపాన్ని నిర్ణయించాడు. ఆయన అందించిన వెలుగు జాడ గత తొమ్మిది దశాబ్దాలలోనూ, ఎన్నో అకుంఠిత విజయాలను సాధించింది. దారిలో సంభవించిన అపజయాలూ లేకపోలేదు. కనకనే మనం - సాధించవలసిన విజయాల గురించి త్రిశుద్ధిగా అంచనాలు వేసుకోవాలి. ఆధునిక రచయితలంతా బాధ్యతతో వ్యవహరించి వక్రమార్గాలన్నిటినీ ఛిన్నాభిన్నం చేయాలి. ఆగామి తరాలకు ఉత్తమ మార్గనిర్దేశకులం కాగలగాలి.

ఇన్ని సంవత్సరాల అవిరళ కృషిలో సైతం మనజాతి, ఇంకా పీడిత వర్గాల మూఢవిశ్వాసాల దుర్గమ దుర్గ ద్వార బంధాలను తట్టవలసే ఉన్నామన్న ప్రాథమికావసరాన్ని మరచిపోకూడదు. వస్తుపరంగా విశాల ప్రజానీక స్థితి గతులను పరిశీలిస్తే ఈ సత్యం బోధపడక మానదు. శాస్త్రీయసామ్యవాదులు సైతం- మూకుమ్మడి అవగాహనలకు లోనై ఆత్మాశ్రియధోరణికి గురికావడం దురదృష్టమే!

అశేష పీడితవర్గం తమ నిత్య నైమిత్తిక బాధా పరంపరల నుంచి విముక్తి సాధించడానికి, సమష్టి కృషిపై ఆధారపడలేక పోతున్నారు. ఇతరేతర సులభమార్గాల గోసాయి చిట్కాలను అన్వేషించే దురవస్థ నేటికీ పైదొలగిపోలేదు. ఈ సత్యసందర్శనానికి చిత్తదీప్తి ఎంతో అవసరం!

వ్యష్టి - సమష్టి :

సందిగ్ధ యోచనా మార్గాలు సర్వత్రా సంసిద్ధమై వున్నాయి. విశాల వర్గ స్వభావంగల రచయితలు, వర్గ శత్రు విమోచనం - వ్యక్తి నిర్మూలనం ద్వారానే సాధ్యమని ఎలా ప్రబోధించగలుగుతున్నారో అర్థంకాదు. కవిత్వం విప్లవాత్మక వీరావేశంతో శివమెత్తడం ఆత్మాశ్రయ నైరాశ్యంకాక మరేమిటి? అనే ప్రశ్న ఉదయించడమేలేదు. ఇలా విషమ పరిస్థితులు కళ వళ పడుతున్న ఈ అంతర్దశలో మనం జీవిస్తున్నాం. ఇట్టి స్థితిలోనే - ఇరవై ఒకటో శతాబ్దం వచ్చి మన తలుపులు తోసుకుంటూ ప్రవేశించడానికి సంసిద్ధంగా ఉందని మరచిపోకూడదు.

సమాజ చైతన్యమూ, వర్గ చైతన్యమూగల సాహితీ ద్రష్ట ఈ దశలో తన కంఠస్వరాన్ని ఏ దిశగా ప్రసరించాలన్న ప్రశ్న సహజంగానే కలవర పెట్టక మానదు. మన జాతిలో అత్యధిక సంఖ్యాకుల బిడుపుల్ని, కరువుల్ని, దుర్భర యాతనల్ని తొలగించి మానవతా మూల్యాలతో లోకాన్ని మరింత వాసయోగ్యంగా పునర్నిర్మించే సత్వర మార్గాన్ని సమష్టిగా అన్వేషించకనూ తప్పదు.

విశాల లోకపు పీడనా రాహిత్యానికి మనమంతా స్థిరమైన బాధ్యత స్వీకరించక తప్పదు. మంది జనాల చైతన్యాన్ని కదిలించి, ఆగామిలోకానికీ కాలానికీ సమాజాన్ని ఆయత్తంచేయలేని రచయిత- ప్రస్తుత కాలంలో రచయిత కానేకాదు. అక్షరాల వర్తకుడో, కుక్షింభరుడో కాగలడు. ఈ సత్యాన్ని జ్ఞాపకం చేసుకొని ముందుకు పురోగమించక తప్పదు.

ప్రపంచ మానవజాతి మన కన్నులముందే అపూర్వ విజయాలెన్నో సాధిస్తోంది. శాస్త్రీయంగా, సాంకేతికంగా మునుపెన్నడూ ఎరుగని నూత్నలోకాలను స్వాధీన పరచుకుంటోంది. మన శతాబ్దం వినూత్న సత్యాలనెన్నో సాధించింది. చీకటికోనలలో సైతం మానవుడు గాఢ నిద్రనుంచి మేలుకొని, జూలుదులిపి గర్జిస్తున్నాడు. లోకమంతా యథాతథంగా తమ స్వాధీనహక్కుభుక్తంలో సాగాలనుకొనే సామ్రాజ్యవాద నీతికి కాలం చెల్లింది.

ఈ యథార్థాలను గమనిస్తూనే కొందరు మేధావులు తిరోగమన వాదులుగా తయారవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రపంచ మానవ చరిత్ర ప్రతి రచయిత ముందుకూ వచ్చి నిలచి, భవిష్యత్తుకు ఏది దారి అని ప్రశ్నిస్తోంది! సావధాన చిత్తంతో మనమంతా ముందుదారి వెతుకక తప్పదు! పురోగమించకనూ తప్పదు మనం కదలక పోయినా లోకం తన దారినది ముందుకుసాగి పోతుంది.

వెలుగు వరద

శ్రీ శశికాంత్ శాతకర్ణి

రాత్రుల కెప్పుడూ కలతనిద్రే
అందుకే అవి పాత భయాలను
మళ్ళీమళ్ళీ నెమరువేసుకుంటాయి !

పునరావృతమయ్యే దుస్వప్నాలతో
ఉలిక్కి పడతాయి !

కాని రాత్రి గర్భంలోనుండే
హఠాత్తుగా నవ్యోషస్సు మేల్కొంటుంది !

అప్పుడు కాలం పెండ్యులం నెమ్మదిగా
వేగాన్ని పుంజుకుంటుంటే
వీధులన్నీ వెలుగువరదతో నిండుతాయి !

కలకూజితాలతో గాలి ప్రాణం పోసుకుంటుంది
నేలలో మత్తుగా నిద్రిస్తున్న విత్తనాలు
హఠాత్తుగా మొలకెత్తుతాయి !

పెద్దపెట్టున ఒక్కసారి వినిపించే
బేండు మేళంలా మొగ్గలు విచ్చుకుంటాయి !
చీకటిలో ఊపిరిబిగపట్టిన నీడలు
వెలుగులో కరిగిపోతాయి
మృదుల ఉదయహృదయం
ప్రతవస్తువు ముఖంపైన మెరుస్తుంది !
పాకుతున్న ఎండసి తాగే ఆకులు
ఆనందంగా ఒళ్ళు విరుచుకుంటాయి !
హేంగర్ కి నిర్జీవంగా వ్రేలాడే నా బట్టలు
మరికొద్ది సేపటికి నా దేహంపై వ్రేలాడతాయి !
నా దేహాన్ని, నా వేదనల్ని, నా అలవాట్లని
నా బట్టల్ని, నా నన్నును పోగుచేసుకొని
తిరిగి నేను దినకాంతిలోకి ప్రవేశించాలి !
ఉదయం బాటవెంట పయనించాలి !!

శ్రీ కల్లూరి సత్య రామప్రసాద్

కవిరాజు త్యాగరాజు

త్యాగరాజస్వామిని వాగ్గేయకారుడిగా ఎరుగని తెలుగువాడు ఉండడు అనడం అతిశయోక్తికాదు. సుమారు అరువందల కృతులనే గాక, నౌకా చరిత్రము, ప్రహ్లాద భక్తివిజయము అనే సంగీత రూపకాలను కూడా ఆయన రచించాడు.

త్యాగయ్యను గురించి వేరే చెప్పాలా? ముంజేతి కంకణానికి అద్దం ఎందుకు? అని చాలా మందికి అనిపించవచ్చు. అయితే దురదృష్టవశాత్తు ఎంతోకాలం ఆయన గురించి చాలామంది తెలుగువాళ్ళు పట్టించుకోక పోవడం వలన, గాయకులు సాధారణంగా ఆయన వ్రాసిన పాటలలో "త్యాగరాజనుత" అనే మకుటం ఉన్న చివరి చరణాలు మాత్రమే పాడి వూరుకోవడం వలన, ఆయన సాహిత్యం, అందులో అంతర్గతంగా ఉన్న ఆయన కవిహృదయం రసజ్ఞులకు సరిగా అందుబాటులో లేవనే సత్యాన్ని ఒప్పుకోక తప్పదు.

వాగ్గేయకారులది నిబంధప్రక్రియ. తాము చెప్పదలచుకున్న విషయాన్ని ఒక కృతిలో తగినన్ని దృష్టాంతాలతో పల్లవి, అనుపల్లవి, చరణం అనే విభాగాల్లో ఇమిడ్చి వాళ్ళు చెప్పడం జరుగుతుంది. అన్నమాచార్యులు, శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితర్ వంటివారు కూడా త్యాగరాజువలెనే ఈ పద్ధతిని అవలంబించారు.

కవిత్వానికి ముఖ్యలక్షణాలైన రసపుష్టి, ఆలంకారికత, జిగిబిగి, చక్కని ఇతివృత్తం, కల్పనా చాతుర్యం అనే అంశాలు ఇటువంటి కృతులలో కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎటొచ్చీ ఏ పాటకు ఆ పాట విడివిడిగా ఉంటుంది. "వాక్యం రసాత్మకం కావ్యం" అని నిర్వచింపబడినపుడు, రసాత్మకమైన ఒక్కొక్క కృతినీ ఒక్కొక్క కావ్యంగా పరిగణించడంలో అభ్యంతరం ఎందుకు వుండాలి?

త్యాగయ్యకు రాముడితోటిదే లోకం గనుక, రాముణ్ణి ప్రధానంగానూ, ఇతర దైవాలను సకృత్తుగానూ మనసులో ఉంచుకుని వివిధ రాగాలలో ఆయన కృతులను రచించాడు. ఒక యోగిలాగ ముక్కు మూసుకుని పోక, జనరంజకంగా పాటలను వ్రాశాడాయన. సందర్భోచితంగా ఆయన తన శిష్యగణంతో వాటిని పాడుకుంటూ ఉంఛవృత్తిని అవలంబించి దినములు గడుపుతూ వుండడంవలన ఆ కృతులు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. తన మనసును హెచ్చరించుకుంటూ, రాముడి సామీప్యాన్ని కోరుకుంటూ, ఆయన్ని పొగడుతూ, ఆయన్ను సేవించిన భక్తుల అదృష్టానికి మురుస్తూ, ఈ కలి కాలాన్ని తిడుతూ విసుగొచ్చినపుడు దేవుణ్ణి చమత్కారంగా నిష్ఠూరమాడుతూ-ఈ విధంగా వైవిధ్యం గల కృతుల నెన్నింటినో ఆయన రచించడం జరిగింది. వీటిల్లో చాలా కృతులు ఆశువుగా ఆయన నోటి వెంబడి వచ్చినవని ప్రతీతి.

ఈ పాటలను మచ్చుకి అచ్చటచ్చట కొన్నింటిని చూస్తేనే చాలు-కండ చక్కెరను తలదన్నే తెలుగు నుడికారపు సొంపు, ఊహాశక్తి, సన్నివేశ వర్ణన, పొగరుబోతు పాలకులపై ఆయన గల ఏవగింపు, సగటు మానవుడి సంసార తాపత్రయం మీద ఆయన విసుర్లు, ఛలోక్తులు, నిరాడంబర జీవనం, ఉత్కృష్ట చింతన - అనగా సింపుల్ లివింగ్ ఎండ్ హై థింకింగ్ - ప్రాతిపదికగా జీవించమని ఆయన ప్రజలకిచ్చే సందేశం - ఇలాంటి వెన్నో మనకి కనిపిస్తాయి.

ముందు ఆయన ఊహాచిత్రాలను కొన్నిటిని గమనిద్దాం.

"నీలమణినిభ తనువులో-ఉరమున ముత్యపుసరులచయముతో-కరమున శరకోదండ కాంతితో - ధరణి తనయతో"

కోదండ రాముడే సాక్షాత్కరించిన దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపెట్టాడు ఆయన "నను పాలింప నడచి వచ్చితివో" అనే కృతిలో.

"చండమార్తాండ మధ్యమండలమునను చెలంగుచు-ఉండేది రాముడొకడు-ఊరక చెడిపోకు మనసా" అంటూ గ్రహమండలానికి ఆధారభూతమైన సూర్యుడికే రాముడు కేంద్రం అన్నాడాయన.

"అలక లల్లలాడగ గని ఆ రాణ్ముని ఎంత పొంగెనో" అంటూ "మారీచుని మదమణచే వేళ", "శివధనుర్భంగ సమ

యాన" రాముడి ముంగురుల కదలికలోని అందాన్ని తెలియ జెప్పాడు.

"స్వరములు ఆరౌక గంటలు-వరరాగము కోదండము-నిరతగతిశరము-సరళ సంగతి సందర్భములు గలగిరములు" అని కోదండరామణ్ణి మూర్తీభవించిన నాద సుధారసంగా అభివర్ణించాడు.

సీతార మణితో ఓమన గుంటలాడి గెలుచుటచేత ఒకరి నొకరు చూచుచు ప్రేమతో పలుక్కుచున్న ముచ్చటను కూడా ఆయన ఊహించాడు.

ఇక శబ్దాలంకార ప్రయోగాలకొస్తే మొట్టమొదట ఉదాహరించవలసినది ఆరాభారాగంలో ఉన్న "అనుపమ గుణాంబుధీ" అనే కృతి.

"మనుపకె యున్నావు మనపతీ వ్రాసి మేననుప మాకెవరు"

"కనకపట ధర కనకపటమేల తనుకనక పరనము చేతు"

అనే వాక్యాలలో ఎక్కడా అర్థం చెడకుండా యమకాలంకారాన్ని వాడాడు.

"కొనియాడే నా యెడ-వెలకు కొని ఆడేవు సుమీ రామా" అనే కృతిలో 'కొనియాడు' అనే శబ్ద పల్లవాన్ని చమత్కారంగా విడగొట్టాడు ఆయన.

"గ్రహ పీడల - పంచ పాపముల - అగ్రహములు గల కామాది రిపుల - నిగ్రహముచేయు - హరిని భజించే త్యాగరాజునికి-రసికాగ్రేసరులకు - గ్రహబలమేమి - శ్రీ రామానుగ్రహ బలమే బలము అన్నాడు. ఇందులో ఉన్న అనుప్రాసలను గమనించండి.

మరో కీర్తనలో మనసును మందలిస్తూ ఇలా అన్నాడు - "రామనామము చేయ సిగ్గా - ఏమి పల్కవు పంటి బిగ్గా - భావజలకడ దాటను మంచే జగ్గా - పామర తనువు నీర్బుగ్గా" ఇలాంటి అంత్యప్రాసలు ఆయన కృతులలో కోకొల్లలుగా ఉన్నాయి.

ఇక తెనుగు నుడికారం, సామెతలు, జాతీయాల ప్రయోగం, దృష్టాంతాలు మొదలైన వాటిని కొన్నింటిని చూద్దాం.

అనురాగములేని మనసున సుజ్ఞానము రాదు. భామ
మరువంపు మొలక
అంబలి తినువేళ అమృత మబ్బిన రీతి
ఆడబోయిన తీర్థ మెదురైన రీతి

అంగము మూయని బాలురు దిగంబరులా?

సోమిదమ్మ సొగసుగాండ్రను కోరితే
సోమయాజి మోక్షార్హుడౌనా?

కాకరకు జీలకర సంబారకు అంతరమైనట్లు
సారమౌ కవితల విని వెర్రివాడు సంతోషపడి ఏమి పడక ఏమి?

వృష రాజులకు అటుకుల రుచి తెలియు చందము

చుట్టి చుట్టి పక్షులెల్ల చెట్టు వెదకు రీతి.

ఏరు నిండి పారిన పాత్రకు తగునీరు వచ్చు.

గణనాథుని చేయగోర కడు వానరుండై తీరెగా

తన తనయ ప్రసవవేదన కోర్వలేకుంటె
తనదు అల్లునిపై అహంకార పడనేల?

మన పూర్వీకులచే శృంగారం రస రాజం అని అంగీకరింపబడింది. అయితే త్యాగయ్య ప్రత్యేకత ఏమిటంటే - హద్దుమీరిన శృంగారం వెతుకుదామన్నా ఆయన కృతుల్లో దొరకదు. వీర, శాంత, కరుణ రసాలకు ఆయన ప్రాధాన్యత ఎక్కువగా ఇచ్చాడు.

పద ప్రయోగంలో ఆయన వ్యాకరణ సూత్రాలను అవసరమని తోస్తే తోసి రాజన్నాడు. ఒక పత్నీవ్రతుడు, శునకపిల్లలు, బంటుడు, నిజదబ్బరలు, నిత్యానందుడైతి- మొదలైన సమాసాలు ఆనాటి లాక్షణికులకు అబ్బురంగా తోచి ఉండవచ్చునేమోగానీ, ఈనాడు ఇటువంటి ప్రయోగాలు మనకు క్రొత్తకాదు.

ఆయన వ్రాసిన కృతులలో సంస్కృత కృతుల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. అయితే అది సులభ గ్రాహ్యమైన సంస్కృతం. వర్ణనా ప్రధానమైన కవిత అది. నారాయణ తీర్థుల వారి తరంగాలవలె ద్రాక్షాపాకం. వీటిలో ముఖ్యంగా పేర్కొనవలసిన సొగసైన కృతులలో కొన్ని

1. హిందోళ రాగంలో	"సామజ వరగమన"
2. కాంభోజి రాగంలో	"మహిత ప్రవృద్ధ"
3. ఖమాస్ రాగంలో	"సుజన జీవన"
4. చిత్తరంజని రాగంలో	"నాదతనుమనిశం శంకరం"
5. ఝంకార ధ్వని రాగంలో	"ఫణితిశాయీ, మాంపాహి"

ఇక ఆయన వ్రాసిన ప్రహ్లాద భక్తి విజయము, నౌకా చరిత్రము అనే సంగీత రూపకాల గురించి.

ఈ రెండింటిలోనూ ఉత్పలమాల, సీసము మొదలైన ఛందస్సులను ఆయన వాడినా రాగ తాళ ప్రధానమైన కృతులే వాటిల్లో ఎక్కువగా ఉన్నాయి.

ప్రహ్లాద భక్తి విజయంలోని ఇతివృత్తం అందరికీ తెలిసిందే. "శ్రీ గణపతిని సేవించరే", "పవమాన సుతుడు పట్టు పాదార విందములకు" అనే సౌరాష్ట్ర రాగంలోని కృతులు ఈ రూపకం లోనివే.

గోపికా స్త్రీల సౌందర్య గర్వాన్ని బాలకృష్ణుడు ఎలా అణగగొట్టాడు అనే కథా వస్తువుతో నౌకాచరిత్రం రచింపబడింది. 'గంధము పూయరుగా' అనే పున్నాగ వరాళి రాగకృతి, 'ఓడను జరిపే ముచ్చట గనరే' అనే సారంగ రాగ కృతి ఈ రూపకంలో ముఖ్యంగా పేర్కొన దగ్గవి.

కవితకు ఈనాటి కొలబద్ద అయిన సామాజిక స్పృహను తీసుకుంటే దానికి ఆకాలంలోనే త్యాగయ్య ఒరవడి పెట్టాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

రాజు అనే వాడు ఎల్లాగుండాలో ముఖారి రాగంలోని "కారుబారు చేయువారు కలరె నీవలె" అనే కృతిలో వర్ణించాడు.

"ఊరి వారు, దేశ జనులు, వరమునులు ఉప్పొంగుచు భావుకులయ్యే వారట; నెలకు మూడు వానలు కురిసేవి. జనులు గర్వం లేకుండా ఉండేవారు."

నేటి మన పాలకులకు ఈ కృతి ఒక హిత వాక్యం.

తన చుట్టూ ఉన్న మనుష్యుల ప్రవృత్తిని త్యాగరాజుగారు ఎంత సునిశితంగా పరిశీలించాడో చూద్దాం.

ఎదటి పచ్చ చూసి తాళలేకపోయేవాళ్ళు,

వేళ్ళు మూసి భూతి పూసి వెలికి శ్లాఘనీయులైన వాళ్ళు,

పుట్టు లోభులను బొట్టకై పొగిడేవాళ్ళు

బుద్ధి అనే తల్లిని విషయ విటులకు వప్పజెప్పే సిద్ధులు,

శివాలయానికి వెళ్ళి, 'హాటక సమంబైన అద్భుతాకృతిని' తిలకించడం మరచిపోయి గోపురాలను, వయ్యారి భామలనుచూస్తూ, చుట్టు ప్రక్కల వాళ్ళను ఆడిపోసుకునే వాళ్ళు-

ఇలాంటి రకరకాలైన జనుల వికృత స్వరూపాలను చూపెట్టాడు ఆయన. అందుకే ఇటువంటి రాజస తామస గుణములు కలవారి చెలిమి కలిసి మెలిసి తిరుగుతూ కాలము గడపక సులభంగా కడతేరడానికై భావుకమగు సాత్త్విక భక్తి బిచ్చమీయమని రాముణ్ణి వేడుకున్నాడు. రాముడి సద్భక్తి కల్గుటే పదవిగా భావించాడు.

మరో కృతిలో పేర్కొన్నట్లుగా-సత్యము తప్పక-సకల లోకులకు భృత్యుడై-దైవ భేదములేక-నిత్యమైన సుస్వరగానముతో-రామనామగానం చేసిన సుఖి మరెవ్వరో కాదు, త్యాగరాజ కవిరాజే.



శ్రీ వుప్పల లక్ష్మణరావు

బ్రౌణ్యం నాటి వ్యవహారికం నేటి వ్యవహారికం

బ్రౌణ్యం సంకలనం 1853 లో జరిగింది. బ్రౌన్ దొర మదరాసు సివిల్ సర్వీసు ఉద్యోగిగా ఉంటూన్నప్పుడు అక్కడి పండితుల సహాయంతో సంకలనంచేశాడు. ఆయన మద్రాసు, కడప, బందరు, రాజమహేంద్రవరం పట్టణాలలో ఉద్యోగం చేశాడు. ఆయన ఏ పట్నంలో ఉద్యోగం చేసినా అక్కడ పండితుల సహాయాన్ని పొందాడు. అట్టి పండితులలో ముఖ్యులు రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు, జూలూరు అప్పయ్యశాస్త్రిగారు, వఠై అద్వైత బ్రహ్మశాస్త్రిల వారు. దురదృష్ట వశాత్తూ శ్రీ కొత్తపల్లి వీరభద్రరావుగారు రచించిన 'బ్రౌన్ దొరగారి జీవితం' నాకు లభ్యం కానందున పై పండితులు యే యే ఊరివారో నాకు తెలియడం లేదు. అయితే వారి పేర్లనుబట్టి గురుమూర్తి శాస్త్రిగారు సర్కారు జిల్లాల వారనీ, జూలూరువారు కృష్ణాజిల్లావారని, వఠైవారు చెన్నపట్నం వారనీ మనం ఊహించుకోవచ్చు. ఈ విధంగా ఆంధ్ర దేశంలో ఆయా ప్రాంతాల పండితుల సాయం పొందటంచేత ఆ ప్రాంతాల నానుడులనే బ్రౌన్‌గారు తమ నిఘంటువులో పొందుపరిచారు. అయితే గ్రంథ పూర్వార్థంలో "పరశురామప్రీతి" అన్న పదబంధం రాజమహేంద్రవరం, కృష్ణాజిల్లాల్లో వ్యవహారమున నున్న మాట- అని రిమార్కు రాశారు (పుట 293), తర్వాతి భాగంలో మరొకచోట ఈ పదబంధాన్నే వాడుతూ ఈ రిమార్కు రాయక పోవడాన్నిబట్టి ఈ భాగము రాజమహేంద్రవరం, బందరులోనే రాసినట్టు కనబడుతుంది.

ఆ కాలంలో చెన్నపట్నంలో ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న దొరలకు దేశ భాషలలో తర్ఫీదు యివ్వడం కోసం కోటలో "మదరాసు కాలేజీ" అని పాఠశాల ఉండేది. ఆ పాఠశాలలో తెలుగు బోధించే పండితులు తెలుగు అధ్యయనం చేసిన తమిళ పండితులు ఉండటం సహజం కదా! ఈ కారణంచేత బ్రౌణ్యం తొలి భాగాలలో చెన్నపట్నం నానుడి, అరవ నుడికారమే కాకుండా, పూర్తి అరవ పదజాలం కూడా అక్కడక్కడ కనబడుతుంది. నేను బ్రౌణ్యం చదవడానికి ప్రారంభించిన తొలుదొల్త చేయుట, చేసుట అనే ధాత్వర్థక క్రియారూపాలు కనపడగానే తబ్బిబ్బయిపోయాను. ఎందుకంటే చేయుట అనే రూపమే మనకు గ్రంథాలలో కనిపిస్తుంది గానీ చేసుట అనే రూపం కనపడదు. 'చేయుట' అనే క్రియా రూపంలోనుండి చేయుచున్నాను, చేయుచున్నాడు, అని క్రియా రూపాలు వస్తున్నాయి. 'చేసు' అనే ధాతువు నుండి చేస్తున్నాను, చేస్తున్నారు, చేస్తారు అనే రూపాలు రావడం స్వతః సిద్ధమే కదా! అంటే ఆనాడు చేయుట, చేసుట రెండూ శిష్ట వ్యవహారం లోనివే! చిన్నయసూరిగారు ఇరవై రెండో సూత్రంలో తెస్తాడు, వస్తాడు మొదలయిన పదబంధాలు భాషా ప్రయోగంబున కనర్హంబు అని సూత్రీకరించారు. ఈ సూత్రం బ్రౌన్ నిఘంటువు రాసినప్పటికే కాకుండా, అంటే సుమారు శతాబ్దన్నర కిందటా, నేడూ చెల్లదు. చేస్తాడు, వస్తాడు, తెస్తాడు ప్రయోగాలు శిష్టవ్యవహారికంబులు అనడానికి చూడు ఆర్డెన్ తెలుగు వ్యాకరణము (1921) పుట 103. అయితే ఆర్డెన్‌గారి వ్యాకరణం ప్రథమ కూర్పు బందరులో విరచితమై 1873 లో ప్రచురితమైంది. అంతే గాకుండా వచ్చాను, వచ్చుంటిరి, వచ్చుంటివి, అనే రూపాలన్నీ కూడా నేడూ, నాడూ శిష్టవ్యవహారికములే! వచ్చుంటిరి అన్న ప్రయోగం చిన్నయసూరిగారి క్త్వార్థక యికారమ్మునకు సంధిలేదు అన్న సూత్రానికి వ్యతిరేకమే అయినా శిష్టులు నేడు వ్యవహరిస్తూనే వున్నారు. ఈ సందర్భంలో మరొక్క మాట. వచ్చుంటిడి అనే క్రియాపదం శిష్టవ్యవహారికమే అయినా శిష్టీకరణాలు (తెలుగు పట్నాయక్‌లు) వాడుక చేసే మాటే అని కొందరనవచ్చును. కానీ "వాడు ఉంటిడి" అన్న క్రియా పదాన్ని నేను మన ఊర్లోనే శిష్టులు వాడగా అనేకసార్లు విన్నాను. (చూడు బ్రౌన్ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు పుట 148).◆

బ్రౌన్ యింగ్లీషు తెలుగు నిఘంటువు 1367 పేజీలు. పేజీకి రెండు కాలములు. సగటున 16 ఆరోపాలతో, కాలమునకు 43 పంక్తుల చొప్పున బృహత్ గ్రంథం అయింది. యింత ఉద్గ్రంథంలోనూ కంట్లో ఒత్తులు పెట్టి వెతికినా అరసున్న గానీ, బండి ర గానీ ఒకసారైనా కనబడలేదు. ఆనాడు అవి లేకపోతే తెలుగు భాష భాషే కాదని అనే పండితులు లేకపోలేదు. శకటరేఫ ఎప్పుడొచ్చిందో ఎవరూ నిర్ధారణగా చెప్పలేరు. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో ఈ అక్షరాన్ని పోలిన ఒక్క అక్షరం వుంది. దాని ఉచ్చారణ తమిళంలో 'ష' అనే శబ్దానికి దగ్గరగా వున్న శబ్దం అని అంటారు. ఆనాటినుండి బండి ర మన భాషలో చోటు చేసుకుంది. ఈ అక్షరం సంస్కృతంలో లేదు. కానీ సోదరభాషైన అరవంలో వుంది. అప్పకవీయంలో అప్పయ్య దీక్షితులు శకటరేఫంతో ఉన్న పదాల పట్టిక యిచ్చాడు. అయితే అతనే రచించిన ఒక పద్యంలో లఘురేఫ శకటరేఫ స్థానమందు వాడాడని ప్రతీతి. బండి ర కేవలం ఉచ్చారణ సంబంధమైంది. సిద్ధానుస్వారం, సాధ్యానుస్వారం అని రెండు విధాలు గదా! సిద్ధానుస్వారం శిష్టజన వ్యవహారికం నాడూ కాదు, నేడూ కాదు. అంతే కాకుండా ఎక్కడ అరసున్న వాడాలో వ్యాకరణ కర్తలు కూడా చెప్పలేరు. బ్రౌన్ గారికి సాయంచేసిన రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు వ్యాకరణ కర్తలు. మిగిలిన శాస్త్రులవారు కూడా బండి ర, అరసున్నలను వాడుక చేయక పోవడానికి కారణం అవిలేని పదాలు, పద బంధాలు శిష్ట వ్యవహారికములు అవడమే! బ్రౌన్ గారు యింగ్లీషు - తెలుగు నిఘంటువును ప్రచురించకముందే, ఆయన తెలుగు - యింగ్లీషు నిఘంటువును రచించి ప్రచురించారు. అందులో కూడా ఆయన బండి ర ని గానీ, అరసున్ననుగానీ ప్రయోగించలేదు. అవిలేని భాష శిష్ట వ్యవహారికమే అయినప్పటికీ, ఆ నిఘంటువు ఆనాటి పండితుల ఆదరణ పొందలేదు.◆ అయినప్పటికీ బ్రౌన్ గారు తరువాత ప్రచురించిన యింగ్లీషు తెలుగు నిఘంటువులో యివి లేకపోవడం వల్ల అవిలేని భాష ఆనాటికే శిష్ట వ్యవహారికం అని మనం అంగీకరించక తప్పదు. ఈ దశాబ్దన్నర కాలంలోకూడా శిష్టులు వీటిని పలకడమూ లేదు. రాయడమూ లేదు. బ్రౌణ్యంలో తమిళ భాషా ప్రభావం వున్నట్టు మొదటే చెప్పాను. అందుకు ఉదాహరణలు, అనేకచోట్ల కొట్టివేసుట, తోసివేసుట అని వాడేరు. మనం తీసివేయుట, కొట్టివేయుట అని అంటాం. అలాగే అనేకచోట్ల నిండా అని పదం ప్రయోగించేరు. చెన్నపట్నం భాషలో నిండా అనే పదానికి పూర్తిగా, బాగా మొదలైన అర్థాలున్నాయి. మన వాడుకలో పూర్తిగా, నిండుగా.

ఉదా: 'చెంబులో నీళ్ళు నిండా వున్నాయి' అని మన వాడుక. 'కాఫీ కప్పు నిండా వుంది' అని మనం వాడినప్పుడు కాఫీ కప్పు అంచునిండా వుంది అనే అర్థంలో వాడుతున్నాం. మరో ఉదాహరణ 'యిసుక నీళ్ళను యీడ్చు కున్నది'; 'కాగితము సిరాను యీడుకన్నది' మనము యింకి పోయింది అంటాం. మరొక ఉదాహరణ: 'తాళిమి' అనే పదం, అనేకసార్లు వాడారు. మనలో 'ఓరిమి' అన్నది శిష్ట వ్యవహారికము. మరొక తమిళనానుడి "పోయివాడు" తమిళంలో పోయినాడు (= పూటారు, వెళ్ళిపోయినాడు అని అర్థం) మన నానుడిలో చనిపోయినాడు అని అర్థం. అరవ తెలుగులో యిదే అర్థంతో పూడ్చినాడు అని కూడా వాడుకలో ఉంది. మన వాడుకలో పూడ్చి పెట్టడము అంటే సమాధి చేయడం అని అర్థం. ఈ పదబంధం బ్రౌణ్యంలో అంతగా కనిపించలేదు. బ్రౌన్ గారు వాడుకచేసిన మరో తమిళ పదబంధం "వేసిపెట్టుట."

ఉదా: 'వాడు నేలను వృధాగా వేసిపెట్టినాడు' (పుట 9)

అప్పుపెట్టి పోయినాడు ఈ పదబంధం అనేకచోట్ల మనకు తటస్థ పడుతుంది; 'చుట్టి వచ్చినాడు' అనేది మరొక పదబంధం. ఉదా: వాడు రాత్రింతా చుట్టివచ్చినాడు (అఁవా సుత్తివందారు). మనం 'తిరిగి తిరిగి వచ్చినాడు' అనగా షికారు కొట్టి, వ్యర్థముగా ఊరికే తిరిగి వచ్చుట అంటాం. ఈ పదం కూడా బ్రౌణ్యంలో అనేకసార్లు తటస్థ పడింది. బ్రౌణ్యంలో తరచుగా కనబడే నానుడి పల్లెకూటము. అనగా తెలుగులో బడి, స్కూలు అని అర్థము. అరవంలో పల్లెకూడము అని నానుడి. ఇలాగే పిల్లకాయలు అనేది కూడా దక్షిణాది నానుడే. మన నానుడి పిల్లడు అని. అయినా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పిల్లగాడు అనే శిష్టవ్యవహారికంలో వున్నది. మన జిల్లాల్లో పిల్లగాడు అని అంటాం. గుంటూరు జిల్లాలో బుడ్డడు, బుడ్డాడు అనేది కూడా శిష్టవ్యవహారికమే. 'దుడ్డు' అనే పదం కూడా చెన్నపట్నంలోనే కాకుండా, రాయల సీమలో కూడా 'డబ్బు' అనే అర్థంతో వాడుతారు. ఈ పదం అనేకసార్లు బ్రౌణ్యంలో వాడుకచేసారు. రాయలసీమలో దుడ్డు అనగా నాలుగు దమ్మిడీలు. యిప్పటికీ ఈ మాట రాయలసీమలో శిష్టవ్యవహారికమే. మన జిల్లాల్లో ఈ వాడుకలేదు. ఈ విధంగానే బ్రౌణ్యంలో డబ్బు అనే అర్థంలో 'రూకలు' అనేకచోట్ల వాడారు. చాలామంది బాలశిక్షలో 'రూకలేనివాడు పోకచేయలేడు' అనే పదబంధాన్ని చదివే వుంటారు. "టు సబ్‌ట్రాక్ట్, టు డిస్మిస్" అనే అర్థాలతో తోసివేసినారు అని దక్షిణాది మాటల్ని వాడారు. మన అర్థం తీసివేయుట, బర్తరఫ్ చేయుట. మరొక తమిళ పదబంధం ఎత్తినాడు, ఎత్తుకో. మన వ్యవహారికంలో వీటి అర్థం పైకి ఎత్తుకున్నాడు,

మే

చంక నెత్తుకున్నాది. అర్థంలో భేదమున్నా ఆ ప్రాంతంలో అది శిష్టవ్యవహారికమే. బ్రౌణ్యంలో వాడిన మరొక యిటువంటి వాడుకే పట్టుట, పట్టలేదు. ఉదా: 'ఈ మందు జ్వరమున పట్టలేదు.' మన నానుడి 'ఈ మందు జ్వరమ్మీద పని చేయలేదు. "నిన్న వాడికి బిడ్డ పుట్టినది" ఇది తెలుగు నానుడి కాదు. 'నిన్న వాడి భార్య ప్రసవించింది' అన్నది మన తెలుగు నానుడి. అనేకచోట్ల నెయిల్ అనగా మేకు అనే అర్థంతో మనంవాడుతున్నాం. బ్రౌన్ గారు ఈ పదానికి అణి, ఆణె అని తమిళ పదం వాడారు. మరో ఉదాహరణ: "టు క్లాయి" అనే పదానికి మనము ముఖం మొత్తుట అని వాడితే, తమిళంలో ముఖము కొట్టుట అని వాడేరు. ముఖం మార్చుకున్నాడు అని మనం వాడితే, బ్రౌణ్యంలో పలుచోట్ల మూతి ముడుచుకున్నాడు అని వాడేరు ముఖం అన్న పదం బదులు మూతి అని వాడడం (తమిళంలో మూంజి) చెన్నపట్నంలో, నెల్లూర్లో వాడడం శిష్టవ్యవహారికమే! బ్రౌన్‌గారు వాడుక చేసిన మరొక నానుడి. ఒక ఒక నాటికి వస్తాడు. ఒక ఒక నాటికి రాడు. (ఒరు ఒరు నాళికి వరువారు. ఒరు ఒరు నాళికి వరమాటారు) ఇవి తమిళ పదాలకి సరైన తెలుగు పదాలు. యివన్నీ శిష్టవ్యవహారికములే. బ్రౌన్‌గారికి సాయంచేసిన పండితులెవరూ యివి శిష్ట వ్యవహారికములు కావనిఅభ్యంతరము చెప్పలేదు. తమిళ ప్రభావం అటుండనియ్యండి. 'ఇఖను సంభవించబొయ్యేది ఎరగక' = బ్లయిండ్ టు ది కాన్‌సిక్వెన్సెస్ (పు. 213). ఇక్కడ ఇకను, ఇకమీదట, ఇక అన్న పదాలను వాడకుండా ఉచ్చారణ ప్రకారం యిహను, ఇఖను అని శిష్టజనవ్యవహారికంగానే వాడేరు. ఇదిలా ఉండగా, బహుశః, స్వతః అన్న పదాల్లో విసర్గ ప్రయోగించేరు. నేటి శిష్టవ్యవహారికంలో విసర్గకు వ్యస్త ప్రయోగం లేదు. మాటకు అక్షరాభ్యాసం చేసినప్పుడు ఓ న మ హః, శివాయహః, సిద్ధం నమహః అనే చదువు ఆరంభిస్తున్నాం. నేటి నానుడిలో యిటువంటి పదాల్లో విసర్గబదులు ఉపాంత్యాక్షరమునకు దీర్ఘంతో పలకడం శిష్ట వ్యవహారికం. ఆనాడు విసర్గ కూడా పలికేవారేమో!

బ్రౌణ్యంలో మరొక విశేషమేమంటే 'వేర్ ఈజ్ హి' అన్న ఇంగ్లీషుకి ఖాదేడి? (అమా యెంగే అన్నదానికి సరైన తెలుగు అనుకరణ) హిందీలో కూడా వో కహఁ అనే వాడుక ఓఢ్రంలో సే కాఁయీ అనే వాడుక. మన శిష్ట వ్యవహారికంలో వాడు ఎక్కడ ఉన్నాడు? లేకపోతే వాడు యేడీ? అని అంటాడు. బాల వ్యాకరణము పదిహేడో సూత్రం యిలా ఉంది. "య కారమ్మును ఉ, వూ, వో, ఒ అను తెలుగు మాటలకు మొదట లేవు" ఇందుకు వ్యతిరేకంగా బ్రౌణ్యంలో యిది, యిందువల్ల, యిందుచేత, వొకడు అని అనేకచోట్ల, లెక్కలేనన్నిచోట్ల వాడుక చేశారు. యిది నాటికి, నేటికి శిష్ట వ్యవహారికమే. అందుచేత పండితులు అభ్యంతరం చెప్పి ఉండరు.

వాడు వచ్చేటప్పుడు, వాడు ఉండేటప్పుడు అన్న చోటల్లా మనం వాడు వచ్చేప్పుడల్లా, వాడు వుండేప్పుడల్లా అని 'ట' కారం వదిలేస్తున్నాం. మన ఈనాటి 'ట' కారం వదిలేసిన నానుడి శిష్ట వ్యవహారికం అనడంలో యే అభ్యంతరమూ వుండకూడదు. ఉదా: భారతం, విరాటపర్వం, చతుర్థాశ్వాసం 234 పద్యం (ద్రోణుడు కృపాచార్యుని అధిక్షేపించుట) (వావిళ్ళవారి ముద్రణ) "వచ్చినవాడు ఫల్గుణు డవశ్యము గెల్తుమనంగరాదు" అన్న పద్యం వచ్చినవాడు అని పాఠాంతరం ఉంది గదా! అదే వచ్చేటివాడు, వచ్చేవాడు అవుతున్నది. అయితే చిన్నయ సూరిగారు -'వచ్చేటివాడు' తెచ్చేటి వాడు, వచ్చేవాడు-లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు'అనియిరవై రెండో సూత్రంలో, దుష్టప్రయోగమని కొట్టివేసినారు. ఈ సూత్రాన్ని లక్ష్యం చేయకుండానే మనం శిష్ట వ్యవహారికంగా వాడుతున్నాం. బ్రౌన్‌గారు మాత్రం 'ట' లోపం లేకుండా వచ్చేటివాడు, తెచ్చేటి వాడు అని ఆనాటి శిష్ట వ్యవహారికమే రాసారు.

బాలవ్యాకరణంలో తత్సమ పరిచ్ఛేదంలో "కొరకు, కై" చతుర్థీ విభక్తి ప్రత్యయములుగా పేర్కొన్నారు. "నా కొరకు వచ్చేవా?" అని అడగడం బదులు నాకోసం వచ్చేవా? అనిన్నీ, నా కోసరం వచ్చేవా? అనిన్నీ నీకోసం, కోసరం చతుర్థీ విభక్తి ప్రత్యయములుగానే వాడుతున్నాం. కోసం, కోసరం అనే ప్రత్యయాలనుశిష్ట వ్యవహారికములుగా-వ్యావహారిక భాషా వ్యాకరణ కర్తలైన వడ్లపూడి గోపాలకృష్ణయ్యగారు పేర్కొన్నారు. బ్రౌన్ గారు కూడా శతాబ్దన్నర క్రితమే ఈ ప్రత్యయాలను చతుర్థీ విభక్తి ప్రత్యయాలుగా వాడేరు. అయితే మన శిష్ట వ్యవహారికంలో నా, నీ, మ, పదాలు వాడినప్పుడు నాయొక్క- నీయొక్క, వానియొక్క అనే ప్రత్యయం మురిగిపోతుంది. అయితే బ్రౌణ్యం నాటికి యొక్క అనే షష్ఠి విభక్తి ప్రత్యయము చాలా తరచుగా వాడడం జరిగింది. అది ఆనాటి శిష్ట వ్యవహారికం అనుకోవాలి.

మరొక విశేషం. "షి" అనే పదానికి నేడు శిష్టవ్యవహారికంలో "ఆమె" అనే వాడుతున్నాం. 'అది' అనే పదం పామర స్త్రీల గురించి వాడుతున్నాం. అయితే ఆనాడు 'అది' అనేది శిష్ట వ్యవహారికమే. అంతెందుకు భారతంలో విరాట పర్వంలో ప్రథమాశ్వాసం నూటయాభై పద్యంలో "తఱిమి నడిచితిని లతాతన్వి, యిది వడగొనియె" అనిన్నీ, నూటమూడో పద్యంలో "ఇది గడు ముద్దరాలు పనులేమియుఁ జేరగ నేరదెంతయున్" అని ద్రౌపదిని గురించి కుంతి అంటుంది. విరాటపర్వం ద్వితీయా

శ్వాసం 38 వ పద్యంలో "దాని దెసందగిలిన". ఈ ఉదాహరణలే కాకుండా తిక్కన పదకోశంలో రెండువందల పైచిలుకు ఉదాహరణలున్నాయి. కానీ మనం ఈనాడు భారతకాలంలో లేము. అందుచేత "అది" అన్నది నీచవాచ శబ్దంగానే శిష్టుల వాడుక. "ఆమె" అనేదే వాడుతాం. మరొక ముఖ్యమయిన విషయం ఏమంటే, వ్రేలు, త్రెన్ను, వ్రేలాడు, గ్రుద్దు, గ్రుచ్చు, ప్రేగు, గ్రుక్కెడు, ప్రాత, గ్రుడ్డి, గ్రుడ్డు, క్రొవ్వు, మ్రింగు, బ్రద్దలు, క్రింద, మ్రాను, త్రాగు, క్రాగు, వ్రేటు, త్రాడు, క్రొత్త, త్రవ్వు ఈ పదాల్లో బ్రౌణ్యంలో క్రావడి లేకుండానే వ్యవహరించారు. నేడు మనం శిష్టవ్యవహారికంలో కూడా రాస్తున్నాం, ఉచ్చరిస్తున్నాం.

నా స్నేహితుడొకడు త్రాగు బదులు తాగు అని ప్రయోగిస్తే 'సారాయి తాగడం' అనే అర్థం వస్తుందని భయంతో త్రాగినారా ? అనడంతో తృప్తి పడకుండా, త్రావినారా ? అని కూడా వాడ్డం విన్నాను. ఇది అసాధారణం. శిష్టులు ఉచ్చరించని మాట. బ్రౌన్‌గారికి తెలుగు భాష యందు కృషికి ప్రోత్సహించినవారు తెలుగు పండితులవడంచేత, దొరగారికి బోధపడేలాగున కొన్ని ఇంగ్లీషు జాతీయాల్ని తెలుగు జాతీయాల్లో నేర్పకుండా ఇంగ్లీషు పదాలకు ముక్కకు ముక్కగా అర్థం చెప్పినట్టు కనిపిస్తుంది. అయితే అయన ఇంగ్లీషు పదాలు వాడకపోలేదు. పెన్సిలు, పెనసలు, మేజిస్ట్రేటు, సమను, వారంటు, మొదలగు ఉద్యోగ సంబంధపు మాటలను యథాతథంగా తెలుగులోనే రాసారు. ఈనాడు మనలో భౌతికశాస్త్రం మొదలైన శాస్త్రాల అధ్యయనం వృద్ధి అవుతూండడం వల్ల సాంకేతిక పదాలు అనేక భాషల్లో నుండి యథాతథంగా వాడుకుంటూనే ఉన్నాము. కొందరు శిష్టులు ఈ సాంకేతిక పదాలకి సంస్కృత పదాలు కల్పించినా అవి ప్రజల నోటగానీ, విద్యార్థుల నోటగానీ రావడం లేదు. ఈ సందర్భంలో బ్రౌన్ సాంకేతిక పదాలకు సంస్కృతంలో తర్జుమా చేయడం బదులు (రెండు మూడు చోట్లతప్ప) పాత తెలుగు మాటలనే వాడారు. (ఉదా: పార్ట్నర్స్ అన్న మాటకు నేడు మనం భాగస్తులు అని అంటున్నాం కదా! బ్రౌన్‌గారు మాత్రం అనాటి నానుడి ప్రకారం పాళీకాపులు అనే వాడేరు. నేడు ఈ మాటకు కమతగాళ్ళు అని అర్థం. అనగా ఫలసాయంలో భాగానికి సాగుచేసే రైతులు పాలికాపులు అన్న మాటలో కాపుఅనగా కర్షకులు. పాలి అన్నది పాలు పంచుకునే వారు)

బ్రౌణ్యంలో గడియారము అనిన్నీ, ఘడియారము అనిన్నీ, గాలి, ఘాలి అనిన్నీ ఒత్తు ఉచ్చారణతో వర్ణక్రమము ప్రయోగించేరు. నేడు కూడా మనం ఉచ్చారణలో ఈ ఒత్తులు ప్రయోగిస్తున్నాము.

మొత్తమ్మీద ఏ వార్థక నుడికారము చాలా తక్కువగానే కనిపిస్తున్నది.

తెలుగులో మాటలు, తెలుగు మాటలలోని మధ్యాక్షరము అకారాంతమా, ఉకారాంతమా, ఇకారాంతమా అనే చర్చ చాలా కాలం నుండి జరుగుతూన్నదే. ఇందుకు ఒకే ఒక్క ఉదాహరణ యిస్తున్నాను. గనక అనే పదాన్ని ఉకారాంతంగా 'గనుక' అని కాకుండా అకారాంతంగానే 'గనక' అనే అనేకసార్లు ఉపయోగించారు.

నలభై వేల ఉదాహరణల్లోనూ, అధమం మూడోవంతు, యింకా అధికంగానే నేటి శిష్టవ్యవహారికములే అని గ్రహించాలి.

బ్రౌణ్యంలో అక్కడకు, అని వ్యాకరణ యుక్తంగా రాయడం బదులు అక్కడికి అనే చాలా చోట్ల వాడారు. మనం కూడా అలాగే అంటున్నాం. ఉదాహరణలు యివ్వడంలో అయన తెలుగు నుడికారాలు ప్రయోగించారు. యాస్ గాడ్ ఆఫ్ బాటిల్ అన్న పద బంధాన్ని కుమారస్వామి అనవచ్చును. అలాగే ఇన్ ది ఆర్ట్ ఆఫ్ వార్ - ద్రోణాచార్యుని వంటివారు యిలాంటి పద బంధాలు (పుట 1289).

బ్రౌణ్యంలోని నాటి, నేటి నానుడులను చూపుతూ నాటి నానుడులలోని పాత మాటల ప్రయోగాన్ని వివరించుతూ కొన్ని ఉదాహరణలను యీ కింద పొందుపరుస్తున్నారు.

1. ◆ వాణ్ణి గౌరవంగా విచారించినారు. నేటినానుడి 'గౌరవించారు'

   ◆◆ నేటి వాడుకలో 'విచారించు' అనే పదానికి 'విచారపడు' నాడు 'విచారించు' అనే పదానికి అర్థం 'పర్యాలోచించు'

2. ◆ అతను లేకపోతే నేను ఛత్తును.

   ◆◆ అతడే గనక లేగపోయుంటే నేను ఛచ్చేవాణ్ణి

3. కొడుకు చచ్చిపోయినదానితో కుంగిపోయినాడు

   కొడుకు చచ్చిపోయాడని వాడి గుండె బద్దలై పోయింది.

4. ఉసూరుమని పెద్ద వూపిరి విడిచినాడు

   ఉసూరుమని పెద్దగా నిట్టూర్చినాడు

◆◆ నేటి వ్యవహారికం

◆ బ్రౌన్ గారి ఉదాహరణలోని వ్యవహారికం.

5. పిల్లాకాయలు తలా కాలూ తెలియక పరుగెత్తినారు.
,, అదరా బాదరా పరుగెత్తినారు.

6. వాడు చెప్పేదాంట్లో తొస్సపోయినది
నేటి ,, వొక చిక్కు వుంది.
తొస్సె అనగా ఉచ్చారణ లోపం.

7. దేశములో వొక ధూము పుట్టినది.
ధూము = కలత పాతమాట.
,, దుమారం రేగింది; దోశ - నాటి వాడుక;
దోసే_నేటి నుడికారం.

8. ఈ మిణకరింతలో యే విధముగా చేసినా సంకటముగానే యున్నది.
నేటి నానుడిలో సంకటము అనగా సుఖరోగము.
యెగదిస్తే బ్రహ్మహత్య దిగదిస్తే స్త్రీ హత్య.
,, ,, ,, గో హత్య.
ఈ సందిగ్ధావస్థలో యేదిచేసినా చిక్కు తప్పదు

9. కాకిముక్కు గడుసుపారిన ముక్కు; పాతమాట=కఠినమైన
,, కాయ కాసిన, కొమ్ముతో చేయబడిన ముక్కు.

10. మనోవృత్తిఖర్చులు = వితంతువుకి అత్తవారుయిచ్చే భరణం.
యింటి ఖర్చులు = దినసరి వెచ్చములు.

11. నీవు పోణిమిగా సంసారము చేయవలసినది = పొదుపు
నువ్వు పొదుపుగా చేసుకోవాలి

12. వాతి కాసు పాతమాట వాయిసా కాసు=తన పని చేయించుకుందుకు రహస్యంగా యిచ్చే డబ్బు.

13. రాణివాసపుస్త్రీలు: జమీందారీకుటుంబాలలో స్త్రీలకువర్తించేది.
నేడు అంతఃపుర స్త్రీలు } జనానా; నేటి సామాన్యుల
ఘోషా స్త్రీలు } పరదా స్త్రీలు.

14. వాడ టెంకాయలు - సింహళం నుండి దిగుమతైన కొబ్బరి కాయలు.
(బహుశా సిషెల్ దీవుల నుండి దిగుమతైన జంట టెంకాయలై వుండొచ్చునేమో ?)
టెంకాయ మన జిల్లాలలో వాడుకలేని పదం.
కొబ్బరికాయ మన జిల్లా పదం.
నేటి సింహళం కొబ్బరికాయలు.

15. ఈ అఘోరమైన సమాచారము యొక్క దెబ్బ దానికి జ్వరం వచ్చినది.
ఈ ఘోరవార్త వినడం వల్ల ఆమెకు జ్వరం వచ్చినది.
అఘోరము=అత్యంత దుఃఖకరము.

16. యిక్కడ దారి పడమటికై కొంచెము వంగివున్నది.
,, ,, ,, మళ్ళుతున్నది. మలుపు తిరుగుతుంది.

17. బ్రిటిషు గౌనరుమెంటు వారికి వచ్చిన ఆయాసము వల్ల దర్బారు వారికి యెటూ తోచక మిణకరింపుగా వున్నది.
బ్రిటిషు గౌనరుమెంటువారికి వచ్చిన అసంతృప్తి వల్ల దర్బారువారికి చేతులూ కాళ్ళూ ఆడకుండా వున్నాయి.

18. నాకు చదువు వచ్చినది అతని పుణ్యం.
అతని పుణ్యమా అని నాకు చదువు చెప్పించాడు }
,, ,, ,, ,, అబ్బింది }

19. గట్టి పట్టు; కోతి పట్టు; భల్లూకపు పట్టు

20. ఆ మందు పట్టలేదు - మన నానుడికాదు.
,, గుణమివ్వలేదు.

21. తాగడముచేత వొళ్ళు నిప్పులుగా వుంటవి
,, ,, నిక్కాకక చేస్తుంది

22. యీ పుస్తకానికి రాజు మీద అంకితము పెట్టినాడు.
యీ పుస్తకం రాజుకు అంకితమిచ్చినాడు.

23. ఆ వంతెన ఆదంబముగా వున్నది. (అంటే బలమైన వంతెన కాదు అని అర్థం.) బలానికి పోట్లు పెట్టవలసిన స్థితి.
క్షేమకరంగా వుండనందున; ప్రమాదకరంగా వుండనందున.

24. ఇందుచేత నేను బయటపోవడానికు కుందకమైనది=
అభ్యంతరము.
,, ,, ,, అటంకమైనది.

25. ఆ పొలానికి నడుమ వెలుగు పోతున్నది (అనగా ముండ్ల చెట్ల ఆవరణ)

,, ,, వొక కంచె పోతున్నది

26. గనిమలు వేయబడ్డ పొలము (చిన్న చిన్న గట్లు)
పెద్దపొలాన్ని విభాగించుతూ వేసిన చిన్నచిన్న గట్లున్నాయి.

పిత్తలాటకముగా నన్ను తొలగదీసి ముందు మించుకొన్నాడు

యేదో మతలబు చేసి ఉద్యోగంలో నా కంటె ముందుకు వచ్చాడు.

27. తొంటి సదుగులు (కీళ్ళు). తొంటి =కటిప్రదేశమందలి కీళ్ళు. నడుము కీళ్ళు.

28. ఈ దారి మిట్టపల్లాముగా వుండుటవల్ల బండి కుదులుతున్నది =చలించు.

,, ,, ,, ,, కుదుపుతున్నది.

29. దిగ్గున లేచినాడు - దిగ్గున = తటాలున; తోక తొక్కిన తాచుపాములాగ చెంగున లేచినాడు.

30. వాటి రూకలను రాజభాండలములో పెట్టివున్నాడు.

,, ,, ట్రెజరీలో భద్రపరచుకొన్నాడు.

31. నీళ్ళను మట్టు చేయడానికి కింది కాలువలను యెత్తుతారు. మురుగు కాలువలు తీస్తారు.

32. నాయకీ నాయకులు వలపు వల్ల వ్రాసుకునే జాబులు (లవ్ ఎపిస్‌ల్స్) ప్రేమలేఖలు.

వెర్రి వెధవా వెధవా అన్న పదం యిక్కడ ముద్దుగా పిలిచిన సంబోధన; వెధవయొక్క పెళ్ళాం విధవ కాదు. అయితే "విడోయర్" అనే పదానికి వ్యావహారికంలో సరైన తెలుగు పదం యేమిటి? అపత్నీకుడు; విధురుడు అని. కాని యిది శుద్ధ గ్రాంధికం.

యిదే నానుడి.

తురకలు పెండ్లాలను రాణివాసంలో పెట్టుతారు.

,, స్త్రీలను ఘోషాలో వుంచుతారు.

[యిక్కడ తురకలు అనే పదం ఎలా వచ్చింది. 'ముసల్మాన్స్' అనే పదం తురుష్కులు అనే పదానికి వైకృతం. 1724 ప్రాంతంలో విశాఖ జిల్లావాడైన గోగులపాటి కూర్మనాథకవి మహమ్మదీయులు హిందువులపట్ల చేసిన అరాచకాలను గురించి సింహాచలవాసుడైన నృసింహ స్వామితో తన దేశపు పరిస్థితులను చెప్పుకుంటూ తన పద్యాల్లో తురుష్కులు అనే వాడాడు (చూడు బలరామమూర్తిగారి 'ఆంధ్రుల చరిత్ర' 210 వ పేజీ). అయితే తురకలు అనే పదం అరవంలోని తురుకన్ అనే పదం నుండి వచ్చిందనుకుంటాను. రు బదులు ర వాడితే తెలుగు నుడికారం వచ్చేసి తురకలు అనే పదం వస్తుందని నా అభిప్రాయం. (కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని తొలిసారి చూసినప్పుడు యెవడీ తురకని అంటాడు) పండితులూ భాషా తత్వవేత్తలు ఏమంటారో మరి. యిక్కడ వొక చిన్న విషయం. బరంపురంలో కంటే యిచ్ఛాపురంలో తురకలు హెచ్చు సంఖ్యలో వుండడానికి కారణం యేమిటి అనే ప్రశ్న వుదయిస్తుంది. బంగాళా రాష్ట్రం ఆఫ్గన్ సర్దారులకింద ఉన్నప్పుడు - దేశంలోని అరాచకాన్ని అదునుగా తీసుకుని తన స్వతంత్రాన్ని ప్రకటించుకున్న ఆఫ్గన్ సర్దారు ఒకడు కళింగదేశాన్ని జయించేందుకు ఆ దేశంపై దండెత్తాడు. అన్ని అడ్డంకులూ; శత్రు ప్రతిఘటనలనూ ఎదుర్కొని సరాసరి ఇచ్ఛాపురం వరకూ పురోగమించాడు. యిక ఏ కారణంచేతనో తన పురోగమనాన్ని చాలించుకుని ఇచ్ఛాపురంలో కొంత సైన్యాన్ని వుంచి తను తిరిగి తన బంగాళ దేశానికి వెళ్ళిపోయాడు. ఆ సైన్యం సంతతివారే నేడు ఇచ్ఛాపురంలోని తురకలు. ఓఢ్ర దేశంలో తురకలను 'పఠాన్ లాకోర్కు' అని అంటారు.] వసుచరిత్రలో కృష్ణదేవరాయలు తన పొరుగునవున్న మహమ్మదీయ రాజులపై దండెత్తి వారిని తన రాజ్యం నుండి పారదోలినప్పుడు తురకలను మోడు పోయిన చెట్లను నరికినట్టు నరికేశాడు. ఈ విషయాన్ని రామరాజభూషణుడు వర్ణిస్తూ.... 'ముసల్మానులు' అనే పదాన్ని 'ముసలి మానులు' అని శ్లేషగా వాడాడు. ముసల్మానులను నరికివేసి రక్త సిక్తమైన ఖడ్గాలు, కందనాలు మొదలుకొని గోదావరిలో కడుగుకున్నాట్ట. ఇది పరాక్రమ సూచకం. (చూడు వసుచరిత్ర 1 వ అశ్వాసం, 45వ పద్యం, వావిళ్ళవారి ప్రతి 1962, పుట 50)

చీటకాగితాలు = పేకాట, పేక (పుట 141)

పొడుగు వెల = అధికవెల (పు. 550)

వాసి = మేలు (పు. 99)

కొండల జ్వరము = మలేరియా (పు. 551)

రెట్టలు = భుజములు (పు. 310)

33. కేపు - ఈ పదం శబ్దరత్నాకరంలో లేదు. అయినా వాడుకలో ఉంది. 'కేపులు' దీపావళి సందర్భంలో చిన్నపిల్లలు పిస్తోలుతో పేల్చే ఎర్ర కాగితం అంటించిన మందు రవ్వ.

34. కేపుమారి- ఈ పదం శబ్దరత్నాకరంలో లేదు. కత్తెర దొంగ అని దీనర్థం. 70 ఏళ్ళ కిందట బాగా వాడుకలో ఉండే మాట.

35. షికు - అతడు 'షికు'లో ఉండి శెలవు పెట్టాడు. యిది రైల్వే పదం. రైల్వే డబ్బాలో ఏదేనా లోపముంటే దాన్ని వెంటనే రిపేరుకు పంపేందుకు దానిమీద 'సిక్' అని రాస్తారు. రైల్వేవారు 'వేగన్ సిక్' చేసారంటారు.

36. పూటబడుట - జామీనుండుట (పుట 69)

37. జిల్దుకట్టు - పుస్తకం బైండుచేయు (పు. 94)

38. కరకలు - వడగళ్ళు (పు. 524)

39. చక్కిపంచదార - శబ్దరత్నాకరంలో ఉంది. తెల్ల పంచదార (పు. 936)

40. నడపీనుగు - నడుస్తూన్న ఎముకల గూడు. (పు. 1053)

41. నూకు - గెంటు (పు. 1040). ఈ మాట నెల్లూరుజిల్లాలో చీవాట్లు పెట్టుట, చెణుకుట అర్థంలో యిప్పటికీ వాడ్తారు.

42. కంచుబొట్టు పెండ్లి - యధావిధిగా జరక్కపోయినా(పు. 673) బహిరంగంగా జరిగిన పెండ్లి. దొంగపెండ్లి అని అర్థం ఉంది. ఈ మాట శబ్దరత్నాకరంలో లేదు. శంకర నారాయణగారి నిఘంటువులో ఉంది.

43. అబక - పెద్దగరిటె (పు. 660)

ఈ పాత మాటల వాడుక అటుండగా కొన్ని నేటి వాడుకలో ఉన్న మాటలు బ్రౌణ్యంలో లేవు.

ఉదా: విజిల్ = ఈల అని అర్థం వుంది. నేటి వాడుకలో రైలు కూత, ఫ్యాక్టరీ కూత అని కూడా ఉన్నాయి. (పు. 253).

44. కల్చర్ - కృషి, వ్యవసాయం, సాగుబడి, సేద్యం అన్న అర్థాలే ఉన్నాయి కానీ 'సంస్కృతి' అని లేదు. శబ్దరత్నాకరంలో సంస్కారం పొందినది అని అర్థం ఉంది. బ్రౌణ్యంలో సంస్కరించు అని వుంది. సంస్కృతం మాట అయినప్పటికీ సర్ మోనియర్ విలియమ్స్ రాసిన ఇంగ్లీషు సంస్కృత నిఘంటువు 1851 లోనూ కూడా లేదు.

45. సైరన్ - దివ్యముగా పాడేటి కవి కల్పిత రాక్షసి (పు. 1051). నేటి అర్థంలో ప్రమాదాన్నే సూచించే హెచ్చరిక. కూత.

46. స్ట్రయిక్ - యికను పనిచేసేదిలేదని పనివాండ్లు తిరగబడుట. (పు. 1118). సమ్మెకట్టు, బందుకట్టు నేటి అర్థం.

(అర్డెన్ 302 పేజిలో "ర" యిస్తేనేగానీ రామని సయ్యా కట్టుకుని ఉన్నారు)

47. స్ట్రాక్ - పుండుపై పక్కు కట్టుట (పు. 995) సమ్మెను భగ్నంచేయుటకు పైచోటనుండి దొంగతనముగా తీసుకువచ్చిన కార్మికుడు.

48. స్లమ్స్ - రోతగా ఉండే స్థలం. (పు. 1061) మురికివాడలు అని నేటి అర్థం.

49. స్మాదర్ - ఈ సమాచారమును అణచివేసినారు. (పు.1064)
,, తొక్కిపెట్టినారు

50. మాడెస్టీ - ఈ పదానికి బ్రౌను సందేహము, అణకువ అని అర్థాలు యిచ్చేరు. ఇందుకు ఉదాహరణగా ఆయన యిలా యిచ్చారు. ది హిందూ విమెన్ అర్ కాన్‌స్పికువస్ ఫార్ మాడెస్టీ. తెలుగున అణకువ గలవారనే ప్రసిద్ధి, హిందూ స్త్రీలకే వున్నది (పుట 741). నేటి వాడుకలో మాడెస్టీ అంటే మొహమాటము. ఉదా : ది హిందూ విమెన్ అర్ మాడెస్టీ = హిందూ స్త్రీలు చాలా మొహమాటస్థులు.

[ఇక్కడ ఒక చిన్న భాషావిశేషం చెప్పవలసివుంది. ప్రజల నానుడిలో మొహమాటము - మొగమాటముగామారి, మోమాటముగా వాడుకలో ఉంది. ఇందులో 'హ', 'గ' రెండూ లుప్తం అయిపోయాయి. తమిళంలో కూడా ఈ మార్పు కనిపిస్తుంది. అరు

మొహము = అరు మొగము అని వారి నానుడి. అలాగే మహాత్ముడు అనే పదాన్ని మగాత్ముడు అంటారు. మనం కూడా మాఘమాసాన్ని మాహమాసం అంటాం. 'హ' 'గ' శబ్దాలు ఒక దాని బదులు ఒకటి మారడం ఇరత భాషల్లోకూడ వుంది. 'మాగ జీన్' అనే రష్యన్ పదాన్ని ఉల్క్రేనియన్ భాషలో 'మహజీన్' అంటారు. ఇక్కడ 'గ' 'హ' కింద మారింది. మనం కూడా 'నీ మొహం' అనే పదాన్ని 'నీ మొగం' అనే అంటూంటాం. హిట్లర్ అనే జర్మన్ పదాన్ని రష్యన్‌లో గిట్లర్ అంటారు.

ఇదిలా వుండగా యింగ్లీషులో ఫ్రెంచి భాషనుండి వుద్భవించిన పదాలు. ఉదా: అవర్, ఆనర్, ఏర్ యిత్యాది పదాల్లో 'హ' పలకనే పలకరు.

మన భాషలో కూడా 'విహంగము' అనే పదానికి 'విడంగము' 'వాయు విశంగము' అనే రూపాంతరాలు వున్నాయి. (చూడు→ మహంకాళి సుబ్బారాయుడుగారి శబ్దార్థ చంద్రిక).

ఇంకొన్ని ఉదా:

హారతి→ ఆరతి; హండా→ అండా; హడావుడి→ అడావుడి; హంస→ అంస; హరిదళము→ అరిదళము; సహము→ సగము; సహాయము→ సాయము; హాసిల్— ఆసిల్, తహసిల్దారు→ తాశీల్దారు; మహా + బాగు→ మాబాగు; వాడు మహారాజు→ వాడు మారాజు; అంతెందుకు? బ్రహ్మపురంలో 'హ' ఎగిరిపోయి ప్రజా నానుడిలో బరంపురం అయింది కదా!

బ్రౌణ్యం లో శానా అనే పదాన్ని ధారాళంగా ఉపయోగించేరు. మరొక విశేషమేమంటే సిరా అనే పదానికి ఇంకి అనే పదం వాడడం. అరవంలో ఇంకి అనే అంటారు. మనం శిరా - సిరా అంటాం. అప్పట్లో సిరాని మశి అనేవారు. సిరాబుడ్లని మశి బుడ్లు అనే వాడుక. కచేరీలలోనూ మశిబుడ్లు వుండేవి.

యింకొక విశేషం - దండుకు సంబంధించిన అన్య దేశీయాలనూ, పాత అచ్చ తెలుగు పదాలనూ వాడారు. మన నేటి ముస్తాబు అనే పదం ముస్తీబు అనే హిందుస్తానీ మిలిటరీ పదానికి తెలుగు నానుడి. ముస్తీబు, ముస్తైబు అంటే యూనీఫారం వేసుకుని అయుధాలు పట్టుకుని, యితర అలంకరణలతో సిద్ధంగా ఉండటం. ముస్తాబు అనే పదానికి వుత్పత్తి యిది. దండుకు సంబంధించిన మరో పదం రస్తు. యిది పాత పదమే. ప్రాచీన కవులు వాడిన పదమే. చూడు శబ్ద రత్నాకరము. రస్తు అనగా దండుకు సరిపడిన తినుబండారాలు, రేషన్ సామానులు, సామగ్రి సరఫరా చేయడం. యిప్పుడు యిక్కడ నేనువాడిన సామగ్రి అనే పదం బ్రౌణ్యంలో సామగ్రీ - అని దీర్ఘ యికారంతో ప్రయుక్తం. అలాగే ఆర్డెను దొర◆ తన వ్యాకరణంలో మిక్కిలి అనే పదాన్ని మిక్కిలీ అని దీర్ఘంతోనే వాడారు. ఇవి అనాటి కొన్ని నుడికారాలు. అన్యదేశీయ పదాల వాడుకను గురించి బ్రౌను దొర ఇలా అంటున్నారు తన పీఠికలో: "యీనాడు తెలుగు సంభాషణలోనూ, వ్యవహారం, వ్యాపారాలలోనూ యింగ్లీషు పదాలు మరింత హెచ్చుగా దొర్లుతున్నాయి." ఆయన ఉద్దేశ్యంలో ఇంగ్లీషు పదాలవాడుక మరింతగా వాడుకలోకి వస్తాయి అని భవిష్యత్తులోకి తొంగిచూచినట్టు కనబడుతూంది. ఏ భాషా పదమైనా మనం వాడుక చేసేప్పుడు దానికి తెలుగు నుడికారం ఇచ్చి మరీ వాడాలి. అలా వాడితేనే మన భాష సుసంపన్నవంతం అవుతుంది.

ఈ వ్యాసం ముగించే క్షణంలో, అక్షరాలా ముగించే క్షణంలో, నా మిత్రులొకరు బ్రౌన్ రాసిన తెలుగు - ఇంగ్లీషు

[◆ చూడు ఆర్డెన్ వ్యాకరణం (1921) 307 పుట. ఈ పేజీ లోనే దీర్ఘ యికారంతో మిక్కిలీ అని మూడు సార్లు వాడేరు.]

నిఘంటువు నాకు బహూకరించేరు. బ్రౌన్ ఈ నిఘంటువుకు రాసిన పీఠికలో యిలా అన్నారు : "(తెలుగువారు) తెలుగు వాక్యాలలో ముఖ్యంగా పట్నాలలో తెలుగుమాట్లాడే తెలుగువారు వాక్యాలలో ఎంతనవసరమైనా ఇంగ్లీషు మాటలను దొర్లించి కంత్రీ భాష మాట్లాడుతున్నారు." దీనికి తెలుగువారందరూ నొచ్చుకోవాల్సిందే. శతాబ్దిన్నర తరువాత కూడా ఈ మాటలు నిజమే!

ఇంగ్లీషు మాటల విషయంలో, ఆయన ఆ సందర్భంలోనే యిలా అన్నారు: తెలుగు వాక్యాలలో దొర్లించి మాటలాడుతూన్న ఇంగ్లీషు మాటలలో "ఏయే మాటలు తెలుగు భాషలో శాశ్వతంగా స్థిరపడి పోవడం వల్ల భాషకి లాభమే చేకూరుతుందో నేడు చెప్పలేము. కానీ పెద్ద సంఖ్యలో వున్న ఇంగ్లీషు మాటలు - రోడ్ (రోడ్డు) ఆస్పిటల్ (అసుపత్రి) మైల్ (మైలు) రూలర్ (రూలుకర్ర); క్వినయిన్ (క్వైనా); రబ్బర్ (రబ్బరు); పెన్సిల్ (పేనసలు); స్టేషన్ (స్టేషను); ఫిడ్ల్ (ఫిడేలు); వగయిరా మాటలు. వీటికి దేశభాషలో సరైన సమానార్థ పదాలు లేకపోవడంచేత యిటువంటి మాటలు ప్రజల వాడుక భాషలో స్థిర పడతాయనుకోవచ్చు." నా వ్యాసం చాలా అసంతృప్తికరంగా వుందని నాకు తెలుసు. బ్రౌన్ రాసిన తెలుగు-ఇంగ్లీషు (డిక్షనరీ) (ఈ యింగ్లీషు పదం ఆయన వాడిందేలెండి); అయనే రచించిన తెలుగు వ్యాకరణము; యింకా వారి జీవిత చరిత్ర, అంతేగాకుండా బ్రౌన్‌గారి గురించి బంగోరే గారు తిరుపతిలో చేసిన పరిశోధనా విశేషాలు యివేవి అధ్యయనం చేయకుండా ఈ వ్యాసరచనకు పూనుకోవడం సాహసమే! అయితే బరంపురంలో అవి దొరకవు. ఆ మిషపెట్టుకుని అసలు బ్రౌణ్యం గురించి రాకపోవడం ఆయనపట్ల నిర్లక్ష్యం చూపినట్టే అని నా అభిప్రాయం. ఈ వ్యాసంలో తడిమిన విషయాలు ఇంచు మించు అన్నీ శ్రీ గిడుగు వారు తమ 'బాలకవిశరణ్యం' అనే గ్రంథంలో విపులంగా కవి ప్రయోగాల ఉదాహరణలతో సహా చర్చించారు. ప్రతి వొక్కరూ తప్పక చదవవలసిన గ్రంథం.

బ్రౌన్‌గారికి తెలుగుభాష, తెలుగు పండితులు, కవులపట్ల వుండిన అభిమానానికి ఒక ఉదాహరణతో యీ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

బ్రౌన్ బందరులో ఒక ఉద్యోగం చేస్తుండగా (కలెక్టరో, జడ్జియో!) ఒక గ్రామ కరణం ఉద్యోగపు నియామకంలో కొంత అన్యాయం జరిగిందని, క్రింది ఉద్యోగులు పక్షపాతం వహించి న్యాయం చేకూర్చలేదని ఆయన వద్దకు ఒక ఫిర్యాదు వచ్చింది. విషయమేమిటంటే పిండిప్రోలు లక్ష్మణకవో లేక ఏనుగుల లక్ష్మణకవో వీరిద్దరిలో ఒకని తమ్ముడికి ఆ ఉద్యోగం రావలసి వుండెనట. అన్యాయం జరిగిన వ్యక్తి లక్ష్మణ కవి సోదరుడు. బ్రౌన్ దొరగారికి తెలుగు పండితులపట్ల, తెలుగు కవిత్వంపట్ల చాలా అభిమానం ఉందని తెలుసుకుని తన తమ్ముని వెంటబెట్టుకుని బ్రౌన్‌దొరగారి దర్శనార్థం వెళ్ళేడట. బ్రౌన్‌దొరగార్ని కవి చూచిన వెంటనే ఒక చిత్ర కవిత, పదిపదిహేను పంక్తులది చెప్పి ప్రతీ పంక్తి మొదట అక్షరం కలిపి చదివితే చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని వస్తుంది. అ విధంగా బ్రౌన్ దొరగారి మీద ఓ పద్యం (చిత్రకవిత) చెప్పగా ఆయన కవి పాండిత్యాన్ని మెచ్చుకుని యెందు కొచ్చారని ప్రశ్నించాడట. కవి తన తమ్మునికి జరిగిన అన్యాయం గురించి చెప్పి, న్యాయం యిప్పించమని కోరాడట. బ్రౌన్ వెంటనే ఆ విషయమై దర్యాప్తు జరిపించి లక్ష్మణకవి తమ్ముడికి అన్యాయం జరిగిందని నిశ్చయించి, కవి తమ్మునికే ఉద్యోగం యిప్పించాడు. (చూడు గురజాడ శ్రీరామమూర్తిగారి కవుల చరిత్ర)

['వికాసం' (బరంపురం, ఒరిస్సా) సాధారణ సమావేశంలో 1981 ఫిబ్రవరిలో చదవబడింది. ఆ వ్యాసాన్ని క్లుప్తీకరించిన పాఠం ఇది.]

శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యం

అన్నమాచార్య నాట్య సంకీర్తనలు

"ఏవం నాట్యప్రయోగే బహుబహు విహితం కర్మశాస్త్ర ప్రణీతం,
న ప్రోక్తం యచ్చ లోకా దనుకృతికరణం తచ్చ కార్యం విధిజ్ఞైః॥

శాస్త్ర ప్రణీతాలైన బహుకర్మ విశేషాలు ఈ నాట్య ప్రయోగమునందు సంగతములుగా నున్నవి. లోకానుకార స్వరూపములగునవి కొన్ని కొన్ని నిరూపితములైనవి. సర్వలోకానుకరణం శక్యనిరూపణం కాదు. కావున సర్వ మిందు నిరూపితం కాలేదు. విధిజ్ఞులు వివేకులైనవారు వానిని లోకానుసరణ మొనర్ప వచ్చును.

—'భ. శా'

మతంగుని 'బృహద్దేశి' - నారదుని 'దేశినృత్త సముద్రం' మొదలు జాయన నృత్త రత్నావళి వరకు దేశిమార్గ పద్ధతిలో పెద్దలు లక్షణాదులను సూచించినారు. దేశిలోని వాని నున్నట్లే స్వీకరింపక సంస్కరించి సూచించారు. దేశి అభ్యాసకులలో దేశీయములు, మార్గ అభ్యాసకులలో మార్గములు నిల్చిపోయినవి క్రమంగా కాలమూ, ప్రజా భీష్టము మారగా రెండును సమన్వయమై ప్రచారమున విలసిల్లినవి గాని మార్గగాములైన నాట్యకోవిదులు, దేశీయాభిమాన ప్రయోక్తలైన జానపదులు వారు వారెఱింగిన పద్ధతిలో వానిని గ్రహించెడువారు - ఆనందించెడువారు. అందువల్ల దేశి నృత్త నృత్యముల ప్రశంస తెలుగు కావ్యములందెక్కువగా నున్నది.

పాల్కురికి సోమనాథుడు తన కాలానికే గల (క్రీ. శ 1190-1260) దేశి ఆటలు పాటలు వాని రీతులు తన 'పండితారాధ్య చరిత్ర' లో బసవ పురాణంలో వివరించినాడు. తరువాత కొందరు సింహ భూపాలుని మొదలు (క్రీ.శ 13 శతాబ్ది) లేపాక్షి వేంకట నారాయణ వరకు (క్రీ.శ 1900) దేశీయ నాట్య పద్ధతులు వివరించినారు. వానికానాడు రాజాస్థానాలలో ప్రజావళిలో ఎంతటి పేరు ప్రఖ్యాతముండెడివో! నేడు వాని పునరుజ్జీవనమొనర్చు కుతూహలము మనకు గల్గుట వాని భాగ్యము!

క్రీ.శ 1408 - 1503 కాలంలో అన్నమయ్య మార్గదేశీ సంగీత సాహిత్య సార్వభౌముడుగా, నాట్యాభినయ కళాకోవిదుడుగా తన సంకీర్తనలచే శ్రీ వేంకటేశ్వరుని మెప్పించిన పరమ భాగవతోత్తముడు - మహా భక్తుడు అన్నమయ్య సంకీర్తన కళా క్షీర సాగరమున భక్త్యామృతంతోపాటు నవరత్న నిధులుద్భవించినవి. ఎవరికే రత్నరాశులవసరమో, వారి యభిరుచినిబట్టి యత్నించి వానిని సేకరించుకొనవచ్చు. ప్రభువులు సంగీత నాట్య కళా కోవిదులు - ఆధ్యాత్మవిధులు - శృంగార విలాసులు - వైరాగ్య కాంక్షులు - ఉభయ భాషా విశారదులు - నారీమణులు - బాల బాలికలు - జానపదులు - సాంఘికాచార వర్తనులు - వివిధ గుణ స్వభావ వర్తనులు - గ్రహింపగలిగినంతవారు గ్రహింపవచ్చు.

అన్నమయ్య కూచిపూడి నర్తనము చూచి నాడో లేదో! కూచిపూడి భాగవతులు అన్నమయ్య సంకీర్తన స్వారస్యము నెఱిగిన వారో కారో! సిద్ధేంద్ర యోగీంద్రుల తొలి భామా కలాప నృత్య విశేషమెట్లుండెనో? అదెట్లు ప్రయుక్తమో? అది ప్రజాభీష్టమును బట్టి, కాలమును బట్టి, తరువాత వచ్చిన సంప్రదాయ ప్రవర్తలు ప్రయోక్తలై ఎన్నో మార్పులు చేసినారన్నది విదితమగుచున్నది. తెలుగునాట వెలసిన భాగవత మేళములకు ఒక్కొక్క దానికి ప్రత్యేక ప్రత్యేక నట్టువ సంప్రదాయము లున్నవని తెలియుచున్నది.

అవి దేనువకొండ - కాకర్ల - కూచిపూడి - మేరటూరు - మైనంపాడు - కపట్రాల - కోరుకొండ - రాజువారి సీమ భాగవత మేళములలో నట్టువ సంప్రదాయము లున్నట్లు తెలియుచున్నవి. ఒక్కొక్క సంప్రదాయము ఒకదానిలో నొకటి అంతో యింతో మిళితమై ప్రచారమునొంది యున్నదన్న సత్యదూరము కాదు. తమిళుల నట్టువ సంప్రదాయములున్ను వీనిలో చోటు చేసికొనియున్నవన్న అతిశయోక్తి కాదు. యక్షగాన విధానమును వీనియందు అనుసరణీయమైనది.

2

రాయలసీమలోని రాజువారి (మట్లి రాజుల పాలనా ప్రాంతము) సిద్ధవటము- పొత్తపినాడు అనగా కడప-చిత్తూరు - అనంతపురం - కర్నూలు మండలాల్లో మట్టిరాజుల వశమై పాలితమైన ప్రాంతములో లేపాక్షి - పెనుగొండ - బద్వేలి - చిప్వేలి - టంగుటూరు - ఎల్లంపేట - ఓరంపాడు - సిద్ధవటం - రాయ

చోటి - పుంగనూరు - శ్రీకాళహస్తి - కార్వేటినగరం - కరిం
బేడు - మన్నారుపోలూరు - వెంకటగిరి - తుంబూరు - లలో
ఎందరో నట్టువకారులు, నట్టువకత్తెలు రాజ పోషణలో, దేవా
లయ నిర్వాహకుల పోషణలో పూర్వం వారి నట్టువ సంప్రదాయ
ములు మంచి స్థితిలో నుండి క్రమంగా పతనమైనవి. దేశస్వాతం
త్ర్యము వచ్చిన తర్వాతనైన వాని పోషణ బాధ్యతలనెవరు
స్వీకరించనందున క్రమంగా ఆయా సంప్రదాయకర్తలు కీర్తి
శేషులగుట వల్ల, వారు తమవారికి తమ సంప్రదాయమునందు
భావి కాలంలో బ్రతుకుతెరువు లభించుట దుర్భరమని భావించి
సంప్రదాయకులు చెప్పకపోవుట వల్ల, ఆయా ప్రాంతములందలి
ఆయా నట్టువరీతులు సంప్రదాయములు నశించిపోయినవి. ఏ
విద్యయైన పరం పరగా సంప్రదాయము ననుసరించిననేగాని
నిలువ నేరదుగదా! నేను వానినెంత యుద్ధరింపదలచి యత్నించి
నను లాభము లేక పోవుచున్నది.

మన పూర్వులు వ్రాసిన పుస్తకములలో చూచి లక్షణ
ముల గుర్తించి లక్ష్యము లేక అభ్యసనమొనర్ప వీలుగాక మన
పూర్వులెంతటివారు! అని లొట్టలు వేసికొని తృప్తి పడవలసినదే
ఇపుడేమియు చేయలేము. ఆ గ్రంథములైనను పోయినవి పోగా
దక్కినవి కొన్నే - అదిమన అదృష్టము! అనాటి నట్టువ పద్ధతులు
కొన్ని నేటి జానపదులలో అటనట నున్నవి. కాని, వానిని గుర్తెరిగి
అది ఫలానా - అని చెప్పగల్గిన లక్షణజ్ఞులే నేడు కరువైనారు.

ఇప్పటి నాట్యాచార్యులు కచ్చేరీ నాట్య పద్ధతిని మార్గ
దేశీయములతో కలగా పులగంచేసి యేర్పరచుకొని దానికి కూచిపూడి
వారి నాట్య ప్రయోగరీతి ఆధారమనుచున్నారు. అసలు కచ్చేరీ
నాట్య పద్ధతికి కూచిపూడి వారి నాట్య ప్రయోగానికి సంబంధంలేదు.
ఒక దానికొకటి యాధారము కాదు. ఈ విషయాన్ని నాట్యాచార్య
శ్రీ నటరాజ రామకృష్ణ గారు కచ్చేరి నృత్య పద్ధతి రాజాస్థానాల్లో
అభివృద్ధినొంది ముఖ్యంగా దేవదాసీలచే ఆరాధింపబడి ప్రదర్శింప
బడు నట్టువ మేళవిద్య అనీ, అది సంస్కరింపబడి నేటి భరతనాట్య
స్వరూపము (పూర్వ పద్ధతి కాదు) దాల్చినదనీ, ఆ నృత్య పద్ధతికి
కూచిపూడి వారి భరత సంప్రదాయమునకు నెట్టి సంబంధము
లేదన్నారు. (చూ. అం. వి. సర్వస్వం) కచ్చేరి నృత్యాల్లో ఒకే
నర్తకి నాట్యం చేస్తుంది. ఇందులో నృత్య, నృత్త, అభినయాలు
సమపాళ్ళలో పోషిస్తారనే శ్రీ రామకృష్ణ గారి అభిప్రాయంతో
మనం ఏకీభవించాలి.

3

అన్నమాచార్య సంకీర్తనము లందలి నాట్య సంప్రదాయ
ములు అనాటి పొత్తపినాడులోని రాజువారి సీమకు చెందిన బద్వేలి
చిట్వేలి - టంగుటూరు - ఎల్లంపేట - ఓరంపాడు సిద్ధవటం -
శ్రీకాళహస్తి - కార్వేటి నగరం - కరింబేడు - లలో, మన్నారు
పోలూరు - వెంకటగిరి - తుంబూరులలో, లేపాక్షి - పెనుగొండ -
ప్రాంతాలలో నట్టువ రీతులున్నవనుటకు సందియం లేదు.
ఈ ప్రాంతములు అనాడు విజయనగర సామ్రాజ్యానికి చెందినవే.
ఆ నట్టువ రీతులు ఈ ప్రాంతమున గల ఏనాదులు - జంగములు-
ముత్తరాచలు - మరాటీలు - నట్టువవారు - దేవాంగులు - హరి
జనులు - మున్నగు వారి కథ నక్కడక్కడ క్వాచిత్కముగ
నున్నదని తెలియుచున్నది. కాని, అదియును నేడు సంకరమే
కావచ్చు. వీరు సాధారణంగా నట్టువ వృత్తి గల దేశదిమ్మరులు.
కొందరు వ్యాపారులుగా, వ్యవసాయ దారులుగా, ఉద్యోగులుగా
ఇతరవృత్తులను స్వీకరించి బ్రతుకుచున్నారు. నేటి నాగరికత
ప్రభావమున తమ ప్రాచీన సంప్రదాయ విద్యలను విస్మరించినారు.

ఈ ప్రాంతముల వెలసిన ప్రాచీన కవులు వాని రీతులను
తమ కావ్యాలలో భద్రపరచినందున వానిని గూర్చి కొంత మనకు
తెలియుచున్నది.

నేడు కళాభిజ్ఞులు కొందరు పశ్చిమ నృత్య పద్ధతిని కూచి
పూడి వారి నృత్యరీతికి ముడిపెట్టి దాని ననుకరించుచున్నారు.
అందువల్ల నేటి నృత్యపద్ధతి యొక్క పంథాననుసరించి ప్రయోక్త
మగుట లేదు. అది విచారకరము! ఏఏ రీతిని ఆయా రీతి ప్రయో
క్తనున దర్శించిననేగదా, ఆనందము!

4

'అలరులు గురియగ' అను సంకీర్తనమున అన్నమయ్య
తెల్పిన అనాటి నృత్యరీతిని, ఆ సంప్రదాయము నించుక వివరిం
తును. విజ్ఞులు పరిశీలింతురు గాక!

సంకీర్తన : రాగం : శంకరాభరణం తాళం : ఆది

పల్లవి॥ అలరులు గురియగ - నాడెనదే
అలకల గులుకుల - నలమేలు మంగ ॥అ

చ. 1) అరవిరి సొబగుల - నతివలు మెచ్చగ
అరతెర మరుగున - నాడెనదే
వరుస పూర్వ దు - వాళపు తిరుపుల
హరి గరగింపుచు - నలమేలుమంగ ॥అ

2) మట్టపు మలపుల - మట్టెల కెలపుల
తట్టెడి నడపుల - దాటెనదే
పెట్టిన వజ్రపు - పెండెపు తళుకులు
అట్టిటు చిమ్ముచు - నలమేలు మంగ ॥అ

3) చిందుల పాటల - శిరిపాల యాటల
అందెల మ్రోతల - నాడెనదే
కందువ తిరువెం - కటపతి మెచ్చగ
అందపు తిరుపుల - నలమేలుమంగ ॥అ

ఈ సంకీర్తనము నందు క్రింద గీతలు గల పదములు దేశినాట్య రీతులను దెలుపునవి. వాని అర్థముల వివరణము పరిశీలింపుడు—

అలరులు గురియగ=పూలవాన కురిసినటు-దీన్ని 'అలరిప్పు'- పుష్పాంజలి-అంటారు. దేశి పద్ధతిలో 'ఆతోద్యమేలనం పూర్వం సమహస్త మతఃపరమ్ । యతి ప్రహరణే శూన్యే పుష్పాంజలి రతః పరమ్' అనగా మొదలు సమహస్తంతో వాద్యాల మేళవింపు; తర్వాత ప్రహరణం; ఆపై శూన్యమున పుష్పాంజలి ప్రయోగింపవలెను. ఇది ఆది, అంత్య అనీ, పూర్ణ, లఘు అనీ భేదాలు.

అరవిరి సొబగులు = అలపల్లవ, పద్మకోశహస్త విన్యాసమున సంయుత హస్తమును గూర్చి పూవులు విచ్చినట్లు సూచించు చల్లు నాట్య విన్యాసపు సొగసులు.

అర తెర = నేపథ్యం - అర్ధ యవనిక - తెరలంటే మన కిష్టమైన గుడ్డలను తెరలుగా నుపయోగింపరాదు. 'అష్టా రత్ని కృతాయా మాః తదర్ధేన తు విస్తృతాం పురో యవనికా శ్చిత్రాః సూచీ విజ్ఞాన భంగిభిః । తి ప్రస్తతోధికా వాస్యుర్యథావాద్యం యథా రుచి-' ఎనిమిది మూరల వెడల్పు నాల్గు మూరల పొడవు గల్గి సూదికుట్టు పనితనముతో (ఎంబ్రాయిడరీ) వింతగొల్పునట్లు మూడుగాని, అంతకెక్కువగాని వాద్యముల ననుసరించి రుచికొలది నుండవచ్చును. 'కర్పూర ధూప సంకాశశ్వే(ప)తాంశుక తిరోహితా, సద్యః క్షీరాబ్ధి జాతేవ తిష్ఠేత్ లక్ష్మీః పతిం వరా -' కర్పూరపు పొడివంటి తెల్లని (కర్పూరమువంటి పచ్చని) వలిపెము మరుగున నర్తకి అపుడే స్వయంవరానికై పాలసంద్రమునుండి వెడలిన మహాలక్ష్మివలె నిల్చియుండవలెను. అంటే నగిషీ పనులు చేసిన తెల్లని తెర సగ భాగమునందు మరుగున శుభాలంకారములతో నర్తకి నిల్చియుండవలెను.

నర్తకి యాడుచు అంగుళీస్ఫోటనము చేయునపుడు (చేతి వేళ్ళు వికసింపజేసి తెరను ఛేదించు ప్రయత్నము చేయునపుడు) తెరను పట్టుకొన్న అందకత్తెలు నర్తకి వక్షస్థలము వరకు దించి మరల పైకెత్తుచుందురు. ఈ లా రెండుమార్లు అంగుళీ స్ఫోటనము చేసిన తర్వాత పుష్పాంజలికి పూర్వం ఇద్దరు స్త్రీలు పాట బంధములతో క్రమంగా పాత్రమున కెదుటనున్న మొదటి తెర దక్కా తక్కిన రెండు తెరలను తొలగింతురు. మూడవసారి అంగుళీ స్ఫోటనము చేసిన తర్వాత మూడవ తెరను తొలగింతురు. ఇది పాట బంధాలతో శబ్దముల కడపట వాద్యాలన్నీ ఒకేసారి చెవుల కింపుగా మ్రోగుచుండగా చేయవలెను. 'తృతీయో పీఠ (పాట) బంధస్య శబ్దేనాంతేఽ ప సర్పితా । సర్వాతోద్య నినాదేషు యుగపత్ శ్రోత్ర హారిషు' (నృ. ర)

మూడు తెరలనుపయోగించుట జాయ సేనాపతి కాలమునకు పూర్వమునుండే యున్నది. అంగుళీ స్ఫోటనాన్నిగూర్చి పాల్కురికి సోమన తన పండితారాధ్య చరిత్రంలోపేర్కొన్నాడు. రాను రాను మూడు తెరలు పోయి ఒకే తెర వాడి మూడు మార్లు అంగుళీ స్ఫోటనము చేయుట జరిగెడిదట; ఇప్పుడది పాశ్చాత్య రీతిని బడి పోయినది. అంగుళీ స్ఫోటనము పూర్వరంగమునుండి నర్తకి రంగ ప్రవేశము చేయుచున్నదనుటకు సూచన -

పూర్వపు దువాళపు తిరుపులు = పూర్వరంగమున - (దువాళపు = వేగముగ) వేగముగ చేయు వీణాది వాద్య గతులు, పంద్రెండు సంగీత భేదములతో చేయునవి.

మట్టపు మలపులు= తక్కుతాలమున పాదములుంచి మెలి పెట్టినట్టు తిరిగి చేయు మండల నర్తనములు (తాలముగగా నాట్య మండల ప్రయోగమునందు పాదముల మధ్య దూరము జానెడు).

మట్టెల కెలపులు = మెట్టెల శబ్దములతో - కెలపు అన ఆంధ్రమున పార్శ్వమన్నారు. కన్నడమున పెద్ద శబ్దముచేయుట, గర్జన, హుంకరించు అనుట.

తట్టెడు నడపులు = పాదములు క్రింద తట్టుచు చేయు పాదచారములతో హస్త విన్యాసములతో చేయు అభినయములు.

వజ్రపు పెండెపు తళుక్కులు = ధరించిన అభరణములందలి రత్నకాంతులును, కాలియందు ధరించిన పెండేరమందలి వజ్రాల కాంతులు. 'తళుక్కు' అన్నది - నాట్య విన్యాసమున నర్తకి హావ భావ ప్రకటనము చేయునపుడు చూపెడు సొగసు. ఇది క్షణికము - మెఱపు మెఱిసినట్లుండును.

అట్టిటు చిమ్మి = (అట్టి + ఇటు) పాదము మెడముతో తొట్టి తట్టి ముందు పాదముతో చిమ్ముచు చరించుట.

చిందు = చిందను నర్తనము - తమిళమున 'శిందు' అని వ్యవహారము. మన పూర్వులు 'తొలుకు మాతంగ నాట్య' మన్నారు. ఇది బజ్జవ భేదము.

శిరిపొల యాటలు = ప్రణయ కలహ సూచితమైన నాట్యం కావచ్చు 'శిరి పింగిణావర్తి' అను బాల్యక్రీడా విశేషమువంటి యాట కావచ్చు - కన్నడంలో సీఱ్ అను ధాతువునకు కోపపడు- అని, జగడమాడు అని యున్న భావము తగును. తెలుగు కన్నడములు ద్రావిడ భాషా కుటుంబములోనివి — పరస్పర ప్రయోగములు కలవు గదా!

అందపు తిరుపుల = అందమైన అభినయముల, మండల నృత్యములతో — ఇది తిరుగుడు మెట్టడవ భేదము.

5

వీనికి మన పూర్వ కావ్యాలనుండి కొన్ని ప్రయోగాలు లక్షణాలు వివరణములు పరిశీలింతురుగాక:

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర :

"....   .... పుష్పమాలికలు
దాల్చి యత్యద్భుతోత్సవ లీలదనర
జనులు హర్షింప నాస్థానముల్ సొచ్చి
యనుకూల విధ వాద్య సమేళనమున
నార్పటం బిచ్చి యొయ్యన జవనికల
గర్పంబు వెడలి యక్కజము వట్రిల్ల
నాడక ముందఱ నభినయం బొలయ
జూడక ముందఱ జోద్యంబు దనర
నిక్కుచును ద్రిభంగి నిలుచుచునల్ల
చొక్కుచు సభఁజూచి యొక్కింత నగుచు
నలినంగ సంచలనము నందగతుల
లలిగొని భ్రూలతలన నర్తనంబు
మొనయుచు చిత్తోల్లాసమునను రంజకత
దనరఁగటాక్షంబునను గుళలంబు
లలరి, శిరః కంప మాచరించుచును
నలినంగుళి స్ఫోటనంబు సేయుచును
లాగు, పంజళము, దాళము, వళి, దిరువు
బాగు, వాహిణి, సాళి, బయగతి, సుగతి
బహుగతి, గతియునాఁ బరిపాటి దనర
సహజమై తనుగతి స్వర వంచనములు
బటు రసాలంకార భావముల్ దనర
స్ఫుట వాద్యతాళ సంఘటన ఘటిల్ల
దనుపాద ఘట్టన దనరు నుద్ఘట్టన
లనునయించుచు నందియల్ గదల్చుచును
'నోహో!' యనుచు గతులొడ్డలించుచును
'నాహా!' యంచు లాస్యమనునయించుచును
జతులు వాడుచు దాళగతుల కాడుచును
శ్రుతులఁగూడుచు నేల ద్రొక్కి నోడుచును.

ఇందు పుష్పాంజలి- అస్థాన ప్రవేశము- పూర్వరంగమున వీణాదివాద్య సమేళనము - అంతరము - ఉదరగతి - ఉప్పరవట్ల కంఠగతి, గమళాయి, నాభిగతి, భగాస్థానము, మందరణ, వళిగ, వాళ, విజయస్థానకము, స్వరగత అగు ప్రపండెడు తిరువులు చేయుట - తెరలనుండి వెడలుట - అంగుళీస్ఫోటనము చేయుట - యవనికలు తొలగించుట - స్వరమేళనముల రసాలంకార భావాలతో వాద్యతాళ సంఘటనలతో, తను పాదఘట్ట నాదులతో అందెలు గదల్చుచు, 'ఓహో! - అహా!' అని 'లాగు' మొదలగు గతుల లాస్యము చేయుచు, జతులు పాడుచు, తాళగతుల కాడుచు, శ్రుతుల గూడుచు నర్తకి చేయు నాట్యక్రమ విన్యాసము సూచింపబడినది - ఈ క్రమాన్నే అర్వాచీనుడైన దామరాజు సోమయ్య తన ఆంధ్ర భరతమున నిట్లు సూచించినాడు.

సీ॥ 'మొదలి పుష్పాంజలి ముదమున గాంచి
కరబాళి మొగబాళి సరవులెత్తి
యురుపృథు బాళము లొగిఁబిల్లమురువును
హస్త ప్రకరణము లే ననుచు చఱచి
కడకట్టు శబ్దంబు కడగి దర్వును
జిందు బాగైన గీత ప్రబంధములును
కుండలి బహురూప దండలాస్య విలాస
దేశి మార్గంబుల తెరువు తెలిగి

గీ॥ నయము బిఱుసును సరిగతుల్ కడిదిగాను
తిరువు మరువును నిలకడ తిన్ననగుచు
పాత్రి గొనిపించఁ గొనఁ గను ప్రౌఢిమైన
వాడె నటుఁడన బరగు నీ వసుధ యందు.'

సోమన లిరువురు సూచించిన నాట్యసంకేతములకు పరస్పర భేదములు గమనింపుడు. సంప్రదాయమొకటే -

6

పై నుదహరించిన కవులు పేర్కొన్న నాట్యసంకేతములలో తిరుపులు అనునవి వీణాదివాద్య స్వరముల యొక్కయు, సంగీతము యొక్కయు భేదములనీ, అభినయ భేదములలోని గతి విధానమనీ, స్పష్టమగుచున్నదిగదా!

అన్నమయ్య కీర్తనలోని 'పూర్వదువాళపు తిరుపులు' పూర్వరంగమున వడిగా చేయు వీణాదివాద్య స్వరగతుల భేదములు తెల్పును-'అందపు తిరుపులు' అభినయ గతులను తెల్పును. తట్టెడు నడవులు దేశి సంప్రదాయానికి చెందినవై ముప్పదిరెండు విధాలు జంప, తట్టు, జగ్గు, జారు, తిరుగుడు, ఒంటి, జంట, దాటు, ఉబుకు, బజ్జ మున్నగు భేదాలతో నున్నవి. (వీనిగూర్చి లేపాక్షి వేంకట నారాయణ కవి తెల్పిన విధములు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నృత్తరత్నావళీ పీఠికలో పదునైదు అడవులను గూర్చి తెల్పినారు. బజ్జడవను గూర్చిన పద్యమొకటి మా కడనున్నది. అందులేదు. దానితో ముప్పదిరెండడవులలో పదహారు మాత్రమే లభ్యములు.)

అన్నమయ్య కీర్తనలోని 'తట్టెడు నడవులు'-'అట్టిటు చిమ్ము' 'మట్టెపు మలపులు'-'చిందు'-'అందపు తిరుపులు'- అనునవి ఈ అడవులలోని భేదములే - చూడుడు.

తట్టెడు నడవులు:- జంపడవ, తట్టు జగ్గడవ, తట్టు పెన్నడవ-అనునవి-ఉదా:-జంపడవ

'వగలు మిగుల పతాకంబు పరగబట్టి
ముదముతో బాహువులు భుజములకు సమము
గాను నిరు పార్శ్వముల నిల్పిగళము గుల్క-
అడుగులను తట్టు తట్ట జంపడవ యగును'

అట్టిటు చిమ్ముట:-ఇది ఒంటిమెట్టడవ భేదము-
'సమముగా పాదములు నతిక్రమము గాను
పార్శ్వ భాగంబులకు మునిపాదమెత్తి
మెడిమతో నొక్కటొకటి మీటు వెలయ
మీటుచును రాగనది యొంటిమెట్టయడవ'

మట్టెపు మలపులు :-ఇది తట్టు పెన్నడవ
'నిండు కుడి పాదమును ధరనుండజేసి
యించు కంతను యెడమ కాలుంచి పెనయు
గాన వెనుకకు నిడి, తగ్గి, కాళ్ళు తట్టి
నడపగాని నిది తట్టు పెన్నడవ యగును.'

చిందు : ఇది బజ్జడవ
'కుడిపాదమెత్తినపుడు నెడమచేయి
నెత్తి శిరము దాకగబట్టి యెత్తి యెడమ
కాలు నెత్తిన కుడిచేయి తలకుపైన
పట్టి తిరుగుడు తట్టగా బజ్జడవగు'

కావున ఈ సంకీర్తనమున అన్నమయ్య సూచించిన నాట్య లక్షణ సంకేతములు అచ్చపు దేశి పద్ధతిలోనివని స్పష్టముగా తెలియుచున్నది. అన్నమయ్య దేశి నాట్య సంప్రదాయమును చక్కగ నెరిగినవాడు. అతని నాట్య సంకీర్తనములు పెక్కులు అభినయాత్మకములై యున్నవి. వానిని పరిశీలింపవలసి యున్నది. అది నాట్యకళాభిజ్ఞులు చేయవలసినపని-అనాటి నృత్యపద్ధతిని విస్మరించి నేటి పద్ధతు లాకీర్తనలకు సమన్వయింపరాదని మనవి!

మరికొన్ని అన్నమయ్య సంకీర్తనల యభినయ కళా కౌశలమును విజ్ఞులముందుంచుటకు యత్నింతును. మన్నింతురుగాక!

డా॥ బాలాంత్రపు రజనీకాంతరావుగారు (12.5.82 ఆంధ్రప్రభ వారపత్రిక అన్నమయ్య ప్రత్యేక సంచిక) ఈ అన్నమయ్య కీర్తనకు కూచిపూడి నృత్య సంప్రదాయమునకు జోడించి వివరించుటకంటే ఆసంకీర్తనమందలి మనదేశి నర్తన సంప్రదాయముల సొగసులు వివరించిన బాగుండెడిది. అన్నమయ్య పాటకు భాగవతుల ఆటకు జతకూర్ప చాల శ్రమపడినారు. అదివృధా! ఈ అన్నమయ్య సంకీర్తనలో భాగవతుల ఆటలోని 'జతపట్టు' లేదు.

ఈ అన్నమయ్య సంకీర్తన భావం సంగ్రహంగా -

'పుష్పాంజలి బట్టి, ముంగురులు గుల్క, అరవిరులు చల్లి, సాటి వనితలు (నర్తకి పరంగా సాటి నర్తకులు) మెచ్చునట్లు క్రమంగా పూర్వరంగమున చేయు వీణాది వాద్యగతుల నటింపుచు, అర తెరల మరుగునుండి వెడలివచ్చి, హారిమురియగ పాదములను మెలిపెట్టి మండల నృత్యములు చేయుచు మెట్టెల సవ్వడులు వెలయ పాదాలు తట్టుచు, నడవులాడుచు, దాటుచు, పాదముల దాల్చిన వజ్రపు పెండేరముల కాంతులు ప్రసరింప, చిందు నృత్యము చేసి ప్రణయకలహ సూచితమైన యభినయములు, (శిరిపొలయాటల) అంచెల మ్రోతల అందమైన సాత్వికాభినయ మండల నర్తనములు గావించి తిరువేంకటపతి మెచ్చునట్లుగ అదిగో! ఆడుచున్నది!'

ఈ సంకీర్తనంలో అనాటి నర్తన క్రమవిలాసం చెప్పబడి. నది గ్రహింప ప్రార్థన!

రక్తం కాదు మట్టి!

నా మూర్తిలోని
నరనరాల్లోనూ
ప్రవహిస్తున్నది
పొంగారు తున్నది
పొంపిరి వోతున్నది
చిక్కని రక్తం కాదు
నునుపయిన మట్టి !
దానిలో - సర్వదా
తరుణమయిన "కారుణ్యపు మొలకలు"
మొలుస్తుంటాయి
సాంద్రారణ్య మండలాలుగా బలుస్తుంటాయి !
ఇంపయిన "ప్రేమఊటలు"
ఊరుతుంటాయి
వాగులు వరదలుగా పెరుగుతుంటాయి !
కుదురయిన "గట్టి గుట్టలు"
ఏర్పడుతుంటాయి !
వరుసలు వరుసలుగా వ్యాపిస్తుంటాయి !
అవి
భిన్న భిన్న సమస్యలతో
ఆకులపాటు నొందుతున్న
దీనులకి
ఆశ్రయంగా నిలుస్తుంటాయి !
వెతల బరువులతో
సొమ్మసిల్లిపోతున్న
బలహీనులకి
ఆర్ద్రతను పంచిపెడుతుంటాయి
అల్పిష్ట విషయాలకి సైతం
వెన్నిచ్చి పారిపోతున్న
పిరికి పందలకి
బిగువును బోధిస్తుంటాయి !

"శ్రీ కాళహస్తి"

ప్రభూ !
నాలో అల్లుకొంటున్న
"ఈర్ష్యా తంతువుల్ని"
మూలముట్టుగా
కాల్చివేయి !
నువ్వు "అగ్నినేత్రుడవు" గదా !
నాలో మడుగు కడుతున్న
"ద్వేష గరళాన్ని"
వళువట్లు గొనునట్లుగా క్రోలివేయి !
నువ్వు "శ్రీకంఠుడవు" గదా !
నాలో రెక్కొంటున్న
"శౌర్య మదాన్ని"
సమగ్రంగా
అణచివేయి !
నువ్వు "శూలివి" గదా !
నన్ను బాగుపరచి
"సువర్ణముఖి" తీరాన వెలసిన
"శ్రీకాళహస్తి" గా
మార్చివేయి !
నువ్వు "జ్ఞాన ప్రసూనాధిపుడవు"
గదా !

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

వేములవాడ భీమకవి కాలము

జనవరి '83 భారతి. కలగూరగంపలోని శ్రీ సూర్యదేవర రవికుమార్ గారి "భీమకవి కాలము" అను విమర్శయందు పూర్వ పక్షముల పునరుద్ధరణములు, అప్రామాణిక విషయముల అను సంధానములు, అవిచార మూలకములైన అకాండ తాండవములు కలవు. అవి :

1. "కరీంనగర్ జిల్లాలోని వేములవాడకు లేములవాడ అను పేరున్నది. 'లేములవాడభీమ ! భళిరే ! కవిశేఖర సార్వభౌమ ! అను చాటువును ఉదాహరించుచు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 'ప్రబంధ రత్నావళి' పీఠికలో 'ఈ పద్యమున లేములవాడ అనియే కలదు. తక్కిన భీమకవి చాటువు లన్నిటిలోఁగూడ లేములవాడ పాఠమున్నది' అని వ్రాసిరి."

"కరీంనగర్ జిల్లాలోని వేములవాడకు లేములవాడ అను పేరు" లేదు. కరీంనగర్ జిల్లాలోని లేములవాడకు కాలక్రమమున వేములవాడ అనుపేరు వచ్చినది. ప్రాచీనములైన కావ్య గ్రంథములందు మాత్రమేగాక, సంస్కృత కర్ణాటాంధ్ర శాసనములందును లేములవాడ అనియే కలదు. "లేములవాడ భీమ! భళిరే!" అను చాటువు వేములవాడ భీమకవి ప్రోక్తము కాదని, అందలి "భీమ ! కవిశేఖర సార్వభౌమ !" అను సంబుద్ధులను బట్టియే స్పష్టము. అది వేములవాడ భీమకవి కాలములోని చాటువును కాదనుటకు ఆధారము కలదు. గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగ రత్నాకరమునందు ఇట్లు కలదు.

"వ. ఇంకా అభేదయతికే భాస్కరదేవుని లక్ష్యం. చాటువు.

ఉ. వేములవాడ భీమ బళిరే కవిశేఖర సార్వభౌమ నీ
వేమని యానతిచ్చితివి యిమ్ముల కోమటి పక్షపాతివై
కోమటి కొక్కటిచ్చి పదిగొన్నను దోసము లేదటంటివా
కోమటి కొక్కటిచ్చి పదిగొన్నను ధర్మము ధర్మపద్ధతిన్."

ఇది ప్రథమతః భాస్కరదేవుని ఛందోగ్రంథములోని లక్ష్యము. తదుపరి గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగ రత్నాకరములోని సాక్ష్యము. ఎందుకు ? అభేదయతికి. పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము లోని వేములవాడ భీమకవి కవిజనాశ్రయమునందు అభేదయతి లేదు. పదునైదవ శతాబ్ది పూర్వార్ధము తొలి భాగము లోని చిన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణియందును అభేద యతి లేదు. మలి భాగములోని అనంతామాత్యుని ఛందోదర్పణమునందు అభేదయతి కలదుగాని (126 ప. 1 ఆ.) అది వ, ప, బ లకు పరిమితము. ఇది రేఫలకారయతి విషయము. ఇట్టి అభేదయతి శ్రీనాథుని నంద నందన చరిత్రము నందు కలదని ప్రయోగ రత్నాకరమునందే కలదు. కాశీ ఖండము నందు కలదుగాని పాఠాంతర గ్రస్తము. (210 ప. 6 ఆ.) ఆదే శతాబ్ది ఉత్తరార్ధములోని భైరవుని కవి గజాంకుశము యతి ప్రకరణము అనుపలబ్ధము. పదునారవ శతాబ్ది ప్రథమ పాదములోని వెల్లంకి తాతంభట్టు కవి చింతామణియందు వ, ప,బ లకు పరిమితమైన అభేదయతి కూడ అసంగతవళి అయినది. (58 ప. ప.ప్రా. అ.) ద్వితీయ పాదములోనిదగు అప్ప సన్నయభట్టు లక్షణ సారము నందు అభేదయతి సంగతమయినట్లు, తదనంతరకాలికమగు అజ్ఞాత కర్తృకమైన లక్షణ విలాసమునందు రేఫలకారయతి విషయికమైన అభేదయతి సమ్మతమయినట్లు, పదునారవ శతాబ్ది ఉత్తరార్ధములోని లింగముగుంట తిమ్మకవి సులక్షణ సారమునందు కలదు. (146, 147 ప.) కనుక రేఫలకారయతి మైత్రికల చాటువు అర్వాచీన కాలికము. ఇట్టి చాటువు వేములవాడ భీమకవి చాటువుకంటె చరితార్థము కాదు.

ఇక వేములవాడ భీమకవి"చాటువులన్నిటిలోఁ గూడ లేములవాడయను పాఠమున్నది" అని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిరి గాని, వారే ప్రకటించిన చాటు పద్య మణిమంజరి లోని వేములవాడ భీమకవి చాటువులందు ఒక్కటనుగూడ "లేములవాడ" అని లేదు (పు. 73 - 77). అనగా చాటుపద్య మణిమంజరికి ఆధారభూతమైన సి. పి. బ్రౌను దొర సంఘటించిన "చాటు ధారా పద్యములు" అను సంపుటమునందును లేవని అవగాహన మగును. ఉన్నచో, ప్రభాకరశాస్త్రిగారు "వేములవాడ" అని ప్రకటింపరు కదా !

"వేములవాడ భీమకవి వేగమె చూచి కళింగగంగు —"

ఇట్లు 1893 వ సంవత్సరమునందు ముద్రితమైన గురజాడ శ్రీరామమూర్తి గారి కవి జీవితములు అను గ్రంథమునందు కలదు. 1913 వ సంవత్సరమునందు ముద్రితమైన వేటూరి ప్రభాకర శాస్త్రి గారి చాటు పద్య మణిమంజరియందును ఇట్లే కలదు. (పు. 76) కవి జనాశ్రయము పీఠికయందు జయంతి రామయ్య పంతులుగారు ఉదాహరించిన (1917) "లేములవాడ భీమునవలీలనుజూచి" అను పాఠాంతరమునకు ప్రాచీనమైన ఆధారము మృగ్యము. అంతేకాదు. పదునైదవ శతాబ్ది పూర్వార్ధములోని శ్రీనాథుని కాశీ ఖండము

మొదలు, పదునెన్మిదవ శతాబ్ది పూర్వార్ధములోని ఓరుగంటి రామకవి కవితాలక్షణసారము వఱకును ముద్రితాముద్రిత గ్రంథములందు వేములవాడ భీమకవి అనియేగాని "లేములవాడ భీమకవి" అని లేదు. "రాము నమోఘ బాణమును" అను చాటువునందు "వేములవాడ భీమకవి పీమని" అని కలదు.

2. "కొఱవి గోపరాజు తన 'సింహాసన ద్వాత్రింశిక'లో భీమ కవిని ఒక కంద పద్యమున నుతించినాడు..... 'భీమన పద్యమన్నఁ గడుఁ బ్రీతి వహించుచు మేలు మేల'ననని కూడ గోపరాజు చెప్పినాడు.... గోపరాజు 13 యతులను చెప్పిన సందర్భమున భీమకవి పద్యములను అనుకరించినాడు.....భీమకవిపై గోపరాజింత అభిమానమును ప్రదర్శించుటకు గల కారణము ఇరువురు ఒకే ప్రాంతీయులు కావటమే."

కొఱవి గోపరాజు భీమకవిని ఒక కందపద్యమున నుతించిన మాట నిజమే. ఏమని?

"లేములవాడక శుచియై
లేములవాడం జరించు లేమలవాడం
దామెఱసిన భీముని నుత
భీముని బలభీము విమత భీమునిఁ దలఁతున్" 11 ప. 1 ఆ.

అను పద్యమునకు అర్థమేమి? ఇందలి పూర్వార్థము "వేములవాడక సుఖియై వేములవాడం జరించి వేములవాడన్" అని కలదు అరుద్రగారి ఉదాహరణమునందు; కాని వేములవాడ యమకమునకు గమకము లేదు. అర్థము రాదు. కనుక అప్రామాణికము. కావ్య పాఠమునందు లేములన్=దారిద్ర్యములచేత, వాడక =స్రుక్కక, శుచియై=శుభ్రత కలవాడై [ఇట "సుఖియై" అను పాఠాంతరము కలదేని, అది ఎక్కువ అర్థవంతము] లేములవాడన్= లేములవాడయందు, చరించు = తిరుగునట్టి, లేమల=యువతుల, వాడన్=వీధియందు అని ప్రతిపదార్థము. లేములవాడయందు తిరుగునట్టి యువతుల వీధి అనగా వేశ్యవాటిక అని తాత్పర్యము. అట భీమకవి మెఱసెను. అనగా తళుక్కుమనెను. అనగా వేములవాడ భీమకవి లేములవాడలోని వేశ్యవాటిక యందు కొంది కాలము విహరించెనని ఫలితార్థము. వేములవాడ భీమకవి కొంత కాలము లేములవాడయందు నివసించెనని సారాంశము. కనుక లేములవాడ-వేములవాడ భీమకవి జన్మస్థలము కాదు, వాసస్థలము. అది సరే, కొఱవి గోపరాజు పూర్వకవి స్తుతియందు వేములవాడ భీమకవిని కవిగా స్తుతింపక, వేశ్యాలోలునిగా నుతించుటకు హేతువు అభిమానమా? ఏమైన కోపమా?

"భీమన పద్యమన్నఁ గడుఁ బ్రీతివహించుచు మేలుమేలునా
నేమిది చెప్పినారమన నిక్కమె ప్రాసము గూర్చినాఁడవో
నేమిది కాదు దీని వడికిక్కడ కర్థమిదెట్టి దీ గణం
బేమని పెట్టినాఁడవని యొగ్గులు పట్టుఁ గుబుద్ధి పెద్దలన్"
18 ప. 1 ఆ.

అను పద్యమునకు అర్థమేమి? పద్యము కుకవి నిరాకరణ ఘట్టములోనిది. (14-19 ప.) పద్యములోని కర్త కుబుద్ధి. అనగా కుకవి. భీమన పద్యమనిన ప్రీతివహించుచు మేలు మేలు అనునెడ, ఎవరైన పెద్దలు పద్యము చెప్పితిమనిన, పెద్దల పద్యములకు కుబుద్ధి తప్పులు పట్టునని తాత్పర్యము. ఇది వేములవాడ భీమకవి యెడల కొఱవి గోపరాజు అభిమానమును ప్రకటించునది కాదు. అసూయను ప్రకటించునది. అసూయ వలన కోపము జనించును. "కుబుద్ధి" అను ప్రయోగము కోపజనితము. భీమన పద్యములు మెచ్చుకొని (తనవంటి) పెద్దలపద్యములకు తప్పులు పట్టువాడు కుబుద్ధి అను గోపరాజు, భీమకవిని కవిగా స్తుతింపక వేశ్యా లోలునిగా నుతించుటకు హేతువు అంతస్తాపమైన కోపమే. అభిమానము కాదు. వేములవాడ భీమకవి పద్యములకు ప్రీతి వహించుట కొఱవి గోపరాజు కాలమునందు మాత్రమే గాక, అతః పూర్వము శ్రీనాథుని కాలమునందే కలదు. ప్రథమతః వేములవాడ భీమకవిని ప్రశంసించినది శ్రీనాథుడు. అదికూడ రాజమహేంద్రవర రాజ్యాధిపతి అల్లాడ వేమారెడ్డిచేత, కవిత్రయము వారికి కంటె ముందుగా అగ్రతాంబూల మిప్పించిన సందర్భము. అంతేకాదు. శ్రీనాథుడు వేములవాడ భీమకవి వలె ఉద్దండలీలను కవిత్వము చెప్పునని అల్లాడ వేమారెడ్డి కతపత్రము. ఇది వేములవాడ భీమకవి యెడల శ్రీనాథుని నిజమైన అభిమానము. నిండైన గౌరవము. అయినను వేములవాడ భీమకవి, శ్రీనాథుడు ఒక ప్రాంతము వారు కారు.

ఇక సింహాసన ద్వాత్రింశికయందు పదమూడు యతులేకాదు; ఆరు ప్రాసములును కలవు. కవి జనాశ్రయములోని పది యతులు సింహాసన ద్వాత్రింశికయందు లేవు. అనంతామాత్యుని ఛందోదర్పణములోని అనుస్వార, గూఢస్వర, నిత్య సమానయతుల అనుసరణము సింహాసన ద్వాత్రింశికయందు కలదు. అంతేకాదు. కవి జనాశ్రయమునందు సుకర, దుష్కర, ద్విప్రాస, త్రిప్రాస, అనుప్రాస, అంత్యప్రాస- ప్రాసక్రమము. ఛందోదర్పణమునందు దుష్కర, ద్వంద్వ, త్రిప్రాస, చతుష్ప్రాస, అంత్యప్రాస, అనుప్రాస - ప్రాసక్రమము. సింహాసన ద్వాత్రింశికయందును దుష్కర, ద్విప్రాస, త్రిప్రాస, చతుష్ప్రాస, అంత్యప్రాస, అనుప్రాస - ప్రాస క్రమము. ఉపరి, కవి జనాశ్రయములోని సుకర ప్రాసము ఛందోదర్పణమునందు లేదు. సింహాసన ద్వాత్రింశిక

యందును లేదు. కవి జనాశ్రయము నందు లేని చతుష్ప్రాసము ఛందోదర్పణము నందు కలదు. సింహాసన ద్వాత్రింశిక యందును కలదు. వేములవాడ భీమకవి కవి జనాశ్రయము కంటె, అనంతామాత్యుని ఛందోదర్పణము అనుసరణము సింహాసన ద్వాత్రింశికయందు అధికము. అయినను అనంతామాత్యుడు, కొఱవి గోపరాజు కూడ ఒక ప్రాంతమువారు కారు. అనుకరణమునకు హేతువు ప్రాంతీయాభిమానము కాదు.

3. "భీమకవి చాటువులలో పేర్కొనబడిన చాళుక్య చోక్క నృపాలాదులు రామగిరి దుర్గముతో సంబంధముగలవారు. ఈ రామగిరి కూడ కరీంనగర్ జిల్లాలోనిదే. కనుక భీమకవి జన్మస్థానము కరీంనగర్ జిల్లాలోని వేములవాడే."

వేములవాడ భీమకవి చాటువులలో పేర్కొనబడిన చాళుక్య చొక్కనృపాలుడు, సాహిణి మారడు, తెలుగు రాయలు రామగిరి దుర్గముతో సంబంధము కలవారని చెప్పిన సంగతియేగాని, కళింగ గంగు కాడుకదా! సజ్జనగరము కరీంనగర్ జిల్లాలో లేదుకదా!- లేములవాడ నుండి దక్షిణ కళింగ దేశములోని సజ్జనగరము వెళ్ళగా వేములవాడ భీమకవి వేములవాడనుండి లేములవాడ, రామగిరి, సజ్జ నగరము వెళ్లగలడు. గోదావరీ మండలములోని మడికి నుండి మడికి సింగన రామగిరి వెళ్ళినట్లు గోదావరీ మండలములోని వేములవాడనుండి వేములవాడ భీమకవి రామగిరి, లేములవాడ వెళ్ళవచ్చును. కనుక వేములవాడ భీమకవి జన్మస్థలము "కరీంనగర్ జిల్లాలోని వేములవాడే" కావలసిన అవశ్యకములేదు. గోదావరీ మండలములోని వేములవాడయును కావచ్చును.

4. "శివభక్తుడగుటవలన వివిధ శైవక్షేత్రములను సందర్శించియుండును. దక్షారామ మందలి భీమేశుని భక్తుడై 'దక్షారామ భీమేశ నందనుడన్' అని చెప్పుకొని యుండును. పాల్కురికి సోమనాథుడు బసవని భక్తుడై 'బసవని పుత్రుండ' నని చెప్పుకొనెను గదా! ధర నుమా మాతా పితా రుద్రా' అని గదా శివభక్తుల నమ్మకము. గోదావరీ మండలము లోని వేములవాడలో వెలసిన భీమేశ్వరుడు 'దక్షారామ భీమేశ్వరుడే అగును' అని.... వ్రాయుట ప్రమాదము."

శివభక్తుడైన వేములవాడ భీమకవి శైవ క్షేత్రములను సందర్శించుచు. మఱి లేములవాడయును శైవ క్షేత్రము. శైవ క్షేత్రమైన లేములవాడ వాసస్థలమైనను, వేములవాడ భీమకవి రాజేశ్వరుని భక్తుడై "రాజేశనందనుడన్" అని చెప్పుకొనలేదు. "దక్షారామ భీమేశనందనుడన్" అనియే చెప్పుకొనెను. ఇది గమనార్హమైన విషయము. "బసవని పుత్రుండ"నని చెప్పుకొన్న పాల్కురికి సోమనాథుడు వీరశైవుడు. వేములవాడ భీమకవి వీరశైవుడు కాడనుటకు నృసింహ పురాణమే ప్రమాణము. "ధర నుమామాతా పితారుద్రా" అనునది శివభక్తులు అందఱి నమ్మకము కాదు. వీరశైవులైన శివభక్తులు కొందఱి నమ్మకము మాత్రమే. అంతే కాదు. "పితా రుద్రా" లోని రుద్రుడు అసలు దైవము. దక్షారామములోని భీమేశ్వరుడు క్షేత్రదైవము. సామాన్య శైవునికి, వీరశైవునికి - అసలు దైవమునకు క్షేత్రదైవమునకు భేదము కలదు. పిసుగునకు బియ్యమునకు ఒకటే మంత్రము కాదు. వేములవాడయందు వెలసిన భీమేశ్వరుడు 'దక్షారామ భీమేశ్వరుడే అగును' అని వ్రాయుట ప్రమాదము కాదు. ప్రమాణము అమెరికా లోని తిరుపతి వేంకటేశ్వరుడే.

5. "మధ్యాక్కర పద్యమునందు అయిదవ గణాది యతి మైత్రి కంటె 'చతుర్థగణాది యతిమైత్రి సరసము' అన్న...మాట సరికాదు...కవిత్రయములోని నన్నయ, ఎఱ్ఱన ఆ పద్యమునకు యతి స్థానము చెరియొక రీతిగా నిర్ణయించుటచే, ఆ పద్యరచనలో ఒక సంప్రదాయ మేర్పడలేదు. కనుకనే కవిత్రయానంతరకవులు మధ్యాక్కరను రచింపలేదు....లక్షణ కర్తలు పూర్వకవుల ప్రయోగముల ననుసరించేకాక వారి వారి యిష్టానుసారము కూడ లక్షణములను నిర్దేశించిరి.....కవి జనాశ్రయములోని మధ్యాక్కర లక్షణము మాత్రము ఎఱ్ఱన ప్రయోగముతో సరిపోయినంతమాత్రమున అది ఎఱ్ఱన తర్వాతి రచన యని నిర్ధారించుట ప్రమాదము."

రెండు ఇంద్రగణములు ఒక సూర్యగణము చొప్పున రెండు దళములు కల మధ్యాక్కర పాదమునందు, మొదటి దళము మొదటి అక్షరమునకు-రెండవదళము మొదటి అక్షరమునకు యతి మైత్రి "సరసము" అన్నమాట "సరికాదు" అనుట సరసముకాదు. విరసము. నన్నయ మధ్యాక్కరలోని యతిమైత్రి విధానము నన్నయ నిర్ణయించినది కాదు. అది నన్నయకు బహుపూర్వము యుద్ధమల్లుని బెజవాడ శాసనములోని మధ్యాక్కరలందు కల యతిమైత్రి విధానమ్మే. ఎఱ్ఱన మధ్యాక్కరలోని యతిమైత్రి విధానము తత్పూర్వము కానరాదు. అది ఎఱ్ఱన నిర్ణయించినది కావచ్చును. నన్నయ, ఎఱ్ఱనల మధ్యాక్కరలలోని యతి మైత్రి భేదమే కవిత్రయానంతర కవులు మధ్యాక్కర రచింపక పోవుటకు కారణమైనచో, యతిమైత్రి భేదము లేని మధురాక్కరను కవిత్రయానంతర కవులు రచింపకపోవుటకు ఏమి కారణము కలదు? నన్నయ భారతమునందు ముప్పైతొమ్మిది మధ్యాక్కరలు కలవు. ఎఱ్ఱన భారతమునందు రెండే రెండు మధ్యాక్కరలు కలవు. కవి జనాశ్రయము ఎఱ్ఱన తర్వాతిది కాకపోయినా, నన్నయ ముప్పె

మే

తొమ్మిది మధ్యాక్కరలకు లక్షణము కవిజనాశ్రయమునందు ఉండి తీరును. లక్ష్యమును బట్టి లక్షణము గాని లక్షణమునుబట్టి లక్ష్యము కాదు. అయిన బండి ముందు, గుఱ్ఱము వెనుక అగును. "లక్షణ కర్తలు వారి వారి ఇష్టానుసారముకూడ లక్ష్యములను నిర్దేశించి"నచో, అందుకు "వేములవాడ భీమ! భళిరే!" అను లక్ష్యమే ప్రథమోదాహరణము కాఁగలదు.

6. "పట్టుకాదు శబ్దము దేశ్యముగానే నిఘంటువులలో చూపబడినది. ఈ శబ్ద ప్రయోగము భీమకవి కాల నిర్ణయమునకు తోడ్పడునది కాదు."

వెనుకటి నిఘంటువులలో చూపబడిన దేశ్య శబ్దములు అనేకము, ఇప్పటి భాషా చరిత్రను బట్టి అన్యదేశ్య శబ్దములగునని, అన్య దేశ్యశబ్ద ప్రయోగమునుబట్టి కావ్య రచనా కాలములు నిర్ణీతము లని భాషా సాహిత్య చరిత్రల పరిజ్ఞానము కలవారికి తెలియును. లగు దేశ చరిత్రకు భాషా సాహిత్య చరిత్రలు సహోదరములు.

7. "భీమకవి 14 వ శతాబ్ది ఉత్తరార్ధము వాడైన అప్పటి వరకు తీరాంధ్రంలో సౌరమానం ప్రచారంలో ఉన్నదా?"

ఉండవలసిన అవశ్యకము లేదు. పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధమునందు తెలుగు దేశమునందు సౌరమానము ప్రచారములో లేకపోయినను, అది వేములవాడ భీమకవికి తెలియరాని మహా విషయము కాదు. వేములవాడ భీమకవి కవిశేఖర సార్వభౌముడు మాత్రమే కాదు; దైవజ్ఞ శిఖామణి కూడ. వేములవాడ భీమకవి జ్యోతిశ్శాస్త్ర వేతృత్వమునకు ఇంద్రద్యుమ్నుని కీర్తి పతాకలవలె అముద్రిత పద్యములు అనేకము తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయమునందు కలవు. జ్యోతిశ్శాస్త్రవేత్తలకు చాంద్రమాన, సౌరమానములే కాదు; బార్హస్పత్యమానమును బాహాటముగ తెలియును. అంతేకాదు. సౌరమాన మాసము కల వేములవాడ భీమకవి పద్యము కళింగ గంగుకు సంబంధించినది. కళింగగంగు గాంగ వంశపురాజు. గాంగవంశపు రాజులు ఆంధ్రులు కారు. ఓఢ్రులు. ఓఢ్రుల కాలమానము సౌరమానమే. అది గాంగవంశపు రాజుల పరిపాలన కాలమునందు కళింగ దేశమునందు ప్రచారములో ఉండుట సహజము. కనుక మీనమాసము కోసము మీన మేషములు లెక్కపెట్టవలసిన అవశ్యకము లేదు. ధనుర్మాసము వలె మీన మాసము.

8. 'రాయలగెల్పి' అనగా విజయనగర రాజునే గెలిచి అనే అర్థము చెప్పుకొన వలసిన అవసరం లేదు. శత్రురాజుల గెలిచి అని కూడ చెప్పవచ్చును గదా: "ఈ రాయలు కోన ఇమ్మడి పోతరాజు పెద్దన్నగారయిన రాయలని చాగంటి శేషయ్య గారి అభిప్రాయం."

'రాయల గెల్పి' అనగా శత్రురాజుల గెలిచి అని గతి లేనప్పుడు చెప్పుకొనవచ్చును గాని, ఉన్నప్పుడు చెప్పరాదు. రాయలు "కోన ఇమ్మడి పోతరాజు పెద్దన్నగారయిన రాయలు" అని మాత్రమే కాదు; "భీమకవి నివాసము గోదావరీ మండలములోవి వేములవాడ అనియే నా యభిప్రాయము. దీనితో సంబంధించిన వాదోప వాదములను జదివి చూచినపిమ్మట కూడ నా యభిప్రాయము మారలేదు" అని కూడ చాగంటి శేషయ్యగారి అభిప్రాయము. (ఆం. క. త. మొ. సం. పు 214) కోన ఇమ్మడి పోతరాజు కోనసీమరాజు. అతని సోదరుని గెలిచి కళింగగంగు సజ్జనగరమున పట్టము గట్టుకొనుట ఏమి? – "అయియుండును" అనియేగాని, "అగును" అని శేషయ్యగారి అభిప్రాయము కాదు. (పు. 256) అది కూడ కళింగ గంగు అనంతవర్మ చోడగంగు అనుకొనుటవలని అభిప్రాయము అనంతవర్మ చోడగంగు చరిత్ర తెలిసిన, అతడు పతనోత్థానములకు పాల్పడిన కళింగగంగు కాడని అవగతమగును.

9. "దానరాజు అనునది పేరు కావలసిన అవశ్యకము లేదు. దానకర్ణుడైన రాజు దానరాజు కాఁగలడు" అని వ్రాయుట .... విచారకరము .... దానరాజును చారిత్రక వ్యక్తిగా చూపటానికి.... చెప్పిన సమర్థన హాస్యాస్పదము దానకర్ణుడైనరాజు వంధిమాగధులకు 'దానరాజు' కావచ్చునేమోగాని చరిత్రకారులకు కాదని మనవి.

పూసపాటి వారి సీస మాలికను రచించిన వ్యక్తి వంది మాగదులకు వైతాళిక గీతములు వ్రాసి యిచ్చునట్టి కవియేగాని చరిత్రకారుడు కాడు. అంతేకాదు. సమకాలికుడు కాడు. అర్వాచీన కాలికుడు. జనుల వాడుకలోని వ్యవహారనామమును అర్వాచీనకవులు రచించుట అసంభవము కాదు. అందు చరిత్రాంశము కలదా? లేదా? అని పరిశీలించుట చరిత్రకారుల అవశ్యకర్తవ్యము. వేములవాడ భీమకవి చాటుపద్యములోని; పూసపాటి రాజకవుల, తదాస్థానకవుల గ్రంథములలోని "పిడుగు" ఎట్టిదో, పూసపాటి వారి సీసమాలిక లోని "దానరాజు" అట్టిది. అది నిజమైన పిడుగు కాదు. ఇది పేరైన దానరాజు కాదు.

10. "సీసమాలికలోని విషయమును పూర్తిగా విశ్వసించ లేము. కాని పూసపాటి వారి సీసమాలిక రాచిరాజు కృతమే కావచ్చునని ....విశ్వసించినారు. దీనికి కారణము దానరాజు ప్రభువు భీమనృపాలుదే మైలమభీముడను.... నమ్మకము."

పూసపాటి వారి సీసమాలిక రాచిరాజు కృతమే కావచ్చునని తలంచుటకు కారణము దానరాజు ప్రభువు భీమన్నృపాలుడే మైలమ భీముడను నమ్మకము కాదు. సమన్వయమును కాదు. పూసపాటి వారి సీసమాలిక రాచిరాజు కృతము కాదనుటకు నిర్ధారక సాధనము లేక పోవుట మాత్రమే. సీసమాలికలోని విషయమును పూర్తిగా విశ్వసింపకపోవుటకు హేతువు తథ్యమిథ్యావివిక్తి. ఇట్టి సీసమాలికలు ఇంకను కలవు. అవి యెల్ల పూర్తిగ విశ్వసనీయములు కావు. కేవలము అవిశ్వసనీయములును కావు. సత్యాసత్యములు సంకీర్ణములగు అర్వాచీనరచనలకు అవుగాముల చర్చ అపరిహార్యము.

11. "ఈ సీసమాలిక కూడా శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి వ్రాసినట్లుగా వ్రాయబడిన 'మారీచీపరిణయము' వంటిదేమో!"

మోహనాంగి మారీచీ పరిణయము కూట సృష్టి అనుటకు నిర్ధారక సాధనములు అనేకము కలవు. పూసపాటివారి సీసమాలిక కూట సృష్టి అనుటకు నిర్ధారక సాధనము ఒక్కటికూడ లేదు. అది "సాహిత్య ఫోర్జరీ" అని అప్పుదగారు అభిప్రాయపడుటకు హేతువు, అందలి "ఋతుగగనాబ్ధి చంద్రశకము" 1484 వ సంవత్సరము అనుకొనుటవలన, అందలి "నందేల కృష్ణ భూనాథుండు" అడ్డు వచ్చుట మాత్రమే. అది 1784 వ సంవత్సరమును అగును. అయిన "నందేల కృష్ణ భూనాథుండు" అడ్డురాడు. కనుక "సాహిత్య ఫోర్జరీ" కావలసిన అవశ్యకము లేదు. అంతేకాదు. నిర్ధారక సాధనములేకుండ నటశ్రీ దువ్వూరి జగన్నాథ శర్మగారి మీద నిందారోపణము చేయుట దుస్సాహసము.

12. "పూసపాటి తమ్మిరాజు కృష్ణ విజయము అను గ్రంథమునందు మైలమ భీముడు, భండన భీముడు అనునవి తప్ప మిగిలినవి నిజముకాదు" అని నిర్ణయించిరి. దీనిని బట్టి కృష్ణ విజయములోని పద్యముల ప్రామాణికత తేటతెల్లమగుచున్నది.

పూసపాటి తమ్మిరాజు కృష్ణ విజయములోని 'మైలమ భీముడు, భండన భీముడు అనునవి తప్ప మిగిలినవి నిజము కాదు' అని నిర్ణయింపలేదు. ఒక్క పూసపాటి తమ్మిరాజు కృష్ణ విజయమునందు మాత్రమే గాక, పూసపాటి రాజకవుల, తదాస్థాన కవుల గ్రంథములందు భ్రమ ప్రమాదములతోపాటు బహు చారిత్రిక సత్యములు కలవని సమన్వయము. అర్వాచీన గ్రంథములందు భ్రమ ప్రమాదములు ఉండుట సహజము. చారిత్రిక సత్యములును ఉండుట సంభవము. సమకాలిక గ్రంథములందును భ్రమ ప్రమాదములు కల సందర్భములు కలవు. అంతమాత్రాన ప్రామాణికతకు భంగము కలిగినట్లు భావించుట ప్రామాదికతకు నిదర్శనము.

13. "భక్తిరాజు కొడుకైన భీముని తల్లి పేరు మైలమాంబ కావచ్చును" అని ఊహించి ఎంతో చరిత్ర రచించారు.

భక్తిరాజు కొడుకైన భీమరాజు తల్లి మైలమాంబ కావచ్చుననుటకు ఉపబలక సాధనములు ఉక్తపూర్వము. అందువలన ఎంతో చరిత్ర రచించుటకు అవకాశము కలిగినది. కనుక భక్తిరాజు కొడుకైన భీమరాజు తల్లి మైలమాంబ కావలయును.

14. "పశ్చిమ చాళుక్యరాజైన ఆరవ విక్రమాదిత్యుని నుంచి క్రీ. శ. 1076 లో కొలని పాకను, పానుగంటిని పరిపాలించే అధికారమును పొందిన ఏఱువ తొండయ రాజునకు 'మైలమాంబ' అను పట్టమహిషి గలదు. ఈమె శాసనములు క్రీ.శ. 1121 నాటిది దక్షారామములోను, క్రీ. శ. 1124 నాటిది పానుగల్లులోను గలవు. పానుగంటి శాసనము ననుసరించి ఏఱువ తొండయ, మైలమాంబలకు ఉదయనచోడ, భీమచోడ, గోకర్ణ చోళులను పుత్రులు గలరని వారిలోని భీమచోడుడే ఏఱువ భీముడని, మైలమ భీముడని ప్రసిద్ధి చెందినట్లు తెలియుచున్నది. (చూ. భారతి, మే 73)

పశ్చిమచాళుక్య రాజైన ఆరవ విక్రమాదిత్యుని నుండి క్రీ. శ. 1076లో కొలనిపాకను, పానుగంటిని పరిపాలించు అధికారమును పొందినవాడు ఏఱువ తొండయరాజు కాడు. ఏఱువ నాడును ఏలిన సామంతుడు ఏఱువ తొండయరాజు. ఏఱువ తొండయరాజు భార్య మైలమాంబయేగాని, ఆమె శాసనము 1121వ సంవత్సరము నాటిది దక్షారామమునందు కలదుగాని, 1124 వ సంవత్సరము నాటి పానగల్లు శాసనములు ఆమెవి కావు. ఒక పానుగంటి శాసనములోని మైలమాంబకు ఉదయనచోడ, భీమచోడ, గోకర్ణచోడులు అను పుత్రులు కలరుగాని, అందలి భీమచోడుడు మైలమభీముడు అగునుగాని, ఏఱువభీముడు కాడు. ఇందుకు చూడవలసినది మే '73 భారతిలోని తేరాల సత్యనారాయణశర్మగారి "ఏఱువ సింహాసనము-నల్లగొండ" అను వ్యాసము మాత్రమే కాదు; తన్నిమిత్తమైన ఆగస్టు '70 భారతిలోని బి. యన్. శాస్త్రిగారి "కందూరిచోడుల నాలుగు శాసనములు" అను వ్యాసముకూడ. అంతేకాదు. దాక్షారామము, పానుగల్లు శాసనములును. ఉపరి, బి యన్. శాస్త్రిగారు శాస్త్రీయముగ సంఘటించిన కందూరి చోళుల వంశవృక్షమునందు ఏఱువ చోళుల ప్రసక్తి లేదని, తేరాల సత్యనారాయణశర్మగారు ఏఱువచోళులను, కందూరి చోళులను ఏకము చేసినను, ఎడనెడ "స్థిరపడుటకై మరికొన్ని ఉపపత్తులింకను

గావలసియున్నవి, కొన్ని చిక్కులు ఇంకా దొలగవలసియున్నది, ధ్రువపడవలసియున్నది" అని చేసిన హెచ్చరికలును.

ఏఱువనాడును ఏలిన చోళులు ఏఱువ చోళులు. కందూరి నాడును ఏలిన చోళులు కందూరిచోళులు. ఏఱువనాడు – "నెల్లూరి జిల్లాలోని పొదిలి, దర్శి తాలూకాలలో గొంతభాగమును, కడప జిల్లాలోని బద్వేలు, సిద్ధవటము తాలూకాలలో గొంత భాగమును, కర్నూలు మండలములోని మార్కాపురము తాలూకా ప్రాంతమును జేరిన దేశము". కందూరినాడు– "నల్గొండ తాలూకాయును దానికి జేరియున్న మహబూబునగర మండలములోని మహబూబునగర తాలూకా ప్రాంతమును." ఏఱువనాడును ఏలిన ఏఱువ చోళులు, కందూరినాడును ఏలిన కందూరి చోళులును భిన్నులు. కనుకనే కందూరి చోళుల వంశవృక్షమునందు ఏఱువ చోళులను బి. యన్. శాస్త్రిగారు ఏకముచేయలేదు. రేనాటి చోళులు, వెలనాటి చోళులు, పొత్తపి చోళులు, కొణిదెన చోళులు, నెల్లూరు చోళులు, నన్నూరు చోళులు వలె, కందూరు చోళులు, ఏఱువచోళులు భిన్న చోళ వంశీయులు. అందఱికిని మూల పురుషుడు కరికాలచోళుడని, బిరుదావళి సమానమని, నామధేయములు సదృశమని కాలము సమీపమని భిన్న వంశములను ఏకము చేసిన, ఏర్పడునది చరిత్రకాదు. పుక్కిటి పురాణము.

1121 వ సంవత్సరము నాటి దాక్షారామ శాసనములోని మైలమాంబ భర్త ఏఱువ తొండయ రాజు ఏఱువ విశేషణమును బట్టి ఏఱువ చోళుడు. (ద. హిం. శా. సం. 4, పు. 420, సంఖ్య 1216) 1124 వ సంవత్సరమునాటి ఒక పానుగంటి శాసనములోని మైలాంబిక, అందలి భీమరాజనందనుడైన తొండరాజు భార్య అని శాసనమునందు లేదు. కాని వారు కందురి నాడునకు సంబంధించిన వారని స్పష్టముగ కలదు. "శ్రీమద్భీమరాజనందనం స్తోండక్షితీశోపి కందూరి విషయే –" (హెచ్. ఎ. యస్. నెం. 19. III పి. 114) మఱొక పానుగంటి శాసనమునందు మైలమాంబిక భర్త పేరు లేదు. "శ్రీమాన్ మైలమాంబికా వైబ .... త్తేజసో జన్మభూమిః" అని కలదు. (హెచ్. ఎ యస్. నెం 13. II పి. 105–8) తనయుల పేర్లు ఉదయాదిత్య, భీమ, గోకర్ణ చోడులని కలదు. కనుక పానుగంటి శాసనములలోని భీమరాజ, తొండరాజ, ఉదయాదిత్య భీమ, గోకర్ణ చోడులు కందూరి చోళులు. కందూరి చోళుడైన తొండరాజు, ఏఱువ చోళుడైన తొండయరాజు ఒకడే అనుట, కందూరి చోళుడైన తొండరాజుకు ఏమగునో తెలియని మైలాంబిక, ఏఱువ చోళుడైన ఏఱువ తొండయ రాజు భార్యయైన మైలమాంబ ఒక్కతే అనుట చరిత్ర కాదు. కథాసరిత్సాగరము.

ఇక రాజమహేంద్రవర శాసనములోని అన్యమాంబ కొడుకైన ఏఱువ భీముడు ఉరపు నల్ల భీముడు ఏఱువ చోళుడు. పానుగంటి శాసనములోని మైలమాంబిక కొడుకైన భీమ చోడుడు కందూరి చోళుడు. ఇతడు మైలమ భీముడు అగును గాని ఏఱువ భీముడు కాడు. కందూరి భీముడు కాఁగలడు. కందూరి చోళుడైన భీమచోడుడు ఏఱువ చోళుడైన ఏఱువ భీముడు ఉరపు నల్ల భీముడు ఒకడే అనుట కూడ చరిత్ర కాదు. కాశీమజిలీ కథ.

15. "మొదటి ఏఱువ భీముడే మైలమ భీముడు .... ఈ మైలమ భీమునిపై పద్యములు చెప్పిన భీమకవి క్రీ.శ. 12 వ శతాబ్ది మధ్య భాగము వాడని చెప్పవచ్చును."

కథాసరిత్సాగ సరణిని, కాశీమజిలీ కథాధోరణిని వదలి, చారిత్రిక పద్ధతిని చూచిన "మొదటి ఏఱువ భీముడు మైలమ భీముడు" కాడు. అన్నమ భీముడే అగును. కనుక "మైలమ భీమునిపై పద్యములు చెప్పిన భీమకవి క్రీ. శ. 12 వ శతాబ్ది మధ్య భాగమువాడని చెప్పఁ" గూడదు.

అసలు "మైలమ భీముని శాసనము అమరావతిలోని అమరేశ్వరుని దేవళముపై నున్నట్లును అది శా। స। 925 యైనట్లు "ఇలియట్ మార్బిల్స్" అను బుక్కు వలనం గాన్పించు" నని గురజాడ శ్రీరామమూర్తిగారి కవిజీవితములందు కలదు. ఇది నమ్మిన వేములవాడ భీమకవి కథలు ఇంకను రక్తి కట్టును.

పదొకండవ శతాబ్ది ప్రారంభములోని (925+78=1003) మైలమ భీమునిపై, వేములవాడ భీమకవి పద్యములు చెప్పిన, కస్తూరి రంగకవి అన్నట్లు వేములవాడ భీమకవి ("ఆదికవి" కాదు) "ఆదిమ కవి"యే అగును. కాని వేములవాడ భీమకవి కవి జనాశ్రయము, సుమతి శతకము, నృసింహ పురాణము, ఇతర చాటువులు పదొకండవ శతాబ్ద ప్రారంభములోనివి కావు. కనుక వేములవాడ భీమకవికి సంబంధించిన మైలమ భీముడు, పదొకండవ శతాబ్ది ప్రారంభములోని మైలమభీముడు కాడు. పన్నెండవ శతాబ్ది మధ్య భాగములోని కందూరి చోళుడైన మైలమ భీముడు ఏఱువ భీముడు కాడు. వేములవాడ భీమకవి పద్యములందు ఏఱువ భీముడని కలదు. కనుక వేములవాడ భీమకవికి సంబంధించిన మైలమ భీముడు పండ్రెండవ శతాబ్ది మధ్యభాగములోని మైలమ భీముడును కాడు. పదమూడవ శతాబ్దియందు మైలమ భీముడు కానరాడు. పదునాల్గవ శతాబ్ది యందును మైలమ భీముడు కానరాడు గాని, పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధములోని ఏఱువచోళుడైన భక్తి రాజు కొడుకు భీమరాజు ఏఱువ భీముడు కావున మైలమ భీముడు కావచ్చును. సప్రమాణ నిరూపణముతోపాటు సంభావ్యమైన సమ

న్వయమును చరిత్రకు విషయము. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి సంభావ్యమైన సమన్వయమున ఏఱువ భీముడగు భక్తిరాజు కొడుకు భీమరాజు నిడుదవోలు దుర్గాధిపతి. పూసపాటి రాజ కవుల, తదాస్థాన కవుల గ్రంథములందు పూసపాటి రాజవంశ పూర్వపురుషుడైన ఏఱువ భీముడు ఉరవు మైలమ భీముడు నిడుదవోలు దుర్గాధిపతి అని కలదు. కనుక భక్తిరాజు కొడుకు భీమరాజు తల్లి మైలమాంబ కావలయును. అయిన వేములవాడ భీమకవికి సంబంధించిన ఏఱువభీముడు ఉరవు మైలమభీముడు అతడే అగును. కనుక వేములవాడ భీమకవి కాలము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము. ఇందుకు వేములవాడ భీమకవి జనన వృత్తాంత సీస మాలికలోని కాలమును ఉపబలకము. ఇది బహిస్సాక్ష్యము. ఇక -

కవి జనాశ్రయము ఎట్టిన భారతము కంటె అనంతర గ్రంథమనుటకు మధ్యాక్కర లక్షణము మార్గ దర్శకము. చాటు పద్యములు పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధము కంటె అనంతర కాలికములనుటకు పారసీక పద ప్రయోగము పథ నిర్దేశకము. సుమతి శతకము కూడ పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధము కంటె అనంతర గ్రంథమనుటకు సదృశ పద ప్రయోగము స్థితి స్థాపకము.

ఇట్లు పరస్పరోప బలకములైన, బహుళార్థ సాధకములైన బహిరంతర సాక్ష్యములను బట్టి వేములవాడ భీమకవి కాలము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధమని ప్రతిపాదితము. అది వేములవాడ భీమకవి "జన్మస్థానము లేములవాడ" అగుటకు బాధకమని - పూర్వపక్ష పునరుద్ధరణములు, అప్రామాణిక విషయాను సంధానములు, అవిచార మూలక అకాండ తాండవములు చేయుటచింత్యము.

ఒక సిద్ధాంతమును విమర్శించునపుడు, ఆ సిద్ధాంతమును ఆద్యంతము చదివి సరిగా అర్థము చేసికొనవలయును. అంతేకాదు. అందు మాదలించిన అన్ని గ్రంథములను, వాని ఆది మూలములను అరసి పరిశీలించుకొన వలయును. ఉపరి, పరిత్యజించిన విషయములను ఎందుకు పరిత్యజించినదియు యోచించుకొన వలయును. అటుపై విమర్శించుటకు అడ్డముపెట్టుకొను ఇతరులఅభిప్రాయములు సమంజసములగునో కాదో సరిచూచుకొన వలయును. స్వయముగ ప్రతిపాదించు విషయములు సమర్థములగునో కాదో పరీక్షించుకొన వలయును. ఆగంతుకములైన అభిమానములను బట్టి ఇష్టానుసారముగ వాగ్వ్యయము చేసికొనరాదు. ఇవి విమర్శకుని ప్రాథమిక విధులు.

డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి

మూడగ్నులు

అ. శంభుకంట నొకటి జలరాశి నొక్కటి
మఱియు నొకటి మనుజ మందిరముల
నొదిగెఁగాక; మెఱసియున్న మూఁడగ్నులు
చలికి నులికి భక్తి సలుపకున్నె.

పోతన మహాకవి రచించిన ఆంధ్ర మహా భాగవతములోని పై పద్యమునకు "మూడగ్నులు" అను సమన్వయమెట్లు కుదుర్చుకొనవలయునో బోధపడుట లేదు.

అగ్నులు మొత్తము ఇరువది యేడు. అందు త్రేతాగ్నులు (౧) గార్హపత్యము (౨) అహవనీయము (౩) దక్షిణము.

ఆంధ్ర మహా భారతమునందు నన్నయగారు చెప్పిన ఈ క్రింది పద్యమును పరిశీలించినచో

కం. విను గార్హపత్యమును న
య్యనలము విహరింపబడి తదహవనీయం
బున వెలుగునట్లు వెలుగును
జనకుఁడు దాఁబుత్త్రుఁడై నిజద్యుతి తోడన్.

గార్హపత్యాగ్నియే అహవనీయమై వెలుగుచున్నదని తెలియుచున్నది. గార్హపత్యమునుండి వేరుచేయబడి మరొక కుండమందుంచ బడినది అహవనీయము. అయితే మరి "దక్షిణాగ్ని" దేనినుండి వేరుచేయబడినది? శివుని కంటిలో దాగియున్న అగ్ని పేరేమి? సముద్రము నందు దాగిన అగ్ని "బడబాగ్ని" కదా? మఱియు "మనుజమందిరముల" అను చరణము నందుగల "మందిర" శబ్దమునకు నానా అర్థములలో "దేహము" నియు "ఇల్లు" అనియు కలదు. కాబట్టి మూడవ అగ్ని మనిషి దేహము నందు దాగిన జఠరాగ్నా? లేక ఇంటు చల్లారకుండ నిత్యాగ్నియై వెలుగుచున్న "గార్హపత్యమా?" "ఒదిగే" శబ్దమునుబట్టి దాగియున్నదని, అర్థము తెలియుచున్నది. దాగియున్న అగ్నులలో శివుని కంటిలోనిదె, సముద్రము

నందు దాగినది, మూడవది "మందిర" శబ్దమును బట్టి "దేహము"నందుగల అగ్నిని సమన్వయించుకొనవలెనా లేక గృహము నందున్న "గార్హపత్య" మును సమన్వయించు కొనవలయునా? గృహము నందలి అగ్ని కంటికి కనిపించుచు సేవచేయుచునేయున్నది. దాగినట్లు యెట్లగును. "మెఱసి యున్న" శబ్దమునకు బయటు పడినచో అని అర్థము సూచింపబడినది. కనుక పండిత మహాశయులు తమ అమూల్యమైన అర్థ తాత్పర్యమును దెలిపి సందియమును నివృత్తి చేయమనవి.

శ్రీ పెంటపురాజు నరసింగరావు

తుపాను చెప్పిన జీవిత సత్యం

"జీవితం ఎల్లప్పుడూ ఒక తుపాను వంటిది, అని డా॥ లాగొనోవ్ చెప్పగా, తుపానులు లేకపోతే జీవితం మిక్కిలి దుర్మార్గమై, నీతి బాహ్యమై పోతుంది" అన్నారు శ్రీ ఇకేడా.

ఈ పై వాక్యాలు నాకు సద్యః ప్రేరణ నివ్వగా ఈ గేయం రచించాను. పై సంభాషణలో పాల్గొన్న ఇద్దరు మహా వ్యక్తులను గూర్చి రెండు ముక్కలు చెబుతాను.

జపాన్ దేశంలోని టోక్యో నగరంలో సోకా గెక్కై అను అంతర్జాతీయ సంస్థ వున్నది. దానికి అధ్యక్షుడు దైసకు ఇకేడా. ఈయన టోక్యోలో 1928 లో జన్మించారు. ఈ సంస్థ విద్యాభివృద్ధినీ, అంతర్జాతీయ సంస్కృతుల ఆదాన ప్రదానాన్నీ, ప్రపంచ శాంతినీ ధ్యేయాలుగా కాంక్షించి స్థాపించబడింది. భారతదేశంలో ప్రభవించిన బౌద్ధమతం దీనికి ప్రధానమైన పునాది. డా॥ ఇకేడా రచించిన గ్రంథాలలో 1. నా హృదయగానం 2. మానవ విప్లవము 3. జీవిస్తున్న బుద్ధుడు 4. జీవితాన్ని ఎన్నుకో — అర్నాల్ టాయన్బీ, ఇకేడాల సంభాషణ 5. హ్యూగే — ఇకేడాల సంభాషణ 6. క్రీ. పూ. మొదటి శతాబ్దిలో బౌద్ధమతము 7. జీవితం ఒక సమస్యా లేక విలువైన రత్నమా? అనే గ్రంథాలు ప్రముఖమైనవి. ఇది ప్రధాన ప్రపంచ భాషలన్నింటిలో అనూదితమైనవి.

ఇక రెండవ వ్యక్తి డా॥ లాగొనోవ్, రష్యాలోని సోవియట్ అకాడెమీ ఆఫ్ సైన్స్‌సెస్ కు రెక్టార్ గా వుంటున్నారు. ఆయన పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్త అయినప్పటికీ క్వాంటమ్ మెకానిక్స్ లో మిక్కిలి ప్రసిద్ధుడు.

ఈయన యిటీవల జపానుకు విచ్చేసి నాలుగైదు ప్రముఖ విషయాలపై డా॥ ఇకేడాతో సంభాషించారు. వారి సంభాషణలు మూడవ హరివిల్లు వంతెన అనే శీర్షికతో పుస్తక రూపంగా వెలువడ బోతోంది.

ఆధునిక మానవుడు ప్రకృతి శక్తుల్ని ఇంకా పూర్తిగా జయించలేదని, అలా జయించడం సాధ్యం కాదని, మానవ మేధకు అతీతంగా మరొక శక్తి పనిచేస్తూ వుందనీ, ఆ అదృశ్య శక్తికి తలవంచి మానవుడు తనవిధినీ, కర్తవ్యాన్నీ నిర్వర్తించడం సమాజ శ్రేయస్సుకు మంచిదనీ అప్పుడే మనశ్శాంతీ, ప్రపంచ శాంతీ సిద్ధిస్తుందని ఈ గేయంలో ప్రతిపాదించాను. అలాగని ఆధునిక మానవుడింతవరకు సాధించిన ఘన విజయాలను కించపరచడం నా ఉద్దేశ్యం కాదు. ఈ యుగపు మానవుడు "ఒకానొక ఏకాగ్రత సాధించిన విచిత్రయోగి" అని అభివర్ణించాను. అది ఈనాటి మానవుని ముందంజ అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఇక పాఠకులు గేయాన్ని చదివి ఆనందించండి, ఆలోచించండి.

1

హఠాత్తుగా ఎప్పుడో
తప్పక పెనుతుపాను వస్తుందనీ ....
అప్పుడు కల్లోలితమై కడలి
ఉప్పొంగి పోతుందనీ ....
చక్కగా తెలును నీకు
అయినా ....
అశనిపాతాన్ని సైతం లెక్క చేయని నీవు
నిర్మించావు సముద్రపు టొడ్డులో
పునాదులు నిలవని పులిన సీమలో
విశాల సుందర రమ్య హర్మ్యాన్ని.

దాచావు అందులో నీ ఈషణ త్రయాన్ని ....
వసుంధరలో మరెక్కడా లేని గుప్తధనాన్ని —
విశాలనేత్ర నీ ప్రేయసి పులిన శ్రోణిని —
కనుపాపల్లా కన్న నీ చిన్నారి పాపల్ని —

2

నీ వొక విచిత్ర సముద్రపు పక్షివి!
అత్యద్భుత జల చరానివి!!
నీ వీ లోకంలో దేనికి భయపడవు.

నీ హృషీకాల నిర్మించిన ఈశుడు కూడా
నీ ప్రయత్నాన్ని విరమించ లేడు.

తుపానంటే హేమంత తుషారం నీకు!
అదేమంత అపాయ మంటావు నీవు !!
మృత్యువు తుపానురూపంలో వస్తుందంటే నమ్మవు!!

నీవొక పెద్దచేపలా జలగర్భంలో దూసుకుపోయినా
గండ భేరుండం లా గాలిని కోసుకు పోయినా
ఇక్కట్లను లెక్క పెట్టక ఎక్కడెక్కడో తిరిగినా
నీటిలో గుడ్లు పెట్టిన తల్లి చేపలా
గూటిలో పిల్లలున్న సముద్రపు పక్షిలా
నడి సంద్రంలో నీ మనస్సు వొడ్డునున్న
నీ యింటి చుట్టే పక్షిలా తిరుగుతుంటుంది.
అనుక్షణమూ నీ అంతః కరణం
నీ దారా పుత్రిల్నే స్మరిస్తూ వుంటుంది.
ఇలా నీకే తెలియని ఒక వినూత్న ఏకాగ్రత
సాధించావు నీవు!
దానితో అదొక విచిత్ర యోగివే అయ్యావు!

3

దేశ దేశాలు తిరిగావు
ఆశల కానులు అపురూపంగా మూటకట్టుకున్నావు
ఏ నాటికైనా ఒకనాడు యిల్లు చేరాలని
వాయువేగ మనో వేగాలతో
తిరిగి వచ్చావు తాపత్రయంతో.
నీ కన్నులే నిన్ను మోసగిస్తున్నాయా అన్నట్లు
కల్లోల కడలి కబళించి వేసింది నీ భవంతి!
పారావారానికి ఎత్తిన దీప స్తంభం లాంటి
సముద్ర కన్యాకుమారికి నచ్చిన వజ్రపు
ముక్కరలాంటి
నీ రమ్య హర్మ్యం సాగర పారమ్యమై పోయింది!
మూడు తరాల వరకూ పాతర వేసిన
నీ గుప్త ధనం సముద్ర గర్భంలో
నిశ్చింతగా నిదురపోతోంది!!
కనుపాపలా కాపాడుతూ వచ్చిన
నీ కన్న సంతానం
తల్లి గర్భానికే తిరిగి చేరుకొంది!!!
సమాధి స్థితిలోని యోగిలా
సజల నయనాలతో
సముద్రాన్ని చూస్తున్న నీకు
హఠాత్తుగా నీ ప్రేయసి
విశాల అగాధ నయనాలలోని రహస్యం
అవగతమై నీవే ఒక దుఃఖ సముద్రమై పోయావు!
మృత్యువు తప్పనిసరి అని తెలుసు నీకు.
అయినా కట్టావు గంపెడాశతో
సముద్రపు ఒడ్డులో
పునాదులు నిలవని పులిన సీమలో
విశాల సుందర రమ్య హర్మ్యాన్ని!
అనాది నుండి బుద్ధిరాని ఈ లోకానికి
బుద్ధి చెప్పావు మరలా
అసార సంసారపు అనంత దుఃఖాన్ని!!

4

అదుగో! ఆ సముద్రపు హోరు ఏమంటోంది?
హృషీకాలకు నాథుడున్నాడని
విస్మరించిన మానవుడు
అనాథు డవుతున్నాడు.

తుపానునే గుండెగా మలిచి
మనిషిని సృష్టి చేశాడు దేవుడు!
భయాన్ని దానిలో దాచిపెట్టి
తానిస్తానన్నాడు అభయం!
మృత్యువే తుపాను
తుపానే మృత్యువు!!
కాదన్నవాడి గుండెలో తుపాను
అగ్ని పర్వతంలా బ్రద్దలవుతుంది
అదే భయం!
భయమే మృత్యువు!!
ఈ తుపానే లేకపోతే
ఈ మృత్యువే రాక పోతే
జీవితం మరింత దుర్భరమై
పరమార్థానికి దూరమై
నీతికి బాహ్యమై పోయేది!
తుపానంటే జీవిత కఠోర సత్యం!
దుర్వాసుడిచ్చిన శాపంలా
దుర్వారంగా వచ్చే తుపాను
మానవ జీవితానికే ఓ అయాచిత వరం!!

శ్రీ ముదివేడు ప్రభాకరరావు

సోమలదేవి - దాక్షారామ శాసనము

ఈ పై శీర్షికతో శ్రీ రవికుమార్‌గారితఃపూర్వము "భారతి" పత్రికలో ప్రకటించిన వ్యాసమును విమర్శింపుచు, నేను "భారతి" పత్రికా ముఖముననే ప్రతి వ్యాసము ప్రకటించి యుంటిని. అయితే శ్రీ రవికుమార్‌గారు 1982 అక్టోబరు మాసపు "భారతి" లో నా వ్యాసమును పూర్వపక్ష మొనరించుచు విచిత్ర సిద్ధాంతము నొకదాని నుపపాదించి, పాఠకమహాశయుల మేధస్సునకొక పరీక్ష కల్పించినారు. ఆ విషయమై నా సమాధానమును "భారతి" ముఖముననే ప్రకటించుచు, వారి వ్యాసములోని ఇతర విషయముల గూర్చి సమాధానము లిత్తునని చెప్పియున్నాను. తదనుగుణముగ నిపుడు వారు తమ వ్యాసములో నుట్టంకించిన విషయ పరామర్శ చేయుచున్నాను.

క్రీ. శ. 1065 వ సం॥ దాక్షారామ శాసనమిచ్చిన సోమలదేవి (విజయాదిత్యుని కుమార్తె) ఆ శాసన మిచ్చునాటికి కన్యకగా నుండి, అవివాహితయని నేనన్న మాటను కాదని వారామెకా నాటికి 30 సంవత్సరముల వయసుండునని, క్రీ శ. 1020 వ సంవత్సరములో జన్మించిన దేవేంద్రవర్మ సోమలదేవి కంటె వయసున పెద్దవాడు గాన ఆమెతో వివాహము సంభవము, సక్రమమని వాకృచ్చినారు. వారి వాదన కపోల్బలకముగా నుండ "దేవేంద్రవర్మ క్రీ. శ. 1070 లో పట్టాభిషిక్తుడైనాడు. అతని కుమారుడు అనంతవర్మ క్రీ. శ. 1078 లో పట్టాభిషిక్తుడైనాడు. అనంతవర్మ జననం క్రీ. శ. 1070 ప్రాంతమని కృష్ణమూర్తిగారి అంచనా. దీనిని బట్టి పట్టాభిషేక కాలమునాటికి అనంతవర్మ వయసు 8 సంవత్సరములు అగును. 8 సంవత్సరములు వయసుగల కుమారునికి పట్టాభిషేకము చేయవలసిన అవసరము ఏ వయసు మళ్ళిన రాజునకో గాని 35-40 సంవత్సరముల ప్రౌఢప్రాయమున నున్న రాజునకు కలుగదు. కనుక కృష్ణమూర్తిగారూహించినట్లు 1070 నాటికి దేవేంద్రవర్మకు 25 సంవత్సరాల ప్రాయమనుట చెల్లదు. అప్పటి కతని వయసు 50 సం॥ పైబడి యుండి యుండవలెను. అనగా అతని జననము క్రీ. శ. 1020 ప్రాంతమగును. సోమలదేవి అతనికన్న వయసున చిన్నదే!" అని వాకృచ్చినారు. ఈ పై వాదన యెంతవట్టు సమర్థనీయమో విచారించ వలసి యున్నది.

సోమలదేవి క్రీ. శ. 1065 సం॥రం నాటికి 15 సంవత్సరముల వయసు కలది అని నేనన్నదానిని కాదని వారామెకు 30 సంవత్సరములని చెప్పుటకీ క్రింది ఉపపత్తుల జూపినారు.

"సోమలదేవి తండ్రి విజయాదిత్యుడు వేంగిసింహాసనమునకై రాజరాజనరేంద్రునితో పోటీపడి 1020 ప్రాంతములో రాజకీయ జీవితమును ప్రారంభించినాడు. అప్పటి కతని వయసు అధమము 15 సంవత్సరములను కొన్న అతని జననము 1005 వ సం॥రం అగును. అతనికి సుమారు 30 సం॥ల వయసున కుమార్తె సోమలదేవి జన్మించియుండవచ్చునని నా యూహ. శ్రీ కృష్ణమూర్తి గారి యూహ ప్రకారం క్రీ. శ. 1065 నాటికి సోమలదేవి వయసు 15 సంవత్సరములే అనుకొన్న ఆమె జననము క్రీ. శ. 1050 ప్రాంతమున. అనగా విజయాదిత్యుని 45 వ సం॥న॥ అగును. అట్లయినను కావచ్చును."

ఒక వంక నా వాదనను పక్షాంతరమున ఆమోదించుచునే శ్రీ రవికుమార్‌గారు సోమలదేవి దేవేంద్రవర్మకు భార్య అని చెప్పుటకు సంశయించుటలేదు. విజయాదిత్యునకు మాలవమహాదేవి అగ్రమహిషి. రేవలదేవి రెండవ భార్య. మాలవదేవియందు విజయాదిత్యుడు ఇమ్మడి శక్తివర్మను కనెను. ఇమ్మడిశక్తివర్మ జననమెప్పుడో తెలియరాదు గాని, అతడు కుళోత్తుంగ చోడుని కన్న కొంచెము పెద్దవాడని మాత్రము చరిత్రకారులందురు. కుళోత్తుంగుడు క్రీ. శ. 1040 వ సంవత్సరములో జన్మించియుండవలెనని నా పూర్వవ్యాసమున నిరూపించియుంటిని. ఆ విధిని ఇమ్మడి శక్తివర్మ క్రీ. శ. 1038 సం॥ ప్రాంతమున జన్మించి యుండెనని మనమనుకొన్న వేంగిసింహాసన మధిష్ఠించు నాటికి అనగా క్రీ. శ. 1061 నాటికాతనికి 23 సంవత్సరముల వయసుండును. క్రీ. శ. 1061 నాటికి కుళోత్తుంగ దేవునకు 20, 21 సంవత్సరముల వయసని చారిత్రకుల నమ్ముచున్నారు. కావున ఇమ్మడి శక్తివర్మ జనించునాటికి సోమలదేవి జనించియుండబోదనుకొన్న, కనీసమామె క్రీ. శ. 1040-41 సంవత్సరములలో జనించియుండవలెను. ఆ విధిని ఆమెకు దాక్షారామ శాసనము నాటికి అనగా క్రీ. శ. 1065 నాటికి 24 లేక 25 సంవత్సరముల మించిన వయసుండి యుండదు. నా అంచనా ప్రకారమప్పటికి దేవేంద్రవర్మ వయసు 25 సంవత్సరములన్న సోమలదేవి దేవేంద్రవర్మలు సమవయస్కు లగుదురుగాని దేవేంద్రవర్మ సోమలదేవి కన్న పెద్దవాడై యుండడు.

మరొక విధమున చూచినను దాక్షారామ శాసనమిచ్చునాటికి సోమలదేవికి 25 సంవత్సరముల వయసు మించి యుండదను హంశము రూఢి యగును.

రాజరాజు క్రీ. శ. 1006 వ సంవత్సరమున జన్మించినాడు. అతని 16 వ యేట వేంగిసింహాసన మధిష్ఠించినాడు.

అనగా క్రీ. శ. 1022 వ సం॥ మున నన్నమాట. అంతకు 2, 3 సంవత్సరముల క్రితము నుండియే అతడు యువరాజుగా నుండి, తండ్రితో బాటు రాజకీయముల నిర్వహించుచుండెడివాడు. వీర విజయాదిత్యుడు రాజరాజు కన్న పిన్న. అతడు బాలుడు. క్రీ. శ. 1005 సంవత్సరమున విజయాదిత్యుడు జన్మించెనని శ్రీ రవి కుమార్ గారు వ్రాసినది తప్పు. విజయాదిత్యుడు క్రీ. శ. 1008–1010 మధ్య కాలమున జనించియుండవలెను. అతడు 30 సంవత్సరముల వయసున సోమలదేవిని కనెనన్న ఆమె జననకాలము క్రీ. శ. 1040 సంవత్సరముగా తేలును. అయిన క్రీ. శ. 1065 లో యిచ్చిన దాక్షారామ శాసనము నాటికామెకు 25 సంవత్సరముల వయసుండి యుండును. ఈ రీతిని జూచినను సోమలదేవికి దాక్షారామ శాసనము నాటికి 25 సంవత్సరములు మించిన వయస్సుండదని తేలుచున్నది.

గాంగరాజు దేవేంద్రవర్మ పట్టాభిషేకము కాలమునాటికి అనగా క్రీ. శ. 1070 సం॥ నాటికి అధమపక్షము 50 సంవత్సరములైన యుండి యుండునని శ్రీ రవికుమార్ గారు చెప్పుచున్నారు. అయిన పక్షమున నాతడు చనిపోవు నాటికి (క్రీ. శ 1077 నాటికి) 57 సంవత్సరముల ప్రాయము గలవాడగుచున్నాడు. ఆ వయసు మానవుని జీవితకాల పరిమాణములో పశ్చిమార్థదశకు చెందినదే గాన ఆ విషయ మంతగా ఆశ్చర్య జనకముగా నుండనవసరము లేదు. దేవేంద్రవర్మ అంత వయసు వరకు జీవింపక నిండు జవ్వనమున దివంగతుడాయెనని చరిత్రకారులుట్టంకించుచున్నారు. నిండు జవ్వనమున 30–35 సంవత్సరముల మధ్య వయస్సుగదా! ఆ ప్రకారము దేవేంద్రవర్మ క్రీ. శ. 1042–1047 మధ్య కాలమున జన్మించి యుండవలెను. ఆ విధిని సోమలదేవి దేవేంద్రవర్మ కన్న పెద్దది యగుచున్నది.

దేవేంద్రవర్మ వయోనిర్ణయమునకు ప్రాతిపదికగా శ్రీ రవికుమార్ గారు తీసికొన్న హంశమిది:–"దేవేంద్రవర్మ క్రీ. శ. 1070 లో పట్టాభిషిక్తుడైనాడు. అతని కుమారుడు అనంతవర్మ క్రీ. శ. 078 లో పట్టాభిషిక్తుడైనాడు. అనంతవర్మ జననం క్రీ. శ. 1070 ప్రాంతమని కృష్ణమూర్తిగారి అంచనా. దీనిని బట్టి పట్టాభిషేక కాలము నాటికి అనంతవర్మ వయసు 8 సం॥లు అగును. 8 సం॥లు వయసు గల కుమారునికి పట్టాభిషేకము చేయవలసిన అవసరము ఏ వయసు మళ్ళిన రాజునకో గాని 35–40 సంవత్సరముల ప్రౌఢ ప్రాయమున నున్న రాజునకు కలుగదు ... .. కాన అప్పటికతనికి (దేవేంద్రవర్మకు) వయసు 50 సం॥లు పైబడి యుండియుండ వలెను" అని. కాని యదార్థమునకు దేవేంద్రవర్మ ప్రౌఢ వయసునందే మరణించుట తటస్థించినది. ఆ కారణముననే 8 సం॥ ప్రాయముగల అనంతవర్మ చోడగంగదేవునకు కళింగరాజ్య పట్టాభిషేకము గావించుట తటస్థించినది. ఇట్టివి చరిత్రలో క్రొత్తలు గావు. చాళుక్య అమ్మరాజ విష్ణువర్ధనుని మరణానంతరము బాలుడైన కంతిక బేతరాజు (5 వ విజయాదిత్యుడు) ను వేంగిసింహాసనమున పట్టాభిషిక్తుని జేయుట ఈ సందర్భమున ఉదహరింపవచ్చును.

వాదనకొరకు విజయాదిత్యుని కుమార్తె సోమలదేవి గాంగరాజు దేవేంద్ర వర్మ అర్ధాంగియై యుండెనని అనుకొన్న వీర విజయాదిత్యుని పాలనాంత్య కాలమున నాతనితో యుద్ధమొనర్చుట, ఆ యుద్ధములో దేవేంద్రవర్మ మరణించుట యేల తటస్థించును? మామ, అల్లుళ్ల మధ్య వైరము జనింపవలసిన అవసరమేల కల్గెను? కావున నీ బంధుత్వము ఇరువురిమధ్య యుండియుండదను ఊహకు తావిచ్చుచున్నది.

ఇదియును గాక "అర్వాచీన తూర్పు గాంగరాజ దేవేరులు" అను వ్యాసమున డా॥ సి.వి. రామచంద్రరావు గారు "దేవేంద్ర వర్మ దేవేరులు" అను శీర్షికక్రింద "రాజసుందరి" ని పేర్కొని, ఆమె అగ్రమహిషి అనుచునే ఇతరుల పేరులు తెలియరావని వ్రాసినారు. నిజముగ సోమలదేవియే దేవేంద్రవర్మ అర్ధాంగియై యుండిన, యే శాసనములో నైనను పేర్కొనబడి యుండదా? అది శ్రీ సి. వి. రామచంద్రరావు గారి దృష్టికి వచ్చియుండదా?

డా॥ సి.వి. రామచంద్రరావు గారి వ్యాసములో ఒక సోమలదేవి, అనంతవర్మ చోడగంగ దేవుని భార్యగా ఉదహరించి, యిట్లని వ్రాసినారు. "శా. శ. 1030 నాటి ఒక ముఖలింగ శాసనమున ఈమె "గుణధామా సోమల మహాదేవీ మనో మానస హంసియా త్రికలింగ మణ్డల పతేః శ్రీగఙ్గ చూడామణేః" అని చోడగంగుని మనో మానస హంసిగా వర్ణింపబడినది. గాంగ శాసనములనుండి ఇతర వివరములు ఈమెనుగూర్చి తెలియరావు. శా॥ శ॥987 నాటి ద్రాక్షారామమందలి ఒక పద్య శాసనమున తూర్పు చాళుక్యరాజైన రాజ రాజ నరేంద్రునికి (క్రీ॥ శ॥ 1019 – 1061) రేవల దేవి వల్ల కలిగిన ఒక సోమలదేవి పేర్కొనబడినది. బహుశః చోడగంగుని భార్య సోమలదేవి రాజ రాజ నరేంద్రుని పుత్రిక సోమలదేవి మనుమరాలై ఉండవచ్చునని ఊహ. అనంతవర్మ చోడగంగుని మనుమడైన ముమ్మడి అనియంకుని భార్య ఒకతె సోమలదేవి నామధేయకలదు. ఆమె విషయమున డి. సి. సర్కారు ఇట్టి సూచనే గావించి యున్నారు.

ముఖలింగ శాసనములోని "గుణధామా సోమల మహాదేవీ మనో మానస హంసియాత్రి కళింగ మణ్డలపతేః శ్రీగఙ్గ చూడామణేః" అన్న పదమునకు వ్యాఖ్యానము చెప్పుచు శ్రీ రవికుమార్ గారు "ఇందులో గంగ చూడామణేః" అన్న పదం ముఖ్యముగా గమనించ దగినది. గంగ రాజైన దేవేంద్రవర్మ చోడరాజు కుమార్తె రాజ సుందరిని వివాహము చేసుకొన్నందువలన చోడ, గంగ వంశాలకు సంబంధం కలసినది. వారికుమార్డు "చోడంగుడని" స్పష్టముగా చెప్పబడినాడు. సోమలదేవి "గంగ చూడామణి మనో మానసహంసి"గాని "చోడగంగుని" "మనోమానస హంసి" గాదు. కనుకనే సోమలదేవి "అనంతవర్మ చోడగంగుని మనోమానస హంసి" కాదని, అతని తండ్రియైన గంగచూడామణి దేవేంద్రవర్మ "మనోమానసహంసి" అని భావించినట్లు చెప్పినారు. విజయాదిత్య దేవుని కుమార్తె సోమలదేవి దేవేంద్రవర్మ భార్య కాదని, అనంత వర్మ చోడగంగుని భార్య అసలే కాదని నేను నా పూర్వ వ్యాసమున స్పష్టముచేసి యున్నాను. ముఖలింగ శాసనములో నుదహరింపబడిన "సోమలదేవి"కి దాక్షారామ శాసనములో నుదహరింపబడిన "సోమలదేవి"కి యెట్టి సంబంధము లేదు. ఇట దాక్షారామ శాసనమిచ్చిన "సోమలదేవి" రాజ రాజ నరేంద్రునకు రేవల దేవికి పుట్టినదని చెప్ప సాహసించి, డా॥ సి. వి. రామ చంద్రరావుగారు, అనంతవర్మ చోడగంగుని "మనోమానసహంసి" సోమలదేవి రాజ రాజ నరేంద్రుని పుత్రి సోమలదేవి మనుమరాలై యుండునని యూహసేయుటలో ప్రమాద పతితులైనారు। ముమ్మడి అనియంకుని భార్య సోమలదేవి విషయములో శ్రీ డి. సి. సర్కారు గారిట్టి సూచనే చేసినారనుటగూడ సమంజస మనిపించుకొనదు.

సోమలదేవి శాసనము తన స్వదేశముననే యిచ్చుటచేతను, ఆదేశములో తాను బెజయిత దేవుని కుమార్తెగనే ప్రసిద్ధి పొంది యున్నది గావునను, తన భర్త యెంత జగదేక వీరుడైనప్పటికి అతని పేరుదహరించకనే శాసనమిచ్చుట సాంప్రదాయ విరుద్ధము గావని, భర్త పేరు పేర్కొనక తప్పిన కారణమున ఆమె అవివాహిత యను నిర్ణయమునకు వచ్చుట సరికాదని శ్రీ రవికుమార్ గారి ఉద్దేశము. ఇందలి ఉచితానుచితములు నిర్ణయింప విజ్ఞులగు పాఠకులే సమర్థులు.

విజయాదిత్యుడిచ్చిన ర్యాలి శాసనములోని వక్కాణములకు భాష్య మొనరించుచు శ్రీ రవికుమార్ గారు వ్రాసిన వ్రాతలు పేలవముగానుండి అస్పష్టతను, హేతువాద దుర్బలతను ప్రదర్శించు చున్నవి. యదార్థ పరిస్థితుల గుర్తించి, ఏ వాతావరణములో నా శాసనము లీయబడినవో తెలిసికొనక, తెలిసికొన్నను వాని అంతరార్థము నెరుంగ యత్నించక వెలువరించిన ఊహలుగా తోచు చున్నవి గాని అన్యములుగా లేవు।

ఇక పంచ బ్రహ్మోదయ భాష్య విషయములో వారు వెల్లడించిన అభిప్రాయముల గూర్చి ప్రస్తావింపవలసియున్నది.

పంచ బ్రహ్మోదయ భాష్యములో చెప్పబడిన రాజ మందిరము "రాజమహేంద్రవరము" ని నేను చెప్పినదానిని ఆక్షేపించుచు శ్రీ రవికుమార్ గారీ విధమున వ్రాసినారు.

"పంచబ్రహ్మోదయ భాష్యరచనాకాలమును కృష్ణమూర్తి గారు తెలియజేయలేదు. ఆ గ్రంథ రచనా కాలము క్రీ. శ. 1100 తర్వాతనేగదా। ఆ కాలమున రాజమహేంద్రవరము 'రాజమందిరము'గా ప్రసిద్ధిజెందియుంటే, అది ఆ పేరున ఆనాటి ఇతర సాహిత్య గ్రంథములలోను, శాసనములలోను కన్పించవద్దా? రాజమహేంద్రవరములో కొన్నాళ్లు నివసించిన శ్రీనాథుడు కూడా కాశీఖండ, భీమఖండములలో దానిని 'రాజమహేంద్రమ'నే పేర్కొనినాడు గాని 'రాజమందిర'మని పేర్కొనలేదు. కనుక పంచ బ్రహ్మోదయ భాష్య రచనా కాలము నాటికి 'రాజమహేంద్రవరము' రాజమందిరముగా ప్రసిద్ధిచెందియుండలేదు. ఆ గ్రంథ శ్లోకములలో చెప్పబడిన 'రాజ మందిరము' 'రాజమహేంద్రవరము' కాదు."

ఇంతకీ శ్రీ రవికుమార్ గారు "రాజమందిరమన్న రాజమహేంద్రవరము" కాదు అనుటకే తమ శక్తియుక్తుల నెల్ల వ్యయించిరి గాని, అందుట్టంకింపబడిన విషయమును గూర్చి ఎట్టి అభ్యంతరమున్నూ చెప్పలేదని స్పష్టమగుచున్నది. వాదనా సౌలభ్యము కొరకు క్షణకాలము రాజమందిరము రాజమహేంద్రవరము కాదనేయను కొందము. అంతమాత్రముచేత రాజమందిరములో జరిగిన సంఘటనల దెలుపు ఆ గ్రంథ వక్కాణములు కాదని శ్రీ రవికుమార్ గారు నిరూపింపగలరా? ఒకవేళ నా వైవాహిక కార్యక్రమము రాజమహేంద్రవరమున గాక రాజమందిరమున జరిగియుండెనన్నను ప్రధాన విషయమునకు భంగ మొదవదుగదా। ముఖ్యాంశము సోమలదేవిని రేవణారాధ్యులు వివాహమాడుటయే గదా। దీనికి భిన్నముగ శ్రీ రవికుమార్ గారు లెక్క కొక్క ఆక్షేపణను దెల్పి సమర్థించుకొనగలరా? రాజమందిరము రాజమహేంద్రవరము కాదని అన్నంతమాత్రమున పై విషయమునకెట్టి విఘాతము కల్గినది? ఆ వ్యాసము వ్రాయుటలోని ముఖ్యాశయము నెరవేరినట్లేగదా।

ఇక రాజమందిరము రాజమహేంద్రవరము కాదని చెప్పుటకు శ్రీనాథుని కాశీఖండ భీమఖండ రచనల నుదహరించినారు శ్రీ రవికుమార్ గారు. శ్రీనాథుడు క్రీ. శ. 1320-1420 మధ్య కాలము వాడు. అప్పటికి రాజమహేంద్రవర నామము రూఢియై నిల్చెనని చెప్పుటకు మాత్రమే యుపయోగించును గాని అతః పూర్వమా పట్టణ నామ మేదియో, ఆనామ మెన్నిమార్పులు పొంది

నదో తుదకు రాజమహేంద్రవర నామమున స్థిరపడినదో తెలుపగల వివరములు తెలిసికొనుట యిప్పట్టున అవసరము.

విష్ణుకుండినుల పాలనాకాల మారంభము నుండియు వేంగీ భూమిలో వేదమతవ్యాప్తికి అనువుగా శృతి స్మృతి పురాణేతిహాసములు, శాస్త్రములు, సాహితీవిలసనము, వేదములు, ఉపనిషత్తులు, వేదోక్తకర్మాచరణము, ధర్మప్రచారము ఇత్యాది కార్యకలాపముల సమర్థవంతముగా నిర్వహించుటకు పెక్కు ఘటికాస్థానముల దేశమునల్గెడల స్థాపించి, సమర్థులగు ఘటికాచార్యుల నియమించి, వాని మనుగడకు గ్రామదానముల నొసంగి, అభిమానించిరి. వానిలో అసనపుర ఘటికాస్థానము మూలఘటికాస్థానమై, అనుబంధ ఘటికాస్థానముల పర్యవేక్షించుచు పరిపాలించుచు, ప్రభువుల ఆశయ సిద్ధికి తోడ్పడుచు వచ్చినది. ఆ ఘటికాస్థానములు వివిధ విద్యలయందు నిష్ణాతులైన పండితోత్తముల గోష్ఠుల నేర్పరచి ప్రతిభ ప్రదర్శించిన ఉత్తమవేత్తల బహూకరించి, సకలవిద్యా వ్యాప్తికి దోహద మొసంగి పేరుగాంచినవి. అందు నాయకమణి యని ప్రసిద్ధికెక్కిన అసనపుర ఘటికాస్థానము కాలక్రమేణ వృద్ధి పొందుచు వచ్చి, చాళుక్యుల కాలమున విద్వజ్జన కవీంద్ర సమాజముల క్రింద రూపపరివర్తనము జెంది, ప్రభువుల ఆదరణపాత్రములై, క్రమక్రమముగ రాజసభల రూపమున స్థిరత గాంచినవి. అట్టి మూలఘటికా స్థానము అగు అసనపురమే క్రమశఃతన నామమును రాజమందిరము రాజమహేంద్రి, రాజమహేంద్రవరము ఇత్యాది నామముల ప్రసక్తి గాంచినది.

రాజమహేంద్రి పట్టణ నిర్మాణమును గురించి రెండు విధములైన కథలున్నవి. రాజమహేంద్రుడను బిరుదు వహించిన మొదటి అమ్మరాజ విష్ణువర్ధనుని కాలమున (క్రీ. శ. 921-927) రాజమహేంద్రవరపట్టణ మారాజు పేరున నిర్మింపబడెనని తెలియుచున్నను అది యదార్థము గాదని తన్నిర్మాణమాకాలపు శాసనములలో గాని, పిదపకాలమున వచ్చిన శాసనములలో గాని, సాహిత్య గ్రంథములలో గాని యుదహరింపబడినట్లు గాన్పింపదు.

రాజమహేంద్ర వరపట్టణ నిర్మాణము మొదటి అమ్మరాజు కాలమున చేపట్టబడినను పిదప కొంతకాలమునకుగాని పూర్తిగావింపబడి, అది రాజధానీనగర శోభల నలవరచుకొన లేదు. అనగా అసంపూర్తి నిర్మాణములతో నుండిపోయినదన్నమాట! నగర నిర్మాణము రాజరాజనరేంద్రుని కాలమునగాని పూర్తి అయినట్లు గానరాదు.

రాజరాజే ఈ పట్టణ నిర్మాతయన్నది ప్రజలమాట. ఐతిహ్యము కూడనట్లే యున్నది. దక్షిణదేశపు శాసనములు 6 వ వాల్యుం, నెం. 669 శాసనములో నిట్లున్నది:-

సోమాన్వయే రాజనరేంద్రభూపో
భూత్వామహేంద్ర సమో బభూవ ।
తస్మాదభూత్ రాజమహేంద్ర నామా
గోదాతటే అకారిపురం స్వనామ్నా ॥

ఈ శాసనము 14 వ శతాబ్దిది. అనగా రాజరాజునకు పిమ్మట మూడువందల సంవత్సరముల నాటిది. ఆ కాలముననే వెలసిన విన్నకోట పెద్దన్న తన "కావ్యాలంకార చూడామణి"లో పురవర్ణనమున కుదాహరణముగ నిచ్చిన సీసపద్యములో

సీ॥ గంభీర పరిఖ నాగస్త్రీల కశ్రాంత
కేళీ విహార దీర్ఘిక యనంగ
నుత్తాలసాల మన్యులకుచ్చి దివిబ్రాక
జేసిన దీర్ఘ శ్రేణి యనగ
జతుర చాతుర్వర్ణ్య సంఘసమర్ధపాలి
రాజిత కల్పకారామమనగ
భ్రాంత సుస్థితమైన భవజూట వాహిని
భుక్తి ముక్తిప్రద స్ఫూర్తి యనగ

గీ॥ నెప్పుడును నొప్పు రాజమహేంద్రవరము
ధరణి గల్పించె నేరాజు దనదుపేర
నట్టి రాజమహేంద్రుని యనుగు మనుమ
డెసగు జాళుక్య విశ్వనరేశ్వరుండు ॥

ఈ రెండు వ్రాతలును రాజనరేంద్రుని నిర్యాణానంతరము మూడువందల సంవత్సరముల కుద్భవించినవి. అప్పటికి పూర్వ చాళుక్యరాజ్య మంతరించికూడ మూడు శతాబ్దులు దాటెను. దీనిని బట్టి జనవాక్యము రాజమహేంద్రవరము చాళుక్యరాజరాజు నిర్మాణమని నిర్ధారణ యగుచున్నది. అగుచో రాజమహేంద్రవరమున కదివరకున్న పేరులు మారి, రాజరాజు (రాజమహేంద్రు)ని పేరున నామపరివర్తన మొందినట్లు తెలియనయ్యెడిని. కావున పంచబ్రహ్మోదయ భాష్యరచనా కాలమునకు ముందుగనే రచింపబడియున్న "పంచబ్రహ్మోదయ" గ్రంథము నాటికి "రాజమందిర" ప్రయోగమే రాజమహేంద్రవర పట్టణమున కుద్దిష్టమై యుండి పిదపకాలమున ననగా భాష్యగ్రంథ రచనా కాలమునకు రాజమహేంద్రవరపట్టణముగా స్థిరపడియుండెననుకొనుటలో విప్రతిపత్తియేమియు నుండరాదు.

శ్రీ తురగా కృష్ణమూర్తి

గ్రంథ విమర్శలు

శ్రీ మద్భాగవత మణిహారము

[ద్వితీయ సంపుటము. సంకలన కర్తలు, సంపాదకులు, ప్రకాశకులు : శ్రీ దర్భా వెంకట రమణ నటరాజ ప్రసాద్, ప్రొఫెసర్ దర్భా సూర్యనారాయణ, శ్రీమతి దర్భా సుబ్బలక్ష్మి. డెమ్మీ సైజు 76 + 528 పేజీలు. వెల: రూ. 30/- ప్రతులకు : ప్రొఫెసర్ దర్భా సూర్యనారాయణ, శ్రీనివాస నిలయం, 14/130, గాంధీపురం, రాజమండ్రి - 533 103, ఆంధ్రప్రదేశ్.]

ఏ తత్సంకలనకర్త, వీరి కుటుంబము వారున్నూ, భగవద్భక్తి పరాయణులు. ఆయన అన్నామలై యూనివర్సిటీ ఇంజనీరింగు కాలేజీలో ప్రొఫెసరుగా ఉన్నప్పుడే శ్రీ నటరాజస్వామి వెలసియున్న చిదంబర క్షేత్రాన్నిగురించిన యావద్విషయాలనూ క్షేత్ర సర్వస్వరూపంగా ఒక పెద్ద గ్రంథాన్ని సంస్కృతంలో దేవనాగరి లిపిలో చక్కగా ప్రకటించారు. వ్యయ ప్రయాసలకు ఏమాత్రం వెనుదీయలేదు. అది సమర్థులైన పండితులచే పరిష్కరించ బడింది. తర్వాత ఆయనకు వ్యాసమహర్షి రచితమైన సంస్కృత భాగవతంలోను, బమ్మెర పోతనామాత్యుని భాగవతానువాదంలోనూ ఉన్న శ్లోకాలను, పద్యాలను ఏర్చి కూర్చి బహుజనోపయుక్తంగా "శ్రీమద్భాగవత మణిహార" మనే గ్రంథాన్ని ప్రకటించాలనే సంకల్పం కలిగినది.

వ్యాసుడు రచించిన భాగవత పురాణం చాలా పెద్దది. అది పండితులకే కాని సామాన్యులకు అర్థం కాదు. వారికయినా దానిని పూర్తిగా చదివి అర్థంచేసుకోవడానికి తగిన సమయం దొరకడం కష్టం, ఓపికకూడా ఉండదు. పోతన్నగారి భాగవతం మూలానికి స్వేచ్ఛానువాదం కావడంవల్ల మూలం కంటె కొంచెం చిన్నది కావచ్చును. సంస్కృత భాషా పరిచయం లేనివారు దానిని పఠించ గలరు. కాని దానికిన్నీ తగిన కాలమూ, ఓపికా అందరికీ ఉండదు. ఈ విషయాన్ని గమనించే ఈ సంకలన కర్తలు మూలానువాదాలలో ముఖ్యములైన శ్లోకాలనూ, పద్యాలనూ, సందర్భానుసారమైన చిన్న వచనాలనూ ఏర్చికూర్చి యీ గ్రంథాన్ని తయారుచేశారు. ఈ సంకలనం సంస్కృత మూలంలోని అధ్యాయాల ననుసరించి జరిగింది. శ్లోకాలక్రింద అధ్యాయ, శ్లోక సంఖ్యలు, వాటి అనువాదాల క్రింద పద్య సంఖ్యలూ ఇవ్వబడినవి. ముఖ్యములైన శ్లోక పద్యాలు ఏర్చి కూర్చడం శ్రమసాధ్యమైన పని. సులభమైనది కాదు. దానికి ఎంతో ఓపిక, సందర్భ శుద్ధితో కూడిన పరిశీలన శక్తి అవసరం. ఇంత శ్రమ తీసుకున్న సంపాదకుల పరిశ్రమ ప్రశంసించదగినది. మొదటిసంపుటం ఇదివరకే వెలువడింది. దానిలో ప్రథమస్కంధం నుండి సప్తమస్కంధం చివరి వరకూ గ్రంథం ఉన్నది. ఈ ద్వితీయ సంపుటంలో అష్టమస్కంధం మొదలు కొని ద్వాదశ స్కంధం చివరి వరకూ ఉన్నది దీనితో గ్రంథం పూర్తి అయింది.

వ్యయప్రయాస మూలమైన యీ ప్రచురణకు తిరుమల తిరుపతి దేవస్థానములవారూ, కొందరు వదాన్యులు కొంత వరకూ ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. గ్రంథం చక్కగానూ, ఆకర్షణీయంగానూ అచ్చయింది. దీని పయి పెక్కు మంది శాస్త్రవేత్తలు, విద్వాంసులు మంచి అభిప్రాయాలను ఇచ్చారు.

ఏతద్గ్రంథ ప్రచారానికి తగిన ప్రోత్సాహం లభించగలదని ఆశిస్తున్నాను.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

చైతన్య కవితా సంకలనం

[వెల : రు. 5-00 లు. ప్రతులకు : సింహపురి సాహితీ సమాఖ్య, 10/170, సంతపేట, నెల్లూరు - 1.]

వివిధ కవుల మినీకవితా చైతన్యమే ఈ చైతన్య కవితా సంకలనం. అద్దేపల్లి రామమోహనరావుగారు ఈ సంకలనానికి శుభారంభం చేశారు. చచ్చిపోయిన సంప్రదాయ వృక్షానికి నీళ్ళు పోసి బ్రతికించాలనే జడత్వంలోంచి, సమాజంతో రాజీపడిపోయి దీన్ని మార్చలేమనే పిరికి తనంలోంచి, ఎప్పుడు ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుందనుకొనే కర్మసిద్ధాంతపు అజ్ఞానంలోంచి, ప్రగతి భావాలకు అడ్డంగా నిలబడ్డ అనంతకోటి దుష్టశక్తుల్లోంచి చీల్చుకువస్తున్న ఈ మినీ కవితా చైతన్యపు తుపాకిగుళ్ళ ఈ సమాజాన్ని మార్చాలనే ఆశావాదాన్ని ఈ కవులకు అందించారు రామమోహనరావుగారు. 'మా మాట'లో ఎతకోట సుబ్బారావుగారు, 'చివరి క్షణం'లో కందికట్టు సూర్యప్రకాశరావు గారు ఈ సంస్థ దృక్పథాన్ని వివరించారు.

ఇందులోని కవులు, కవయిత్రులు వారి వారి మినీ కవితల్లో ఈ సమాజాన్ని, దాని అక్రమాన్ని గాఢంగా ద్వేషిస్తున్నారు. మినీ కవితను ఆరంభంలో సుబ్బారావుగారు ఉద్యమంగా పేర్కొన్నారు. ఈ భ్రమని వారు ఎంత త్వరగా వదిలితే అంత మంచిది. "నాలుగు రోజులైతేనేం గట్టిగాపాడు - ఎందుకంటే - ఈ గాలి - ప్రపంచం అంతా పయనిస్తుంది." ఇది నిజం అనే గేయం. ఇట్లాంటి కవిత్వంలో కవుల అస్తిత్వం ఏం విలుస్తుంది? నేను మినీ కవిత్వాన్ని వ్యతిరేకిస్తున్నానని ఎవరూ అభిప్రాయ పడనవసరంలేదు. అసలు కవిత్వం అనేది ఉంటే అది మినీయా? మాక్సీయా? అని ఆలోచించవచ్చు. పోగా ఉద్యమాలు ఎప్పుడూ రూపంమీద ఆధారపడి ఉండవు. ఏ ఉద్యమానికైనా భావం పునాది. మినీ కవిత్వం ఈ తరం యువకులకు కవితా ప్రాంగణంలో అడుగు పెట్టడానికి ఒక సాధనం మాత్రమే కాని సర్వస్వం కారాదని నా విశ్వాసం. ఈ సంకలనం లోని వారంతా ఎంతో కొంత కృషి చేశారు. వారి కవితా కృషికి సాహిత్యాభిమానులు సంతోషించ వలసిందే. కొన్ని బాగున్న కవితలు

నీ నెత్తిన
సూర్యుడు మెరుస్తూ ఉంటే
నిన్ను వెక్కిరించే నీక సహితం
నీ అరికాళ్ళకు మొక్కుతుంది

(అను రాజేంద్ర)

మంచికి మంచివాడికి
గుర్తింపు
మల్లెలు కాదు మాలలూ కాదు
మంచివాళ్ళను
తుపాకి గుళ్ళు గుర్తించాయి చరిత్రలో

(ఇ. బి. రామారావు)

పులకరింపు
వెన్నెల పూచినపుడు
సముద్రం పొంగినపుడు కాదు.
ఐదేళ్ళ తర్వాత —
మావీధి కుక్క మొరిగినపుడు

(మూర్జటి వెంకట బాలాజీ)

మినీ కవితను ఆదినుంచీ పాలో అవుతున్నవారు దీనిని కూడా పాలో అవ్వాలి.

సంఘజీవి శతకము

[నవ్వప్పగారి ఈరన్న. వెల: రు. 2.00 లు. ప్రతులకు: భువన విజయ శారదా పీఠము, గుంతకల్లు.]

సంఘంలో మార్పుతో పాటు సాహిత్యంలో కూడా మార్పు వస్తోందని, పద్య కవిత కొంచెం వెనుక బడినా ఆగలేదని రచయిత 'నా మాట' లో చెప్పారు. కవిత్వముఖాన మనిషికి హితబోధ చెయ్యటం నాడూ, నేడూ కూడా పరిపాటే. మనిషి ఎట్లా ఉంటే మనిషిగా ఉంటాడో ఆ మార్గాలన్నీ 'సజ్జనుండ వగుము - సంఘజీవి' అనే మకుటంతో ఈ కవిగారు ఒక శతకం రాశారు. అందులో మచ్చుకో పద్యం —

పుణ్య మబ్బ నెట్లు - పుణ్యస్థలము జూడ
ప్రక్క యింటి వాడు - పస్తులుండ
సాటిమనిషికింత - సాయమ్ము జేయుచు
సజ్జనుండ వగుము - సంఘజీవి.

స్వరలహరి

[వై. హరేరామమూర్తి. వెల: రు. 10/- లు. ప్రతులకు: 1) వై. పద్మలత, వైజయంతీ పబ్లికేషన్స్, 5/226, భుజంగరావు వీధి, కడప. 2) శ్రీ వెంకట్రామా అండ్ కో, ట్రంక్ రోడ్, కడప. 3) శ్రీ కస్తూరిబాయి ఏజన్సీస్, వై. వి. స్ట్రీట్, కడప.]

"హరేరామమూర్తిగారు గీతా హృదయులు. రసాప్లావిత భావుకులు. ప్రయోగశీలురు. ఉత్సాహం మాత్రమే కాక వ్యుత్పత్తి ప్రతిభ ఉన్నవారు" అని 'కవికౌస్తుభ', 'సాహితీ స్వరాజ్' ఆచార్య తిరుమలగారు ముందుమాటలో ఈ కవిని గురించి చెప్పారు. బాణీలు కట్టి పాడుకునేందుకు వీలుగా వీరు రాసిన గీతా సమాహారం ఈ సంకలనం. జాతీయ పతాక, ప్రగతి ప్రభలు, తెనుగు పూజారి, నవ చైతన్యము, పొలి మహిమ, పన్నులు, అస్పృశ్యత, గులాబి తారలు, ప్రేమజ్వాల, అభిసారిక మొదలైనవి దీంట్లో కొన్ని గీతాలు. లలిత లలితమైన భావాలకు, సున్నితమైన భాషలో గీతా రూపాన్నివ్వటం ఈ కవి గారికి తెలుసు. కాని రాస్తున్నది సత్యమా? అసత్యమా? అని నిగ్గు తేల్చుకోవ వలసిన అవసరం కవిగారి కుంది.

"స్వల్ప కాలపు రుణము అల్పమైన వడ్డి
కల్ప తరువై దేశం రైతు కండగ వుండ
రైతు నడ్డిని విరుచు గడ్డు రోజులు లేవు
కరువులు కాటకా లిక పైన కనరావు."

ఇత్యాదులైన పాటలు ప్రజా జీవితం కంటె ప్రభుత్వపు బాకాగా బాగుంటాయి.

వలపు తలపులతో మధురమై ప్రవహించునో
కలత ఎదనిండి రుధిరమై స్రవియించునో
స్వర్గ లోకాల విహరించి సుఖియింతుమో
బాష్ప జలధిలో మున్కలిడి దుఃఖింతుమో

ఇట్లాగే వారి భావావిష్కరణ కవిత్వ రూపంలో జరిగింది.

శ్రీనివాస కుసుమాంజలి

[కుంటిమద్ది శేషశర్మ. వెల : రు. 3-00 లు. ప్రతులకు : శ్రీ సాధన కార్యాలయము, అనంతపురం.]

ఐహ లౌకికాలు, పార లౌకికాలు, నిత్యముక్తులు, కర్మ విధములు, పరమాత్మ, వైకుంఠయాత్ర, శ్రీనివాస ప్రసాదనము మొదలుగా విషయాలను విభజించి, భగవంతుని తత్వాన్ని, మహిమను విశదపరుస్తూ మనిషికి ఆధ్యాత్మిక ప్రబోధం అయ్యేటట్లుగా కుంటిమద్ది శేషశర్మ గారు 'శేషహృదయవాస శ్రీనివాస' అనే శతక మకుటంలో రాసిన పుస్తకం ఇది.

'పంచ భూతములను పరిధవిల్లిన మేని
బందిఖాన జీవి బంధితుండు
బంధితునిగ జేయు పరమాత్మ నీవెగా
శేషహృదయవాస శ్రీనివాస'

ఇదీ జీవితం పట్ల శర్మగారి అభిప్రాయం.

న్యూ ఎక్స్ రేస్

(మహిళల కవితల ప్రత్యేక సంచిక)

[వెల : రు. 2-00 లు. ప్రతులకు : ఎక్స్‌రే పబ్లిషర్స్, కొల్లూరి హౌస్, అమలాపురం - 533202]

కొల్లూరి 'ఎక్స్‌రే' సాహిత్య పత్రికను నడుపుతూ, ఇప్పటికే మినీ కవితా సంబంధంగా చాలా పుస్తకాలు తెచ్చారు. అవేకాకుండా సాహిత్యగతమైన అనేక పుస్తకాలు వెలువరించారు. కవితా రచనలో స్త్రీలు వెనుకబడ్డారేమో అనే అనుమానంలో మహిళల కవితలలో ఎక్స్‌రేని ఒక ప్రత్యేక సంచికగా తెచ్చారు. ఇందులో నాయని కృష్ణకుమారి, శీలా సుభద్రాదేవి, అడివికొలను పార్వతి, వాసా ప్రభావతి, ఆలూరి విజయలక్ష్మి, సి. వేదవతి మొదలైన వారితోపాటు ఇంకా కొంతమంది మహిళలు కవితా రచనలో పాల్గొన్నారు. కొంతమంది ఈ సమాజాన్ని గురించి కవిత్వం రాశారు; మరికొంతమంది కేవలం మహిళలను గురించే రాశారు. 'సామాన్యంగా కన్పించే చీమలు కలిస్తే - సర్పరాజుకు చావు తప్పదు - గడ్డిపోచల జనావళి తలిస్తే - అక్రమాలు చేసే గజరాజుకు బందీ తప్పదు' అంటున్నారు సువర్చలారాణిగారు. 'ఎంత బరువుంటే / అంత వేగంగా / కదులుతుంది / ఏ ఫైలైనా' అంటున్నారు మందరపు హైమవతిగారు.

'ఇది రాబోయే తుపాను చిహ్నమే అని
ఎర్రని జీరల మధ్య
రక్త ప్రవాహంలా
ఉరుకుతున్న కన్నీటిని
మందే గుండెల్ని చీల్చుకొచ్చే కసిని
చూడగానే అనుకున్నాను
మన గమ్యానికి దగ్గరవుతున్నామని'

(బొమ్మిరెడ్డిపల్లి భానుశ్రీ)

ఈ సంకలనంలో కవిత్వం రాయటానికి కలాలు, కాగితాలు సిద్ధం చేసుకున్నవాళ్ళు చాలామందున్నారు. ఇక కావలసిందల్లా కవిత్వం రాయటం, నేర్చుకోవటమే.

శ్రీ వేంకటేశ్వర తారావళీ త్రయి

[వేదుల వేంకటశాస్త్రి. వెల : లేదు. ప్రాప్తిస్థానము : వి. వి. శాస్త్రి, నరసింగరావుపేట, అనకాపల్లి (పోస్టు), జిల్లా విశాఖపట్టణము.]

ఈ దేశంలో శ్రీరాముని తరువాత అధికంగా వేంకటేశ్వర స్వామిని కొల్చే వాళ్ళున్నారని అంచేత శ్రీ తిరుమ వేంకటేశ్వర్లు, శ్రీ ఉపమాకా వేంకటేశ్వర్లు, శ్రీ అనకాపల్లి వేంకటేశ్వర్లు అను పేరుతో మూడు నక్షత్రమాలలు రాసుకొన్నట్లుగా కృతికర్త గారు చెప్పుకొన్నారు. ఈ పద్యాలన్నీ, భక్తిని, ముక్తిని, జీవన పద్ధతినీ చెప్పేవి. ఉదాహరణకు —

ధనమా? శూన్యము, శీల ధర్మగుణ త
 త్త్వంబా, నిరాలంబ, మీ
జనులా? దుష్పథవర్తు, లీ ప్రభుతయున్
 జండాల పైశాచికో
దన తృష్ణా పరమయ్యె, హైందవుల నే
 దారిన్ గటాక్షింతువో
యనకాపల్లి పురాధినాథ! పరమే
 శా! వేంకటేశ ప్రభూ!

అ రా జ కీ య ం

[ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా. వెల : రు. 2-00 లు. ప్రతులకు : డా॥. పి. రాజారామ్, కవితా క్లినిక్, 3వ లైను, లక్ష్మీపురం, గుంటూరు - 522 007]

అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు శాఖవారు వర్తమానాంధ్ర దేశ స్థితి గతులపై పెనుగొండ లక్ష్మీ నారాయణ గారి సంపాదకత్వంలో ఈ కవితా సంకలనాన్ని తెచ్చారు. "అజ్ఞానుల చేతిలో ప్రజాస్వామ్యం పరిహాసనం అయిపోతుంది. దిగజారిన నైతిక విలువలు అనుక్షణం బాధిస్తున్నాయి. ప్రాణంతో సమానంగా కాపాడుకోవలసిన రాజ్యాంగం, చట్టం ఆఖరిశ్వాస పీలుస్తుంటే, కర్మభూమి సర్కస్ బఫూన్‌ని చూసినట్టు చూస్తోంది." దానికి వ్యతిరేకంగా, ఈ అరాచకత్వానికి భరత వాక్యం పలకటానికి ప్రజలను చైతన్య వంతులను చేయటానికై, వారిలో సమాజ స్పందనను కలిగించటానికై ఈ కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఇదివరకే కవిత్వంలో ఒక స్థానాన్ని కలిగి ఉన్నవారు, ఇప్పుడిప్పుడే తమ స్థానాన్ని వెతుక్కుంటున్నవాళ్ల ఈ కవితా సంకలనంలో ఉన్నారు. "నైతిక ప్రమాణాలు రోజు రోజుకు దిగజారి పోతున్నాయి. మన కళ్ళముందే పతనమవుతున్న ఈ దేశ వ్యవస్థను చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం అంతో ఇంతో హృదయమున్న వ డికి సాధ్యమయ్యే పని కాదు" కనుకనే ఈ కవితా సంకలనం.

ఈ సంకలనంలో చాలా గేయాలు ఇందిరమ్మ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఎలక్షన్ల పరిహాసనాన్ని ఎత్తి పొడుస్తూ రాసినవి.

"బడి పిల్లల భోజనంలోనూ
భాగం రావాలనే బకాసుర సంతతి !
అమ్మశ్రీ రాజ్యంలో
ఆడపడుచులు హత మైపోతున్నారు !
షకీలాలు సరోజమ్మలూ
చెరిచి హత్యచేయబడ్డారు !
గంట కాలానికో చిట్టి తల్లి
మంటల్లో మాడిపోతూవుంది !
ఒక తల్లిని, వివస్త్రను జేసి
వూరంతా తిప్పి,
రక్షకభట కార్యాలయంలో
రాక్షసత్వం చేశారు !"

ఇట్లా ఈ వ్యవస్థ స్వరూపాన్ని వారి వారి సంస్కారాలకు అనుగుణంగా కవితామయం చేశారు ఈ కవులు.

శ్రీ సూర్య స్తోత్రము

[కొండేపూడి సుబ్బారావు. వెల : రు. 2-00 లు. ప్రాప్తి స్థానము: శ్రీ కొండేపూడి సుబ్బారావు, 47-10-5, ద్వారకానగరం, విశాఖపట్టణం - 16.]

సూర్యుని శక్తి, మహిమలను కొనియాడుతూ రాసిన పద్య శతకం లాంటి పుస్తకం ఇది. "సూర్యదేవుని స్తోత్ర పాఠముతో పాటు సూర్యవంశాభి వర్ణనము ద్వాదశాదిత్యుల విశిష్టత, సూర్య కాంతి ప్రభావములు మొదలగు చాల విషయము లిందు జేర్చ బడినవి" అని గ్రంథకర్తగారు తన పద్య వస్తువును పేర్కొన్నారు. కవిగారి కవిత్వానికి ఒక పద్యం ఉదాహరణ —

నీ తాపమ్మున కోర్వలేని ప్్రజ
నివ్వేడంగ నీ దేహమున్
ప్రీతిన్ కొంతగ చెక్కి వేయుటకునై
నీ సమ్మతిం దెల్పి వి
ఖ్యాతిం బొందితివోయి త్వష్టయని
లోకంబెల్ల కీర్తింప, ఊ
హాతీతమ్ములు నీయుదారతలు
దేవా సూర్యనారాయణా !

అంతరంగ తరంగాలు

[రచయిత : పాయసం సుబ్రహ్మణ్యం. వెల : రు. 5-00లు. ప్రతులకు : 1) పి. సుబ్రహ్మణ్యం, జడ్. పి. కాలనీ, పొదలకూరు రోడ్, నెల్లూరు - 4. 2) విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్, నేంద్రగుంట, చిత్తూరు జిల్లా.]

సంఘంలో మూఢాచారాలు, ఛాందస భావాలు అజ్ఞానం, అవినీతి బానిసత్వం, డబ్బు, అధికారం, దోపిడీ యధేచ్ఛగా రాజ్యం చేస్తున్నాయని వీటి నిర్మూలన కొరకు రచయితలు పాటు పడాలని సుబ్రహ్మణ్యంగారు కోరుతున్నారు. 'వ్యక్తి ఆరాధనకు, బూర్జువాల సేవలకు అంకితమవుతున్న రచయితలు జాతికి చీడ పురుగులు' అని ఘంటాపథంగా చెబుతున్నారీ కవి. సాహిత్యం ద్వారా ఈ వ్యవస్థను మార్చటం సాధ్యమని పూర్తిగా నమ్ముతున్నారీ కవి. "ఊహలలో విహరిస్తూ వాస్తవాన్ని, వర్తమానాన్ని నిర్లక్ష్యం చేయడం బాధ్యతను విస్మరించడమే అవుతుంది. అటువంటి రచయితలు రేపటి సాహిత్య చరిత్ర నుండి బహిష్కరింపబడతారు." ఇది కవి యొక్క ప్రగాఢమైన నమ్మకం. జనమే తన బాటని, కలమే తన ఆయుధమని నొక్కి చెబుతున్నారు.

"కవి హృదయం
ఘర్షణ, సంఘర్షణలతో
పురిటినొప్పులు పడి
ప్రసవించిన కవిత—
తూరుపు సంధ్య నీళ్ళాడిన
సూర్యుడికి పోలిక!"

అని కవిత్వశక్తిని ఉగ్గడించారు. శిఖరాల నధిరోహిస్తే ఈ వ్యవస్థ వెలుగు మయమవుతుందని అగాధంలో కాపురం పెడితే రోగగ్రస్త మవుతుందని గుర్తుచేస్తున్నారు. ఈ భ్రష్టవ్యవస్థ నశించి, చైతన్యం పరమావధిగా మరోసృష్టి ఆవిర్భవించాలని కోరుతున్నారు.

"నేనొక్కమాట గట్టిగా చెప్పగలను
అక్షరాలూ, ఆలోచన మాత్రమే
ఈ వ్యవస్థను మార్చి
నా తరం కోర్కెను తీర్చగలవు
తూరుపు కాన్వాసుపై
చైతన్యం చిత్తరువును చిత్రించగలవు."

నిజమే. మరి ఆచరణ మాటేమిటి?

జలతారు సెలయేరు కన్నీరు

[ఎన్. ఎన్. నాయకర్. వెల: రు. 3-00 లు. ప్రతులకు: ఎన్. ఎన్. నాయకర్, 32, మోస్కో స్ట్రీట్, చీపాక్, మద్రాసు-5]

ఈ సంకలనంలో గేయ కవితలూ, వచనకవితలూ ఉన్నాయి. కవిది అభ్యుదయ దృక్పథమే. ఇందులోని గేయాలూ, వచన కవితలూ అనేక పత్రికల్లో ప్రచురింప బడ్డవే. శ్రమజీవుల చెమటతోనే సముద్రాలు నిండాయని, మండిన గుండెల నుండే మార్తాండుడుపుట్టాడని, నిరుపేదల కాష్ఠాలే విప్లవకొండలయ్యా యని త్రికాలజ్ఞానమ్‌లో చెబుతున్నారు. పాములపై చలిచీమలు పగతీర్చుకునే రోజు అతిత్వరలో వస్తుందనే ఆశావాదం ఈయనది. స్వేచ్ఛా సంపద కొందరిదైతే చీకటి బ్రతుకులూ ఆకలి చావులూ మరికొందరివని, గుండెలు అగ్నిగుండాలై, పిడికిళ్ళు బిగిస్తూ స్వేచ్ఛా పతాకాన్నెగరేయడానికి పీడితులు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు ఈ కవి. కల్లోలముంచుతూ భావాల్ని మింగే కాల్పనికత, మార్మికత అంటే ఈ కవికి సరిపడదు. అర్థం కాకుండా రాయటం ఆధునికత అస్పష్ట కవిత్వాన్ని ఎత్తి పొడిచారు.

మేలుకొన్న వాళ్ళని
జోలపాడి నిద్రపుచ్చేది
కాల్పనికత
గుర్రుపెడుతున్న వాళ్ళని
కొరడాతో కొట్టిలేపేది
వాస్తవికత.

ఇది వీరి దృక్పథం.

సప్తశ్లోకి గీత

[సమర్పణ: కోనె మహాలక్ష్మి. వెల లేదు. కోనె మహాలక్ష్మి, శ్రీ వీర వెంకట సీతారామ భజన మందిరం, రాజమండ్రి - 5.]

పై చిరునామాకు 0-35 పై. బిళ్ళలు పంపిన వారికి ఈ పుస్తకం పంపబడుతుంది. దీంట్లో గీతా పరమార్థం కొంతవరకూ బోధింపబడింది. "భగవంతుడగు నారాయణునిచే స్వయముగా అర్జునునకు బోధింపబడి నట్టియు, ప్రాచీన మహర్షియగు వేద వ్యాస మునీంద్రునిచే మహా భారత మధ్యమున కూర్చ బడినట్టియు, అద్వైత జ్ఞానమను అమృతమును వర్షించు నట్టిదియు, సంసార బంధములనుండి విముక్తిని కలిగించునట్టియు ఓ తల్లీ! భగవద్గీతా నిన్ను నేను ధ్యానించుచున్నాను" అని అనుకోగలిగిన వాళ్ళందరూ పై ఎడ్రస్‌కు రిప్లైకార్డులు రాస్తే విషయం తెలుస్తుంది.

హంస సందేశము

[కుంటిమద్ది శేషశర్మ. వెల: రు. 6-00 లు. ప్రతులకు: కుంటిమద్ది శేషశర్మ, 2-228, 4వ అడ్డరోడ్డు, అనంతపురం-515004]

ఇది వేదాంత దేశికుల సంస్కృత మూలానికి ఆంధ్రానువాదం. రెండాశ్వాసాల కావ్యం. హంస చేత సీతకు రాముడు పంపిన సందేశం. మొదటి ఆశ్వాసంలో ఆయా ప్రాంతాల విశిష్టతలను, మహిమలను చెపుతూ మార్గోపదేశం చెయ్యటం జరిగింది. రెండవ ఆశ్వాసంలో సీత స్థితిని ఊహించు కుంటూ రాముడు పడిన మానసిక వేదన, దాంతోపాటు ఆశావహమైన రాముని సందేశం చెప్పటం జరిగింది. "అక్షరములూ భావములూ ఒక్కటేఐనా, పదముల కూర్పులో ప్రతి కవి రచనకూ భేదము తప్పదు. మూలానువాదముల తారతమ్యము పరిశీలించిన రసికుల మతికే కొంత చమత్కృతి గల్గించిననూ మత్కృతి చరితార్థము. ఇందలి గుణములు మూల కర్తవి. దొసగులున్న నావి యని విన్నవించు కొను చున్నాను" అని అనువాద విషయంలో మూల కృతి కర్తపై గల గౌరవాన్ని, తన విధేయతను ప్రకటించుకున్నారు శర్మగారు. వారి మాత్రాచ్ఛందస్సు నడకకు, అనువాద సరళికి ఈ క్రింది శ్లోకం దాని అనువాదం ఉదాహరణ.

"వర్ణాఽఽకీర్ణామివకమలినీం, వ్యాహతార్థమివోక్తం
పంకాశ్లిష్టా మివ బిసలతాం పఙ్క్యపేతామివేభిం:
మేఘచ్ఛన్నామివ శశికలాం విఘ్నరుద్ధామి వాశం
వ్యాఘ్రోపేతా మివమృగవధూం, భూతలేజ్యా మివాస్త్రాం॥"

"వ్యాహ తార్థం బైనవాక్కువలె, మంచు పా
టున కగ్గమైన పద్మినివోలె, బురదతో
కచ్చర మైనట్టి కమలినీలతవోలె
మేఘ సంఛన్న మగు మిహికాంశుకల వోలె
కరిలేని కరిణివలె, హరిణివలె పులిచెంత,
తెగిపడిన నారివలె పొగులునని భావింతు"

ఈ అనువాదంలో పాఠకుడు మూలాన్ని అనువాదాన్ని బేరీజు వేసుకునేందుకు ఒకప్రక్క మూల శ్లోకాన్ని, దానికి ఎదురుగా అనువాదాన్ని ఇవ్వటం జరిగింది.

హృదయ భారతి

["కవి కౌస్తుభ" ఆచార్య తిరుమల. వెల : రు. 5-00 లు. ప్రతులకు : ఆచార్య తిరుమల, చైతన్య కళాశాల, హైదరాబాదు - 500 001.]


కిన్నెర ఆర్టు థియేటర్స్‌వారు ఈ మధ్య మహా జోరుగా పుస్తకాలు వేస్తున్నారు. సంతోషించదగ్గ విషయం. ఆచార్య తిరుమలగారు సంప్రదాయపద్యం, అధునిక గేయం రాయగలిగిన దక్షత కలవారు. ప్రస్తుత కావ్యం ఆచార్య తిరుమలగారి హృద్గతమైన భక్తికి సంబంధించినది. అందువలననే పద్య రచనగా అవతరించింది. అన్ని భావాల్ని సమదృష్టితో ఆహ్వానించే దృక్పథం ఆచార్యులుగారిది. "ఏ భావతరంగం లేచినా నాకు ఇబ్బంది లేదు. 'పండితాః సమదర్శనః' అన్న గీతాసూక్తి ఎప్పుడూ నా మనస్సులో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది" అని ఆయనకు ఆయన అనుకోవటం చాలా బాగుండ లేదు. వారి హృదయంలోని ఆర్తికి కలంలోని శక్తికి ఈ పద్యం ఉదాహరణ.

"ఓ పరమేశ ! ఓ వరద !
ఓ పురుషోత్తమ ! ఓ రమాపతీ !
ఓ పవమాన నందన
గుణోజ్జ్వల మానస వజ్రపీఠ ! ఓ
భూప లలామ ! ఓ భువన పోషణకారణ !
మోక్ష వల్లభా !
నీ పద పద్మమే శరణు
నీల ఘనాభ శరీర ప్రోవరా !"

శ్రీ టి. ఎల్. కాంతారావు



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.





AMRUTANJAN
Pain Balm
Amrutanjan Ltd.
2-45, Luz Church Road, Madras-600004